ఆంబాదర్శన గ్రంథమాల *

యోగదర్శనము

योगदर्शनम्

"సమాధి నిర్ధూతమలస్య చేతసో
నివేశితస్యాత్మని యత్సుఖం భవేత్
నశక్యతే వర్ణయితుం గిరా తదా
స్వయం తదంతఃకరణేన గృహ్యతే"

పండిత గోపదేవ విరచిత గ్రంథములు

వైశేషిక దర్శనము	ఱా ఎ-ఆ-ం
ఆస్తిక వాదము	ర-ం-ం
న్యాయ దర్శనము	ర-ం-ం
యోగ దర్శనము	ఎ-ఆ-ం

స్థిర సమాధి నిర్మలమగు చేతమునకు
నాత్మయం దత్తుకొన్నప్పు డబ్బుసుఖము
స్వానుభవ వేద్యమగునది యంతె కాని
ఇట్టిదని తెల్ప వాక్కు-ల కెట్లు బొసగు?

యోగదర్శనము

పతంజలి ముని ప్రణీతము

పండిత గోపదేవ
విరచిత వ్యాఖ్యానము

తొలిపలుకు:
గౌ. శ్రీ పాకాల వెంకట రాజమన్నారు
ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు – మదరాసు

ఆర్య సమాజము
కూచిపూడి (గుంటూరు జిల్లా)

సర్వ స్వామ్యములు ఆర్య సమాజము వారివి
ప్రథమ ముద్రణము ౧౦౦౦, ఖర, హేమంతము

R635
35N51

రెండున్నర రూప్యములు

1705

భారతీ ప్రెస్, తెనాలి – ౧౯౩౭.

?

వడ్లమూడి వంశాబ్ధి సోముడై జన్మించి, విద్యాజీవియై శిష్టశాస్త్రమునందు లబ్ధప్రతిష్ఠుడైవెలసి, ఆంధ్రలోకమునకు 'సఫలత' ప్రభృతి యమరకృతులనందజేసి, ఉదారచరితుడు, పరమసాధకుడు, ముక్తసంగుడు నై, తెలుగున దర్శనము లను రచియింప నెంతయు నన్ను ప్రోత్సహించుటయే కాక నాకు చేదోడు వాదోడుగా నుండి యా కార్యము పూర్తిగా కొనసాగకముందే మొన్న మొన్న (౨౫-౧౦-౧౯౫౧) ఆత్మీయుల నపార శోకాంబుధినిముంచి కీర్తిశేషుడయిన

శ్రీ వేంకటరత్నంగారికి

నీ కృతి నెట్లందజేయుదును ?

అంబాదర్శన గ్రంథమాల

నేటివరకు లభించిన

—♦ మహారాజపోషకులు ♦—

౧. శ్రీమతి కొత్తపల్లి భూమినీలూర్ణగారు (కూచిపూడి)
౨. శ్రీయుత బెల్లె జగదీశ్వరయ్య శ్రేష్ఠిగారు (సికిందరాబాద్)

—♦ రాజపోషకులు ♦—

౧. శ్రీ కావూరి సంగయ్యగారు (కూచిపూడి)
౨. శ్రీ బి. వెంకట్రావుగారు, వకీలు (వరంగల్)

తొలిపలుకు

ప్రాచీన భారతీయ విజ్ఞానము సంస్కృత వాఙ్మయములో గుప్తమైయున్నది. అందును ప్రామాణిక గ్రంథములు సూత్రప్రాయముగ నున్నవి. ఏ తత్కారణమున సంస్కృతమునందే అట్టి గ్రంథములకు వ్యాఖ్యానములు రచింపబడి యున్నవి. ఈ కాలమున సంస్కృత భాషా జ్ఞానము మిక్కిలి క్షీణించి యుండుటచేత అట్టి గ్రంథములను వ్యాఖ్యతో పఠించి గ్రహించువారు అల్పసంఖ్యాకులు. అందుచేత అట్టి గ్రంథములకు వ్యావహారిక భాషల్లో సులభగ్రాహ్యముగ వ్యాఖ్యానములు వ్రాయుట అత్యావశ్యకమైయున్నది. ఈ మహత్కార్యమును నిర్వహించుటకు బూనుకొన్న మహానుభావుల్లో ఒకరు శ్రీ పండిత గోపదేవ్ గారు.

న్యాయ వైశేషిక దర్శనములను రచించి వందనీయులైన వారిప్పుడు పతంజలిమహర్షి రచించిన యోగసూత్రములకు తెనుగున వ్యాఖ్యానము రచించి ప్రశంసనీయులైనారు.

యోగశాస్త్రమునకు హైందవ విజ్ఞానమున మహోన్నతమైన ప్రత్యేకస్థానము గలదు. ఈ శాస్త్రము భరత వర్షమున ప్రబలిన విధముగా ఇక నే దేశమునందును

వెలయలేదు. ఈ శాస్త్రము మెంతగొప్పదో ఇప్పుడిప్పుడు విదేశీయులు కనుగొంటున్నారు. కాని మనవారు అజ్ఞానముచేత బోధపడక అవజ్ఞసేయుచున్నారు. ఈ యజ్ఞాన తిమిరాన్ని నిర్మూలించుటకు శ్రీ గోపదేవ్‌గారి యీ గ్రంథము మిక్కిలి యుపకరించును.

జగత్ప్రఖ్యాతములైన పతంజలి సూత్రములు అతి క్లుప్తములు క్లిష్టములు. సంస్కృతమున వీటికి అనేక వ్యాఖ్యానము లున్నవి. వ్యాస, వాచస్పతిమిశ్ర, భోజ, రామానంద సరస్వతీ ప్రణీతములు. తెలుగుభాషలో ఇంత విపులమైన వ్యాఖ్యానము లేదని నా యభిప్రాయము. ఇట్టి గ్రంథమును రచించి ఆంధ్రలోకమునకు మహోపకార మొనర్చినారు గోపదేవ్‌గారు. వీరు ఇట్టి గ్రంథముల నింకయు వ్రాయవలెనని నా ప్రార్థన.

24-12-51
మద్రాసు

(సం.) పా. వెం. రాజమన్నారు



ద్రవ్యదాత: శ్రీ జె. వెంకటరావుగారు, వరంగల్.

శ్రీ జె. వెంకటరావుగారు, వకీల్.

వీరు వరంగల్ పట్టణ వాస్తవ్యులు, ప్రముఖ న్యాయ వాములు. చిన్ననాటినుండి వీరికి సత్యము, న్యాయము మరియు ధర్మమునందు ప్రీతి యెక్కువ. ఓరుగల్లు ఆర్య సమాజ సభలయందు తరచుగా పాల్గొనుచు, వైదిక ధర్మోప దేశములచే ప్రభావితులై సంస్కారము పొందిరి. బాల్యము నుండి బాగా మాంసభక్షణకు అలవాటు గలిగియుండియు, అది మానవుని ఆహారము కాజాలదని వెంటనే విసర్జించిరి. పిదప తమ కుటుంబమును గూడ సంస్కరించిరి. క్రమేణ ఆర్యసమాజ నియమములు పాటించుచు, సమాజ సభ్యత్వ మునుగూడా అంగీకరించిరి. గత సంవత్సరము వీరు ఓరుగల్లు ఆర్య సమాజ మంత్రులుగా ఏకగ్రీవముగా ఎన్నుకోబడిరి.

అనేక ప్రజాహిత సంస్థలకు ఆర్థికముగాను, యితర విధములుగాను సహాయపడుచుందురు. ఓరుగల్లు ప్రజలలో వీరికి గౌరవస్థానము కలదు. నిస్వార్థమైన సేవ, నిర్మలమైన హృదయము మొదలైనవి వీరియందు గమనింపదగినవి.

ఈ సంవత్సరమున శ్రీ వం. గోపదేవ్‌గారి యాచార్య త్వమున గాయత్రి ధరించిన సందర్భమున, వీరు ఈ గ్రంథ ప్రచురణకై, రు ౫౦౦ లు విరాళముగ నొసంగిరి.

వరంగల్
విజయ దశమి, ౧౯౫౧

ఇట్లు
చె. కాంతయ్య.

గ్రంథపరిచయము

యోగదర్శనము భారతీయ దర్శనములలో నన్యతమము. ఇందలి సిద్ధాంతములు సాంఖ్య సిద్ధాంతములకు సమానములని చెప్పదగును. సాంఖ్యసిద్ధాంతముల నాచరించు విధానమే యోగ మని చెప్పినను చెప్పవచ్చును. యోగ విధానములను క్రియా రూపమునకు దెచ్చి ప్రపంచమునకు మూలతత్వములైన ప్రకృతిని, ఆత్మను, పరమాత్మను సాక్షాత్కారము చేసికొనవచ్చును. ఆత్మతత్త్వము నను భవగమ్య మొనర్చుటకు యోగమే సాధనము.

ఈ గ్రంథమున నాలుగు పాదములు గలవు.

(౧) సమాధి పాదము (౨) సాధన పాదము

(3) విభూతి పాదము (౪) కైవల్య పాదము

(౧) **సమాధి పాదము:**— ఇందుగల సూత్రములు ఏబదియొకటి. ఈ సూత్రములలో సూత్రకారుడు ముందుగా యోగలక్షణము వర్ణించి యటుపై యోగమును విస్తారముగా వివరించియున్నాడు. యోగ మన కలయిక యని సామాన్యముగ పలువురు తలంచుచుందురు; కాని, యీ శాస్త్రమునందు యోగమునకు సమాధి యని యర్థము. చిత్తములో కలుగు సంకల్పములు (వృత్తులు) నిరోధింపబడుటయే సమాధి – యోగము – అనబడును. కాబట్టి యీ పాదమునందు చిత్త వృత్తులు, వాని నిరోధించుట కనువగు నుపాయములు వివరింప

బడినవి. వృత్తి నిరోధము సమాధియగును; కావున సమాధి యన నేమో యందలి సూక్ష్మభేదము లేవో కూడ నీ పాదము నందు వర్ణింపబడినవి. చిత్తము నేకాగ్రమొనర్చి సమాధి స్థితిని సంపాదించిన యోగి స్వస్వరూపమును (జీవాత్మ స్వరూపము) నెఱుగగలడు. ఆ యవస్థయందు జీవాత్మ పరమాత్మయందుండి సుఖించును. ఇయ్యదియే జీవనసాఫల్యము. ప్రసంగవశమున నీ పాదమున నీశ్వరుని యునికిని, లక్షణమును, నామమును సైతము సూత్రకారుడు వివరించియున్నాడు.

ఈ శాస్త్రమునందు ప్రత్యక్షము, అనుమానము, ఆగమము నని మూడు ప్రమాణములే యంగీకరింపబడును. వానిని గురించి సూత్రకారుడు (ప్రత్యక్షానుమానాగమాః ప్రమాణాని) అను సూత్రమున సామాన్యముగ నిర్దేశించి యున్నాడు. న్యాయవైశేషికములందువలె ప్రమాణములను గురించి విశేషముగ నిందు వర్ణింప యత్నము జరుగలేదు. ఈ ప్రమాణములను విశేషరూపమున నెఱుగదలచువారు నాచే రచియింపబడిన న్యాయదర్శనమును జదువ ప్రార్థించుచున్నాడ.

ఈ పాదమున సూత్రకారుడు చిత్తమును సమాహిత (స్థిర) మొనర్చుటకు ప్రాణాయామాది సాధనము లనేకములు వివరించియున్నాడు. ఇయ్యవి హఠయోగాదులం దెచ్చటను గానరావు. ఈ యుపాయము లన్నియు నార్ష ములు; సాత్త్వికములు. ఎల్లరు నీ యుపాయముల నెఱిగి యాచరించిన సుఖింతురు. చిత్తవిక్షేపమును బోనాడగలుగుదురు. ఇందులకై

యరణ్యవాసాదులుకానీ, గృహత్యాగముకానీ, గుహానివేశాదులుకానీ యవసరముండవు.

(౨) **సాధనపాదము:**— ప్రథమపాదమునందు జెప్పిన సాధనములన్నియు సాత్త్వికబుద్ధిగలవారి కుపకరించును. ఈ పాదమునందు మందబుద్ధులు, విక్షిప్తచిత్తులు యోగమును సాధించు నుపాయములు చూడనగును. సాధించుట కనువగు విషయమిందు జెప్పబడుటచే నియ్యది సాధన పాద మనబడినది. ఈ పాదమున నేబదియైదు సూత్రములున్నవి.

ప్రాణి యనుభవించు దుఃఖముల కన్నిటికి మూలకారణము అవిద్య. దానినిగురించి వివరముగా నిందు సూత్రకారుడు వర్ణించియున్నాడు. ఆ యవిద్యామూలకములే రాగద్వేషాది క్లేశములు. క్లేశములవలననే జన్మము, ఆయువు, భోగము నేర్పడుచున్నవి. ఈ పాదమున (సతిమూలే తద్విపాకో జాత్యాయుర్భోగాః ౧౩) అను సూత్రమునందు జన్మమేర్పడు విధము చక్కగ వివరింపబడినది.

ఈ పాదమునందే జీవుడు, ప్రకృతి యను నీ రెండిటి స్వరూపము వర్ణింపబడినది. ఇందే జిజ్ఞాస, జిహాస, ప్రేప్స, చికీర్ష, శోకము, భయము, వికల్పము ననునేడును తొలగిపోవుటకు వలయు సప్తవిధప్రజ్ఞ యన నేమో వర్ణింపబడినది. ఇంతియే గాక పతంజలిమహర్షిచే జెప్పబడిన నీ యోగమునకు అష్టాంగయోగమనిపేరు. ఈ నామమునకు కారణములయిన యమము–నియమము–ఆసనము–ప్రాణాయామము–ప్రత్యాహారము–ధారణ

–ధ్యానము–సమాధి అను నెనిమిది యంగములు విస్తారముగా నించు వర్ణింపబడినవి. అట నా నేర్చినకొలది ప్రాణాయామ మొనర్చు విధముకూడ వ్రాసియున్నాను. చదువరు లా యా సూత్రములందు వివరముగా జూడగలరు.

(3) విభూతి పాదము:— ఇందు సంయమము, దాని వలన యోగికి కలుగు సిద్ధులు వివరముగ వర్ణింపబడినవి. అష్టాంగములలోని చివరి ధారణ, ధ్యానము, సమాధి యను మూడంగములు స్వాధీనపరచుకొనినగాని సంయమము సిద్ధింప నేరదు. సంయమము సాధించినయోగి సాధించు మహాకార్యము లెన్నో యున్నవి. అవి యన్నియు కైవల్యము నపేక్షించు యోగికి రుచింపవు. అందువలన నతడు వానిని ప్రదర్శించుటకు యత్నింపడు. స్వయముగ తాను నా సిద్ధులను ఉపయోగించు కొనడు. ఈ పాదమునందు నేబదియైదు సూత్రములున్నవి.

(4) కైవల్య పాదము:— ఈ పాదమునందు ముప్పది నాలుగు సూత్రము లున్నవి. ఇందు చివర కైవల్య లక్షణము చెప్పబడినది. ప్రథమమున సిద్ధులు, వారిలోగల భేదములు వర్ణింపబడినవి. యోగి తన కర్మఫలముల ననుభవించుటకు క్రొత్తశరీరముల నెట్లు నిర్మించుకొనగలడో వివరముగ చెప్ప బడినది. విజ్ఞానవాదము, చిత్తమే యాత్మ యను వాదము రెండును ఖండింపబడినవి. ధర్మమేఘ సమాధియు వర్ణింపబడి నది. వివరములన్నియు నా యా సూత్రస్థలములందే చూడ గలరు. ఇట్లీ పుస్తకము నాలుగుపాదములతో రచియింపబడి యనేక విషయము లిందు పొందుపరుపబడినవి.

పతంజలి - సూత్ర రచయిత

ఈ యోగదర్శనము రచియించిన మహానుభావుడు పతంజలిమహర్షి. అందువలననే యీ గ్రంథము యోగదర్శన మనియేకాక పాతంజల సూత్రములనియు వ్యవహరింపబడును. పతంజలి యెప్పటివాడో, యెక్కడివాడో యేరికిని నిశ్చితముగ తెలియదు. అభియుక్తుల(శిష్టుల) దృష్టిలో నీ పతంజలిమహర్షి యే వ్యాకరణ భాష్యమును, చరకసంహితను రచియించినాడని తెలియుచున్నది. ఈ విషయమును ధ్రువపరుచుటకై యీ క్రింది శ్లోకము నుదాహరింతురు.

"యోగేనచిత్తస్య, పదేనవాచాం,
మలం శరీరస్యచ వైద్యకేన
యోఽపాకరోత్తం ప్రవరం మునీనాం
పతంజలిం ప్రాంజలి రానతోఽస్మి"

ఈ శ్లోకార్థము ననుసరించి చరకము, మహాభాష్యము రచియించిన పతంజలియే యోగదర్శన కర్తయగునెడల నతడు చారిత్రకుల మతమున విక్రమార్క శకమునకు పదునైదు శతాబ్దములు పూర్వమున్నట్లు తెలియుచున్నది. అనగా మూడు వేల సంవత్సరములకు పూర్వ మీ మహర్షి యున్నట్లు తెలియు చున్నది. ఇందుల కైతిహాసికులే ప్రమాణము.

నా ప్రార్థనను త్రోసివేయక, అత్యంత కార్యభారముచే నవకాశములేనివారయ్యు నా యీ గ్రంథమునకు తొలిపలు కుగా కతిపయవాక్యములను దయతో వ్రాసి యనుగ్రహించిన

(శ్రీ) పా. వెం. రాజమన్నారు (ప్రధాన న్యాయమూర్తులు మదరాసు హైకోర్టు) గారికి నా కృతజ్ఞతా వందనములు.

ఈ గ్రంథము నచ్చొత్తించుటకయిన ఖర్చులో నెక్కుడు భాగము 'ఓరుగల్లు' నివాసులైన (శ్రీ) జె. వెంకట్రావు (వకీలు) గారి వలన లభించినది. వారీ వత్సరమున మా గ్రంథమండలికి రాజపోషకులై రు. ౫౦౦/ ల నిచ్చిరి. వారి యీ సారస్వత సేవ ప్రశంసనీయము. భగవంతుడు వారి కాయురారోగ్యము లను ప్రసాదించుగాత!

నా మనస్సునకు నచ్చునట్లు, పాఠకులకు జూడ నింపు గలుగునట్లును ప్రేమతో నా యీ పుస్తకమును ముద్రించిన భారతీ ప్రెస్ వారికి నా హార్దిక ధన్యవాదములు.

— గోపదేవ్.



గ్రంథకర్త

(౧౯౪౦ నాటి చిత్రమునుండి)

యోగాభ్యాసమున నా స్వల్పానుభవము

నాకు కొంచెము ప్రపంచానుభవము కలుగగానే వివేకానంద స్వామి, రామకృష్ణ పరమహంస, గౌతమ బుద్ధుడు ప్రభృతుల జీవితములు చదువు నవకాశము కలిగినది. ఆ చదువు ఫలమో లేక మరి యే యితర కారణమునకో తెలియదు; కాని, యొంటరి జీవితము నడుపు భావమంతకు కరణమున నవ్యక్తముగా నేర్పడినది. అనంతర మందులకు విపరీతముగ నేర్పడిన అంతరాయము లెట్లో తొలగిపోయినవి. ఆ భావము బలపడినది. ఒంటరితనమును సఫలము జేసికొనుటకై యోగాభ్యాస మవసరమని యెట్లో పొడకట్టినది. అందు సహాయపడగల వా రెవరాయని కొన్నాళ్ళు దక్షిణా పథమున నా యా యాశ్రమములను దర్శించితిని. అందు ముఖ్యమైన తావులు మదరాసునగరమున నున్న దివ్యజ్ఞానసమాజ మొకటి. రెండవది రామకృష్ణాశ్రమము. అడయారులోనున్న దివ్యజ్ఞాన సమాజమువారి ఆశ్రమ వాసి కార్యకర్తలతో మాట్లాడగా యోగవిషయమున నా కట తోడుపడు వారు లేరని తోచినది. అటుపై రామకృష్ణాశ్రమమున జేరి విచారించితిని. నా యభిలషిత సాహాయ్యము వారి వలనను లభింపనేరదని స్పష్టమయ్యెను. అనంతరము ఏర్వేడులో మళయాళస్వామి యాశ్రమ మిందుల కుపయుక్త స్థానమని తెలిసి యటచేరి స్వామివారిని కలిసికొని మాట్లాడితిని. ఆశ్రమ వాసులలో పెక్కురు భోజనార్థ మక్కడజేరి శ్రీ వారి సేవయందు మగ్నులై యున్నట్లు నాకు బోధపడినది. వారెల్లరు నిరక్షరాస్యులు. కుక్షింభరులును. స్వాములతో సంభాషించిన మీదట వారును నాకు యోగాభ్యాసమునం దుపకరింపరని నా హృదయమున దోచెను. ఇట్టి యభిలాషతో చేరినవారి కేవో కొన్ని కతన నియమములజెప్పి, తన చిత్రము నొకదానిని వారికందజేసి దానికి పూజా పురస్కారములు జేయుడనిచెప్పి పంపు నలవాటు స్వాములకున్నట్లు నాకు గుర్తు – ఇయ్యది ముప్పది సంవత్సరములనాటి మాట. స్వాములకు నాడు సంస్కృతము గానీ, తెలుగు గానీ బాగుగ తెలియదు. భజనలు, పాదపూజలు, నాటికే ప్రారంభింప బడినవి. అంతకు పూర్వము వారు తిరుపతి దగ్గరనుండువారనియు, నట నుండి కారణాంతరములచే నేర్వేడు చేరినారనియు తెలిసినది – పరిస్థితు

లన్నియు తెలిసినమీదట నిజముచెప్పినచో, నాకు వారియెడ శ్రద్ధ యే మాత్రము కలుగకపోగా మూఢజనులలో నంధకారము నొకింత పెంపు చేయుచున్నా రేమోయని తోచి వారినుండి సెలవు తీసికొంటిని.

ఇట్లు సహాయకులం గానక నా తోచిన విధమున నియమబద్ధ జీవ నము గడుప నారంభించితిని. సాత్త్వికాహారము తీసికొనుచు నిద్రాహార ముల నత్యల్పముగా నొనరించి యథాశక్తి సంస్కృతము నభ్యసింప నారం భించితిని. రెండుమూడు సంవత్సరము లిట్లు గడచిపోయెను. అప్పటికి నా కీరువదియైదు వత్సరములు గడచినవి.

అది క్రీస్తుశకము ౧౯౨౭ సంవత్సరము. శ్రద్ధానందుని స్మారక పాఠశాల యొకటి ఢిల్లీ నగరమున నారంభింపబడినది. అందు విద్యా భ్యాసమొనర్చు నిమిత్తముతో నుత్తరాపథమును జేరితిని. ఒకటి రెండు సంవత్సరములు విద్యాభ్యాసము జేయుచు యోగమతి సెట్లో బలపరుచు కొనుచు కడకు (౧౯౨౯ లో) హిమవంతుని పాదతలమున సెలకొని యున్న గురుకులము (హరిద్వార్) ను జేరితిని. యోగాభ్యాసమునకు వలయు సాధన సామగ్రిని సంపాదింప నీ లోపల నెంతేని యత్నించితిని. యోగము నెఱుగుదుననిన ప్రతివ్యక్తితోను సంభాషించి చూచితిని. కాని యెవరికి నిందు చక్కని ప్రవేశమున్నట్లు కనిపింపదయ్యె. తెలియనివారిని మోసగించు పెద్ద లెందఱో దర్శనీయమూర్తులు కనుపించలేదని పాఠకు లూహింపకుందురుగాత. కట్ట కడపటికి గురుకులమున నాచార్యులుగా నాడు పనిచేయుచున్న నిఖిలశాస్త్ర పారంగతులు, ఆఖాల బ్రహ్మ చారులు, కర్మయోగులు, నత్యంత శ్రద్ధేయులు నగు శ్రీ పండిత ముక్త రామోపాధ్యాయులవారి యంతేవాసిత్వము నంగీకరించి యట పాతంజల యోగదర్శనము జదువు భాగ్యము పొందగల్గితిని. దానిని చక్కగా పఠించినమీదట యభ్యాసమునకై యోగులమని చెప్పుకొనుచు, మూర్ఖులను, సాంసారికులను మోసగింపవారి నాశ్రయింపటకంటె స్వయముగానే యభ్యాసమొనర్చుట మిక్కిలి శ్రేయస్కరమని తోచినది. (సఖూ ర్వేషా మపిగురుః కాలేనా నవచ్ఛేదాత్) ఆను యోగసూత్రమును పఠించిన మీదట, పవిత్రాంతఃకరణులగు పరమర్షులకు నాదిగురువయిన దేవ

దేవునే గురువుగా భావించి యభ్యసించుట యుక్తమని నాకు స్ఫురించి నది. గురువు లేక యోగము నభ్యసింపరాదనుటచే నేర్పడిన భయమంత టితో దూరమయ్యెను. అటుపై నేను యోగము నభ్యసించిన విధము నిట నంకేత మొనర్చుచున్నాడ. పాఠకులలో నెవరికేని యది రుచించుచో నట్లాచరించి లాభమునందవచ్చునను నాశతో నిట్లు చేయుచున్నాను. ఇయ్యదియు మిత్రుల యనురోధ కారణమున వ్రాయుచున్నట్లు పాఠకు లకు విన్నవించుకొనుచున్నాడ. భారతమున నేడు యోగులమని చెప్పు కొనుచు యోగాశ్రమముల నేర్పరచి యట శిష్యులను జేర్చి యాచరించు అనాచారములను జూచుచు నే నొక యోగాభ్యాసినని చెప్పుకొనుట కెంతయు భయపడుచున్నాను; కాని, సాధకభావముతో దొంగ గురువు లను జేరి జీవనమును వ్యర్థపరుచుకొనకుండుటకై నా యీ వాక్యము లెవరి కేని తోడ్పడగలవను నాసతో నిట్లు చేయుచున్నందులకు క్షంతవ్యుడ.

క్రీ. శ. ౧౯౩౦ లో బ్రహ్మచారులతో కలిసి ఆచార్యులవెంట పర్వతయాత్రజేసి 'పుంఛ్' స్టేటు (కాశ్మీరాంతర్గతము)లోనున్న 'బూఢా అమరనాథ్' అను పేరుగల యొక దివ్యక్షేత్రమున జేరితిని. అయ్యది యా సంస్థానమున పుణ్యస్థలముగా నెంచబడును. అట నొక మందిరము (గుడి) పురాతనమని చెప్పబడునది కలదు. అట నా దేవాలయమును కనిపెట్టుకొని యిద్దరు సన్యాసు లుండెడివారు. యాత్రికు లప్పు డప్పుడు వచ్చిపోవుచుండువారు. ఈ స్థలము 'పుంఛ్' పట్టణమునకు పదునారు మైళ్లదూరమున నరణ్య మధ్యమున గలదు. కాలినడకను దప్ప ఆటకు వెళ్లిను వలనుపడదు. అది హిమాలయ మధ్యస్థానమున కొండచరియ యందున్నది. స్థాన మతిరమణీయము. దేవాలయము స్వర్ణముఖి యనెడి నదీతీరమున నొక గండశిలపై యెంటిరాతితో నిర్మింపబడినది. ఆ దేవా లయమున కిరువై పుల నాకాశమును చుంబించు పర్వత శిఖరములు, ఎలుగు బంట్లతోను, చిఱుత పులులతోను భయంకరములయ్యు అరణ్యములు చూడ నింపుగలిగించుచుండును. ఇక్కడ నొక మాసమురోజులుండి మా యాచార్యులు అంతేవాసులను వెంటనిడుకొని గురుకులాభిముఖులైరి. నేను మాత్రము అక్కడనే ఉండుటకు నిశ్చయించుకొని యాచార్యుల యనుమతిని బడయగలిగితిని.

సహజ సుందరమైన ఆ పర్వతభూమియందు నేను దేవాలయార్చకు లైన సన్యాసులతో నుండసాగితిని. యోగదర్శనమునగల సూత్రములను కంఠస్థమొనర్చు వానిని మననము చేయుచుండువాడ.

చాల దినములనుండి యోగము నభ్యసింపవలయునని యున్న సంస్కార మెట్లో తీవ్రతవహింప నందులకై స్వయముగ ప్రారంభించితిని. నా యభ్యాసమునకు అనువైనవేళ 'ఉదయము (తెల్లవారకముందే) నాలుగు గంటలనుండి యేడు గంటలవరకు. సాయంతనము ఆరు గంటలనుండి యెనిమిది గంటలవరకు' అని నిశ్చయించుకొంటిని. సరిగా నా సమయమునకు ముందే శౌచాదిక నిత్యకృత్యములను నిర్వర్తించుకొని యభ్యాసస్థలము నకు చేరుకొనువాడ. అభ్యాసి నియతముగ నిత్యము నొకే క్షణమున తన యభ్యాసము నారంభింప వలయునని నా నిశ్చయము. అభ్యాసము నాచరించుటకై దేవాలయమునకు కొంత దూరముననున్న ఒక పురాతన కట్టడము స్థానముగ నేర్పరుచుకొంటిని. (తరువాత విచారింప నయ్యది 'పుంఛ్' రాజవంశము వారిలో నొకరి యస్థులను స్థాపించి కట్టిన సమాధి గృహమని తెలిసినది.) అభ్యాసము నారంభించుటకు ముందు నీశ్వరుని స్తుతి ప్రార్థనలను వేద మంత్రములతో జేయుచుండెడి వాడ. అటు తరువాత శివసంకల్పసూక్తమును పఠించెడివాడ. (ఈ మంత్రములు తెనాలి ఆర్యసమాజము వారిచే ప్రచురింపబడిన 'వైదికసంధ్య' యను పుస్తకమున నెల్లరు చూడగలుగుదురు.) అనంతరము పతంజలి ప్రభృతియోగసిద్ధులను మనస్సునసే స్మరించి నమస్కరించి యలసట గలుగువరకు ప్రాణాయామము చేయుచుండెడివాడ.

అభ్యసించిన ప్రాణాయామప్రకారము:—

ముందుగా నొక కంబళిపఱచి దానిపై నొకవస్త్రమును మడిచివేసి యాసనము నొకింత మెత్తగా నేర్పరుచుకొని యందు సిద్ధాసనముతో కూర్చుండెడివాడ. వెన్నెముక తిన్నగానుండునట్లు చూచుచుండెడి వాడ. గుదద్వారమును గట్టిగాబిగించి కొంచెము పైగిలాగిపట్టి యుంచి రెండు నాసికాపుటములతోను కొంత తడవు భస్త్రికా ప్రాణాయామము చేయుచుండెడివాడ. శ్వాసకోశములందున్న గాలిని బలముతోబయటికి నిశ్వసించి

వెంటనే మరల శ్వాసకోశములను గాలితో నింపుటను భస్త్రికా ప్రాణాయామమందురు. కంసాలివాని తిత్తితో కొలిమినూదినట్లు గాలిని నాసికాపుటములతో బయటికి, లోపలకు నడుపుటజరుగునుకాబట్టి, దీనిని భస్త్రిక యందురు. ఈ ప్రాణాయామమున రేచకపూరకములే యుండును. కుంభక ముండదు. విరామము లేకుండ అలసట గలుగువరకు నిట్లు సుమారు పదునైదు నిమిషములుచేసి యీ క్రియను ముగించెడివాడ. ఇట్లు చేయుట వలన రెండు నాసికాపుటములనుండి ధారాళముగ ఉచ్ఛ్వాస నిశ్వాస ములు జరుపగలుగుదుము. నాసికాపుటములనుండి సముముగ గాలిప్రవహించును. శ్లేష్మాదుల యాటంకము తొలగిపోవును. నాసికకెదురుగా నొక ప్రాతగుడ్డ నుంచుకొనవచ్చును. నాసికవెంట వెలువడు శ్లేష్మాది మలములు దానితో శుభ్రపరుచుకొనవచ్చును. అందులకై యాసనమునుండి లేచుట తగదు. అభ్యాసియొకేయాసనమున కనీసమొక యరగంటకాలము కదలక కూర్చుండుటకై యలవడి యుండవలయును.

అనంతరము కుంభకసహిత ప్రాణాయామము నారంభించి యొక గంటతడవు దాని నాచరించెడివాడ. ఈ ప్రాణాయామము రెండు విధములు : (౧) బాహ్యకుంభకము (౨) అంతఃకుంభకము. బాహ్యకుంభక మనగా ఊపిరి తిత్తులలోని సంపూర్ణ వాయువును బలపూర్వకముగ బయటికి నిశ్వసించి వెలుపలి వాయువును లోపల ప్రవేశింపనీయకుండుట. ఇట్లు అరనిమిషము మొదలు ఒక నిమిషమువరకు ఊపిరితిత్తులను ఖాళీగా నుంచవచ్చును. మొట్టమొదట అరనిమిషముండలేకపోవుదురు. కాని క్రమముగ సమయము పెరుగును. అట్లు వెలుపలిగాలిని లోపల ప్రవేశింప నీయక యుండగలిగినంత తడవుండి యటుపై నెమ్మది నెమ్మదిగ గాలిని లోపలికి పోనీయవలయును. ఇదియొక ప్రాణాయామము. ఇట్లొక యర గంట వరకు బాహ్యకుంభక ప్రాణాయామములు చేసితిని. ఎవరేని యంతతడవు నేయలేకున్న ఓపిక యున్నంత తడవే చేయవచ్చు; కాని ప్రాణాయామ మొకదాని తరువాత మఱియొకటి నిరంతరము చేయవల యును. మధ్యలో నాగి యాగి చేయరాదు. బలముతో గాలిని బయటికి రేచించి యూపిరితిత్తులను ఖాళీచేయునపుడు శరీరముకదలరాదు. కన్నులు మూసియుంచుట శ్రేయస్కరము. ప్రాణాయామ సమయమున నితరచింత

లుండరాదు. ఈ బాహ్యకుంభకము అభ్యాసికి నెక్కుడు కుంభకరము. త్వరగా ఫలమునిచ్చునది.

ఆంతఃకుంభక ప్రాణాయామము:— బాహ్యకుంభకము చేసిన తదుపరి యంతఃకుంభకముచేసితిని. వెలుపలనున్న గాలిని నెమ్మది నెమ్మదిగా లోపలికిపీల్చి (పూరించి) యూపిరితిత్తులను పూర్ణముగ నింపవలెను. అనంతర మట్లు నింపినగాలిని బయటికి రాకుండునట్లు ఆపవలయును. ఇక నిలుపజాలమని తోచినపుడు నెమ్మది నెమ్మదిగ బయటికి విడువవలయును. ఇట్లొకమారు చేసిన నొక ప్రాణాయామమగును. అరగంట కాలము ప్రథమమున నిట్లు ప్రాణాయామములను చేసితిని. ఇందు పూరక సమయము కంటె కుంభకసమయము నాలుగు రెట్లుండవలయును. రేచక సమయము రెండు రెట్లుండునట్లు యత్నింపవలయును. ఇందులకై గడియారము నుపయోగింపవచ్చును. పూరకము అరనిమిషమైన కుంభకము రెండు నిమిషములు, రేచకము ఒక నిమిషము ఉండునట్లు చూడవలయును. ప్రథమమున నిట్లు నియమబద్ధము చేయలేకపోవచ్చును. కాని క్రమముగ నియమమునకు తేగలుగుదుము. ఈ కుంభక సమయము మూడు నిమిషముల వరకు పెంచవచ్చును. నే నంతవరకే చేయగలిగితిని. ఇంతకంటె నెక్కుడు కాలముంచుట హానికరమని నా యభిప్రాయము. ఇంతకంటె నెక్కుడు సమయము అంతఃకుంభకము నభ్యసించిన సాధకులును నాకు గనిపింపరైరి. సమయమును తెలిసికొనుటకు గడియారముకంటె 'ఓం ఒకటి, ఓం రెండు, ఓం మూడు' అని ప్రణవసహితమయిన గణన నుపయోగించుట శ్రేయస్కరమేమో. సాంప్రదాయకులు మోకాటిచిప్ప నరచేతితో మున్మాటు స్పృశించి చిటికెవేయుటకు వలయు సమయము ఒక మాత్రయందురు. ఇట్టి మాత్రలతో రేచక పూరక కుంభకముల సమయమును గుర్తింప వచ్చును. ఎవరికేది సులభము, ఏకాగ్రతకు నుపయుక్తము నగునో దాని నుపయోగింపవచ్చును. ఇట్లు ప్రార్థన సమయము మొదలు ఒకటిన్నరగంట కానీ, రెండు గంటలుకానీ సమయము వెచ్చించి యటుపై చిత్తైకాగ్రత కొఱకు నీ క్రింది క్రియ నాచరించెడిపాడ.

ప్రణవ జపము:—

పై విధముగ ప్రాణాయామము నభ్యసించినందున మనస్సు

(చిత్తము) అలసిపోయి చాంచల్యమును విడిచియుండెడిది. ఆట్టిచిత్తమునఁ భ్రుకుటియందుంచి ప్రణవము నర్థసమేతముగ నానేక పర్యాయములు స్మరించెడివాడ. ఇట్లొకగంటసేపు నిత్యము నభ్యసించితిని. ఈ సమయమున నుచ్ఛ్వాసనిశ్వాసములు నాసికాభ్యంతరమునఁనే జరిగెడివి. బయటికి లేనట్లే తోఁచెడివి. ఒక్కొకవేళ తన్ను తా మరచెడి స్థితియు నేర్పడుచుండెడిది. ఉచ్ఛ్వాసనిశ్వాసములు లేకుండుస్థితిని సంపాదించుటయు నొకవిధమగు ప్రాణాయామమే. ఇయ్యది కేవల కుంభక మనబడును. ఈ స్థితి యెంతపెరిగిన నంత యభ్యాసికి మంచిది. ఇట్లు నిత్యము నుదయము మూడుగంటలు సాయంకాలము రెండుగంటలు అభ్యాసమునకై యుపయోగించితిని.

పది దినములు శాంతముగ గడచినవి. అభ్యాసమున రుచిపెంపయినది. ఒకనాడు అంతఃకుంభక ప్రాణాయామము నేయ మొదలిడి యొకటి రెండు ప్రాణాయామము లాచరించితిని. మూడవసారి పూరకము పూర్తి అయి, కాకముంజే నాభిస్థానమున నొకవిధమగు సంచలన మతివేగముగా ప్రారంభమై నాభిప్రదేశము ముందువెనుకలకు ఊగసాగెను.; ఒక మనుజుడు భాగమునట్లు చలింపజేయ బుద్ధిపూర్వకముగ యత్నించిన నెన్నడు సఫలము కాజాలడు. వేగముగ నట్లు చలింప నారంభింపగానే నేను నాసనమున స్థిరముగ కూర్చుండజాలకపోయితిని. ఆసనబంధము తొలగిపోయినది. కుంభకము చేయజాలకపోయితిని. పూరించిన వాయువెటు పోయినదో తెలియదు. నా కాస్థితి వింతగా దోచినది. ఇట్లు జరుగునని యెన్నడు చదివికానీ, వినికానీ యెఱుఁగనైతి. చిత్తము నొకవిధముగ కుదుట బఱచుకొని మరల ఆసన బద్ధుడనై కూర్చుండి ఒకమాటు పూరించి కుంభింప యత్నించితిని. రెండవమాటు నట్లే సంచలించి నేను ముందుకో వెనుకకో పడిపోయినట్లు గుర్తు. పడిపోయినపుడు తగిలిన దెబ్బకూడ నాకు తెలియదు. ఈ మాటు కొంచెము భయమేర్పడినది. అందువలన నాటి కా ప్రాణాయామమాపి మిగిలిన కార్యక్రమము యథాపూర్వముగ నడిపితిని. దినమంతయు చిత్త మా విషయమునఁనే లగ్నమై యుండెను. యోగదర్శన మంతయు గాలించి చూచితిని. ఎక్కడను నే వ్యాఖ్యాన కారుడు నీ విషయము నుల్లేఖించినట్లు కనబడలేక పోయితిని. సాయంతనము కూడ మరల ధైర్యముతో నంతఃకుంభకము చేయ నారంభించితిని. మరల

నట్లే జరిగినది. మూడు నాలుగు మాట్లు యత్నించి భంగపడితిని. ఒక మాటు ముందుకు మరియొకమాటు వెనుకకు పడుటయు, ఫాలమునను శిరస్సునను బొప్పులు గట్టుటయు సంభవించినది. ఇట్లు వరుసగా మూడు నాలుగు రోజులు ఎన్నిసారులు యత్నించి యెన్నిదెబ్బలు తింటినో యిప్పుడు గుర్తులేదు. కాని యత్నమును విడువనైతి. పరిస్థితిని తెలిసికొని నాకు తోడ్పడువ్యక్తిని గానక కొంత చింతించియుంటిని. నా యీ స్థితిని చూచి యటనున్న సన్యాసులలో నొకడు (బంగాలీ సన్యాసి) "నీవు కూర్చుండి యభ్యసించు స్థలము సమాధి. అందువలన నీ కా స్థానవర్తి ద్రుద్రదేవతలు బాధకల్గించుచున్నవి. కాబట్టి నీ వా స్థలమును విడిచిపెట్టు" మని తన విశ్వాసము ననుసరించి నన్ను బలవంతపెట్టుటయు జరిగినది. కాని నా కా స్థానికదేవతలయందు కాని, దయ్యములందు కాని విశ్వాసమే లేదు. అందువలన నా యభ్యాసమును విడువనైతి.

దాదాపు వారమురోజు లిట్లే పడుచు లేచుచు నెన్నిదెబ్బలకు గురి యైనను నభ్యాసము సాగించుచునే యుంటిని. అనంతర మొకనాడా నాభికమలముపద్ద నేమిజరిగెనో తెలియదుకాని, అంతఃకుంభకము సరిగా జేయ గలుగుటయే కాక నాభికి దిగువగా వాయువు పోవుచున్నట్లు నాకు తోచినది. అట్లు వాయుసంచారము వెన్నెముక చివరిభాగము వరకు జరిగి నట్లు తెలియవచ్చెను. ఆ వాయు సంచార మేనాడీ ద్వారమున జరిగెనో గ్రహింపజాలక పోయితిని. శ్వాసాశయములందు కుంభింపబడిన వాయువే యట్లు సంచరింప సాగెనా ? లేక యా వాయువుచే ప్రేరింపబడి నాభి స్థలమున నున్న వాయువులో గతి గలిగెనా ? స్పష్టముగ నిశ్చయింప జాలక పోయితిని. కాని కుంభకానంతర మొకవిధమగు వాయుసంచారము నాభికి క్రిందకలుగుట నిక్కువమని చెప్పగలుగుదును. అయ్యది స్పష్టమైన యనుభవము. శరీర శాస్త్రజ్ఞుల కిది యందరాని విషయము. ఈ యనుభవము శాస్త్ర విరుద్ధమని వారనవచ్చును. వారి శాస్త్రమున మానవుడు లోపలికి తీసికొను వాయువు శ్వాసాశయములలో జేరి యా యాశయముల నల్లుకొని యున్న యసంఖ్యాకమలగు నాడులలో హృదయమునుండి చేరిన చెడు రక్తమును శుభ్రమే చేయగలుగును కాని యన్యస్థలమునకది పోజాలదు. కావున వారి కీ యనుభవము వింతగా నుండును.

మఱియు నాటినుండి నా నాభిక్రమలమునం దేదో మార్పేర్పడి నట్లు నాకు తోచినది. స్థూలముగ నేను చూడగలిగినమార్పు నాభి పూర్వముకంటె నిమ్నమై గంభీరమగుట యొకటి. సాధకులలో నెందఱి కీ యనుభవ మున్నదో చెప్పజాలను.

ఇట్లు వాయు సంచారము నాభిక్రింది ప్రదేశమునందు కలిగి యది గుదద్వార సమీపమున వెన్నెముకలో ప్రవేశింపసాగెను. ఈ సంచారాను భవము కలిగిన తదుపరి మరల నాభి ప్రదేశము కదులుట కానీ, ఆసన బంధము విడిపోవుట కానీ, ఇటునటు పడిపోవుట కానీ యెన్నడును జరుగ లేదు. ఇట్లొక వారము పది దినములు గడచియుండును. నిత్యము నా కార్యక్రమము సక్రమముగ జరుపుచునే యుంటిని. ఈ యనుభవములవలన నభ్యాసమున శ్రద్ధాసక్తి లెక్కకడయ్యెనని చెప్పకతప్పదు. అనంతరమొక నాడు మూలస్థానమున ప్రవేశించిన వాయువు వెన్నెముకనుండి యూర్ధ్వ మునకు కొంతదూరము (మూడు నాలుగంగుళములు) పోయి యట నిర్జడ గింపబడి నారంభించెను. ఈ యనుభవమును నాకు వింతగూర్చకపోలేదు. పంట కాలువలో ప్రవహించు నీరు ఒక యడ్డుకట్టను భేదించుకొని పోయి కొంతదూరమున మఱియొక యడ్డుకట్టకు తాకి యాగుచున్నట్లు నాకియ్యది తోచెడిది. ఈ వాయు సంచారమార్గమున నీ యడ్డుకట్టలేమో నేను చెప్ప జాలను. ఈ యడ్డంకులు గలిగిన స్థానములన్నియు నాడీ గ్రంథులేమో యని నా యూహ. పది దినములకొక స్థానము చొప్పున నారో యేడో స్థానములు భేదింపబడినట్లు గుర్తు. కుంభించిన వాయువు శ్వాసాశయ ములను చేరి యటనుండి క్రమముగా నాభి, మూలస్థానము (గుదద్వారము) లగుండ వెన్నెముకలో ప్రవేశించి యనంతర మూర్ధ్వముఖమై యట నట నారేడు స్థానములను భేదింపుకొనుచు ముచ్చిలిగుంటవరకు చేరినది. ఇది యొక వింతయైన యనుభూతి. ఇయ్యది యోగసాధకుల పరిభాషలో చెప్పిన షట్‌చక్ర భేదనమనవచ్చును. చక్రములు, వాని దలములు, ఆయా దలములకు రంగులు, బీజాక్షరములు, దేవతలునన్నియు కల్పితములని నా యూహ.

ఈ కాలమున నభ్యాస క్రమములో ప్రణవజపముచేయుచు చిత్త మును భ్రుకుటియందు నిలిపి కేవల కుంభకము సాధించునపుడు నాకు

కనబడిన వింతదృశ్యములు, వాని క్రమము, నిట వివరింప జాలకున్నందు లకు పాఠకులు తప్పింతురుగాక. బహుదినములు గడచినందున క్రమము స్మృతి పథమునలేదు. అవి యన్నియు నియమపూర్వకముగ సభ్యసించు ప్రతి సాధకునకును సాధారణముగ కనిపించు దృశ్యములే యనియు నా తలంపు. అంచువలన వాని నిట వివరముగ వ్రాసి పుస్తక కాయమును పెంపుట యనవసరమనియు నెంచుచున్నాడ.

కాని, ఈ కాలమునందు నాకుగలిగిన ఒకవిచిత్రమైన యనుభూతిని పాఠకులకు వినిపింపకుండుట భావ్యమనిపింపకున్నది. ఆ యనుభూతి నా కీ మార్గమున నెంతటి యుపకృతిని కలిగించినదో మాటలతో చెప్ప జాలను. అట్టి మహోపకృతి నొనర్చిన యనుభవమును వ్రాయక విడుచుటకు మనస్సంగీకరింపకున్నది. కాని దానిని వివరించుటెట్లో తెలియక తటపట లాడవలసి వచ్చుచున్నది. మఱియు నీ వైజ్ఞానిక యుగమున దానిని అసా ధకులకు బుద్ధి గమ్యమొనర్చి నమ్మింపజేయు విధియు కనిపింపకున్నది. కాబట్టి మౌనము వహించుటయే యుత్తమ మనిపించు చున్నది. అయినను క్లిక్తో నాలుగు వాక్యములు చదువుకురుగాక.

ఇంతతీవ్రముగ నే నభ్యాస మొనరించినపుడు శరీరమున నేవోకష్ట ములు కలుగకుండుట యస్వాభావికము. శరీరమలసట చెంది నిత్యము కొఅ వానిదివలె నగుచుండెడిది. అంగములలో నప్పుడప్పుడేవో కొన్ని బాధలు కలుగుచుండెడివి. ఇవి యెట్లు తొలుగునా యని యొకింత చింతనొడము చుండెడిది. కాని, రాత్రి విశ్రాంతి నపేక్షించి మేనువాల్చినప్పుడో లేక మధ్యాహ్నమున శ్రమదీర్చుకొనుటకై శవాసనమున దేహమును శిథిల మొనర్చి యున్నపుడో యెవరో యపరిచితమూర్తి నా శరీరమున నావే శించి యంగమునగల నొప్పుల నన్నిటిని చేతితో తీసివేసినట్లు తోలగించు చుండెడివాడు. ఆ యనుభూతిలోగల వింతయైన వేదన (Feeling) నెట్లు వర్ణింపవలయునో తెలియకున్నది. రెండుమూడు క్షణములలో నా శరీర మున గల బాధలు, అలసట యంతయు నెటు పోయెడిదో తెలిసెడిది కాదు. శరీరము నూతన శక్తితో నుత్సాహభరితమై యలరారు చుండెడిది. ఈ యనుభవము నాకీ మార్గమున నెంతటి యుపకారము చేసినదో వర్ణింప

జాలను. ఇట్టి యనుభవము లెన్నియో కలవు. వాని నీ గ్రంథమున పొందు పరుచుట యుక్తము కాదని విడుచుచున్నాడ. ఆరు మాసములలో నిట్టి యనుభవముల సంపాదింపగలుగుట నాకే యాశ్చర్యము గొలిపినది. ఇట్లే యభ్యాసముచేయుచు శారీరకముగాను, మానసికముగాను నేను మిక్కిలి లాభము పొందగల్గితిని. ఆత్మదర్శనాదులకు వలయు సాధన యింకను చేయవలసినచెంతయో మిగిలియున్నది. పాతంజల దర్శనము పఠించుచు నేర్చినకొలది నిత్యము నా యభ్యాసము (నింకను) స్వల్పముగానైనను సాగించుచున్నాడ. పాఠకుల లాభము కొఱకిట కొంచెముగా నంకితము చేసితిని.

లోకమున ప్రచారములోనున్న నేతి, ధౌతి, బస్తి, నౌళి మున్నగు హఠయోగసాధన లెన్నో గలవు. అవియన్నియు శారీరకముగ నొకింత యుపయోగించినను, ఆధ్యాత్మిక దృష్టితో చూచిన ప్రయోజనము స్వల్ప మని నా యభిప్రాయము. ఇవియన్నియు నేర్చియు నేనభ్యసింపనైతి. ఇందు పొరపాట్లుపడి యనేకరోగములకు గురియైనవారిని నే నెఱుగుదును. మానసికముగాను, ఆధ్యాత్మికముగాను వారిలో నెట్టి వికాసము కలుగక పోవుటయు నిశ్చితము.

అభ్యాసము చేయగోరు వ్యక్తులకొకింత యుపయోగముండ గలదను నభిప్రాయముతో నీ వాక్యములను వ్రాసితిని. అన్యథా భావింప కుందురుగాక.

—గోపదేవ్.

విషయసూచిక

(౧) సమాధి పాదము

	పేజీ.
౧. యోగలక్షణము	౨
౨. నిరోధింపదగిన వృత్తుల భేదములు	౭
౩. వృత్తులు	౮
౪. ప్రమాణములు వాని లక్షణములు	౯
౫. విపర్యయ లక్షణము	౯
౬. వికల్ప లక్షణము	౧౦
౭. నిద్రాలక్షణము	౧౦
౮. స్మృతి లక్షణము	౧౨
౯. వృత్తినిరోధమున కుపాయము	౧౩
౧౦. అభ్యాస లక్షణము	౧౪
౧౧. వైరాగ్య లక్షణము	౧౫
౧౨. పరవైరాగ్యము	౧౭
౧౩. సంప్రజ్ఞాత సమాధి	౧౮
౧౪. అసంప్రజ్ఞాత సమాధి – లక్షణము	౨౦
౧౫. భవప్రత్యయము	౨౧
౧౬. ఉపాయ ప్రత్యయము	౨౨
౧౭. ఈశ్వర స్వరూపము	౨౫
౧౮. ఈశ్వరుడున్నాడనుటకు ప్రమాణము	౨౬
౧౯. ఈశ్వర నామము	౨౮
౨౦. ప్రణిధానము–దాని లాభములు	౨౯
౨౧. యోగమునకు అంతరాయములు	౩౧
౨౨. చిత్తమాలిన్యములు వాని నిరాకరించుట కుపాయములు	౩౫
౨౩. ప్రాణాయామము – అభ్యాసవిధము	౩౭
౨౪. చిత్తనిరోధమున కితరోపాయములు	౩౯–౪౧
౨౫. సవితర్క– సంప్రజ్ఞాత సమాధి	౪౫

	పేజి
౨౬. నిర్వితర్క – సంప్రజ్ఞాత సమాధి	౪౭
౨౭. సవిచార నిర్విచార సమాధులు	౪౮
౨౮. ఋతంభరాప్రజ్ఞ	౫౨
౨౯. నిర్బీజసమాధి కలుగు విధము	౫౫

(౨) సాధనపాదము

౧. క్రియాయోగము – దాని ప్రయోజనము	౫౭
౨. పంచక్లేశములు – వాని మూలము	౫౯
౩. అవిద్యా స్వరూపము	౬౨
౪. అస్మితా	౬౩
౫. రాగలక్షణము	౬౪
౬. దుఃఖము – అభినివేశము	౬౫
౭. క్లేశముల నెందుకు వర్జింపవలయును	౬౮
౮. క్లేశములున్న నేమగును ?	౬౯
౯. జన్మమెట్లుకలుగును ?	౬౯
౧౦. వివేకికి సర్వము దుఃఖమేలయగును ?	౭౨
౧౧. హేయ పదార్థమేది ?	౭౫
౧౨. హేయ దుఃఖమునకు కారణమేమి ?	౭౬
౧౩. దృశ్యస్వరూపమేమి ?	౭౭
౧౪. గుణములు, వాని యవస్థలు	౭౯
౧౫. ద్రష్టృస్వరూపము	౮౧
౧౬. ప్రకృతి పురుష సంయోగ కారణము	౮౫
౧౭. హానమనేమి	౮౫–౮౬
౧౮. సప్తవిధప్రజ్ఞ	౮౭
౧౯. యోగాంగములు	౮౯
౩౦. యమములు	౯౦
౩౧. నియమములు	౯౨
౩౨. ప్రతిపక్షభావనము	౯౪–౯౫
౩౩. యమముల సిద్ధిఫలము	౯౬–౧౦౧
౩౪. ఆసనము	౧౦౧

	పేజి
౩౫. ప్రాణాయామము – దాని భేదములు	౧౦౨
౩౬. ప్రత్యాహారము – దాని ఫలము	౧౦౭

(3) విభూతి పాదము

౧. ధారణ	౧౦౯
౨. ధ్యానము సమాధి	౧౧౦
౩. సంయమము తత్సిద్ధిఫలము	౧౧౧
౪. సంప్రజ్ఞాతమున కలుగు చిత్తపరిణామము	౧౧౬
౫. ఆతీతానాగతజ్ఞానము కలుగు విధము	౧౨౦
౬. పూర్వజన్మజ్ఞానము	౧౨౧
౭. పరుల చిత్తమును తెలియు విధము	౧౨౨
౮. మరణసమయము తెలియు విధము	౧౨౩
౯. ఇతర సంయమములు – వాని సిద్ధులు	౧౨౪–౧౩౭
౧౦. యోగికి కలుగు విఘ్నములు నివారణ	౧౩౮
౧౧. వివేకము – దాని ఫలము	౧౪౦–౧౪౪

(4) కైవల్య పాదము

౧. సిద్ధులు	౧౪౫
౨. యోగి యనేక శరీరముల నెట్లు నిర్మించుకొనును ?	౧౪౭
౩. యోగిచిత్త మనాశ్యమై యెట్లగును ?	౧౪౯
౪. ప్రాణులకు భోగమెట్లుకలుగును ?	౧౫౩
౫. విజ్ఞానవాదము – దాని ఖండనము	౧౫౭
౬. 'చిత్తమే ఆత్మ' అను వాదము దాని ఖండనము	౧౬౦
౭. ధర్మమేఘ సమాధి	౧౬౨
౮. క్లేశహానము కలుగు విధము	౧౬౨
౯. గుణముల పరిణామక్రమము	౧౭౧
౧౦. కైవల్య లక్షణము	౧౭౨

అనుబంధము

౧. విశిష్ట పదసూచి	i
౨. అకారాది సూత్రానుక్రమణిక	vii

ఓమ్

యోగ దర్శనము

సమాధి పాదము

జీవుడు ప్రకృతి (శరీరము)లో నుండి కష్ట సుఖములను బొందుచున్నాడు. శరీర సంబంధముచే నేర్పడు నానావిధ కష్ట సుఖములనుండి వేరై కైవల్యము ననుభవింప గోరునేని ప్రకృతి పురుష వివేకజ్ఞానము (శరీరము తాను కాదు అను తెలివి) కలుగవలయును. అందుకు చిత్తము సమాహితము కానవలయును. చిత్తసమాధానము—చిత్తైకాగ్రత — మనోనిశ్చలత— యోగము నభ్యసింపక సంభవింపదు. కాబట్టి కరుణానిలయుడగు పతంజలి మహర్షి జగత్తు నుద్ధరించు బుద్ధితో యోగమును వివరముగా బోధింప దలచి శాస్త్రము నారంభించుచున్నాడు.

"అథ యోగానుశాసనమ్" ౧

యోగానుశాసనమ్=సమాధి శాస్త్రము. అథ=ఆరంభింప బడినది.

అథ శబ్దము అధికారమును తెలుపును. అధికార మనగ ప్రారంభము. "యుజ్=సమాధౌ" అను క్రియచే యోగమేర్పడుచున్నది. కాబట్టి యోగ మన సమాధి. సమాధి యన నేమో, దాని సంపాదన యుపాయము లేవో, ప్రయోజన మేమో తెలుపు విధము అనుశాసనము—శాస్త్ర మనబడును.

యోగలక్షణము, యోగమున కుపాయములు, యోగ ప్రయోజనాదులు వివరముగా తెలుప బుుషి ప్రారంభించి నాడని భావము.

(మధుమతి, మధుప్రతీక, విశోక, సంస్కార శేషము నని చిత్తమునకు కొన్ని యవస్థలు కలవు. వీనిని చిత్తభూము లనియు నందురు. చిత్తముయొక్క సార్వభౌమిక ధర్మమే సమాధి.)

యోగలక్షణము:—

"యోగశ్చిత్తవృత్తి నిరోధః" ౨

చిత్తవృత్తినిరోధః=చిత్త వృత్తులను ఆపుట, యోగః= యోగము.

మనస్సు, బుద్ధి మున్నగు శబ్దములచే చెప్పబడు అంతఃకరణ మీ శాస్త్రమున చిత్త మనబడును. శాంతము, ఘోరము, మూఢము నని వృత్తులు మువ్విధములు ముందు వివరింపబడును. మనము వస్తువుల నెరుగునపుడు చిత్తము ఇంద్రియముల ద్వారా వస్తువును చేరి దాని యాకృతిని పొందును. నీరు కాలువలద్వారా పొలముచేరి దాని యాకార మును పొందునట్లు చిత్తము వస్తువుయొక్క ఆకారమున మార్పు చెందుట వృత్తియనబడును. అభ్యాసము, వైరాగ్యము మున్నగు రీతులతో చిత్తమును వృత్తిరూపము నొందకుండ చేయుటయే యోగము. కాగా నొక విధమగు చిత్తావస్థయే యోగమని భావము. ఆ యోగము సంప్రజ్ఞాతము, అసంప్రజ్ఞాతము నని

రెండు విధములు. అభ్యాసము, వైరాగ్యము మున్నగు సాధనముల ననుష్ఠించుట వలన వృత్తులన్నియు నిరోధింపబడును. అపుడు చిత్తమునే ధ్యానవిషయమైన తత్త్వమొక్కటి తక్క మరియొండు తెలియబడదు. ఇట్టి శుద్ధసాత్త్విక చిత్త పరిణామము సంప్రజ్ఞాత సమాధి యనబడును. చిత్త మెట్టి స్థితియుండ ధ్యేయవస్తువు నిస్సంశయముగా నున్న దున్నట్లు తెలియబడునో ఆ యవస్థావిశేషమే సంప్రజ్ఞాత సమాధి యని భావము. వృత్తుల నిరోధము యోగమనికదా యోగలక్షణము? సంప్రజ్ఞాత సమాధియందు ధ్యేయ వస్తువునకు సంబంధించిన వృత్తి యొకటి యున్నపట్టున నది యోగ మెట్లు కాగలదని సందేహింప వీలగును. కాని, ధ్యేయాకారమైన సాత్త్వికవృత్తి యొండు మిగిలి యున్నను రాజస తామస వృత్తులన్నియు నిరోధింపబడును. కాబట్టి, 'వృత్తుల నిరోధము యోగము'ను లక్షణమున దోషములేదని తెలియనగును. సంప్రజ్ఞాత సమాధితో కూడిన చిత్తమే యేకతత్త్వము ఆలంబనము కలదగుట వలన ఏకాగ్రమనియు, సమాధి కలదగుటవలన సమాహిత మనియు యోగులచే చెప్పబడును.

చిత్త మేకాగ్రము కాగా ఏ సమాధి పారమార్థిక తత్త్వమును తెలియజేయునో, అవిద్యాది క్లేశములను తొలగింప జేయునో, కర్మబంధములను శిథిలము చేయునో, వృత్తి హీనత కభిముఖము చేయునో యా సమాధి సంప్రజ్ఞాత సమాధి యని వ్యాసమహర్షి.

పర వైరాగ్యముతో నభ్యాసమొనర్చు యోగి పైన చెప్పబడిన శ్లోకాకార చిత్తస్థితిని సైతము నిరోధింపగా వేయించిన చిత్తసమువలె కార్యకారి కాక వాసనా రహితమై సంస్కార మాత్రముగా నిలిచియుండు ఒకానొక చిత్తావస్థ అసంప్రజ్ఞాత సమాధి యనబడును. సకల వృత్తులు నిరోధింప బడుటచే సమాహితమై చిత్తము నిరుద్ధ మనబడును. పైన చెప్పబడిన రెండువిధములగు చిత్తావస్థలే యోగ మనబడును. మిగిలిన అవస్థలు క్షిప్తము, మూఢము, విక్షిప్తము నని మువ్విధములు. రజోగుణాధిక్యముచే నెల్లపుడు నాయా విషయములందు ప్రేరేపింపబడుచు నెక్కుడు చంచలముగానుండు చిత్తము క్షిప్తమనబడును. తమోగుణాధిక్యముచే నిద్రాది వృత్తులు కలదై జడతవహించియుండు చిత్తము మూఢ మనబడును. సత్వగుణ మెక్కుడు కలదై యప్పుడప్పుడు పర మూర్ఖతత్వమగు ధ్యేయవస్తువునందు నిలుచునదై క్షిప్తావస్థతో కూడియుండు చిత్తము విక్షిప్తమనబడును. ఇట్టి యవస్థలు యోగ మనబడవు.

చిత్తము స్వభావముచే త్రిగుణము. ప్రకాశ స్వభావముచే సత్వగుణము, ప్రవృత్తి స్వభావముచే రజోగుణము, స్థితిశీలముచే తమోగుణము చిత్తమునందు తెలియనగును. ప్రకాశ మన జ్ఞానము. జ్ఞానము, ప్రసన్నత, ప్రేమ, లాఘవము మున్నగునవి సత్వగుణమును తెలుపును. కాబట్టి వీనిని సాత్వికము లందుము. ప్రవృత్తి యన క్రియ. ఇచ్ఛ, పరితాపము, శోకము మున్నగునవి రజోగుణములు—రాజసములు. స్థితి యన క్రియా

రాహిత్యము—నిలకడ. గురుత్వము, దీనత మున్నగు గుణములు తామసములు.

చిత్తము విషయములందు ప్రవృత్తికలదై యున్నపుడు జీవాత్మ ఆ యా విషయముల నెఱుగు చుండును. అనగా జీవాత్మ ప్రకృతియందుండును. చిత్తవృత్తులు నిరోధింప బడినపుడు జీవాత్మ (పురుషుడు) యెట్లు నుండునన:—

"తదా ద్రష్టుః స్వరూపేఽవస్థానమ్" 3

తదా=చిత్తవృత్తులు నిరోధింప బడినపుడు, ద్రష్టుః=పురుషుడు—చితిశక్తి, స్వరూపే=తనయందు, అవస్థానమ్=స్థితి కలవాడగును.

చిత్తవృత్తులు నశించి సమాధి యేర్పడినపుడు జీవుడు తన రూపమున తానుండును. దృశ్య ప్రపంచ మతనియందు భాసింపదు. స్ఫటికమణికి సమీపమున నానావిధములయిన రంగులు గల పువ్వులుండిన నది రంగులతో భాసిల్లును. వానిని తొలగించిన నయ్యది స్వచ్ఛముగా ప్రకాశించును. ఏ రంగును నందుండదు. అట్లే చిత్తవృత్తులు లేనపుడు పురుషుడు తాను స్వచ్ఛముగా నుండును. ఈ స్థితినే కైవల్య మందురు.

సూత్రమునందున్న 'ద్రష్టుః' అను పదమును రెండు మారులు చెప్పుకొని యందొక ద్రష్టృ పదము పరమాత్మ పరముగాను, రెండవది జీవాత్మ పరముగాను అర్థము చెప్పవచ్చును. అప్పుడు—

తదా=చిత్తవృత్తులు నశించినపుడు, ద్రష్టుః=జీవాత్మ్మనకు, ద్రష్టుఃస్వరూపే=జగద్రష్టయైన పరమాత్మ్మని స్వరూప మునందు, అవస్థానమ్=స్థితి, కలుగును. అని యర్థ మేర్పడును.

చిత్తవృత్తులుడిగినపుడు జీవుడు ప్రకృతియందు వర్తించుట మాని తనయందు తానుండువాడై పరమాత్మ్మని యానందము ననుభవించుచు నతని యందిమిడియుండును. పరమాత్మ్మయే సర్వ ప్రాణులకు గతి.

"ఏషాఽస్య పరమాగతిః....." బృ. ర.3.3 ౨

చిత్తవృత్తులు నిరోధింపబడనపుడును, పురుషుడు పరిణామము నొందనివాడగుటచే స్వస్వరూపమున నుండి పరమాత్మానందమును—కైవల్య సుఖము నేల యనుభవింపడన:-

"వృత్తిసారూప్య మితరత్ర" ర

పూర్వసూత్రమునుండి "ద్రష్టుః" అనుపదము ఈసూత్రమున నన్వయించును.

ఇతరత్ర=చిత్తవృత్తు లేర్పడు సమయమున, ద్రష్టుః = స్వస్వరూపమున నున్నజీవునకు, వృత్తి సారూప్యం=చిత్తవృత్తులతో సమానమైన రూపము కలుగును.

జీవుడు (పురుషుడు) పరిణామికాడు. అతని రూపమున మార్పులు కలుగవు. స్వచ్ఛమైన స్ఫటికమణివంటిది పురుష స్వరూపము. సమీపమున నున్న పువ్వుల రంగులు స్ఫటికమున ప్రతిఫలించి స్ఫటికము రంగులు కలదిగా తోచును. అట్లే చిత్తవృత్తులు చిత్తసమీపమున నున్న పురుషునియందు చేర్చ

బడును. అందువలన పురుషుని స్వరూపము చిత్తవృత్తి స్వరూపముతో పోలి సమానమగును. పురుషుడు బుద్ధి చిత్త సమీపమున నుండి యందుప్రతిబింబించి బుద్ధి వృత్తులతో కూడినవాడై యావృత్తులు తనవి కావని గుర్తింపక-వివేకము లేనివాడై 'నేను శాంతుడను, నేను ఘోరవృత్తికలవాడను, నేను మూఢుడను' అని యనుకొనును. ఇట్లు తలంచుటయే వృత్తిసారూప్యము. అట్టిచో చిత్తవృత్తుల రూపమే పురుషుని రూపము. మలినదర్పణమున తన ముఖము మలినముగా కన బడుట చూచి "నేను మలినముఖము కలవాడను" అనుకొనుట లోకవిదితమే కదా!

నిరోధింపదగిన చిత్తవృత్తు లెన్నివిధము లన:—

"వృత్తయః పంచతయ్యః క్లిష్టాక్లిష్టాః" ౫

క్లిష్టాః = అస్మితాదిక్లేశములు హేతువులు గాగలవియై ధర్మాధర్మ సంస్కారములకు ఉత్పత్తి స్థానములు నయిన రాజస తామస వృత్తులు క్లిష్టములు. అక్లిష్టాః= క్లిష్టములు కానివి-సాత్వికవృత్తులు. ఇట్లు క్లిష్టాక్లిష్టశబ్దములచే చెప్పబడు రెండు విధములగు, వృత్తయః=చిత్తవృత్తులు, మరల, పంచతయ్యః= ఐదువిధములు.

చిత్తవృత్తు లెన్నివిధములో తెలియకున్న వాని నిరోధింప నను వుకాదు. కాబట్టి వృత్తులు క్లిష్టములు అక్లిష్టములు నని రెండువిధములుగా విభజించి మరల నవి యైదువిధములు గలిగియున్నట్లు స్పష్టపరుపబడినది.

క్లేశము-కష్టము-కలిగించు వృత్తులు క్లిష్టములనబడును. పురుషుడు ప్రత్యక్షాది ప్రమాణములద్వారా వస్తువుల నెరుగును. అట్టిపై వానియం దాసక్తుడో ద్వేషముకలవాడో యగును. ఇట్లు ప్రత్యక్ష ప్రమాణాది వృత్తులు ఆసక్తిచేత అనుకూలవాసనలనో లేక ద్వేషముచే ప్రతికూలవాసనలనో కలిగించును. కాబట్టి వృత్తులు వాసనలకు-సంస్కారములకు-ప్రసవభూములు-ఉత్పత్తి స్థానములగుచున్నవి. ఇవి రాజస తామస వృత్తులు. కష్టదాయకము లని భావము.

సాత్వికవృత్తులు అక్లిష్టము లనబడును. వానివలన సత్వ పురుషాన్యతాఖ్యాతి-ప్రకృతి పురుష వివేకజ్ఞానము-కలుగును. అట్టిపై ప్రకృతి కార్యము నశించును. పురుషుడు స్వస్థుడగును.

వృత్తులసంఖ్య నిర్ణయించుట దుర్ఘటము. అయినను స్థూలముగా రెండువిధములని చెప్పి వాని ప్రకారము లైదుగా నిర్ణయించి వాని నిరోధింపవలయునని సూత్రమున వర్ణింప బడినది.

ఐదువిధములయిన వృత్తులు:—

"ప్రమాణ విపర్యయ వికల్ప నిద్రాస్మృతయః" ౬

ప్రమాణ...స్మృతయః=ప్రమాణములు, విపర్యయము, వికల్పము, నిద్ర, స్మృతియని వృత్తు లైదు విధములు.

అందు ప్రమాణవృత్తిని విభజించుచు ప్రమాణ సామాన్యరూపమును వర్ణించుచున్నాడు.

"ప్రత్యక్షానుమానాగమాః ప్రమాణాని" ౭

19031
035
N51

ప్రత్యక్షా...గమాఃః = ప్రత్యక్షము, అనుమానము, అగమము అని, ప్రమాణాని=ప్రమాణములు మువ్విధములు.

ప్రమాకరణము ప్రమాణ మని ప్రమాణ లక్షణము. ప్రమ యన జ్ఞానము. దానికి కరణము–సాధనము–ప్రమాణ మనబడును. జ్ఞానసాధనము ప్రమాణ మని భావము.

చక్షురాది ఇంద్రియములద్వారా జనించి, అంతకు పూర్వము తెలియబడని ముందు బాధితముకాని వస్తు విషయ కమైన చిత్తవృత్తి ప్రత్యక్ష ప్రమాణ మనబడును. లింగపరా మర్శ జన్యమై అనధిగతము, నబాధితము నగు వస్తువిషయక మైన చిత్తవృత్తి అనుమాన ప్రమాణ మనబడును. అప్తు నిచే చూడబడియో లేక అనుమింపబడియో యొక వస్తు వే శబ్దముచే నుపదేశింపబడునో యట్టి శబ్దముచే జన్యమై, అనధిగతా బాధిత వస్తు విషయకమగు చిత్తవృత్తి శబ్దప్రమాణ మనబడును.

ఇంద్రియ ప్రణాలికలద్వారా బాహ్యవస్తువుతో చిత్తము సంబద్ధమగుటచే నేర్పడిన అయా వస్తు విషయకమైన – సామాన్య విశేషాత్మకమగు వస్తువు యొక్క విశేషమును ప్రధానముగా నిశ్చయించు–వృత్తి ప్రత్యక్ష ప్రమాణ మని భాష్యకారులు – వ్యాసమహర్షి.

విపర్యయ లక్షణము:—

"విపర్యయో మిథ్యా జ్ఞానమతద్రూప ప్రతిష్ఠమ్" ౮

అతద్రూపప్రతిష్ఠమ్=జ్ఞానప్రతిభాసిరూపమున స్థిరముగా నుండని, మిథ్యాజ్ఞానమ్=బాధితజ్ఞానము– అట్టిది కానిదాని

యందు అట్టిది యని కలుగుజ్ఞానము. విపర్యయః=విపర్యయము.

సర్పము కానిదానిని సర్ప మనియు, రజతము కాని దానిని రజతమనియు తెలిసికొనుట (విపర్యయము) మిథ్యా జ్ఞానము–అవిద్య యనబడును. ఈ యవిద్య యైదు విధములు. ౧ అవిద్య ౨ అస్మితా. ౩ రాగము. ౪ ద్వేషము. ౫ అభినివేశము. ఇవే వరుసగా తమస్సు, మోహము, మహామోహము, తామిస్రము, అంధతామిస్రము నని చెప్పబడును.

వికల్ప లక్షణము:—

"శబ్దజ్ఞానానుపాతీ వస్తుశూన్యోవికల్పః" ౯

వస్తుశూన్యః = వస్తువులేని – నిర్విషయకమైన, శబ్దజ్ఞానానుపాతీ=శబ్దజ్ఞానము కలిగినవెంటనే కలుగు చిత్తవృత్తి, వికల్పః=వికల్ప మనబడును.

ఆకాశకుసుమము, గొడ్రాలిబిడ్డడు, కుందేటికొమ్ము మున్నగు జ్ఞానములు వికల్ప వృత్తివలన కలుగును. ఆకాశకుసుమాది వస్తువులే లేకుండుటవలన నీ వికల్పవృత్తి ప్రమాణముకాదు. ఈ వికల్పవృత్తి విపర్యయముకాదు. సంశయమును కాదు. ఇది బాధిత జ్ఞానమయ్యు లోకమున వ్యవహరింపబడుచున్నది. శబ్దజ్ఞానమే యిందులకు కారణము.

నిద్రాలక్షణము:—

"అభావ ప్రత్యయాలంబనా వృత్తిర్నిద్రా" ౧౦

పూర్వసూత్రమునుండి వృత్తిపద మిందు అనువర్తింపవీలున్నప్పటికి నిందు ప్రత్యేకముగా వృత్తిపదమును వాడినందున సూత్రకారుడు నిద్రను వృత్తిగా చెప్పదలచెనని యెంచవలెను.

అభావ ప్రత్యయాలంబనా = జాగ్రత్స్వప్నాది వృత్తుల యభావము విషయముగాగల, వృత్తిః=చిత్తవృత్తి, నిద్రా= నిద్ర యనబడును.

త్రిగుణాత్మకమగు చిత్తసత్త్వమున తమోగుణము సత్వ రజస్సులను ఆవరించి అంధకారము వ్యాపింపగా, బుద్ధి విషయా కారమున పరిణమింపదు. ఇదియే సుషుప్తావస్థ. పురుషు డపు డంతఃసంజ్ఞ కలిగియుండును. సుషుప్తియం దంతఃసంజ్ఞ కలదను టకు ప్రమాణము నిద్రనుండి మేలుకొనుటయే తడవుగ 'సుఖ ముగా నిద్రించితిని. నా మనస్సు ప్రసన్నముగానున్నది. నిద్ర సుఖముగాలేదు. ఒడలు బరువుగా నున్నది.' అని యనుటయే. సుషుప్తియందు జ్ఞానమే లేకున్న నిట్టి ప్రత్యవమర్శ కలుగదు. కాబట్టి నిద్రయు (తమోరూప ప్రత్యయ విషయమయిన) వృత్తి—జ్ఞానమనవలయునని భావము. సమాధియందు ఇతర వృత్తులవలె నిద్రావృత్తియు నిరోధింపబడవలయును.

సుషుప్తియందు చిత్తసత్వము అంధకారమును మాత్రము తెలుపుచు పరిణామ రహితమై యుండుటచే నిరుద్ధ ప్రాయమగును. పురుషుడు వృత్తులు లేనందున స్వస్థుడై పర మాత్మ సుఖము ననుభవించును. సమాధి మోక్షావస్థలందువలె బ్రహ్మానందము ననుభవించుచు శోకమును తరించి సుఖించును.

"సతా సోమ్య తదా సంపన్నో భవతి" ఛాం. ఉ. ౮.౧

"తద్యథా ప్రియయా స్త్రియా సంపరిష్వక్తో
నబాహ్యం కించనవేద నాంతరమ్

ఏవ మేవాయం పురుషః ప్రజ్ఞానే నాత్మ నా
సంపరిష్వక్తో న బాహ్యం కించనవేద నాంతరమ్"

బృ. ర. 3. ౨౧

'సుషుప్తియందు జీవుడు సత్స్వరూపుడగు పరమాత్మతో కలిసి నుండును.'

"ప్రియురాలయిన స్త్రీని కౌగిలించుకొని బాహ్యాభ్యంతరములను విస్మరించునట్లు జీవుడు పరమాత్మతోచేరి సర్వమును విస్మరించును."

మున్నగు ఉపనిషద్వాక్యములు పై విషయమునే ధ్రువపరుచును.

స్మృతి లక్షణము:—

"అనుభూత విషయా సంప్రమోషః స్మృతిః" ౧౧

సంప్రమోషః=దొంగతనము—పరుల అర్థమును గ్రహించుట. పూర్వము తెలిసిన విషయము స్మృతికి స్వార్థము. పూర్వము అనుభూతముకానిది పరార్థము. కాబట్టి, అనుభూత విషయా సంప్రమోషః=పూర్వము తెలిసికొనినదానిని ఎక్కువ తక్కువలు లేకుండ తెలిసికొను వృత్తి, స్మృతిః=స్మృతి యనబడును.

చిత్తమొకప్పు డేవస్తువునుచేరి దాని యాకారమును పొందియుండెనో ఆ విషయాకారమే చిత్త ధనము. అట్టిదానిని మరల గ్రహించు వృత్తి స్మృతి యనబడును. ఇట్టిదెడ చిత్తము పూర్వజ్ఞానమునే గ్రహించునా? లేక విషయమును

శైతము గ్రహించునా? యన ఉభయమును గ్రహించునని సమాధానము. ప్రమాణాది వృత్తులవలన నేర్పడు ప్రత్యయము (జ్ఞానము) విషయము, జ్ఞానము నను రెంటికి సంబంధించిన సంస్కారమునే యుదయింపజేయును. ఆ సంస్కారమే ఉద్బోధకముద్వారా వ్యక్తమై ఉభయాత్మక స్మృతిని కలిగించును. పూర్వము తెలియబడని-అనగా క్రొత్తగా తెలియబడు-వస్తు విషయక చిత్తవృత్తి జ్ఞానము. ఇందు 'ఘటమును తెలిసికొను చున్నాను' అని జ్ఞానము ప్రధానముగా నుండును. 'ఘటము' అనునది స్మృతి. ఇందు విషయము (వస్తువు) ప్రధానమగును. 'ఆ ఘటమే యిది' అనునది ప్రత్యభిజ్ఞ. భావితస్మర్తవ్యము అభావిత స్మర్తవ్యము నని స్మృతి రెండువిధములు. స్వప్నమున భావిత (కల్పిత) స్మర్తవ్యము. జాగరణ సమయమున అభావిత (యథార్థ) స్మర్తవ్యము. చిత్తవృత్తుల యనుభవము వలన సంస్కారములు కలుగును. ఆ సంస్కారములవలన స్మృతు లేర్పడును. వృత్తులన్నియు సుఖ దుఃఖ మోహరూపములే. ఇవి యన్నియు నిరోధింపదగినవే. సర్వ వృత్తి నిరోధమువల ననే సంప్రజ్ఞాత సమాధి కలుగును.

వృత్తి నిరోధమున కుపాయము:—

"అభ్యాస వైరాగ్యాభ్యాం తన్నిరోధః" ౧౭

అభ్యాస వైరాగ్యాభ్యాం=అభ్యాసము వైరాగ్యము ననురెంటిచే, తన్నిరోధః=చిత్తవృత్తుల నిరోధము కలుగును.

అభ్యాస వైరాగ్యము లన నేమో ముందు వర్ణింప బడును. ఇందు వైరాగ్యమువలన వృత్తి నిరోధము కలుగును. అభ్యాస మట్టి నిరోధమును స్థిరపరచును.

చిత్తమనెడినది కైవల్యాభిముఖమై వివేక విషయమనెడి నిమ్నమార్గమున ప్రవహించును. లేకున్న సంసారాభిముఖమై అవివేకమార్గమున ప్రవహించును. వైరాగ్యము విషయాభిరతిని శిథిలమొనర్చి వివేకమును కలిగించును. అభ్యాస మా స్థితిని స్థిరపరచునని భావము.

అభ్యాస లక్షణము:—

"(తత్ర) స్థితౌ యత్నోఽభ్యాసః" ౧౩

"స్థితౌ=వైరాగ్యముద్వారా చిత్తవృత్తులు నిరోధింప బడగా నేర్పడు ఏకాగ్రతకొఱకు చేయు, యత్నఃచిత్తమును నిలుపుటకై యమనియమాది సాధనముల నాచరణలో నుంచుటకగు ఉత్సాహాది యత్నము, అభ్యాసఃఅభ్యాస మన బడును.

"(సతు)దీర్ఘకాల నైరంతర్య సత్కారాసేవితో దృఢభూమిః" ౧౪

సతు=పై సూత్రమున చెప్పబడిన యభ్యాసము, దీర్ఘ కాల.....సేవితఃమరణ పర్యంతము గాఢనిద్రాసమయము విడిచి మిగిలిన సమయమంతయు శ్రద్ధతో నాచరింపబడి, దృఢభూమిఃనిశ్చలస్థితికలది యగును.

చిత్తమును బాహ్య ప్రపంచమున వర్తింపకుండునట్లు చేయు యత్నము మరణపర్యంతము నిరంతరము చేయవలెను.

ఇంపు తపస్సు, బ్రహ్మచర్యము, శ్రద్ధయు మిక్కిలి తోడ్పడ గలవు. అభ్యాస మట్లుచేయకున్న చిత్తనిరోధ మేర్పడదు.

వైరాగ్య లక్షణము:—

"దృష్టానుశ్రవిక విషయ వితృష్ణస్య వశీకార సంజ్ఞావైరాగ్యమ్" ౧౫

దృష్టే విషయే=ఐహిక విషయములందు, అనుశ్రవికే విషయే=వేదశాస్త్ర బోధిత పారలౌకిక విషయములందు, వితృష్ణస్య = ఆశలుడిగిన యోగియొక్క చిత్తస్థితి — దివ్యములు అదివ్యములు నగు వస్తువుల నాకాంక్షింపనిబుద్ధి, వశీకార సంజ్ఞా వైరాగ్యమ్=వశీకారమను పేరుగల వైరాగ్య మనబడును.

స్త్రీలు, అన్నపానములు, ఐశ్వర్యము మున్నగునవి ఐహికములు—దృష్టవిషయములు. అనుశ్రవమన వేదము. గురువులు చెప్పగా విని నేర్వబడునది. దానివలన కలుగు జన్మాంతర (విదేహ ప్రకృతి లయ) ములకు సంబంధించిన విషయములు అనుశ్రవికములు. ఆ విషయములు పరిణామములను చెందుచు ఒక క్షణమున సరసములయినను క్షణాంతరమున విరసములయి దోషములతో కూడినవగుటచే యోగారూఢుడు కాదలచు వ్యక్తి వానియందు విరక్తుడగును. వానిని సంపాదింప యత్నింపడు. అవి తాపత్రయముతోకూడినవిగా తెలిసికొనును. అతనికి విషయములందువైఁబుద్ధి కలుగును. ఇదియే ప్రసంఖ్యానము. ఇట్టి వితృష్ణ వశీకార మనబడును. దీనినే అపరవైరాగ్య మందురు.

వైరాగ్యమునకు నాలుగు పేరులని ఆగమికు లంతురు. ౧. యతమానసంజ్ఞ. ౨. వ్యతిరేక సంజ్ఞ. ౩. ఏకేంద్రియసంజ్ఞ. ౪. వశీకార సంజ్ఞ.

చిత్తమునందుండు అనురాగాది మలములు ఇంద్రియములను తమ తమ విషయములందు ప్రవర్తింపజేయును. అట్లు ఇంద్రియములు విషయములందు ప్రవర్తింపకుండునట్లు చేయు యత్నము యతమాన సంజ్ఞగల వైరాగ్యము. ఇట్లు యత్నింపగా చిత్తమునందలి రాగాది మలములు కొన్ని పక్వములగును. కొన్ని పక్వములు కావలసియుండును. ఇట్లు పక్వములు కానల సినవానికంటె పక్వములయినవానిని వ్యతిరేకముగా నిర్ణయించుట వ్యతిరేక సంజ్ఞగల వైరాగ్యము. పక్వములయిన మలములు ఇంద్రియములను విషయములందు ప్రవర్తింపజేయగల సమర్థత లేని స్థితిలో చిత్తమునందుండుట ఏకేంద్రియ సంజ్ఞగల వైరాగ్యము. దివ్య-అదివ్య విషయములు ఉపస్థితములై యున్నను ఉపేక్షించుట వశీకారసంజ్ఞగల వైరాగ్యము నాలుగవది. ఇదియే అపరవైరాగ్యము. తక్కిన మూడుసంజ్ఞలుగల వైరాగ్యము కలుగకున్నచో నీ యపరవైరాగ్యము కలుగనేరదు. కాబట్టి ఋషి దీనినే వర్ణించియున్నాడు.

ఈ యపరవైరాగ్యమువలన రాజస తామస చిత్తవృత్తులు నిరోధింపబడి సంప్రజ్ఞాత సమాధి యేర్పడగలదు. కాబట్టి ఇది సంప్రజ్ఞాత సమాధికి అంతరంగసాధనము-ముఖ్యకారణ మనగును.

సాత్వికచిత్తవృత్తులను సైతము నిరోధింప ననుకూలించు పరవైరాగ్యము:—

"పరం పురుషఖ్యాతే ర్గుణవైతృష్ణ్యమ్." ౧౬

పురుషఖ్యాతేః=గుణత్రయాత్మక ప్రకృతికంటె పురుషుని భిన్నముగా నెరుగుటవలన, (కలుగు) గుణవైతృష్ణ్యమ్=గుణవిరక్తి, పరమ్=పరవైరాగ్య మనబడును.

ఐహికాముష్మిక విషయములందుగల దోషముల నెఱిగి వానినుండి చిత్తమును మరలించుకొని విరక్తుడగును. అట్టిపై సత్త్వనృత్తికలవాడై ఆచార్యోపదేశాదులద్వారా తెలిసికొనిన పురుషుని దర్శించుట కభ్యాసముచేయును. ఇట్టి సాత్వికవృత్తియే ప్రకృతిపురుష వివేకజ్ఞాన ముదయించును. పురుషుడు శుద్ధుడనియు గుణములు (ప్రకృతి) పురుష విపరీతము – మలినము–లనియు తెలిసికొనును. గుణములనుండి విరక్తుడగును. ఇట్టి స్థితియే ధర్మమేఘసమాధి యనబడును. ఇట్లు యోగి పురుష ప్రకృతులలోగల భేదమును గుర్తెఱుగును. ఈ జ్ఞానమే శుద్ధ సాత్వికవృత్తి. ఇదియు గుణ(ప్రకృతి) వికారమే యని దానినుండియు విరక్తుడగును. ఇట్లు అపరవైరాగ్యమున రాజస తామస వృత్తులనుండి విరక్తుడై, పరవైరాగ్యమున సాత్వికవృత్తినుండియు విరక్తుడగును. పరవైరాగ్యమున వివేకజ్ఞానము కలవాడై "పొందదగినది పొందితిని. అవిద్యాదిక్లేశములు క్షీణించినవి. ధర్మాధర్మ సంస్కార సమూహములవలన నేర్పడు జన్మపరంపర తెగినది" అని యెంచును. ఈ జ్ఞానపరాకాష్ఠయే

పరవైరాగ్య మనబడును. కైవల్యమన నియ్యదియే. "జీవన్ముక్తో విద్వాన్".

అభ్యాస వైరాగ్యముల లక్షణములను చెప్పి యటుపై అభ్యాస వైరాగ్యములద్వారా రాజస తామస వృత్తులు నిరోధింపబడగా నేర్పడు సంప్రజ్ఞాత సమాధిని వర్ణించుచున్నాడు.

"వితర్క విచారానందాస్మితానుగమాత్ సంప్రజ్ఞాతః" ౧౭

వితర్క.....గమాత్=వితర్కము, విచారము, ఆనందము, అస్మిత, వీని సంబంధముచేత, సంప్రజ్ఞాతః=సంప్రజ్ఞాతసమాధి కలుగును.

కొంతకాక స్థూలమైన భౌతికవస్తువును ఆధారముగా నుంచుకొని యంతఃచిత్తమును నిలుప నది దాని యాకృతి కలచి యుండును. ఇట్టి సాత్వికచిత్తపరిణామమే వితర్క మనబడును. విషయము స్థూలమగుటచే స్థూలమైన సాత్వికపరిణామము కలుగును. ఇదియే భావనయనియు చెప్పబడును.

స్థూలభూతములకు కారణములైన పంచతన్మాత్రలు ఆధారముగా నిలుకొని యంతఃచిత్తమును నిలుప, చిత్తము పంచతన్మాత్రల యాకృతిని పరిణమించును. ఇట్టి సూక్ష్మసాత్వికపరిణామము విచార మనబడును.

విషయములను సమీపింపజేసి యానందము (హ్లాదము)ను కలిగింపజేయులకు కారణములగుటచే నింద్రియములు ఆనంద మనబడును. అట్టి ఇంద్రియమునందు చిత్తము నిలుపగా నేర్పడు స్థూల సాత్వికపరిణామము ఆనంద మనబడును.

'పురుషుడే తాను'ను అహంకారముతో కూడిన బుద్ధి అస్మితయనబడును. ఈ యస్మితయనెడి సూక్ష్మవిషయమున చిత్తము నిలుపుటవలన నేర్పడు సూక్ష్మ సాత్త్వికపరిణామము అస్మితయనబడును.

ఇట్లు వితర్కసంబంధముచేత వితర్కానుగత సంప్రజ్ఞాత సమాధి, విచారసంబంధమున విచారానుగతసంప్రజ్ఞాతసమాధి, ఆనంద సంబంధమున ఆనందానుగత సంప్రజ్ఞాత సమాధి, అస్మితాసంబంధమున అస్మితానుగత సంప్రజ్ఞాత సమాధియని సంప్రజ్ఞాత సమాధి నాలుగువిధములు. ఇందు మొదటి రెండును బాహ్యవిషయములకు సంబంధించినవి. మూడవది ఇంద్రియమునకు సంబంధించినది. నాలుగవది గ్రహీతృ (బుద్ధి) విషయకమని గ్రహింపవలయును.

మూలకారణమగు ప్రకృతి, దానిచే నేర్పడు బుద్ధి, అహంకారము, పంచతన్మాత్రలు, ఇంద్రియములు, స్థూలభూతములు, శరీరము మున్నగు కార్యవిషయములనుండి పురుషుని వేరుగా నెఱుగుటకై యోగమభ్యసింపబడును. పాలు నీళ్లు కలిసియున్నట్లు భేదము గ్రహింప వీలులేని విధమున ప్రకృతి పురుషులు కలిసియుండుటచే తేలికగా వానివివేకము కలుగజాలదు. అందువలన శరీరాదులు ఒక్కొక్కటిగా పురుషునికంటె వేరని వివేకించి సాక్షాత్కారము చేసికొనవలయును. ఇందులకు యోగము మిక్కిలి యుపయుక్తమని యెంచి ఋషి మొదట సాలంబన (ఆధారముతో కూడిన) యోగము — సంప్రజ్ఞాత సమాధిని—గూర్చి వివరించినాడు. సంప్రజ్ఞాతమే

సబీజసమాధి యనబడును. ముక్తికాములు దీనిని హేయము (విడువదగినది) గా నెంతురు.

పరవైరాగ్యముచే కలుగు అసంప్రజ్ఞాత సమాధి, దాని లక్షణము, ఉపాయము:—

"విరామప్రత్యయాభ్యాసపూర్వః సంస్కారశేషోఽన్యః" ౧౮

విరామ ప్రత్యయాభ్యాసపూర్వః = పరవైరాగ్యము కారణముగాగల, సంస్కారశేషః=నిరోధ సంస్కార రూపమున నుండు చిత్తస్థితి, అన్యః=అసంప్రజ్ఞాత సమాధి—నిర్బీజసమాధి యనబడును.

సాత్త్విక రాజస తామస వృత్తులలో నొక్కటియు లేకుండుట (సర్వవృత్తుల యభావము) విరామము. దాని కే జ్ఞానము కారణమో అది పరవైరాగ్యము. అట్టి వైరాగ్యమును మాటిమాటికి అలవరుచుకొనుటవలన చిత్తము సంస్కార రూపమున మిగిలియుండును. అనగా పరవైరాగ్యమును బాగుగ నభ్యసించుటవలన వృత్తులు, వృత్తుల సంస్కారములు నన్నియు నిరోధింప (అడ్డగింప) బడును. చివరకు చిత్తము నిరోధసంస్కారరూపమున మాత్ర ముండును. ఇట్టి చిత్త స్థితియే అసంప్రజ్ఞాత – నిర్బీజ–సమాధి యని చెప్పబడును.

ఇట్టి సమాధినిపొందినయోగులే బ్రహ్మవిద్వరిష్ఠు లనబడుదురు. యోగమునకు పరమావధియు నిదియే. వృత్తులు, వాని సంస్కారములు నన్నియు లేకుండుటచే చిత్తము నశించినట్లే యగును. కాబట్టి పురుషుడు స్వస్వరూపమున బ్రహ్మానంద సుఖము (కైవల్య సుఖము) ననుభవించును.

ఈ నిర్బీజసమాధి ఉపాయప్రత్యయము, భవప్రత్యయము నని రెండువిధములు. అందు భవప్రత్యయము:—

"భవప్రత్యయో విదేహ ప్రకృతిలయానాం" ౧౯

విదేహ ప్రకృతి లయానామ్ = విదేహులకు, ప్రకృతి లయులకు, కలుగు అసంప్రజ్ఞాత సమాధి, భవప్రత్యయః = అవివేకపూర్వకము—భవప్రత్యయ మనబడును.

పృథివ్యాది పంచభూతములలో కొండొకదానిని ఆత్మగా తలచి దాని నుపాసించి కేవలము సంస్కార రూపమున మిగిలి యున్న చిత్తముగలవారై, స్థూలదేహ రహితులై మరణానంతరము తా ముపాసించిన భూతములందు లీనులైయుండువారు విదేహు లనబడుదురు.

పంచభూతములుకాక మిగిలిన అవ్యక్తము, మహత్తత్వము, అహంకారము, పంచతన్మాత్రములలో నేదేని యొకదాని నుపాసించి ఆయావాసనలచే వాసితములగు నంతఃకరణములతో శరీరపాతానంతరమున అవ్యక్తాది ప్రకృతి వికారములలో లీనులైయుండువారు ప్రకృతిలయు లనబడుదురు.

వీరికి దేహాదులలో విరక్తి కలిగినను పురుషఖ్యాతి కలుగదు. వైరాగ్యమువలన సమాధి యేర్పడినను చిత్తము బొత్తుగా నశింపక ప్రకృతియందు లీనమై యుండును. వైరాగ్యమువలన నేర్పడిన సంస్కార నిరోధబల మున్నంతవర కల్లో యుండి అనంతరమున జన్మహేతువగును. ఇట్టి చిత్తము సాధి

వాని చిత్తమనబడును. సాధికారమన అచరితార్థము. వివేక ఖ్యాతి–ప్రకృతి పురుష వివేకజ్ఞానము– కలిగించిన చిత్తము చరితార్థమగును. వివేకఖ్యాతి కలిగించని చిత్తము అచరితార్థ మయి కొంతకాల మది ప్రకృతిమహత్తత్త్వాదులలో లీనమై యుండి పునర్జన్మశూన్యతఫలన సమాధిలో కలుగు కైవల్య సుఖముసంటి సుఖము కలిగించి నిరోధబలము నశింపగానే మరల జన్మహేతువగునని భావము. కాబట్టి భవప్రత్యయ సమాధి ముముక్షువులకు హేయమేకాని ఉపాదేయముకాదు.

"వివేకఖ్యాతిహీనస్య సంస్కారశ్చేతసోభవః"
వివేకఖ్యాతి కలుగని చిత్త సంస్కారము జన్మహేతువు.

"దశమన్వన్తరాణీహ తిష్ఠన్తీంద్రియచింతకాః
భౌతికాస్తు శతం పూర్ణం సహస్రం త్వాభిమానికాః
బౌద్ధా దశసహస్రాణి తిష్ఠన్తి విగతజ్వరాః
పూర్ణం శతసహస్రంతు తిష్ఠం త్యవ్యక్తచింతకాః
పురుషం నిర్గుణంప్రాప్య కాలసంఖ్యా నవిద్యతే"
అని వాయుపురాణమునను చెప్పబడినది.

ఉపాయప్రత్యయసమాధి:—

"శ్రద్ధా వీర్యస్మృతి సమాధి ప్రజ్ఞాపూర్వక ఇతరేషామ్" ౨౦

ఇతరేషామ్ = కైవల్యము నభిలషించు యోగులకు, శ్రద్ధా...పూర్వకః=శ్రద్ధ, వీర్యము, స్మృతి, సమాధి, ప్రజ్ఞ యనెడి యుపాయములద్వారా అసంప్రజ్ఞాత–నిర్బీజ సమాధి కలుగును.

ఐహికాముష్మిక విషయములందు తృష్ణారహితుడు కాగా చిత్తమునందు కలుగు యోగవిషయకమైన అభిరుచి—మిక్కిలి కోరిక—శ్రద్ధ (చిత్తసంప్రసాదము) అనబడును. ఇట్టి చేతఃసంప్రసాదము (శ్రద్ధ) జననివలె యోగిని కాపాడును. దేహేంద్రియాదుల నాత్మగా భావించువారి కిట్టి యభిరుచి—చిత్తప్రసాదము కలుగనేరదు.

శ్రద్ధావంతునకు వివేకసంపాదన కొఱకు గలుగు ఉత్సాహము వీర్యమనబడును. ఆగమములు, అనుమానము, ఆచార్యోపదేశాదులద్వారా తెలియబడిన యమనియమాది యోగాంగముల అనుష్ఠానము (ఆచరణ) కొఱకు వీర్యవంతునకు కలుగు స్మరణము స్మృతి యగును. ధ్యానమనియునందురు. యోగాంగానుష్ఠానమువలన కలుగు సంప్రజ్ఞాతసమాధి ఇట సమాధియనబడును. సమాహితచిత్తునకు కలుగు వివేకజ్ఞానము ప్రజ్ఞ యనబడును. దీనిచే వస్తుయాథార్థ్యము బోధపడును.

ఇట్లు శ్రద్ధవలన వీర్యము, దానివలన (ధ్యానము) స్మృతి, యద్దానివలన సంప్రజ్ఞాతసమాధి, అందున ప్రజ్ఞయు కలుగును. ఇట్టి యుపాయములచే కలుగు నిర్బీజ సమాధిని మోక్షాపేక్ష కలవారు కామింతురు.

"తీవ్రసంవేగానా మాసన్నః" ౨౧

పైన వర్ణించిన నిర్బీజసమాధి, తీవ్రసంవేగానామ్ = త్వరగా లభింపవలయునని నిరంతరము నభ్యసించుటలో నెక్కుడు కోరిక గలవారికి, ఆసన్నః=త్వరగా లభింపగలదు.

శ్రద్ధాద్యుపాయములందు తీవ్రతకలవారికి సమాధి త్వరగా లభింపగలదు.

ఉపాయములు మృదువులు, మధ్యమములు, అధిమాత్రములు నని మువ్విధములు. ఆ యుపాయముల ననుష్ఠించు యోగులును ఆయాభేదములచే నవవిధముల వేర్వొనబడుదురు. (౧) మృదూపాయ మృదుసంవేగము కలవారు. (౨) మృదూపాయ మధ్యసంవేగము కలవారు. (3) మృదూపాయ–అధిమాత్రసంవేగము కలవారు. (౪) మధ్యోపాయ మృదుసంవేగము కలవారు. (౫) మధ్యోపాయ మధ్య సంవేగము కలవారు. (౬) మధ్యోపాయ–అధిమాత్రసంవేగము కలవారు. (౭) అధిమాత్రోపాయ మృదుసంవేగము కలవారు. (౮) అధిమాత్రోపాయ మధ్యసంవేగము కలవారు. (౯) అధిమాత్రోపాయ అధిమాత్ర సంవేగము కలవారు.

"మృదుమధ్యాధిమాత్రత్వా త్తతోపి విశేషః" ౨౨

పైన వర్ణించిన తీవ్రసంవేగమునందలి తీవ్రతయు, మృదు మధ్యాధిమాత్రత్వాత్ =మృదువు,మధ్యమము, అధిమాత్రము నని మూడు భేదములు కలదగుటవలన, తతోపి విశేషః = అంతకంటెను త్వరగా సమాధి లభింపగలదు.

ఎక్కడు తీవ్రతతో శ్రద్ధాద్యుపాయముల ననుష్ఠించుటచే నతిత్వరలో సమాధి సిద్ధించును. కైవల్యప్రాప్తి కలుగగలదని భావము.

త్వరలో సమాధి సిద్ధించుటకు వేరొండు ఉపాయము కలదా యనఁ—

"ఈశ్వరప్రణిధానాద్వా" ౨౩

ఈశ్వరప్రణిధానాద్వా= ఈశ్వరునియెడ చూపబడు భక్తి విశేషమువలననను.

భక్తివిశేషముచే నభిముఖమైన ఈశ్వరతత్వము తీవ్ర సంవేగముగల యోగికి సమాధి శీఘ్రముగా కలుగునట్లు అనుకూలించును. ఈశ్వర ధ్యానమువలన యోగి త్వరలో నిర్బీజ సమాధి లాభము నందగలడని భావము.

ప్రకృతియు పురుషుడును గాక యీశ్వరు డన నెవరనఁ—

"క్లేశకర్మవిపాకాశయై రపరామృష్టఃపురుషవిశేష ఈశ్వరః" ౨౪

క్లేశకర్మ విపాకాశయైఃఅవిద్యాది క్లేశములు, ధర్మాధర్మము లనెడి కర్మములు, కర్మఫలములయిన జాతి ఆయువు భోగము ననెడి విపాకము, విపాకమున కనుగుణమైన వాసనలు వీనిచే, అపరామృష్టఃసంబంధములేని, పురుషవిశేషఃపురుషోత్తముడు, ఈశ్వరఃఈశ్వరు డనబడును.

క్లేశాదులు మనస్సునందుండి జీవునియందుచేరి వ్యవహరింపబడును. జీవుడే వాని ననుభవించును. ఇట్టి యనుభవముతో సంబంధములేని పురుషుడు ఈశ్వరు డనబడునని భావము.

కైవల్యము ననుభవించు జీవులును క్లేశాదులతో సంబంధము లేనివా రెందరో ఉండగా వారికంటె భిన్నముగా ఒక ఈశ్వరు నంగీకరింపనేలయని సందేహింప వలనుపడదు. కైవల్యము ననుభవింపకముందు జీవులకు క్లేశాదులతో

సంబంధ ముండును. విదేహులకు, ప్రకృతి లయులకును కాలాంతరమున క్లేశాదులతో సంబంధము కలుగగలదు. కాని ఈశ్వరుడు పూర్వమునగానీ పరమునగానీ యెన్నడును క్లేశాదులతో సంబద్ధుడు కాక సదా ముక్తుడై యుండును. అతడాప్తకాముడు. సర్వజ్ఞుడు. సర్వశక్తిమంతుడును.

ఇట్టి లక్షణములుగల ఈశ్వర తత్వ మొండు కలదనుటకు ప్రమాణమేమి?

"తత్ర నిరతిశయం సర్వజ్ఞ బీజమ్" ౨౫

తత్ర=ఈశ్వరునండుగల, నిరతిశయం = అతిశయము నుండి విడివడిన, సర్వజ్ఞబీజమ్=సర్వజ్ఞతకు నిమిత్త కారణమగు జ్ఞానము ప్రమాణము.

ఈశ్వర పదముచే చెప్పదగు తత్వమొకటి కలదనుటకీ సూత్రమున అనుమాన ప్రమాణము చూపబడినది.

మనుజులలో భూత భవిష్యద్వర్తమాన విషయములకు సంబంధించిన జ్ఞానము ఒకనియందు స్వల్పముగాను, మరి యొకనియం దంతకంటె కొంచె మధికముగాను, వేరొకనియం దంతకంటె నెక్కుడుగాను కనబడుచున్నది. ఇట్లు ప్రతి వ్యక్తి యందు నుండు జ్ఞానము ఇతరుల జ్ఞానముకంటె కొంచె మెక్కుడుగానో లేక తక్కువగానో కనబడుట లోక సిద్ధము. విషమమైన యీ జ్ఞానమే సాతిశయ (జ్ఞాన) మని శాస్త్రమున చెప్పబడును. ఒకచో సాతిశయముగా తెలియబడునది మఱి యెటనేని యొక్కయెడ నిరతిశయమై యుండుట నియమము.

ఇంపుల కుదాహరణము పరిమాణము. ఉసిరికాయ, వెలగ కాయ, గుమ్మడికాయ మున్నగు పదార్థములలో హెచ్చు తగ్గులుగా కనబడు పరిమాణము ఆకాశాది నిత్య విభుపదా ర్థములలో నిరతిశయమై యుండును. అట్లే నీవు, నేను, వాడు అని పేర్కొనబడు వ్యక్తులలో హెచ్చు తగ్గులుగా కనబడు జ్ఞానము సాతిశయము. అది యొకచో నెట్టనైనను నిరతిశయ ముగ (పూర్ణముగ–ఆ జ్ఞానమునుమించిన జ్ఞానము మరియొకచో నుండని విధముగ) నుండవలయును. అట్టి జ్ఞానాశ్రయ తత్వమే ఈశ్వరుడని భావము. ఇట్లే నిరతిశయ మగు క్రియాశక్తియు ప్రమాణముగ గ్రహింపనగును. ఇట్టి పదార్థమునకు ఈశ్వరుడు, బ్రహ్మ, విష్ణువు, హిరణ్యగర్భుడు మున్నగు నామములు భార తీయ శాస్త్రములందు పేర్కొనబడినవి. ఈ నామముల వ్యుత్ప త్త్యాదులను వివరముగా తెలిసికొనగోరువారు దయానంద మహర్షికృత సత్యార్థ ప్రకాశమున ప్రథమ సముల్లాసము చదువుట శ్రేయస్కరము.

సర్వజ్ఞాన మయమగు వేదము ప్రకాశింపజేసిన ఋషులు నిరతిశయజ్ఞానవంతులై యుండ వేరుగా నీశ్వరతత్వ మెందేల యంగీకరింపవలయునన:–

"పూర్వేషామపి గురుః కాలేనానవచ్ఛేదాత్" ౨౬

ఈశ్వరుడు, పూర్వేషామపి = వేదప్రకాశకు లయిన పూర్వ ఋషులకును, గురుః= గురువు–ఉపదేశకుడు. కారణ మేమన, కాలేనానవచ్ఛేదాత్ = ఆద్యంతములు లేనివాడగుట వలన.

ఈశ్వరుడొకప్పుడుండి మరియొకప్పుడు లేకుండువాడు కాకుండుట కాబట్టి కాలమతనిని నియమింపదు. కాల వ్యవధి లేక యెల్లకాలములందుండువాడు కావున పూర్వఋషులకును జ్ఞానదాతగా నీశ్వరు డిట్లు వర్ణింపబడెను.

పూర్వేషా మపి=పూర్వపూర్వ సర్గాదులలో నుత్పన్ను లగు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాదులకును, గురుః=పిత–అంత ర్యామి. విద్యాద్వారమున జ్ఞానచక్షువు నొసంగువాడు. కారణ మేమన, కాలేనానవచ్ఛేదాత్=కాలపరిమితిగల బ్రహ్మా దులు కాలపరిమితి లేని గురువులేక సంభవింపరని వార్తిక కారులు.

ఈశ్వరప్రణిధానము చేయువిధమును వర్ణింపదలచి ముందుగా తద్వాచకము (నామము)ను వర్ణించుచున్నాడు:—

"తస్యవాచకః ప్రణవః" ౨౭.

తస్య=ఆ యీశ్వరుని, వాచకః=నామము, ప్రణవః= ఓంకారము.

ఓంకారము ఈశ్వరతత్వమును తెలుపును. కాబట్టి ఓంకారము వాచకము. ఈశ్వరుడు వాచ్యము. శబ్దార్థము లకు గల సంబంధము నీశ్వర సంకేతము నియమించును. శబ్దా ర్థములకు స్వాభావిక సంబంధ మొండుండును. ప్రతి శబ్దము ప్రత్యర్థమును బోధించుటయే వానికిగల స్వాభావిక సంబం ధము. ఒక శబ్ద మొక్కయర్థమునే బోధింప వలయునను నియమములేక శబ్దములన్నియు పదార్థముల నన్నింటిని

తెలుపు ననుటయే శబ్దార్థములకుగల స్వాభావిక సంబంధమని భావము. 'ఈ శబ్దముచే నీయర్థము తెలియనగును'ను నీశ్వర సంకేతము శబ్దార్థములకుగల స్వాభావిక సంబంధమునకు ద్యోతకము, నియామకము నగునని భావము. పితాపుత్రులకు గల జన్యజనకభావ సంబంధమును సంకేతము ద్వారా 'ఇత డితనికి పిత, ఇతడితనికి పుత్రుడు' అని తెలుపబడుట లోక విదితము. ఇట్లు వాచ్యవాచకత్వ సంబంధముచే ప్రణవము (ఓమ్) ఈశ్వరుని తెలుపునని భావము.

ఈశ్వర నామమును తెలిపి ప్రణిధానమును వర్ణించుచున్నాడు:-

"తజ్జప స్తదర్థభావనమ్" ౨౮

తజ్జపః=ప్రణవజపము, తదర్థభావనమ్= ప్రణవశబ్దమున కర్థమైన ఈశ్వరుని భావించుటయు ప్రణిధాన మనబడును.

ప్రణవము (ఓమ్)ను మాటిమాటికి మనస్సున స్మరించుచు, సర్వజ్ఞమైన ఈశ్వరతత్వమును భావించు యోగికి చిత్త మేకాగ్ర మగును.

"స్వాధ్యాయాద్ యోగమాసీత
యోగాత్ స్వాధ్యాయ మామనేత్
స్వాధ్యాయ యోగసంపత్త్యా
పరమాత్మా ప్రకాశతే"

స్వాధ్యాయ మన ప్రణవజపము. యోగమన ఈశ్వర భావన. ప్రణవజపము, ఈశ్వరభావన యను నీ రెంటితో ఈశ్వర తత్వ మభిముఖమగును. యోగిచిత్త మనాకులమై సమా

హితమగును. పురుషఖ్యాతి కలుగును. పరవైరాగ్యముద్వారా అసంప్రజ్ఞాత సమాధి—నిర్బీజ సమాధి యేర్పడును.

ఈశ్వర ప్రణిధాన మొనర్చు యోగికి కలుగు లాభము సమాధి మాత్రమేనా ? యన :—

"తతః ప్రత్యక్చేతనాధిగమో ప్యంతరాయాభావశ్చ" ౨౯

తతః = ఈశ్వరప్రణిధానము వలన, ప్రత్యక్‌చేతనాధిగమోపి=ప్రకృతికంటె భిన్నుడైన జీవుని స్వరూప ప్రాప్తియును, అంతరాయాభావశ్చ=రాబోవు సూత్రమున వర్ణింపబడు వ్యాధి మున్నగు విఘ్నముల నివారణమును సేర్పడగలవు.

ప్రత్యక్‌చేతనము:— ప్రత్యక్ = విపరీతముగ నెఱుగు నట్టి, చేతనము=జీవపదార్థము. జీవుడు ప్రకృతి సంబంధముచే తన స్వరూపము నున్నదున్నట్లు తెలిసికొనక విపరీతముగ తెలిసి కొనును. ఈశ్వరప్రణిధానమువలన యోగి రోగాది విఘ్న ములనుండి తొలగి క్రమముగా సంప్రజ్ఞాత సమాధి కలవడును. అట్టిపై తన స్వరూపమును గుర్తించును. అంతట పరమ వైరాగ్య మేర్పడి నిర్బీజ సమాధిని పొందును. అనంతరము పరమాత్మ ప్రకాశ మేర్పడును. నాడు జీవుడు కైవల్య సుఖము—బ్రహ్మానందప్రాప్తి నందును.

ఇందు ఈశ్వరునికొఱకు యత్నించు యోగికి ఆత్మ స్వరూప (తనరూప) ప్రాప్తి యెట్లుకలుగగలదని సందేహింప వలదు. జీవుడు కూటస్థుడు (జన్మ మరణములు లేనివాడు), ప్రసన్నుడు (అవిద్యాది క్లేశరహితుడు), కేవలుడు (ధర్మాధర్మ

సంస్కార రహితుఁడు) మఱియు జాతి, ఆయువు, భోగము నను వానిచే రహితుఁడు నయినపుఁడు ఈశ్వరునివలె నుండును. జీవేశ్వరులలో నొకింత భేదముతో సమానత యేర్పడును. సామ్యమువలన ఈశ్వరునకై యత్నించుచు స్వస్వరూపమును గూడ తెలిసికొనును. కొండొక శాస్త్రము నభ్యసించువాఁడు దానికి సమానమైన మఱియొక శాస్త్రము నభ్యసింపకయే తెలిసికొనఁగలుఁగుట మన మెఱుఁగుదుము కదా !

అంతరాయములు:—

"వ్యాధిస్త్యానసంశయ ప్రమాదాలస్యావిరతి భ్రాంతిదర్శనాలబ్ధ భూమికత్వా నవస్థితత్వాని చిత్తవిక్షేపాః తేఽన్తరాయాః" 3౦

వ్యాధి.....అనవస్థితత్వాని = వ్యాధి మున్నగునవి, చిత్తవిక్షేపాఃచిత్తమును చలింపఁజేయునవి. తేఽన్తరాయాఃఅవి యంతరాయములు—యోగమలములు అనఁబడును.

వ్యాధిః— శరీరమునందలి వాతపిత్తాది ధాతువులయు, అవయవములయు వికారము వలన కలుగు జ్వరాదులు.

స్త్యానమ్:—కోరికయున్నను యోగసాధనకు తగిన సామర్థ్యము చిత్తమున లేకుండుట.

సంశయఃఁ— యోగము తనకు సాధ్యమగునో కాదో యను సందేహము.

ప్రమాదఃఁ— యమనియమాది యోగాంగముల ననుష్ఠించకుండుట.

ఆలస్యమ్ఁ— యోగాంగములయిన యమనియమాదుల నాచరింప ప్రవృత్తికలిగింపని శరీరస్థూలత, చిత్తమాలిన్యమును.

అవిరతిః— శబ్దస్పర్శాది విషయములందు అనురాగము కలిగియుండుట.

భ్రాంతిదర్శనమ్ః— ఆచార్యులచే బోధింపబడిన యోగాంగములను యోగాంగములు కావని యెంచుట.

అలబ్ధభూమికత్వమ్ః— యోగాంగముల నభ్యసించినను మధుమత్యాదినామములుగల చిత్తదశలను పొందకుండుట.

అనవస్థితత్వమ్ః— చిత్తభూములను పొందియు నట నిల కడ లేకుండుట.

ఇవి యన్నియు యోగమునకు విఘ్నములు. సమాధి కంతరాయములు. ఇవి చిత్తమును విక్షిప్తమొనర్చి వృత్తి నిరోధరూపమగు సమాధిని కలుగనీయవు. కాబట్టి యోగ మలములనియు వీని నందురు.

ఈ యంతరాయములతోబాటు:—

"దుఃఖదౌర్మనస్యాఙ్గమేజయత్వశ్వాసప్రశ్వాసావిక్షేపసహభువః"౩౧

దుఃఖ...ప్రశ్వాసాఃదుఃఖాదులు, విక్షేపసహభువఃవ్యాధి మున్నగు విక్షేపము (అంతరాయము) లుండగా గలుగును.

ఆధ్యాత్మికము, అధిభౌతికము, అధిదైవికము నని మువ్విధములుగ చెప్పబడు బాధలు దుఃఖము. కోరికలు నెర వేరనందువలన కలుగు చిత్తవైకల్యము దౌర్మనస్యము. అసనము (కూర్చుండుస్థితి), మనస్సు వీని స్థిరతకు భంగము కలిగించు శరీరావయవముల కంపనము అంగమేజయత్వము.

ప్రయత్నము లేకయే వెలుపలి వాయువు లోపలికి ప్రేరేపింప బడుట శ్వాసము. ఇట్లే లోపలి వాయువు బయటికి విడుచుట ప్రశ్వాసము.

దుఃఖము, దౌర్మనస్యము, అంగమేజయత్వము, శ్వాసము, ప్రశ్వాసము ననునీ యైదును చిత్తము విక్షిప్తావస్థయందుండగా కలుగును. సమాహితమై యున్నపుడు కలుగనేరవు.

సమాధికి విరోధులగు నీ విక్షేపములు (అంతరాయములు), వాని సహచరములయిన దుఃఖాదులు నివారింప నేమి జేయవలయు ననఁ:—

"తత్ప్రతిషేధార్థ మేకతత్త్వాభ్యాసః" 32

తత్ప్రతిషేధార్థమ్=ఆ యంతరాయముల నష్టగించుటకు, ఏకతత్త్వాభ్యాసః=ఈశ్వరతత్త్వము నభ్యసింపవలయును.

లోకమునందలి విషయములను ఒక దాని తరువాత నొకటిగా మన మెరుగుచున్నాము. అనగా చిత్తము ముందు ఒక వస్తువు (విషయము)ను చేరి దాని యాకృతిని బొంది యది గ్రహించి యటుపై వెంటనే మరియొక వస్తువునుచేరి దాని యాకృతిని బొంది యదియు గ్రహించును. ఇట్లే యొక దానితరువాత నొకటిగా వస్తువులు గ్రహింపబడుచుండును.

చిత్తమెల్లపుడు నిలకడలేనిదై వస్త్వాకారముల నొందుచుండుననని భావము. ఇట్టి చిత్తమును అభ్యాస వైరాగ్యముల ద్వారమున స్థిరమొనర్పవలసి యున్నది. దానిని వస్త్వాకారమున పరిణతి నొందకుండ జేయవలయును. అందుల కభ్యాసము

ముఖ్యసాధనము. ఆ యభ్యాసమునకు విషయ మెయ్యదియో నిర్ణయింపబడలచి ఋషి యేకతత్వమును బోధించి యున్నాడు. ఏకతత్వమిట యీశ్వర తత్వమే యని వాచస్పతిమిశ్రులు స్పష్ట పఱచి యున్నారు. "ఈశ్వరప్రణిధానాద్వా" యని పూర్వ సూత్రమున వర్ణించిన ఈశ్వర విషయమిట ప్రకృత మగుటయే యింపులకు కారణము.

కొందఱు (భోజాదులు) ఏకతత్వమన ఏదేని యొక స్థూలతత్వ మని వ్రాయుట చింత్యము.

బుద్ధ మతానుయాయి యగు యోగాచారుని (క్షణిక విజ్ఞానవాది) మతమున పదార్థము లన్నియు క్షణికములు. ఒక క్షణమున నుండి మఱియొక క్షణమున నశించును. కాబట్టి చిత్తము కూడ క్షణికమే యగును. మఱియు నొక క్షణమున నొక వస్తువును గ్రహించి యాచిత్త మా వస్తువుతో బాటు నశించును. మఱియొక క్షణమున నావస్తువుకానీ, ఆ చిత్తము కానీ యుండనేరవని భావము. కాబట్టి చిత్తము క్షణికమేకాక ప్రత్యర్థనియతమనియు చెప్పవలసివచ్చును. అట్టియెడ చిత్తము సదా యేకాగ్రమే (ఏకవస్తు విషయకమే) యని తేలుచున్నది. వారి మతమున సమాధికై యభ్యాస మనవసరము. ఇంతే కాక చిత్తము క్షణికము, ప్రత్యర్థనియత మనుటయును తగదు. చిత్తము ప్రత్యర్థ నియతమై క్షణిక మగునెడల ఒక క్షణమున తెలిసిన వస్తువు మఱియొక క్షణమున "అదే యిది" యని గుర్తింపబడకుండవలయును. కారణ మేమన — మొదటి క్షణమున తెలిసికొనిన చిత్తము కానీ, వస్తువుకానీ రెండును

రెండవక్షణమున నుండనేరవు కదా! కాబట్టి అనుభన విషయమున. ఈశ్వరవాదుల మతమున బుద్ధభగవానుని చిత్తనిరోధము నిమిత్త మొనర్చు ఉపదేశమును వ్యర్థము కాగలదు.

చిత్తము రాగద్వేషాది మాలిన్యములతో కూడియున్న పుడు ఏకతత్త్వాభ్యాసము (ఈశ్వరప్రణిధానము) సాధ్యము కానేరదు. అందులకు చిత్తప్రసాదమవసరము. కాబట్టి చిత్తము నందలి మలినతను దూరమొనర్చి శుద్ధమొనర్చుకొను విధమెట్టి యన:-

"మైత్రీకరుణాముదితో పేక్షాణాం సుఖదుఃఖపుణ్యా
పుణ్య విషయాణాం భావనాత శ్చిత్తప్రసాదనమ్" 33

సుఖ...విషయాణామ్=సుఖులు, దుఃఖులు, పుణ్యులు, పాపులు క్రమముగా విషయములు గలవైన, మైత్రీ...పేక్షా ణామ్=సుహృద్భావము, కృప, ముదము-సంతోషము, ఉపేక్ష-ఉదాసీనత లను, భావనాతః = భావించుటవలన-మాటిమాటికి చిత్తమున నిడుకొనుటవలన, చిత్తప్రసాదనమ్ = చిత్తనైర్మల్యము సంపాదింప నగును.

సుఖులయెడ సుహృద్భావము (మైత్రి)ను, దుఃఖులయిన వారియెడల కృపను, పుణ్యులయెడ ముదమును, పాపుల యెడ నుదాసీనత (ఉపేక్ష)ను కలిగి యున్నంపున చిత్తము ప్రసన్న మగును. కాలుష్యము దూరమగును.

చిత్తమున ఈర్ష్య, పరాపకారబుద్ధి, అసూయ, అమర్షము-అసహనత యనెడి నాలుగు విధములయిన కాలుష్యము

లుంచును. ఇంచు సుఖసంపన్నులైన వారినిజూచి వారియెడల మిత్రభావము కలిగియున్నంచున ఈర్ష్య యనెడి కాలుష్యము తొలగును. సుఖియైన మిత్రునిజూచి యీర్ష్యపడువా రుండరు. మిత్రుని సుఖము చిత్తప్రసన్నతకు కారణమగును. అట్లే సుఖులయిన ప్రాణులు మిత్రములా ? యమిత్రములా ? యని విచక్షణ చేయకయే యెల్లప్రాణులయెడను మిత్రభావన కలిగియున్నచో చిత్తమున నీర్ష్య కలుగనేరదు. దుఃఖితులయిన ప్రాణులను జూచి వారియెడల జుగుప్సచెందక "పాపము! వీరి కీదుఃఖ మెట్లు పోగలదా!" యని యనుకంప–కరుణ కలిగియున్నంచున పరాపకారబుద్ధి యనెడి కాలుష్యము తొలగును. పుణ్యవంతులు–సుకృతులయినవారియెడల (ముదము) హర్షము కలిగియున్నంచున అసూయ నశించును. తనవలె సుకృతమొనర్చి తనకంటె నెక్కుడుగానో, లేక తక్కువగానో పుణ్యసంపాదన మొనర్చువారిని జూచి యసూయపడుట లోకమున జూచుచున్నాము. అట్టియెడల తనవలె నితరులును పుణ్యవంతులగుట శ్రేయస్కరమని సంతసించువారికి అసూయ కలుగనేరదు. పాపులనుజూచినపుడు అసహనము (అమర్షము) కలుగుట సామాన్యము. కాబట్టి పాపులయెడల నుపేక్షాభావము (ఉదాసీనత) కలిగియున్నంచున అసహనత యనెడి చిత్తమాలిన్యము దూరమగును.

యోగము నభ్యసించువారు ఈశ్వరప్రణిధానము (ఏకతత్వాభ్యాసము) కొఱకు తమ చిత్తమునందలి యీర్ష్యాది కాలుష్యములను నశింపజేయగోరి సదా మైత్ర్యాదుల నభ్యస

సింతురు. అంచువలన వారిచిత్తము ప్రసన్నమగును. చిత్తమున శుక్లధర్మ మేర్పడును—సత్వగుణము వర్ధిల్లును. ఈశ్వర ప్రణిధానము సులభమగునని భావము.

ప్రసన్నచిత్త మీశ్వరప్రణిధానమువలన నేకాగ్రము—సమాహితమగునని వర్ణించి, చిత్తైకాగ్రత కుపకరింపగల యితరోపాయములను చెప్పుచున్నాడు:—

"ప్రచ్ఛర్దన విధారణాభ్యాం వా ప్రాణస్య" 34.

ప్రాణస్య=కోష్ఠమునందలి (లోపలి) వాయువుయొక్క—ప్రచ్ఛర్దనవిధారణాభ్యాం= రేచనకుంభకములద్వారా చిత్తము స్థిరమగును.

కోష్ఠము (శ్వాసాశయము)నందలి వాయువును రెండు నాసికాపుటములద్వారమున బయటికి వెడలగ్రక్కుట ప్రచ్ఛర్దన మనబడును. విధారణమన ప్రాణాయామము. బయటికి తీసినవాయువు వెంటనే నాసికాపుటములద్వారమున శ్వాసాశయములందు ప్రవేశింపనీయకుంభిట విధారణము — ప్రాణాయామ మనబడును. ఇట్లో శ్వాసాశయములను నెమ్మదినెమ్మదిగా వెలుపలి వాయువుతో పూరించి యటుపై కొంత తడవా వాయువును కుంభించి యటనే యుంచుటకును యత్నింప వలయును. ఇట్లు చేయుటచేతను చిత్తము స్థితిపదమొందును—సమాహితము కాగలదు.

యోగమునభ్యసించువ్యక్తి నిత్యము నిశ్చితసమయమున తన యభ్యాస స్థలమునచేరి యట నభ్యస్తమయిన ఆసనమున

(సిద్ధాసనము, పద్మాసనము) స్థిరముగా కూర్చుండవలయును. పరమేశ్వరునకును, యోగోపదేశకులైన పతంజలిప్రభృతిఋషులకును–సిద్ధులకు భక్తితో మానసిక నమోవాకములొనర్చి యటుపై ప్రాణాయామమునకు గడంగవలయును. ముదద్వారమును గట్టిగాబిగించి, పైకిలాగి పట్టియుంచి, పొట్టనక్కళించి శ్వాసాశయములందలి వాయువును రెండు నాసికాపుటముల ద్వారమున నొక్కమాటు బయటికి వెడలునట్లు బలపూర్వకముగాను, వేగముగాను రేచింపవలయును–నిఃశ్వసింపవలయును. అట్లు బయటికి వెడలగ్రక్కిన వాయువు వెంటనే నాసికాపుటముల ద్వారమున లోపల ప్రవేశింపకుండునట్లు కొంతతడవు యత్నింపవలయును. శక్తికొలది యత్నించి యటుపై నికనిలుపజాలమని తోచినపుడు మరల వెలుపలి వాయువును నెమ్మది నెమ్మదిగా లోపలికిపోనిచ్చి శ్వాసాశయములు పూర్ణముగ నిండునట్లు పూరింపవలయును – ఉచ్ఛ్వసింపవలయును. అట్లు నింపి మరల యథాశక్తిని కుంభించి యుంచవలయును. లోపలనే వాయువు నుంపవలయునని భావము. ఇట్లు అంతర్బాహ్య కుంభకములద్వారా నిత్యము ప్రాణాయామము నభ్యసించుటవలన చిత్తము సమాహితము కాగలదు. ఈ సూత్రమున చెప్పబడిన ప్రచ్ఛర్దన విధానమును వర్ణించుచు వ్యాసమహర్షి కోష్ఠగతవాయువును నాసికాపుటముల జంటతో ప్రయత్న విశేషమున వమనముచేయుట యని వ్యాఖ్యానము చేసియున్నాడు. ప్రయత్నవిశేషమున కర్థము 'యోగశాస్త్రమున చెప్పినట్లు' అని వాచస్పతిమిశ్రులు. నాసికాపుటాభ్యాం

రెండు నాసికాపుటములతో) అను వ్యాస వచనమునకు ముందు ఆధునికులు (ఒకే నాసికాపుటముతో)నని యర్థము వ్రాసియున్నారు. ఈ యర్థములు మూలము నెంతవర కను సరించుచున్నవో పాఠకు లాలోచింతురు గాత.

"విషయవతీ వాప్రవృత్తి రుత్పన్నా మనసః స్థితినిబంధినీ" 35

వా= లేక, విషయవతీ=శబ్దస్పర్శాది విషయములుగల, ప్రవృత్తిః=ఆయా విషయ సాక్షాత్కారాత్మకమగుచిత్తవృత్తి, ఉత్పన్నా= జనించినదై, మనసః= చిత్తమునకు, స్థితినిబంధినీ=నిలుకడ గలిగించునది యగును.

నాసికాగ్రభాగమున చిత్తమును నిలిపి యట ధ్యాన సమాధులను సంపాదించుటవలన దివ్యగంధజ్ఞానము కలుగును. ఇయ్యది గంధ సంబంధమైన విషయవతీ ప్రవృత్తి యనబడును. ఇట్లే తాలువునంను, జిహ్వామధ్యమున, జిహ్వామూలమున చిత్తమును నిలిపి ధ్యానసమాధులను సంపాదించినందున క్రమముగా దివ్యములయిన రూప, స్పర్శ, శబ్దముల జ్ఞానము కలుగును. ఇట్టి దివ్యగంధప్రవృత్తి, దివ్యరూప ప్రవృత్తి, దివ్య స్పర్శ ప్రవృత్తి, దివ్యశబ్ద ప్రవృత్తియును చిత్తస్థైర్యమునకు కారణములగును. శాస్త్రములం దుపదేశింపబడిన కైవల్యాది సుఖవిషయములు యథార్థము లయినను సూక్ష్ములగుటచే వానిస్థితియంను సందేహము కలుగవచ్చును. అట్టి సందేహమును దివ్యములయిన ఉపర్యుక్తగంధాది విషయవతీప్రవృత్తులు తొలగించును. సమాధి ప్రజ్ఞను కలిగించుటలో నివి

ద్వారములగును. యోగి ప్రథమమున నాసికాగ్రాది స్థానము లలో నొకయెడ చిత్తమును నిలిపి ధ్యానసమాధులు సంపాదించిన త్వరలోనే దివ్యగంధాదులు ప్రత్యక్షము కాగలవు. ఇట్టి దివ్యగంధాది ప్రవృత్తి చిత్తమును స్థిరపరుచును. తదుపరి సూక్ష్ములయిన జీవేశ్వరాది విషయములందు శ్రద్ధాళువు కాగలడు. క్రమముగా నిర్బీజసమాధి సంపాదనకు గడంగి పురుషఖ్యాతిని సంపాదించి కైవల్యసుఖమునందగలడనిభావము.

"విశోకావా జ్యోతిష్మతీ" 3౬

వా= లేక, విశోకా= శోకరహితమైన, జ్యోతిష్మతీ = ప్రకాశవంతమగు ప్రవృత్తి చిత్తస్థైర్యమునకు కారణమగును.

చిత్తసత్వము (మనస్సు) హృదయ పుండరీకమున నుండును. చిత్తసత్వమునకు కారణము అస్మిత. అదియును హృదయస్థానికమే. హృదయమున చిత్తమును స్థిరపఱచిన జ్యోతిష్మతీ (ప్రకాశవంతమగు) ప్రవృత్తియేర్పడును. చిత్తసత్వము విషయముగాగల ప్రవృత్తి (విషయవతీ విశోకా జ్యోతిష్మతీ) విషయవంతము, శోకరహితము, ప్రకాశవంతమునై యుండును. అస్మిత విషయముగాగల ప్రవృత్తి (విశోకాజ్యోతిష్మతీ) శోకరహితము, ప్రకాశవంతమునై యుండును. ఇట్టి ప్రవృత్తులున్నపుడు రజస్తమోగుణములకు సంబంధించిన దుఃఖము (శోకము) లుండవు. ఈప్రవృత్తులును చిత్తస్థిరతకు నుపయోగించునని భావము.

"వీతరాగ విషయంవా చిత్తమ్" 3౭.

వా=లేక, వీతరాగవిషయం=రాగాదులులేని పుణ్యమూర్తులయిన మహాత్ములచిత్తము విషయముగాగల, చిత్తమ్=మనస్సు, స్థితిపదమును బొందునని యర్థము.

రాగద్వేషాదులులేని మహాత్ములచిత్తమును తనచిత్తమునకు విషయమొనర్చు యోగిచిత్తము సమాహిత మగునని భావము.

"స్వప్ననిద్రా జ్ఞానాలంబనం వా" 3౮.

వా=లేక, స్వప్న....బనమ్=స్వప్నము (కల) లోని జ్ఞానము, నిద్రించునపుడుండు జ్ఞానము విషయముగాగల చిత్తము స్థిరపడును.

కలలోనేదేని యొకవిచిత్రదృశ్యమునుచూచుట సామాన్యము. అట్టి దృశ్యమునందు చిత్తమును నిలుపుటచేతను చిత్తము సమాహితమగాగలదు. ఇట్లే సుఖముగ నిద్రించిలేచిన తదుపరి 'సుఖముగ నిద్రించితిన'ని తోచును. ఇట్టి జ్ఞానమునందు చిత్తమును నిలుపుటచేతను చిత్తము సమాహితమగునని భావము.

"యథాభిమతధ్యానాద్వా" 3౯.

వా=లేక, యథాభిమతధ్యానాత్=ఏదేని యిష్టమైనవిషయమును ధ్యానించుటవలనను చిత్తము స్థితిపదమునందును.

నాభిచక్రము, హృదయము, మూర్ధజ్యోతి మున్నగు విషయములందుగానీ, చంద్రసూర్యాది ప్రాకృతిక విషయములందుగానీ చిత్తమునిలిపి ధ్యానాదుల నొనర్చుటవలన నది సమాహితము కాగలదని భావము.

ఇట్లు చిత్తసమాహితమునకు వలయు నుపాయము లనేకములుచెప్పి, చిత్తస్థితియొక్క పరిపక్వావస్థను తెల్పికొను విధమును వర్ణించుచున్నాడు.

"పరమాణు పరమమహత్వాంతోఽస్య వశీకారః" ౪౦.

అస్య=చిత్తము నిలుపుటకొఱకు ఉపాయముల ద్వారమున యత్నించుయోగియొక్క చిత్తమునకు, పరమాణుపరమమహత్వాంతః = సూక్ష్మమున ప్రవేశింపజేసిన పరమాణువువరకును, స్థూలమునప్రవేశింపజేసిన పరమమహత్వ పరిమాణమునకు ఆశ్రయమయిన ఆకాశమువరకును, వశీకారః=స్థిరతకలుగుటలో నాటంక ముండనేరదు.

ఏదో యొకవిషయమునమాత్రము చిత్తము స్థిరమగును; మరియొక విషయమునకాదు అను నియమములేక — స్థూలసూక్ష్మభేదములేక-కోరిన విషయములందెల్ల చిత్తము స్థిరమై-సమాహితమయిననాడు చిత్తైకాగ్రత పరిపక్వమైన క్లేంచవలయును. అటుపై యోగి చిత్తస్థితికై యత్నింపవలసిన యవసరముండదని భావము.

ఇట్లాయావిషయములందు చిత్తము ఏకాగ్రము — సమాహితమైనపు డేవిషయమున నెట్టిసంప్రజ్ఞాతసమాధి కలుగగలదో వర్ణించుచున్నాడు.

"క్షీణవృత్తే రభిజాతస్యేవ మణేర్గ్రహీతృ గ్రహణ
గ్రాహ్యేషు తత్స్థ తదంజనతా సమాపత్తిః"౪౧

అభిజాతస్య=కులీనమైన-సహజముగ నిర్మలమైన, మణే రివ=స్ఫటికమువలె, క్షీణవృత్తేః= అభ్యాసవైరాగ్యముల ద్వారమున తామసరాజసవృత్తుల నన్నింటిని దూరముచేసి నిర్మలము చేయబడిన చిత్తసత్త్వమునకు, గ్రహీతృగ్రహణ గ్రాహ్యేషు= (అస్మిత, ఇంద్రియములు, విషయములు) అభ్యాసక్రమమున చెప్పినచో-శబ్దాదివిషయములు, ఇంద్రియములు, అస్మిత అను నిట్టివిషయములందు, తత్స్థ తదంజనతా= పై విషయములందు స్థిరముగానుండుటవలన-అయా విషయాకారములు కలిగియుండుటవలన వాని యాకారముగల, సమాపత్తిః= సంప్రజ్ఞాత సమాధి కలుగును.

స్వచ్ఛమైన స్ఫటికమునకు సమీపమున రంగులుగల పుష్పము లున్నపు డాస్ఫటికము తనరూపమును విడిచి ఆయా పువ్వులరంగులతోకూడి యెఱుపుగాను, పసుపుగాను ప్రకాశించును. అట్లే అభ్యాసాదుల ద్వారమున చిత్తమునందలి రాజస తామసవృత్తులు నశింపగా నాచిత్తము సత్త్వగుణముతో క్రమముగా రూపరసాదివిషయములందును, వానినిగ్రహింప సాధనములైన యింద్రియములందును, గ్రహీత యనబడు అస్మితయందును నిలుపబడి వానియాకారముకలదై ప్రకాశించును. అట్టి యెడ చిత్తమున రాజసతామసవృత్తులుండక సాత్త్వికవృత్తి మాత్రముండును. అభ్యాసి ముందు శబ్దాదిస్థూలవిషయములందట్టివృత్తి సంపాదించును. అటుపై సూక్ష్మములయిన యింద్రియములందు చిత్తమునునిలిపి వానియాకృతిని సంపాదించును. అటుతరువాత నంతకంటెసూక్ష్మమైన అస్మిత (చిత్తవృత్తులు

తనవే యనుకొనెడిస్థితి)యంపు చిత్తమునునిలిపి చిత్తమునకు అస్మితాకారత సంపాదించును. ఇట్లాయాశబ్దాది విషయములకు, ఇంద్రియములకు, అస్మితకు సంబంధించిన చిత్తము యొక్క సాత్త్విక పరిణామమే సంప్రజ్ఞాతసమాధి యనబడును.

శబ్దాది విషయములు గ్రహింపదగినవి. కాబట్టి వీనిని గ్రాహ్యము లందురు. ఈ గ్రాహ్యములును స్థూలములును, సూక్ష్మములును ననిరెండువిధములు. స్థూలములయిన గ్రాహ్య విషయములందు నేర్పడు చిత్తసాత్త్విక పరిణామము వితర్కానుగత సంప్రజ్ఞాత సమాధి యనబడును. సూక్ష్మగ్రాహ్య విష విషములం దేర్పడు చిత్తసాత్త్విక పరిణామము విచారానుగత సంప్రజ్ఞాత సమాధి యనబడును.

విషయములను గ్రహించుట కుపయోగించును కాబట్టి ఇంద్రియములు (చక్షురాదులు) గ్రహణము లనబడును. ఇట్లు చక్షురాదిగ్రహణములందు చిత్తము నిలుపుటచే నటనేర్పడు చిత్తసాత్త్విక పరిణామము అనందానుగత సంప్రజ్ఞాతసమాధి యనబడును.

విషయాదులనుగ్రహించు అస్మిత (దృక్‌దర్శనశక్త్యో యేకాత్మత) గ్రహీతయనబడును. అట్టిగ్రహీతయనబడు అస్మిత యందుచిత్తము నిలుపగానేర్పడు అస్మితాకార సాత్త్వికపరిణామము అస్మితానుగతసంప్రజ్ఞాతసమాధి యనబడును. ఇట్లు సంప్రజ్ఞాతసమాధి నాలుగువిధములు. ఈపాదమునందే పదునేడవసూత్రమున (వితర్క...సంప్రజ్ఞాతః) సంప్రజ్ఞాత సమాధి

నాలుగువిధములని చెప్పబడినది. ఈసూత్రమున గ్రహీతృ, గ్రహణ, విషయభేదమున మువ్విధములనిచెప్పబడినట్లు సామాన్యముగతోచును. కాని విషయములను స్థూలసూక్ష్మములుగ విభజించి ఆయా ఆకారపరిణతులను రెండుగ లెక్కించిన పూర్వాపరవిరోధముండజాలదు. శబ్దాదివిషయములు గ్రాహ్యములయినట్లు ఇంద్రియములును, అస్మితయుగూడ వానియందు చిత్తము నిలుపునపుడు గ్రాహ్యములేయగును. ఇట్లు గ్రహీతృ గ్రహణ, గ్రాహ్యములన్నియు గ్రాహ్యములే కాబట్టి సామాన్యముగ సంప్రజ్ఞాత సమాధి గ్రాహ్యవిషయకమై యొక్కటిగానే యెంచబడును. అవాంతరభేదములను గుర్తించినపుడు చతుర్విధము లగుననిభావము.

గ్రాహ్యవిషయమునకు సంబంధించిన స్థూలసూక్ష్మ భేదములవలన సంప్రజ్ఞాతసమాధి రెండువిధములు. అందునను రెండు భేదము లుండుటచే, సవితర్కము, నిర్వితర్కము, సవిచారము, నిర్విచారము నని నాలుగువిధములగుచున్నది. అందు స్థూలగ్రాహ్య విషయముగల సవితర్కసంప్రజ్ఞాతసమాధి లక్షణము వర్ణించుచున్నాడు:—

"శబ్దార్థజ్ఞానవికల్పైః సంకీర్ణా సవితర్కాసమాపత్తిః" ౪౨

శబ్దార్థజ్ఞానవికల్పైః = శబ్దము, అర్థము, జ్ఞానము అను నీమూడును (అభిన్నములు) ఒకటిగా తోచినందున, సంకీర్ణా= మిశ్రమముగా— అభిన్నవిషయకమైన, సమాపత్తిః= సమాధి, సవితర్కా=సవితర్క మనబడును.

శ్రోత్రేంద్రియముచే గ్రహింపదగు ధ్వనియొక్క పరిణామభేదము శబ్దము. సామాన్యమునకు (ఘటత్వగోత్వాదులకు) ఆశ్రయమైనవ్యక్తి అర్థము. అట్టి వ్యక్తివిషయకమైన శబ్దమువలన జనించిన బుద్ధివృత్తి జ్ఞానమనబడును.

సంప్రజ్ఞాతసమాధి చిత్తమునొక్క సాత్త్వికవృత్తి యని పూర్వమే చెప్పబడినది. ఇట్టి చిత్తవృత్తికి బాహ్యమున గ్రాహ్యములనబడు స్థూలములయిన గోవు, ఘటము మున్నగు వస్తువులు విషయములయినపుడు అయా గో ఘటాది విషయములు స్వవాచకశబ్దము, శబ్దసంకేతస్మృతి, స్వవిషయిక జ్ఞానమునను వానితోగూడి జలసంగ్రములవలె నభిన్నములై మిశ్రమములుగా భాసించును. అట్టి చిత్తస్థితి సవితర్క సంప్రజ్ఞాతసమాధి యనబడును.

లోకమునగల వస్తువులన్నియు శబ్దములచే వ్యవహరింపబడుచుండును. వ్యవహరించువారి కా వస్తువులకు, శబ్దములకు గల సంబంధమును తెలిసియుండును. నిత్యవ్యవహారమువలన వస్తువు తెలియుటతోబాటు దానిని తెలుపు పదము, ఆ పదమున కా వస్తువుతోగల సంబంధము, ఈ వస్తు వియ్యది యను జ్ఞానము నన్నియు కలుగుచుండును. ఇయ్యవి వేరువేరుగా నుండక అన్నియు కలిసి యొకేకారణమున భాసించు చున్నట్లుండును. రాజసతామసవృత్తులు లేక కేవలము సాత్త్వికవృత్తి చిత్తమున నున్నపు డిట్టిశబ్దార్థ జ్ఞానములతోగూడిన బాహ్యస్థూలవస్తువిషయకభానము సవితర్క సంప్రజ్ఞాతసమాధి యనబడునని భావము.

స్థూలగ్రాహ్య విషయమునకు సంబంధించిన నిర్వితర్క-సంప్రజ్ఞాతసమాధి:—

"స్మృతిపరిశుద్ధౌస్వరూపశూన్యేవార్థమాత్రనిర్భాసానిర్వితర్కా" ౪౩

'సమాపత్తిః' అను పద మీ సూత్రమున అన్వయించును. స్మృతిపరిశుద్ధౌ=శబ్దసంకేతమునకు సంబంధించినస్మృతి తొలగిపోగా, (శబ్దమును, జ్ఞానమును ఉపస్థితములుకావు.) అట్టియెడ, అర్థమాత్రనిర్భాసా = గోవు, ఘటము మున్నగు వస్తువులుమాత్రము ప్రకాశించుస్థితి. స్వరూపశూన్యేవ = వస్తువుయొక్క 'ఈవస్తు వియ్యది' యను జ్ఞానస్వరూపముగూడ లేనట్లుండునది నిర్వితర్క-సంప్రజ్ఞాతసమాధి యనబడును.

సవితర్క-సమాధియందు ప్రతిభాసించు స్థూలవస్తువు (గో ఘటాదులు)నందు వృద్ధవ్యవహారాదులవలన తెలియు శబ్ద శక్తికి సంబంధించిన స్మృతితోబాటు శబ్దమును, జ్ఞానమును గలిసియుండును. నిర్వితర్క-సమాధియందు అభిధావృత్తియనెడి సాంకేతికస్మృతి యుండదు. అట్టియెడ వస్తుబోధక శబ్దమును, 'ఈ వస్తువియ్యది' యను జ్ఞానమును రెండునుగూడ అస్ఫుటముగా భాసించును. ఉండియు లేనట్లుండునని భావము. కాబట్టి వస్తువుమాత్రము స్ఫుటముగా భాసించును. ఇట్టి శుద్ధసాత్త్వికచిత్తవృత్తియే నిర్వితర్క-సమాధి యనబడునని తాత్పర్యము.

ఈ సమాపత్తి (సంప్రజ్ఞాతసమాధి), నిర్వికల్పమై (శబ్దముతోను, జ్ఞానముతోను, మిశ్రితముకాక) అర్థము (వస్తువు) మాత్రము భాసించునుకాబట్టి పరప్రత్యక్షమనబడును. సమాధి

సిద్ధులైన ఆచార్యులే సమాపత్తిద్వారమున సద్రూపమయిన అర్థమును (వస్తువు) ప్రత్యక్షమొనర్చుకొని శబ్దజ్ఞానములతో చేర్చి యుపదేశింతురు.

సూక్ష్మగ్రాహ్యవిషయకములైన సవిచార, నిర్విచార, సంప్రజ్ఞాత సమాధుల లక్షణములు:—

"ఏతయైవ సవిచారా నిర్విచారాచ సూక్ష్మవిషయావ్యాఖ్యాతా" ౪౪

ఏతయైవ=పూర్వము వర్ణింపబడిన సవితర్క, నిర్వితర్క, సంప్రజ్ఞాతసమాధిలక్షణముల ద్వారమునసే, సూక్ష్మవిషయా=సూక్ష్మవిషయములుఆలంబనముగాగల, సవిచారానిర్విచారాచ=సవిచార సంప్రజ్ఞాత సమాధియు, నిర్విచార సంప్రజ్ఞాత సమాధియును, వ్యాఖ్యాతా=లక్షణపూర్వకముగా వ్యాఖ్యానము చేయబడినవైయున్నవి.

స్థూలగ్రాహ్య వస్తువులకు కారణములు స్థూలములయిన పంచభూతములు. అట్టి స్థూలపంచభూతములకు సూక్ష్మకారణములు పంచతన్మాత్రములు. పంచతన్మాత్రముల వలన నాయా దేశకాలములందు స్థూలములయిన ఘటపటాది వస్తువులు అభివ్యక్తములు—ప్రకటములు—ఉత్పన్నములగును. కాబట్టి సూక్ష్మగ్రాహ్యములగు తన్మాత్రలు దేశ, కాల, కారణముల యనుభవములతోగూడి, అభివ్యక్తములగు ఘటపటాదులు ధర్మములుగా గలిగియుండును. ఆతన్మాత్రలయందు ఏర్పడు శబ్దార్థజ్ఞానములతోగూడిన శుద్ధసాత్త్విక చిత్తవృత్తి సవిచారసంప్రజ్ఞాత సమాధి యనబడును. దేశకాలకారణముల యనుభవములతో నసంబద్ధములయి, అభివ్యక్తములగు ఘటపటాదులు ధర్మము

గాగల సూక్ష్మగ్రాహ్యవిషయము (తన్మాత్ర)లందు శబ్దార్థజ్ఞాన మిశ్రమముకాక కేవల తన్మాత్రరూపమైన అర్థమును భాసింప జేయు సాత్త్వికచిత్తవృత్తి నిర్విచార సంప్రజ్ఞాత సమాధి యనబడును.

సవిచార, నిర్విచార సంప్రజ్ఞాత సమాధులందు చిత్తమునకు ఆలంబనము సూక్ష్మవిషయములని యీసూత్రమున నిర్దేశింపబడినది. దీనింబట్టి సవితర్క- నిర్వితర్క- సంప్రజ్ఞాత సమాధులు స్థూలవిషయములు గలవిగా పూర్వసూత్రమున వ్యాఖ్యానము చేయబడినట్లు తెలియనగును.

సవిచార నిర్విచార సంప్రజ్ఞాతసమాధులందు గ్రహింప బడు సూక్ష్మవిషయము లెంతవరకు గ్రహింపవలయు నన్న :—

"సూక్ష్మవిషయత్వంచాలిఙ్గ పర్యవసానమ్" ౪౫

సూక్ష్మవిషయత్వంచ = సవిచార నిర్విచార సమాధు లకు చెప్పబడిన సూక్ష్మ విషయత్వము, అలిఙ్గ పర్యవసానమ్= ప్రకృతి యంతముగాగలదిగా నెంచవలయును.

సవిచార నిర్విచార సంప్రజ్ఞాతసమాధియందు చిత్తము నకు గ్రాహ్యములుగా పంచతన్మాత్రములు (సూక్ష్మభూతములు) చెప్పబడినవి. చిత్తము సూక్ష్మభూతము లనబడు పంచతన్మాత్రములందు నిలుపబడునని భావము. పంచతన్మాత్రముల కంటెను సూక్ష్మమైనది అహంకారము. దానికంటెను సూక్ష్మము మహత్తత్త్వము. అంతకంటెను సూక్ష్మము ప్రధానము—అలిం గము—ప్రకృతి. ఇట్లు యోగి పంచతన్మాత్రములకంటెను క్రమ

ముగా సూక్ష్మాతిసూక్ష్ములయిన అహంకారాదులందు చిత్తమును నిలుపుచు నన్నిటికంటెను సూక్ష్మమైన ప్రధానమునందును చిత్తమునిలిపి సంప్రజ్ఞాతసమాధిని సంపాదించును. చిత్తమునకాలంబనముగా (గ్రాహ్యముగా)నుండు వస్తువులలో ప్రధానముకంటె సూక్ష్మమైనవస్తువు మఱియొకటి లేదనిభావము.

"తా ఏవ సబీజః సమాధిః" ౪౬

తా ఏవ = పూర్వము వర్ణించిన నాలుగువిధములయిన (సవితర్క—నిర్వితర్క, సవిచార, నిర్విచార) సమాపత్తులు—సమాధులు, సబీజః సమాధిః=సంప్రజ్ఞాతసమాధి —సంప్రజ్ఞాత యోగము.

సవితర్కాది చతుర్విధసమాధులు సంప్రజ్ఞాత సమాధి యనబడునని భావము.

సంప్రజ్ఞాతసమాధియే సబీజసమాధి యనబడును. బీజమనగా ధ్యేయము. సంప్రజ్ఞాతసమాధియందు ధ్యేయము — ఆలంబము—ఒకటియుండును. కాబట్టి సబీజసమాధి యనబడునని తెలియునది.

అట్టి చతుర్విధ సమాపత్తులలో:—

"నిర్విచార వైశారద్యేఽధ్యాత్మ ప్రసాదః" ౪౭

నిర్విచార వైశారద్యే=నిర్విచార సమాపత్తికి సంబంధించిన విశారదత్వమేర్పడినపుడు, అధ్యాత్మప్రసాదః = ప్రజ్ఞాప్రసాద మేర్పడును.

రజస్తమోగుణముల యాధిక్యము అశుద్ధియనబడును. అయ్యది యే యావరణమనెడి చిత్తమలము. ఈ మలము తొలగగా చిత్తసత్త్వము ప్రకాశాత్మకమగును. రజస్తమములచే నభిభూతముకాని—ఆవరింపబడని—ప్రకాశాత్మక చిత్తసత్త్వము యొక్క స్వచ్ఛమైన స్థితిప్రవాహము వైశారద్యమనబడును.

తన్మాత్రములు మొదలుకొని క్రమముగా ప్రధానపర్యంతము సూక్ష్మవిషయములందు రాజసతామసరూప మూలిన్య రహితమైన (బుద్ధి) చిత్తసత్త్వప్రవాహము స్థిరమైనపుడు— నిర్విచారవైశారద్య మేర్పడినపుడు — యోగికి వ్యవహితము, (అడ్డంకుకలిగిన వస్తువు), విప్రకృష్టము (దూరమున నుండునది), స్థూలము, సూక్ష్మము, సామాన్యము, విశేషము అను భేదము లేక ఉన్న వస్తువులన్నియు సాక్షాత్కారములగును. ఇదియొక విశిష్టచిత్తవృత్తి. దీనినే 'స్ఫుటప్రజ్ఞాలోక'మందురు. ఇది 'ప్రజ్ఞాప్రసాద'మనియు ననబడును.

"ప్రజ్ఞాప్రసాద మారుహ్యాశోచ్యః శోచతో జనాన్
భూమిష్ఠానివ శైలస్థః సర్వాన్ప్రాజ్ఞోఽనుపశ్యతి"

పర్వతము నెక్కినవాడు భూమిపైనుండు జనులను చూచునట్లు, ప్రాజ్ఞుడు (యోగి) ప్రజ్ఞాప్రసాదమునుపొంది శోకరహితుడై యితర ప్రాణులను తాపత్రయపరీతులనుగా తెలిసికొనును.

ఈ నిర్విచారసమాధివలన నేర్పడు వైశారద్యమే 'సత్త్వపురుషాన్యతా ఖ్యాతికి' పరమోపాయము. దీనికంటె పురుష

ప్రకృతివివేకమునకు వేరొండుపాయములేదు. నిర్విచార వైశారద్యమునుపొంది, యధ్యాత్మప్రసాదముకలవాడై, యోగి ప్రకృతిని, దానికార్యజాతమును వేరువేరుగా తెలిసికొని వాని కంటె పురుషుడు (జీవాత్మ) భిన్నుడని యెరుగును. అంటువలననే యధ్యాత్మప్రసాదము స్ఫుటప్రజ్ఞాలోకమనియు, ప్రజ్ఞాప్రసాదమనియు, సమాధిప్రజ్ఞయనియు, ఋతంభరాప్రజ్ఞయనియు, సత్త్వపురుషాన్యతాఖ్యాతి యనియు ననేక నామములతో చెప్పబడును. ఇయ్యది నిర్విచారసంప్రజ్ఞాత సమాపత్తివలననే కలుగునుకాబట్టి నిర్విచార సమాపత్తి యితరసమాపత్తులకంటె శోభనమని భావము.

"ఋతంభరాతత్రప్రజ్ఞా" ౪౮

తత్ర=నిర్విచారవైశారద్యము కలిగినపుడు, యోగికి కలుగు, ప్రజ్ఞా=సమాధిప్రజ్ఞ, ఋతంభరా=ఋతంభర యనబడును. ఋతం=శబ్దజ్ఞానానుమలతో మిశ్రమముకాని సద్వస్తువును, బిభర్తి=విషయముగా ధరించునది ఋతంభర యనబడును. సత్యమునే తెలుపునది కావున విపర్యాసమొకింతయు నుండదని భావము.

నిర్విచార సమాపత్తి శబ్దమునకును, అనుమానమునకును విషయములగు వస్తువులకుసంబంధించిన భావన యగుటచే దానివలన నేర్పడు సమాధిప్రజ్ఞయు నాయా విషయములకు సంబంధించినదే యగునుకాని ప్రత్యక్ష విషయమెట్లు కాగలదన:—

"శ్రుతానుమానప్రజ్ఞాభ్యా మన్యవిషయావిశేషార్థత్వాత్" ౪౯

శ్రుతానుమానప్రజ్ఞాభ్యామ్ = శాస్త్రశ్రవణము వలన కలిగినప్రజ్ఞ శ్రుతప్రజ్ఞ. అనుమానమువలన కలిగిన ప్రజ్ఞ అనుమానప్రజ్ఞ. వీనికంటెకంటె సమాధిప్రజ్ఞ, అన్యవిషయా= భిన్న విషయము కలదిగా చెంపనలెను. కారణమేమన, విశేషార్థత్వాత్ = అర్థవిశేషము విషయముగా కలదగుట వలన.

శ్రుతానుమానము లన నిట శబ్దప్రమాణము, అనుమాన ప్రమాణము అని భావము. ఈ రెండు ప్రమాణముల వలన తెలియు జ్ఞానము వస్తుసామాన్య విషయకమై యుండును. శాస్త్రముగానీ, అనుమానముగానీ విశేషవస్తువును బోధించక వస్తుసామాన్యమును బోధించునని భావము. 'ఈశబ్దమువలన నీయర్థము (వస్తువు) తెలిసికొనవగును' అను శబ్ద సంకేతము ఏదోయొక వస్తువును మాత్రము తెలుపక ఆ వస్తు సామాన్యమును (జాతిని) తెలుపును. గోశబ్దమువలన గోజాతి గ్రహింప బడును కాని, ఏదోయొక గోవుకాదు. ఇట్లే అనుమానము (హేతువు)వలన కలుగు జ్ఞానమును సామాన్య విషయకమై యుండును. ధూమప్రాప్తివలన (ధూమహేతు జ్ఞానమున్న) కలుగు అగ్నిజ్ఞానము సామాన్య విషయకమే కాని యేదోయొక విశిష్టమగు అగ్నివిషయకము కాజాలదు. ఇట్లు శబ్దానుమానప్రజ్ఞలు రెండును సామాన్య (జాతి) విషయకములని తెలుచున్నది; కాని, సమాధిప్రజ్ఞ యట్లుకాక ఏవస్తువున చిత్తసమాపత్తికలుగునో ఆవస్తువిశేషము నయ్యది సాక్షాత్కరింప జేయును శ్రుతానుమానముల కంటె భిన్న

విషయక మగుచున్నది. ఇట్లు సమాధిప్రజ్ఞ ప్రత్యక్షాత్మక మగుటచే ప్రత్యక్ష విషయమని భావము.

శబ్దాది విషయముల ననుభవించుటచే నేర్పడిన అనాది వాసనలు శత్రువులుగా నుండగా సమాధిప్రజ్ఞ స్థితిపదమునెట్లు పొందగలదు? సంసారమునకు నిమిత్తములయిన క్లేశకర్మాశయ ముల నెట్లు నిరోధింపగలదు? అనగా:—

"తజ్జః సంస్కారోఽన్యసంస్కారప్రతిబంధీ" ౫౦

తజ్జః = నిర్విచార సంప్రజ్ఞాతసమాధివలన కలిగిన, సంస్కారః=సంస్కారము, అన్యసంస్కారప్రతిబంధీ=ఇతర సంస్కారములను శేకెత్తనీయదు.

చిరకాలమునుండి శబ్దాదివిషయముల ననుభవించుటచే నేర్పడిన సంస్కారములు ఆయా ప్రమాణాదివృత్తులద్వారా శేకెత్తుచుండును. కాని వస్తుతత్త్వము నెరుగక యేర్పడిన సంస్కారములగుటచే నయ్యవి బలహీనములై సమాధిప్రజ్ఞ వలన (వస్తుతత్త్వము ప్రత్యక్షమగుటచే) గలిగిన సబలసంస్కార ముచే జయింపబడును. అంచువలన నవి శేకెత్తజాలవు. వాని వలనకలుగు జ్ఞానములిట్లు నిరుద్ధములగును. సమాధిప్రజ్ఞవలన గలిగిన సంస్కారము క్రమముగా స్థిరపడి సంసారమునకు నిమిత్తములయిన క్లేశకర్మాదివాసనలు బొత్తిగా నిరోధింపబడును. క్లేశకర్మాది వాసనలు నిరోధింపబడినను, సమాధిప్రజ్ఞవలన నేర్పడిన సంస్కారముండును కాబట్టి యది సంసారహేతు వేల కాదు? అనజనదు. సంస్కారవంతమగు చిత్తకార్యములు

రెండును. ఒకటి శబ్దాదివిషయభోగములను కలిగించుట. రెండు వివేకఖ్యాతిని కలిగించుట. క్లేశకర్మాది సంస్కారయుక్తమైన చిత్తము శబ్దాదివిషయముల ననుభవింపజేయును. అట్టి వాసనలు నిరుద్ధములగుటచేత (సమాధిప్రజ్ఞవలన జనించిన సంస్కారమువలన) శబ్దాదుల ననుభవింపజేయజాలక సంసారహేతువు కాజాలదు. సమాధిప్రజ్ఞాజన్యసంస్కారముతోగూడిన చిత్తము వివేకఖ్యాతిని గలిగించును. ఇట్లు చిత్తకార్యములు రెండును ముగియుటచే చిత్తము సాధికారముకాదు. సాధికారచిత్తమే సంసారహేతువని పూర్వమే వర్ణించియున్నాము.

సమాధిప్రజ్ఞయును, దానిసంస్కారమును నుండగానిర్బీజ సమాధి కలుగు విధ మెట్టి? యన:—

"తస్యాపి నిరోధే సర్వనిరోధాత్ నిర్బీజః సమాధిః" ౫౧

తస్యాపి=ప్రజ్ఞ, దానివలన నేర్పడిన సంస్కారము అను రెండును, నిరోధే=విలయముకాగా, సర్వనిరోధాత్=వ్యుత్థాన సంస్కారములును, ప్రజ్ఞయు ప్రజ్ఞాజన్య సంస్కారములును నన్నియు నిరోధింపబడుటవలన, నిర్బీజః=వాసనలనెడి బీజము లేని — నిరాలంబనమయిన, సమాధిః = చిత్తముయొక్క యవస్థావిశేషము—అసంప్రజ్ఞాతసమాధి యేర్పడును.

నిర్విచార వైశారద్యము—(జ్ఞానప్రసాదము) వలన పర వైరాగ్యమేర్పడును. దానివలన సంప్రజ్ఞాతసమాధివలనకలుగు ప్రజ్ఞ, ఆప్రజ్ఞవలన కలిగిన సంస్కారము రెండును నశించును. ఇట్లు సంస్కారములన్నియు విలయముకాగా నేర్పడు చిత్తస్థితి

ఉన్మనీభావసమాధి యనబడును. ఇయ్యదియే నిర్వికల్ప సమాధి. కైవల్యము సఫలమించువారికియ్యది సర్వథా ఉపాదేయము.

నిర్వికల్పసమాధిని సంపాదించినవారిచిత్తము ప్రకృతి యందు లీనమైపోవును. జీవాత్మ స్వస్వరూపముననుండి, పరమాత్మను సాక్షాత్కారముచేసికొని, పరమాత్మస్వరూపమగు ఆనందము ననుభవించుచు శుద్ధుడు, ముక్తుడు, కేవలుడు నగును.

"యదాపశ్యః పశ్యతే రుక్మవర్ణం
కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్
తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ
నిరంజనః పరమం సామ్య ముపైతి" ముం. 3.౧.3.

సమాధిపాదము.

ఓమ్

యోగదర్శనము

సాధన పాదము

చిత్తశుద్ధిగలవారు ప్రథమ (సమాధి)పాదమున చెప్పబడిన యోగమును సాధింపగలుగుదురు. చిత్తశుద్ధిగలవారికే యోగసాధనములైన అభ్యాసవైరాగ్యములు వెంటను సాధ్యములు. కాని విక్షిప్తచిత్తులకు—రాగద్వేషాది చిత్తకషాయము లెక్కువగాగల వారికి—అభ్యాసవైరాగ్యములు సులభములు కావు. కాగా వారికి సమాధిపాదమున వర్ణించిన యోగము లభింపదు. కాబట్టి చిత్తశుద్ధిలేని మందబుద్ధులు యోగయుక్తులగుటకును, నంతమాత్రమె యభ్యాస వైరాగ్యములను సంపాదించుటకును ననువగు చిత్తశుద్ధి సాధనముల నీ పాదమునందు మహర్షి వివరముగా వర్ణింపదలచి ముందుగా నల్పాయాస సాధ్యమగు క్రియాయోగమును చెప్పుచున్నాడు.

"తపఃస్వాధ్యాయేశ్వర ప్రణిధానాని క్రియాయోగః" ౧

తపః.....నాని=తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము, క్రియాయోగః=క్రియాయోగ మనబడును.

శీతోష్ణాది ద్వంద్వములను సహించుట, హితము, మితమునైన ఆహారమును గ్రహించుట మున్నగునవి తపస్సు. ఇట్టి తపస్సు చేయనివానికి యోగము సిద్ధింపదు. అనాదికర్మ

క్లేశవాసనలచే చిత్ర విచిత్రముగా నుపస్థితమగు విషయజాలములవలన కేర్పడు చిత్తమాలిన్యము తపస్సు చేయనివారికి ఫలాలుకేరదు. కాబట్టి తపస్సు క్రియాయోగమున చెప్పబడినది. ఈ తపశ్చరణమును శరీరమునందలి ధాతువులు విషమింపని విధమున నాచరింపవలయును. ధాతువైషమ్య మేర్పడువిధమున మితిమీరి తపశ్చరణమొనర్చిన నయ్యది చిత్తప్రసాదము కలిగించుటకు బదులు యోగమునకు ప్రతిబంధకమగును.

పవిత్రములైన ప్రణవామల జపముగానీ, మోక్షశాస్త్రములయిన వేద-ఉపనిషదాదులు పఠించుటగానీ స్వాధ్యాయమనబడును.

పరమగురువైన జగదీశ్వరునందు సర్వకర్మలనర్పించి, కర్మఫలమును త్యజించుట యీశ్వరప్రణిధాన మనబడును.

ఇట్టి తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము ననుష్ఠానమును క్రియాయోగమని భావము. వీనివలన చిత్తశుద్ధి యేర్పడును. యోగము సాధింపవీలగును. ఈ క్రియాయోగము వ్యుత్థిత చిత్తులకు (చిత్తశుద్ధిలేనివారికి) సులభసాధనము. క్రియాయోగ ప్రయోజన మేమన:—

"సమాధిభావనార్థః క్లేశతనూకరణార్థశ్చ" ౨

క్రియాయోగము, సమాధిభావనార్థః = పూర్వపాదమున వర్ణించిన సమాధిని చిత్తశుద్ధిద్వారమున నుత్పన్నము చేయుటయే ప్రయోజనముగాగలది. క్లేశతనూకరణార్థశ్చ = మఱియు సమాధికి విరోధములై, వివేకఖ్యాతి గలుగనీయని అవిద్యాదిక్లేశములను తగ్గించుటయే ప్రయోజనముగాగలది.

ఫలము నపేక్షింపకచేయు క్రియాయోగము అనాది క్లేశకర్మవాసనలతో చిత్రమైయుండు చిత్తమాలిన్యము (పాపము)ను తొలగించును. చిత్తైకాగ్రత యనెడి సమాధిని సంపాదించును. సమాధి ప్రతిపక్షము (విరోధు)లైన అవిద్యాది క్లేశములను శిథిలమొనర్చి, వివేకఖ్యాతినలన దగ్ధబీజములవలె వానిని ప్రసవధర్మములుకాకుండ చేయును. కాబట్టి విక్షిప్తచిత్తు డీ క్రియాయోగమును తప్పక యభ్యసింపవలయునని భావము.

క్రియాయోగమువలన శిథిలములగు క్లేశము లెయ్యవి యన:-

"అవిద్యాఽస్మితా రాగద్వేషాభినివేశాః (పంచ) క్లేశాః" 3

అవిద్యా.....క్లేశాః = అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము నని క్లేశము లైదు. వీనిని విపర్యయములనియు నందురు. క్లేశము(కష్టము)ను కలిగించునవి కాబట్టి క్లేశములు.

అవిద్యాది క్లేశములు వర్ధిల్లి గుణాధికారము (కార్యారంభ సామర్థ్యము)ను బలపరుచును. కార్యకారణ స్రోతస్సు నుద్భవింప జేయును. క్లేశకర్మములు పరస్పరము తోడ్పాటుతో జాతి, ఆయువు, భోగము ననెడి కర్మవిపాక (ఫల)ములను గలిగించును. కాబట్టి యత్నపూర్వకముగ క్లేశములను శిథిలమొనర్పవలయు నని భావము.

ఈ క్లేశములలో మూలమెద్దియన:—

"అవిద్యాక్షేత్రముత్తరేషాం ప్రసుప్తతనువిచ్ఛిన్నోదారాణామ్" ౪

ప్రసుప్తతను విచ్ఛిన్నోదారాణామ్=ప్రబోధకములు లేనందున చిత్తమున శక్తి (సంస్కార)రూపమున నుండునవి 'ప్రసుప్త

ములు'; క్రియాయోగముచేత శిథిలము చేయబడినవి 'తనువులు'; సజాతీయమో లేక విజాతీయమో యైన క్లేశాంతరముచే నభిభూతములయినవి (అణగియుండునవి) 'విచ్ఛిన్నములు' (ఇయ్యవి భవిష్యత్కాలమున మరల వృత్తిరూపము నందుచుండును; విషయప్రాప్తి గలిగినపుడు వృత్తిరూపములనంది 'ఉదారములు' ననబడును. ఇట్లు ప్రసుప్తములు, తనువులు, విచ్ఛిన్నములు, ఉదారములు నని చతుర్విధభేదములచే భిన్నములయిన, ఉత్తరేషామ్=అస్మితా, రాగము, ద్వేషము, అభినివేశము ననునాలుగింటికి, క్షేత్రం=ఉత్పత్తిస్థానము — మూలము. అవిద్యా=అవిద్య.

అస్మితారాగద్వేషాభినివేశము లను నాలుగు క్లేశములును అవిద్యయున్న నుండును. అవిద్యలేనపుడవి యుండవు. కాబట్టి యవిద్య అస్మితాదులకు మూలమని భావము.

వివేకఖ్యాతి యేర్పడనికారణమున విదేహప్రకృతిలయులయిన వారి చిత్తమున అస్మితాది క్లేశములు 'ప్రసుప్తము'లై యుండును. (బీజభావమున నుండును.) ఆలంబనము లభింపగానే మరల ప్రబుద్ధములగును. ప్రసంఖ్యానము (వివేకఖ్యాతి) కలిగిన వారి క్లేశములు, దగ్ధబీజము లంకురింప యోగ్యములు గానట్లు వస్తువులయాలంబనము లభించినను ప్రబుద్ధములుకావు.

ప్రతిపక్షభావనవలన అవిద్యాది క్లేశములు క్షీణములయి తనుత్వమునందును. ప్రతిపక్షభావన యన నిట క్రియాయోగము నభ్యసించుటయే. లేక, సమ్యక్‌జ్ఞానము (యథార్థజ్ఞానము) అవిద్యకు, భేదదర్శనము (ప్రకృతిపురుష వివేకము)

అస్మితకు, ఉదాసీనత రాగద్వేషములకు, ఉపకారబుద్ధి అభినివేశమునకును ప్రతిపక్షములని యెంచి వానిని సదా భావించుట వలన సవిద్యాది క్లేశములు క్షీణములగునని భావము. అవిద్యాదులలో ఒక క్లేశము సజాతీయమో విజాతీయమో యైన మఱియొక క్లేశ మావిర్భవించుటచే విచ్ఛిన్నమగును. రాగమున్నపుడు క్రోధము విచ్ఛిన్నమగును. ఇట్లే క్రోధమున్నపుడు రాగము విచ్ఛిన్నమగును. 'ఒకానొక విషయమున రాగమున్నచో మఱియొకవిషయమున రాగము లేదనరాదు. అట భవిష్యత్తున గలుగగలదని భావము. చైత్రుడొక స్త్రీయందు రక్తుడైయున్నాడనిన అన్యస్త్రీలయందు విరక్తుడని కాదు. అనురక్త స్త్రీయందతని రాగము లబ్ధవృత్తి కలదనియు, అన్యస్త్రీలయందది భవిష్యద్వృత్తి కలదనియు నెంచవలయును. ఇట్లు భవిష్యద్వృత్తిగల క్లేశములు ఆ సమయమున ప్రసుప్తతనువిచ్ఛిన్నరూపములలో నొక రూపమున నుండిన నెంచవలయును. క్లేశములు విషయములందు వృత్తిని పొందినపుడు ఉదారము లనబడును.

క్లేశములన్నియు అవిద్యాభేదములే. అవిద్యచే వ్యాప్తము కాని క్లేశమెండును లేదని భావము. అవిద్య (విపర్యయ జ్ఞానము) ఉన్నపుడు క్లేశములుండి, అది లేకున్న నవి లేకుండుటయే యిందులకు ప్రమాణము.

"ప్రసుప్త తన్వవిచ్ఛిన్నోదారరూపాశ్చ క్లేశా విషయసంగినామ్"

ప్రకృత్యాది సూక్ష్మతత్వములందు లీనులయిన విదేహ ప్రకృతిలయుల క్లేశములు ప్రసుప్తస్థితియందుండు ననియు,

క్రియాయోగుల క్లేశములు క్షీణములయి యుండుననియు, విషయాసక్తుల క్లేశములు విచ్ఛిన్నోన్ముఖస్థితియందుండుననియు వివేకము.

అవిద్యాస్వరూప మెట్టిదన:—

"అనిత్యాశుచిదుఃఖానాత్మసు నిత్యశుచిసుఖాత్మఖ్యాతిరవిద్యా" ౫

అనిత్యా...నాత్మసు=అనిత్యము, అశుచి, దుఃఖము, అనాత్మలంను గలుగు, నిత్య...ఖ్యాతిః = నిత్యము, శుచి, సుఖము, ఆత్మయను జ్ఞానము, అవిద్యా=అవిద్య యనబడును.

ఖ్యాతి, బుద్ధి, జ్ఞానము సమానార్థకములు. అట్టిదికాని దానియం దట్టిదియని కలుగు జ్ఞానము అవిద్య యనబడును. నిత్యముకాని కార్యజగత్తును నిత్యమనియు, అశుచియైన దేహమును శుచి యనియు, సుఖములేని విషయభోగాదులను సుఖమనియు, ఆత్మకాని బుద్ధి, స్త్రీ, పుత్రాదులను ఆత్మ యనియు నెంచుట (తెలిసికొనుట) యవిద్యయని భావము. ధ్రువములు కాని పృథివిని, చంద్రనక్షత్రాదులతో గూడిన దివమును, దేవతలను ధ్రువములని యెంచుట అవిద్య.

"స్థానాద్ బీజాదుపష్టంభాన్నిస్యందాన్నిధనాదపి
కాయమాధేయ శౌచత్వాత్ పండితాహ్యశుచింవిదుః"

దేహమును శుచి యని లోకమెంచును. కాని, ఉత్పత్తి స్థానము, ఉత్పత్తికి కారణమైన బీజము, పోషకరసములయిన అన్నపానాదులు, స్వేదాదులు, నిధనముమున్నగునవన్నియు శరీర మెంత జుగుప్సాకరమో తెలుపును. స్వభావమున నశుచియైన

దేహమునకు శుచిత్వము జలాదులతో సంపాదింపవలసి యున్నం దున పండితులు శరీరము నశుచిగా నెంచుదురు. ఇట్లే అపుణ్య మును పుణ్యమనియు, అనర్థమును అర్థమనియు నెంచుటయు అవిద్య యనబడును.

అవిద్య యనేక విధముల లోకమున రూపొందుచున్నను నాలుగు విధములైన యవిద్యయే యీ సూత్రమున వర్ణింప బడినది. ఇయ్యదియే ముఖ్యముగ క్లేశ సంతానమునకు మూలము. దీనిని కర్మాశయములకు కారణముగా నెంచవలయు నని భావము.

అవిద్యాస్వరూపమును జెప్పి యనంతరము రాగాదు లకు హేతువైన అస్మితను వర్ణించుచున్నాడు.

"దృగ్దర్శనశక్త్యో రేకాత్మతే వాస్మితా" ౬.

దృగ్దర్శనశక్త్యోః = జీవాత్మ, బుద్ధి వీని రెంటియొక్క, ఏకాత్మతేవ=ఏకాకారత, అస్మితా=అస్మిత యనబడును.

దృక్‌శక్తిః=జీవాత్మ — పురుషుడు. దర్శనశక్తిః=బుద్ధి. ఈ రెండు పదార్థములు అత్యంత విభిన్నములు. ఒకటి ఆత్మ. మరియొకటి అనాత్మ. అవిద్యవలన ననాత్మయైనబుద్ధియం దాత్మ జ్ఞానము గలుగును. వాస్తవమున బుద్ధి యాత్మకాకున్నను ఆత్మ వలె వ్యవహరింపబడును. ఇట్లు బుద్ధిపురుషుల యేకాత్మత — ఏకాకారత — వాస్తవముగాక యవిద్యామూలకమని తెలుపు టకే సూత్రమున 'ఏకాత్మతా ఇవ' అని 'ఇవ' శబ్దము ప్రయో గింపబడినది.

పురుషుడు భోక్త; బుద్ధి భోగ్యము; అని తెలుపుట కొఱకు దృగ్దర్శన శబ్దములతోబాటు సూత్రమున శక్తి శబ్దము ప్రయోగింపబడ్డది.

'అస్మిత' యనెడి క్లేశమువలననే పురుషుడు తాను సుఖియనియు, దుఃఖియనియు, కర్తయనియు, భోక్తయనియు ననుకొనును. వివేకఖ్యాతి వలన అస్మిత తొలగి జీవాత్మ తన్ను బుద్ధికంటె సర్వదా భిన్నుడని గుర్తించినపుడు ముక్తిపదము నందును. ఈ యస్మితా క్లేశమునే ఉపనిషత్కారులు హృదయ గ్రంథి యందురు. వివేకఖ్యాతిచే నీగ్రంథి విడివడును.

"భిద్యతే హృదయగ్రంథి శ్ఛిద్యంతే సర్వసంశయాః
క్షీయంతే చాస్యకర్మాణి తస్మిన్‌దృష్టే పరావరే"

రాగలక్షణము:—

"సుఖానుశయీ రాగః" ౭.

సుఖానుశయీ=సుఖము నెఱిగిన పురుషునకు, సుఖ మునుగానీ, సుఖసాధనములనుగానీ పొందుటకుగాను సుఖ స్మరణ పూర్వకముగా నేర్పడు చిత్తవృత్తి — అభిలాష, రాగః= రాగ మనబడును.

ఈ సూత్రమునందును, రాబోవు సూత్రమునందును గల సుఖదుఃఖ శబ్దములు సుఖదుఃఖముల యనుభవమును తెలుపు నని యెంచవలయును. సుఖము నెఱుగని వానికి సుఖస్మృతి కలుగదు. స్మరింపబడు సుఖమునందుకలుగు నభిలాష సుఖాను స్మృతి పూర్వకముగా నుండును. సుఖము ననుభవించు నపుడు అనుస్మృతి కలుగదు.

దుఃఖలక్షణము:—

"దుఃఖానుశయీ ద్వేషః" ౮

దుఃఖానుశయీ=దుఃఖము ననుభవించుటవలన గలుగు, దుఃఖమునకు, దుఃఖసాధనమునకు సంబంధించిన క్రోధమనెడి చిత్తవృత్తివిశేషము, ద్వేషః=ద్వేషమనబడును.

దుఃఖము నొకమాటు అనుభవించిన మీదట నట్టి దుఃఖమును స్మరించుటచేత దుఃఖము ననుభవించిన పురుషుని చిత్తమున క్రోధమనెడి వికారము కలుగును. ఇయ్యదియే ద్వేషము. దీనివలన గష్టము కలుగును కాబట్టి క్లేశమనబడును.

అభినివేశలక్షణము:—

"స్వరసవాహీ విదుషోఽపి తథారూఢోఽభినివేశః" ౯

స్వరసవాహీ=పూర్వ పూర్వ జన్మములందు అనుభవించిన మరణ దుఃఖమువలన గలిగిన వాసనాసముదాయము స్వరస మనబడును. అట్టి స్వరసరూపమున నెల్ల ప్రాణు నుండు, విదుషోఽపితథా=మూఢునకు వలె జ్ఞాని యైన విద్వాంసునకును, రూఢః=ప్రసిద్ధమైన 'నేను చావకుందునుగాక, జీవింతునుగాక' అను మరణభయము, అభినివేశః=అభినివేశ మనబడును.

ప్రతి ప్రాణియు 'నేను చావకుందునుగాక!, జీవింతునుగాక!'అని నిత్యము కోరుచుండును. మరణమనచేమో యెన్నడు నెరుగని ప్రాణికిట్టి యాశ — కోరిక—కలుగజాలదు. కాబట్టి ప్రతి ప్రాణియందును కనబడు నీకోరిక, లేక మరణభీతి పూర్వ

జన్మానుభవమును తెలియజేయును. ఈ మరణత్రాసము విశేషజ్ఞానములగల ప్రాణులందే కాక క్రిమికీటాదులందును మనము చూడగలుగుచున్నాము.

ఇప్పుడిపుడు జన్మించినక్రిమికి మరణత్రాసమెట్లు కలుగుచున్నది ? అట ప్రత్యక్షానుమానాగమ ప్రమాణములలో చేసినదనను అట్టిజ్ఞానము కలుగుట కవకాశములేదు. జ్ఞానము లేని కోరిక యెందుకు కలుగనేరదు. మరణ దుఃఖజ్ఞానమొక మాటు కలిగిన నట్టి దుఃఖము మరల రాకుండ వలయునను కోరిక జనించుట యుచితము. కాబట్టి ప్రాణులకు కలుగు నీ మరణ భయము = పూర్వజన్మమం దనుభవించిన దుఃఖము ననుమానింపజేయుచున్న దనక తప్పదు.

ఎక్కువలి మూఢులైనవారి యందెట్లు మరణభయము కనబడుచున్నదో యట్లే జ్ఞానులయిన విద్వాంసులందును నీ క్లేశము సమానముగా కనబడుచున్నది. మరణ దుఃఖానుభవ మెల్లరికి సమానమని భావము.

ఈ యైదువిధములగు క్లేశములే యన్యశాస్త్రములందు తమస్సు, మోహము, మహామోహము, తామిస్రము, అంధ తామిస్రము నని వర్ణింపబడినవి.

"తమో మోహో మహామోహ స్తామిస్రోహ్యంధసంజ్ఞక:
అవిద్యా పంచపర్వైషా సాంఖ్యయోగేషు కీర్తితా"

క్లేశములు, వాని లక్షణములు చెప్పబడినవి. ఇయ్యవి హేయములు. వీనికిగల ప్రసుప్త – తను – విచ్ఛిన్న – ఉదార

రూపములయిన యవస్థలును వర్ణింపబడినవి. ప్రస్తుతము వాని దగ్ధబీజ భావమనెడి సూక్ష్మమగు సంచమావస్థ వర్ణింపబడు చున్నది.

"తే ప్రతిప్రసవహేయాః సూక్ష్మాః" ౧౦

తే=పూర్వోక్త పంచక్లేశములు, సూక్ష్మాః=మైత్ర్యాది భావనలతోగూడిన క్రియాయోగము ద్వారమున క్షీణమొనర్చ బడి, యనంతరము ప్రసంఖ్యానాగ్ని (వివేక ఖ్యాతి)తో దగ్ధబీజ ములవలెనయి, ప్రతిప్రసవహేయాః=భోగము, నపవర్గము ననెడి యుభయవిధకార్యముల నొనర్చి చిత్తము తనకు కారణమైన ప్రకృతియందు లీనమగుట ప్రతిప్రసవమనబడును. అట్టి స్వకా రణమున లయమైనచిత్తముతోబాటు క్లేశములుహేయములు– విశ్లేషగినవి–అగును.

సమాధిపాదమున వర్ణింపబడిన మైత్రి, కరుణ మున్నగు భావనలతోబాటు క్రియాయోగము నభ్యసించుటచే అవిద్యాది క్లేశములు క్షీణములయి సూక్ష్ములగును. అనగా బీజరూపము నొందును. వివేకఖ్యాతి కలుగగా నయ్యవి దగ్ధబీజములవలె కొఱగానివై చిత్తముతోబాటు హేయములగును. ప్రకృతి యందు లీనమగునని భావము.

క్లేశములు సూక్ష్ములై బీజభావమునొందియుండును గదా! వాని వృత్తులెట్లు హేయములనగా:—

"ధ్యానహేయాస్తద్వృత్తయః" ౧౧

తత్ వృత్తయః= బీజభావమును బొంది దగ్ధము కాని క్లేశముల స్థూలవృత్తులు– ఉదారావస్థలను, క్రియాయోగము

ద్వారమున సూక్ష్మములొనర్చి, ధ్యానహేయాఃⳆ ధ్యాన మన ప్రసంఖ్యానము–వివేకఖ్యాతి–అధ్యాత్మప్రసాదము. దానివలన సద్బీజభానము కలవిగా చేయవలయును.

క్లేశములకు ప్రసుప్త – తను – విచ్ఛిన్న – ఉదారము లనెడు నాలుగు అవస్థలు పూర్వము చెప్పి యుంటిమి. అందు ఉదారావస్థ క్లేశముల స్థూలస్థితి. అప్పుడు చిత్తము విషయా సక్తమై యుండును. క్రియాయోగము ద్వారమున నీయవస్థ సూక్ష్మము చేయబడును. అటుపై ప్రసంఖ్యానబలమున బొత్తిగా నశించును. వివేకఖ్యాతి జనించిన పిదప క్లేశములు నిరుపద్రవములై చిత్తముతోబాటు విలయము నందునని భావము.

ఈ క్లేశముల నేల వర్జింప వలయు ననఃⳆ—

"క్లేశమూలఃⳆ కర్మాశయో దృష్టాదృష్ట జన్మవేదనీయఃⳆ" ౧౨

దృష్టా ... నీయఃⳆ = ఐహిక ఆముష్మిక జన్మములలో ననుభవింపదగు, కర్మాశయఃⳆశుభాశుభ కర్మముల ననుష్ఠించుటచే నేర్పడు పుణ్య పాపాత్మక ఆశయము–సంస్కారము. క్లేశమూలఃⳆ = అవిద్యాదిక్లేశములు నిమిత్తముగా గలది.

దృష్టజన్మము వర్తమానము – ఐహికము. అదృష్ట జన్మము–భవిష్యజ్జన్మము. ఈ యైహికాముష్మిక జన్మములలో సుఖదుఃఖముల ననుభవింపజేయు కర్మాశయములు క్లేశములున్న కలుగును; లేకున్న కలుగవు. కాబట్టి కర్మాశయమేర్పడకుండ వలయునని క్లేశములు హేయము లగును.

కర్మాశయములకు హేతువులైన క్లేశములు తొలగినను, పూర్వజన్మ పరంపరయందు సంచితమయిన కర్మాశయము లనంతముగా నుండుటచే నవి పరిపక్వములుగాక తప్పదు కాబట్టి క్లేశములున్న నేమి యన:—

"సతిమూలే తద్విపాకో జాత్యాయుర్భోగాః" ౧౩

మూలే=కర్మాశయమునకు మూల కారణమైన క్లేశ ములు, సతి, ఉండగా జాత్యాయుర్భోగాః = జన్మము, జీవన కాలము, సుఖదుఃఖానుభవము, సే మూడును, తద్విపాకః= కర్మాశయమునకు విపాకమగును. విపాకమన కర్మసాధ్యఫలము. అట్టి ఫల మేర్పడునని భావము.

కర్మాశయమునకు క్లేశములు మూలము. మూల మున్నంత కాలము కర్మాశయము విపాకము నారంభించును— ఫలజనకమగును. (ఛిన్నే మూలే నైవపత్రం నశాఖా) మూలము ఛిన్నమైన వృక్షము చిగురింపనట్లు వివేక ఖ్యాతివలన క్లేశ మూలము నశింప కర్మాశయ మనంతమయ్యు నకించిత్కరమే— నిష్ప్రయోజనమే యగునని భావము.

"జాత్యాయుర్భోగములు కర్మఫలములని చెప్పుటచే కర్మము జన్మము (జాతి) నకు హేతువని తెలియుచున్నది. ఇట నొక కర్మమొక జన్మమునకు కారణమా? లేక యనేక జన్మములకు కారణమా? యని విచారింప ననువగును. మఱియు ననేక కర్మము లనేక జన్మములను కలిగించునా? లేక యొక జన్మమును కలిగించునా? యని విచారింప వీలగును. ఇందు

ఒక్క కర్మ యొక్క జన్మమునకు కారణ మన వీలుపడదు. అనాదికాలమునుండియు సంచితకర్మము లెన్నియో యుండును. ఈ జన్మమునందు చేయబడునవియు ననేకము లగును. ఇవి యన్నియు క్రమముగా నొక్కటొక్కటి యొకొక్క జన్మము నకు కారణములయిన జన్మముల కంతముండదు కావున ముక్తికామన యసంభవము, ననిష్టము నగును. ఇట్లే యొక్క కర్మ మనేకజన్మములకు కారణమనుట మిక్కిలి యసంభవ మగును. ఒక్కకర్మముఫలమే యనేకజన్మములయిన మిగిలిన కర్మముల ఫలానుభవమునకు కాలమే లేకుండును గదా! ఇక ననేకకర్మము లనేకజన్మముల నొక్కసారి కలిగించునంటమూ యడియాసను పొసగదు. ఒకే తృణమున ననేక జన్మములు కలుగుచెట్లు? కలుగ వలనుపడదు. అందువలన క్రమముగా నొకదానితరువాత మఱియొక జన్మము కలుగవలసి యుండును. అప్పుడొక్క కర్మమున కొక్కజన్మమనియే తేలును. అందువలన ప్రార్వదోషమే వాటిల్లును. కాబట్టి యనేక కర్మములుకలిసి యొక్క జన్మమును కలిగించుననియే యూహింప నగును. ఒక జన్మమున మరణించుటకు పూర్వము చేయబడు పుణ్యాపుణ్యకర్మముల వాసనలు (జీవాత్మ విశిష్టచిత్తమునం దేర్పడినవి) చిత్రములై ప్రాయణ (మరణ)సమయమున కొన్ని ప్రధాన భావమును, మరికొన్ని యప్రధానభావమును పొంది యభివ్యక్తములగును. అందు కొన్ని వెంటనే ఫలమునిచ్చునవి గాను, మఱికొన్ని కాలాంతరమున ఫలమొసంగునవి గాను నుండును. వానికి కారణభూతములయిన కర్మముల స్వభావమే

యింపులకు కారణము. కాలభేదముచే ఫలమునొసంగుటనుబట్టి వీనికి ప్రధాన అప్రధాన భావమును కల్పింప వీలగును. తమ తమ ఫలములను జన్మాదిరూపమున ననుభవింపజేయుటలో లోలములైన ఈసంస్కారములు ఒక్కటిగాకలిసి, మరణమును సాధించి జన్మమును కలిగించును. ఆజన్మము లభ్యాయుష్కమగుటకు నావిచిత్రవాసనాప్రచయమే కారణము. భోగము నాకర్మ సముదాయమువలననే సంభవించును. కాబట్టి కర్మాశయము జన్మాయుర్భోగహేతువై త్రివిపాకమని చెప్పబడుచున్నది." అని వ్యాసమహర్షి యాశయము.

పుణ్యపాపకర్మాశయములకు మూలమగుటచే నవిద్యాది క్లేశములు హేయములు కావచ్చును; కాని, కర్మాశయ విపాకములయిన జాత్యాయుర్భోగములు వేనికి మూలములై హేయము లగుచున్నవన:—

"తేహ్లాద పరితాపఫలాః పుణ్యాపుణ్య హేతుత్వాత్" ౧౪

పుణ్యాపుణ్య హేతుత్వాత్ =ధర్మాధర్మములు హేతువులుగాగలవగుటవలన, తే = జన్మము, ఆయువు, భోగము నీ మూఁటను హ్లాదపరితాపఫలాః = సుఖదుఃఖములనెడి ఫలముల నిచ్చును.

ధర్మమూలకములైన జన్మాదులు సుఖదాయకములగును. అధర్మమూలకములైన జన్మాదులు దుఃఖదాయకములగునని భావము.

అట్లయిన దుఃఖదాయకములైన కర్మాశయములు హేయములగునుసరే; సుఖదాయకముల నేలవిడువవలెనన:—

"పరిణామతాప సంస్కారదుఃఖైః గుణవృత్తి
విరోధాచ్చ, దుఃఖమేవ సర్వం వివేకినః" ౧౫

వివేకినః=సుఖదుఃఖములను వివేకించుయోగికి, పరిణామ తాపసంస్కార దుఃఖైః=పరిణామ, తాప, సంస్కార రూప దుఃఖములచేతను, గుణవృత్తి విరోధాచ్చ = సుఖజ్ఞానమునకు హేతువులయిన చిత్తరూపమున పరిణామమునొందు సత్వ రజస్తమోగుణములలోగల వైరుద్ధ్యమువలనను, సర్వం=దృష్టా నుశ్రవిక విషయములవలన కలుగు సమస్తసుఖము, దుఃఖమేవ= దుఃఖమే యగును–ప్రతికూలమే యగును – అనుకూలముకాదని భావము.

చేతనపదార్థములవలనగానీ, యచేతన పదార్థముల వలన గానీ, లభించుసుఖము రాగముతో కూడియుండును. అనురక్తి లేనియెడ సుఖానుభవముండనేరదు. రాగము ప్రవృత్తికి కారణము. ప్రవృత్తివలన పుణ్య పాపముల నొనరింతురు. కాబట్టి రాగమువలన నేర్పడు కర్మాశయము (వాసన) కాయికము, వాచికము, మానసికము నని మువ్విధములు. సుఖము కొఱకిది యాచరింపవలయునని సంకల్పించుటచే నేర్పడు వాసన మానసికము. చెప్పుటచే నేర్పడునది వాచికము. చేయుటచే కలుగునది కాయికము. "నానుపహత్య భూతాన్యుపభోగః సంభవతి" భూతములను హింసింపక భోగము లభింపదు–కాగా కాయిక కర్మాశయము హింసాకృతమగును. ఇట్లు సక్తుడై మనుజుడు సుఖము ననుభవించు నెడ యెవ్వడేని సుఖవిచ్ఛిత్తి కలిగిన దానికికారణమైన దుఃఖసాధనములను ద్వేషింప

సాగును. అట్టి దుఃఖసాధనములను పరిహరింప నసమర్థుడై మోహము నందును. ఇట్లు ద్వేష మోహములకు సంబంధించిన కర్మాశయములును కాయిక వాచిక మానసిక భేదములతో మువ్విధముల నేర్పడును. ఇట్టి కర్మాశయముల పరిణతియే దుఃఖము. ఇదియే పరిణామదుఃఖము.

మానవుడు సుఖము ననుభవించునప్పుడు తనకెన్నడును సుఖవిచ్ఛిత్తి కలుగకుండవలయునని యెంచి సుఖవ్యతిరేక సాధనములను ద్వేషించుచు సంతప్తుడగును. అంతట నాసాధనములను వారింపదలచి ప్రయత్నపరుడగును. అట్టియెడ ద్వేషమునకు సంబంధించిన కాయిక, వాచిక, మానసిక సంస్కారములు (కర్మాశయములు) కలుగును. దుఃఖసాధనములను పరిహరింప నసమర్థుడై మోహితుడగును. కాగా మోహజనిత కర్మాశయములు నేర్పడును. ఇట్లే సుఖమునందనురక్తుడైన వ్యక్తి సుఖము నభిలషించుచు నితరుల ననుగ్రహించును. దుఃఖసాధనముల నుపహాననముచేయును. కాబట్టి రాగజన్య కర్మాశయములు నేర్పడును. వానివలన దుఃఖమేర్పడును. ఇదియే తాప దుఃఖము.

సుఖదుఃఖముల ననుభవించుట వలన నాయా విషయములకు సంబంధించిన సంస్కారము లేర్పడును. సుఖవిషయిక సంస్కారమువలన మరల స్మృతి కలుగును. స్మృతివలన రాగమేర్పడును. రాగమువలన మనోవాక్కాయములందు ప్రవృత్తి కలుగును. ప్రవృత్తివలన మరల సంస్కారములు (కర్మాశయములు). అందువలన సుఖదుఃఖములు, వాని యనుభవమువలన

సంస్కారములు, వానివలన మరల స్మరణము; మరల రాగము; మరల ప్రవృత్తి; మరల కర్మాశయములు. మరల సుఖము; మరల దుఃఖము అని సంస్కారచక్రమువలన నేర్పడు దుఃఖము నకు పేరయుండదు. ఇదియే సంస్కార దుఃఖము.

ఇట్లే పరిణామ, తాప, సంస్కారదుఃఖత్రయముతో కూడియుండుటచేత విషయసుఖము దుఃఖమే యగుచున్నది.

ఇక సత్త్వరజస్తమోగుణములు స్వభావముచే పరస్పర విరుద్ధములు. సత్త్వగుణము ప్రఖ్యా (ప్రకాశ) స్వభావము. రజోగుణము ప్రవృత్తి స్వభావము. తమోగుణము స్థితిశీలమని పూర్వమే చెప్పియున్నాము. గుణములిట్లు విరుద్ధస్వభావము కలవైనను పరస్పరము గుణప్రధాన భావముతో కలిసి (జీవాత్మ కొఱకు) శాంత, ఘోర, మూఢ స్వరూపముగల కార్యజాతమును సృష్టించుచుండును. ఇందొకటి ప్రధానమైన మిగిలిన రెండును గౌణము (అప్రధానము) లగును. ఇట్లు ప్రతి కార్యవస్తువు త్రిగుణమైనను, ప్రధాన గుణశబ్దముచే వ్యవహరింపబడుచు సాత్త్విక రాజసతామసము లనబడును. కాబట్టి కొండొక వస్తువిషయికమైన సుఖప్రత్యయము సైతము ప్రధానముగ సాత్త్వికమైనను రజస్తమోగుణాత్మకమునగుటలో సంశయముండదు. అందువలన సుఖానుభవము కేవల సుఖానుభవము కాక దుఃఖమోహములతో కూడియుండుట నిశ్చితము. పరస్పర విరోధాత్మకములగు నీ గుణముల వృత్తము నతి చంచలము. విషయములకు సంబంధించిన వృత్తులు (జ్ఞానము) ఋణ ఋణము మాకుచుండును. ఒక వృత్తిచే మఱియొక వృత్తి యభి

భూతమగుచుండును. కాబట్టి వైషయికసుఖము తుణమాత్రమై యస్థిరమే యగును. ఇట్లు గుణవృత్తులలోగల వైరుధ్యము వలన విషయసుఖము దుఃఖమయమే యని భావము.

అంత పరిణామదుఃఖము భవిష్యద్దుఃఖము. తాపదుఃఖము భవష్యద్వర్తమానములకు సంబంధించినది. సంస్కారముల యానంత్యమున నేర్పడు సంస్కార దుఃఖము భవిష్యద్దుఃఖమగునని వివేకము.

ఇట్లు వివేకియైన యోగికి విషయ జన్యసుఖ మంతయు దుఃఖమేయగును. కాబట్టి యదియు హేయమే యగుచున్నదని భావము.

ఇంతవరకు శాస్త్రప్రతిపాద్యవిషయమును సంక్షేపముగ చెప్పి యిప్పుడు హేయము, హేయహేతువు, హానము, హానోపాయము నని నాలుగువిధములుగ విభజించి వివరముగా శాస్త్రమును చెప్పదలచినవాడై ముందుగా హేయపదార్థ మునకే మొదట చెప్పుచున్నాడు:—

"హేయందుఃఖమనాగతమ్" ౧౬

అనాగతం = రాబోవు, దుఃఖం = త్రివిధ దుఃఖము, హేయమ్=విడువదగినది.

భూతకాలికదుఃఖము భోగముద్వారమున నశించియుండును. వర్తమానదుఃఖము అనుభవింపబడుచుకాలాంతరమున నదియు విడువబడును. కాగా మిగిలినది అనాగతదుఃఖమే. అయ్యది రాకుండ చేసికొనవలయునని భావము.

ఈ హేయదుఃఖమునకు కారణ మేమైయుండునన:—

"ద్రష్టృదృశ్యయోః సంయోగో హేయహేతుః" ౧౭

ద్రష్టృదృశ్యయోః = ద్రష్ట, దృశ్యము నను నీ రెంటి రెండిక్క—, సంయోగః=సంబంధము, హేయహేతుః=హేయమగు సాంసారిక దుఃఖత్రయమునకు హేతువు—కారణము.

బుద్ధిసంవేది పురుషుడు ద్రష్టయనబడును. బుద్ధిగత ధర్మములను తనవిగా భావించు జీవాత్మ ద్రష్టయని భావము. బుద్ధి, అహంకారము మున్నగు రూపముల పరిణమించు ప్రకృతి దృశ్య మనబడును. అవిద్యవలన నీ జీవాత్మ ప్రకృతులకు స్వస్వామి భావాత్మకమగు ననాది సంబంధము కలదు. ఈ సంబంధమే దుఃఖములకు మూలమని భావము.

బుద్ధిసత్వము స్వచ్ఛమై విషయాకారతను పరిణామముల నొందుచు పురుష సమీపముననుండి యుపకరించును—దృశ్యమగును. ద్రష్టయైన పురుషునకిది 'స్వమ్'; పురుషుడు స్వామి. ఇదియే వీనికిగల స్వస్వామిభావసంబంధము. పురుషుని భోగమునకు విషయమై—పురుషునిచే భుజ్యమానమగుచు—బుద్ధి 'స్వమ్' (ధనము) అగుచున్నది. బుద్ధిసత్వము స్వయం ప్రకాశమగదా! పురుషభోగమునకు విషయ మెట్లగు నన జనదు. బుద్ధి చైతన్యమయినచో స్వయంప్రకాశమయ్యెడిది. అది జడమగుటచే చైతన్యస్వరూపుడైన పురుషుని సామీప్యము వలన స్వరూపమొంది—విషయాకారతను పొంది—యతని యనుభవమునకు విషయమగుచున్నదని భావము.

ప్రకృతి పురుషులకుగల వాస్తవరూపమైన యవిద్యచే నేర్పడిన సంబంధమువలన దుఃఖము లేర్పడుచున్నవి. దుఃఖకారణమైన సంబంధమును త్యజించుటచే అత్యంతిక దుఃఖప్రతీకారము కలుగునని పంచశిఖాచార్యుడును వర్ణించియున్నాడు.

"తత్సంయోగ హేతు వివర్జనాత్
స్యాదయ మాత్యంతికో దుఃఖప్రతీకారః"

దృశ్యస్వరూప మెట్టిదన:—

"ప్రకాశక్రియాస్థితి శీలం భూతేంద్రియాత్మకం
భోగాపవర్గార్థం దృశ్యమ్" ౧౮

భోగాపవర్గార్థం= భోగము, అపవర్గము ప్రయోజనముగాగలది, భూతేంద్రియాత్మకం = పృథివ్యాది భూతముల, శ్రోత్రాదీంద్రియములరూపమున పరిణమించునది, ప్రకాశక్రియాస్థితిశీలం=ప్రకాశము, క్రియ, స్థితిస్వభావముగాగలది, దృశ్యమ్= దృశ్యమనబడును.

భోగాపవర్గములు ప్రయోజనముగా గలిగి భూతేంద్రియాది రూపమున పరిణతినొందునట్టిదియు, ప్రకాశ క్రియాస్థితులు స్వభావముగా గలిగినట్టిదియు నగు కొండొక పదార్థము దృశ్యమని భావము.

ఈసూత్రమున సుఖము, దుఃఖము ననెడి విషయాను భవము భోగమనబడును. ప్రకృతిపురుషవివేకఖ్యాతి అపవర్గమనబడును. దృశ్యపదార్థము భోగముకొఱకు అపవర్గము కొఱకునగుటచేభోగాపవర్గములు ప్రయోజనముగాచెప్పబడినవి.

దృశ్యపదార్థము (ప్రకృతి) పంచతన్మాత్రములు, ఇంద్రియములు, సూక్ష్మభూతములు, స్థూలభూతములుగా పరిణమించును. దృశ్యస్వభావముగా చెప్పబడిన ప్రకాశమనగా బుద్ధి వృత్తులనబడు జ్ఞానమును, లోకమునగల వెలుతురునని గ్రహింపవలయును. ఇట్లు యత్నమును, చలనాదులను క్రియయనియు, ప్రకాశమునకు, క్రియకుగలుగు ప్రతిబంధకమును స్థితియనియు తెలియవలయును. ప్రకాశము, క్రియ, స్థితి యనునవి క్రమముగా సత్వరజస్తమోగుణముల స్వభావమని పూర్వమనేక పర్యాయములు వర్ణింపబడినది. ఇట్టి త్రిగుణాత్మకమే ప్రకృతి—దృశ్యము.

ప్రకృతి, ప్రధానము అను శబ్దములచే వ్యవహరింపబడు గుణత్రయము పురుషుని భోగాపవర్గములకొఱకే బుద్ధిరూపమున పరిణమించును. కాని యా భోగాపవర్గములు చెందును పురుషునకు వాస్తవములుకావు. పురుషుడు బద్ధముక్త స్వభావుడయ్యు స్వరూపమున నట్లు కాడని యభియుక్తుల మతము. కాబట్టి భోగాపవర్గములు వాస్తవమున బుద్ధిగతములై పురుషునివిగా వ్యవహరింపబడునని భావము. యోధులయెడ గలుగు జయాపజయములు రాజునందు వర్తించు నట్లని యిట నుదాహరింతురు.

పురుషార్థము పరిసమాప్తము కానంతవరకు బుద్ధికి బంధము; వివేకఖ్యాతియనెడి పరమపురుషార్థము సిద్ధించుటయే మోక్షమునని భావము. మఱియు వాస్తవమున బుద్ధిగతములైన, గ్రహణము, ధారణము, ఊహ, అపోహ, తత్త్వజ్ఞానాభి

నివేశాదులు పురుషారోపితములై వ్యవహరింప బడునని గ్రహింప వలయును. (గ్రహణము=స్వరూపమాత్రమున వస్తువులను తెలిసికొనుట. ధారణము=స్మృతి.)

"విశేషావిశేషలింగమాత్రాలింగాని గుణపర్వాణి" ౧౯

విశేషా...లింగాని=విశేషములు, అవిశేషములు, లింగమాత్రము, అలింగము ననునాలుగు, గుణపర్వాణి=పృశ్నిమలయిన సత్త్వరజస్తమస్సులను గుణముల యవస్థలు.

(౧) విశేషములు:- పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము ననునైదుభూతములు; త్వక్కు, చక్షువులు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణేంద్రియమునను జ్ఞానేంద్రియములైదు; వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థము ననునైదు కర్మేంద్రియములు; మనస్సు, ఈ పదునారు పదార్థములు విశేషము లనబడును.

(౨) అవిశేషములు:— శబ్దతన్మాత్రము, స్పర్శతన్మాత్రము, రూపతన్మాత్రము, రసతన్మాత్రము, గంధతన్మాత్రము, అను నైదు తన్మాత్రములు. ఇయ్యవి యాకాశాది పంచమహాభూతములకు కారణములు. ఈశబ్దాది తన్మాత్రములు మిశ్రితములై యుండుటచేతను, పూర్వతన్మాత్ర ముత్తరతన్మాత్రమునకు కారణమగుటచేతను ఏకద్విత్రిచతుష్పంచలక్షణములు కలవిగా చెప్పబడును. ఇట లక్షణము ధర్మవాచకము. శబ్దతన్మాత్ర మన్నిటికంటెపూర్వముకాబట్టి యది యేకలక్షణము—ఏకధర్మకము—శబ్దలక్షణము. స్పర్శతన్మాత్రము ద్విలక్షణము—శబ్దస్పర్శలక్షణము.; రూపతన్మాత్రము శబ్దస్పర్శ రూపలక్షణమై త్రి

లక్షణము. రసతన్మాత్రము చతుర్లక్షణము— శబ్దస్పర్శరూపరస లక్షణము. గంధతన్మాత్రము పంచలక్షణము—శబ్దస్పర్శరూపరస గంధలక్షణము. ఇట్టి శబ్దాది తన్మాత్రములైదు; శ్రోత్రాది పదకొండు ఇంద్రియములకు కారణమైన అహంకారమొకటి కలసి అరును అవిశేషము లనబడును.

(3) లింగమాత్రము:— పంచతన్మాత్రములకు, అహంకారమునకు కారణమైన మహత్తత్వము లింగమాత్ర మనబడును.

(4) అలింగము:— మహత్తత్వమునకు కారణమైన సత్వరజస్తమో గుణాత్మకమగు ప్రకృతి—ప్రధానము అలింగమనబడును. లయమును బొందునది లింగము. లయము పొందనిది—నాశముకానిది కాబట్టి ప్రధాన మలింగమనబడును.

సత్వరజస్తమో గుణముల సామ్యావస్థ ప్రకృతి—ప్రధానము—అవ్యక్తము అనబడును. మహత్తత్వము మొదలు పంచ మహాభూతముల వరకు చెప్పబడిన లింగమాత్ర, అవిశేష, విశేషములన్నియు గుణముల విషమావస్థలని వివేకము.

ఇంచుమించుగా విశేషములను వికారములు—కార్యములు. అయ్యవి శాంతఘోరమూఢతాలక్షణములతో కూడియుండును. ఇట్టి లక్షణములులేని తన్మాత్రముల వికారములేకాబట్టి యివి విశేషము లనబడునని భావము. శ్రోత్రాది జ్ఞానేంద్రియములు సత్త్వప్రధానమైన అహంకారము (అస్మిత) యొక్క వికారములు—విశేషములు. వాగాది కర్మేంద్రియములు రజోగుణ ప్రధానమైన అహంకారమునొక్క విశేషములు — వికారములు —

కార్యములు. మనస్సు మాత్ర ముభయప్రధానమని తెలియ వలెను.

ప్రకృతివిశేషములు మహదహంకారములు. అహంకార విశేషములు ఏకాదశేంద్రియములు. మహత్తత్త్వము యొక్క విశేషములు పంచతన్మాత్రములు. పంచతన్మాత్రముల విశేషములు పంచమహాభూతములు.

ప్రకృతినుండి మహదహంకారములు, మహత్తత్త్వము నుండి పంచతన్మాత్రములు, అహంకారమునుండి ఏకాదశేంద్రియములు, పంచతన్మాత్రములనుండి పంచమహాభూతములు జనించినవని యోగుల మతము. పంచతన్మాత్రములును మహత్తత్త్వమునుండి జనించినట్లు సాంఖ్యులు చెప్పుదురు.

దృశ్యము, దాని స్వరూప పరిణామములు నన్నియు వర్ణించి ద్రష్టస్వరూపము చెప్పుచున్నాడు.

"ద్రష్టాదృశిమాత్రఃశుద్ధోఽపిప్రత్యయానుపశ్యః" ౨౦

దృశిమాత్రః=జ్ఞానమే స్వరూపముగాగల పురుషుడు, ద్రష్టా=ద్రష్టయనబడును. శుద్ధోఽపి=జ్ఞానమున కాశ్రయము కాకున్నను, ప్రత్యయానుపశ్యః=బుద్ధియందలి ప్రత్యయము—జ్ఞానముననుసరించి చూచువాడు.

జ్ఞానమాత్రుడైన పురుషునందు స్వరూపమున ద్రష్టృత్వములేదు. కాని, శబ్దాది విషయాకారతను పరిణమించి వృత్త్యాత్మకమైయున్న బుద్ధియందు పురుషుడు (జీవాత్మ) ప్రతిబింబించి, బుద్ధి సమానమైన యాకారమునుపొంది, వివేకము

లేనందున శబ్దాదులనెఱుగు బుద్ధివృత్తులను తనయం దారో పించుకొని, తానే శబ్దాదులను తెలిసికొనుచున్నట్లు— దర్శించు చున్నట్లుండును. ఇట్లు పురుషుడు శుద్ధుడయ్యు దృష్టికాశ్రయు డగుచున్నాడు. ఇట్టివాడే ద్రష్టయని భావము.

పురుషుడు దృక్‌శక్తి మాత్రమే. ఇతర విశేషణరహి తుడని భావము. అట్టి పురుషుడు బుద్ధిప్రతిసంవేదియై ద్రష్ట యనబడును. బుద్ధియనెడి దర్పణమున పురుషుని ప్రతిబింబ సంక్రమణమే బుద్ధిప్రతిసంవేదిత్వము. దృక్‌శక్తి ఛాయతో కూడిన బుద్ధితో సంసృష్టములయి శబ్దాదులు దృశ్యములగును కాబట్టి పురుషునందు ద్రష్టృత్వమారోపితమే కాని స్వాభావి కము కాదని భావము.

స్వాభావికద్రష్టృత్వ మంగీకరించినచో పురుషుడు పరి ణామియగును. శబ్దాది జ్ఞానముకలిగిన రూపమొకటియు, లేని రూపమొకటియు నగునని భావము. పురుషుడు పరిణామికాదు. బుద్ధి పరిణామి. గవాదిరూపమున పరిణమించినపుడు బుద్ధికి గవాదుల జ్ఞానము కలుగును. పరిణామములేనపుడు కలుగదు. పురుషుడట్లుకాక సదాజ్ఞాత. అతనికి విషయము బుద్ధియే. బుద్ధి యొకప్పుడు తెలియబడి, మరియొకప్పుడు తెలియబడ కుండుట యనునది యుండదు. కాబట్టి పురుషుడు సదాజ్ఞాతయై— దృక్‌శక్తిగా—అపరిణామియై యుండునని తాత్పర్యము.

ద్రష్టృదృశ్యముల స్వరూపమునుచెప్పి దృశ్యము ద్రష్ట కొఱకే యని చెప్పుచున్నాడు.

"తదర్థఏవ దృశ్యస్యాత్మా" ౨౧

దృశ్యస్యాత్మా=దృశ్యముయొక్క స్వరూపము, తదర్థ ఏవ=పురుషార్థమే ప్రయోజనముగాగలది.

దృశ్యముయొక్క స్వరూపము తనకొఱకుకాక దృక్ శక్తి-పురుషుని-యొక్క భోగాపవర్గములనెడి ప్రయోజనము కొఱకే యని భావము.

అటులయిన ద్రష్టయొక్క ప్రయోజనము సిద్ధింపగానే దృశ్యము నశించును. అటుపై ప్రపంచము చిన్నముకాగలదన:-

"కృతార్థంప్రతి నష్టమప్యనష్టం తదన్యసాధారణత్వాత్" ౨౨

తత్=బుద్ధిరూపమున పరిణమించు గుణత్రయాత్మక మగు దృశ్యము (ప్రధానము), కృతార్థంప్రతి= భోగాపవర్గ లక్షణ ప్రయోజనము సిద్ధించిన పురుషుని విషయమున, నష్ట మపి=నాశమునొందియు, అన్యసాధారణత్వాత్=అకృతార్థుడైన పురుషుని విషయమునను సమానమగుటవలన, అనష్టం = నష్టముకాదు. స్వరూపనాశము నందదు.

గుణత్రయాత్మకమగు ప్రకృతి యొక్కటే. పురుషులు అనేకులు. ప్రకృతి పరమాత్మనిమూలమున పురుషులందరి యెడ సమానభావముతో వారి భోగాపవర్గార్థము సదా ప్రవర్తించుచుండును. కొండొక పురుషుని భోగాపవర్గములు సిద్ధించి యతనికి నష్టమయ్యు నితరుల-అకృతార్థుల-కొఱకది నష్టముకాజాలదు. కాబట్టి యొకానొకడు ముక్తుడైనందున సంసారము(ప్రపంచము) చిన్నముకావలసిన యగత్యముండదు.

మఱియు ప్రకృతి నిత్యము. దానిస్థితి పురుషార్థము కొఱకుకాదు. ప్రకృతియొక్క పరిణామ స్వరూపముమాత్రము పురుషార్థనిమిత్తము. కాబట్టి యట్టి దృశ్యరూపము కొండొకని యెడ నాశమందినను ప్రకృతి తత్త్వతః నశింపదని భావము.

ద్రష్టృ దృశ్యములను వివరించి వాని సంయోగమును వర్ణించుచున్నాడు.

"స్వస్వామిశక్త్యోః స్వరూపోపలబ్ధిహేతుః సంయోగః" ౨౩

స్వస్వామిశక్త్యోః=స్వశక్తి ప్రకృతి, స్వామిశక్తి పురుషుడు, వీని రెంటియొక్క, స్వరూపోపలబ్ధిహేతుః = స్వరూప సాక్షాత్కారమునకు కారణమైన స్వస్వామిభావలక్షణమైన సంబంధము, సంయోగః=సంయోగమనబడును.

దృశ్యము ద్రష్టకొఱకు. దృశ్యము వలన కలిగిన భోగము, అపవర్గము ననెడి ఉపకారమును పొంది పురుషుడు స్వామి యగుచున్నాడు. దృశ్యము 'స్వమ్' అతని ధనమగుచున్నది. శబ్దాదివిషయ రూపమున పరిణమించి సుఖదుఃఖములు కలదియైన బుద్ధి-ప్రకృతి స్వరూపజ్ఞానములేని పురుషున కుపలబ్ధమై భోగమగును. ద్రష్టయొక్క స్వరూప జ్ఞానము కంటె-బుద్ధ్యాది ప్రకృతికంటె పురుషుడు తన స్వరూపమును వేరుగా నెరుగుట-అపవర్గ మనబడును. భోగాపవర్గములకు హేతువైన స్వస్వామిభావ-దృశ్య ద్రష్టృభావ-భోగ్య భోక్తృభావ - లక్షణమయిన సంబంధము సంయోగమనబడు నని భావము.

భోగాపవర్గములకు హేతువైన ప్రకృతి పురుష సంయోగము ఘటపటముల సంయోగములవంటిది కాదు. ఇది యోగ్యత లక్షణముగాగల సంయోగము. దృశ్యమున జడత్వము, విషయత్వము ననెడి భోగ్యత్వ యోగ్యత కలదు. ద్రష్టయైన పురుషునందు చేతనత్వమనెడి భోక్తృత్వ యోగ్యత కలదు.

ఇట్టి యోగ్యతలు లక్షణములుగాగల ప్రకృతి పురుషుల సంయోగము అనాది విపర్యయ జ్ఞానవాసనచే జనించి యవిద్యానిమిత్తము తొలగగానే నశించును. ఈ యవిద్యా నిమిత్తము తొలగుటకు సమ్యక్ జ్ఞానము తక్క వేరొండు సాధనము లేదు. సమ్యక్ జ్ఞానమే విపర్యయ జ్ఞానమునకు ప్రతిద్వంద్వి—విరోధి.

భోగాపవర్గములకు హేతువైన ప్రకృతి పురుషసంయోగమునకు కారణమేమన:—

"తస్యహేతు రవిద్యా" ౨౪

తస్య=ఆ సంయోగమునకు, హేతుః=కారణము—నిమిత్తము, అవిద్యా=అవిద్య.

అవిద్య, విపర్యయజ్ఞానము, మిథ్యాజ్ఞానము, భ్రాంతిజ్ఞానము, అజ్ఞానము, అవివేకము, భ్రమ ఈ శబ్దము లన్నియు నొకే యర్థమును బోధించును.

హేయమగు దుఃఖమును, హేయకారణమైన సంయోగము, దాని నిమిత్తమునుచెప్పి హానమననేమో చెప్పుచున్నాడు.

"తదభావాత్ సంయోగాభావోహానం తద్దృశేః కైవల్యమ్" ౨౫

తదభావాత్=అవిద్యానాశమువలన కలుగు, సంయోగాభావః=ప్రకృతి పురుష సంయోగనాశము, హానం=హాన మనబడును. తత్=అహానమే, దృశేః=జ్ఞానస్వరూపుడైన పురుషుని, కైవల్యమ్=నిఃశ్రేయసము—మోక్షమనబడును.

పురుషుడు బద్ధుడు, ముక్తుడు అని యనబడినను స్వరూపముతో నతడు బద్ధుడుకాడు. స్వరూపముతో బద్ధుడైనచో ముక్తి యసంభవ మగును. కాబట్టి యవిద్యా నిమిత్తమున దుఃఖహేతువగు బుద్ధిసంయోగమే యతనికి బంధము. సమ్యక్ జ్ఞానము--వివేకఖ్యాతివలన—నవిద్య తొలగగా అవిద్యచే నేర్పడిన బుద్ధిసంయోగమునుతొలగును. బుద్ధి సంబంధము తొలగుటయే మోక్షము. ఇంతకుమించి మోక్షమున పురుషస్వరూపమునందు కలుగు మార్పు లండేమియు నుండదు. సంయోగ నివృత్తియే దుఃఖనివృత్తి. దుఃఖనివృత్తియే బ్రహ్మానందానుభవము. కాబట్టి సంయోగము నశించుటయే హాన మనియు, ఆహానమే కైవల్యమనియు సూత్రమున చెప్పబడినదనిభావము. హానప్రాప్తికి నుపాయమేమన:—

"వివేకఖ్యాతి రవిప్లవా హానోపాయః" ౨౬

అవిప్లవా=నిర్మలమైన, వివేకఖ్యాతిః=ప్రకృతి పురుషులత్యంత భిన్నులను వివేకము, హానోపాయః = కైవల్యమున కుపాయము.

వాసనతో కూడిన మిథ్యాజ్ఞానమనెడి కాలుష్యము విప్లవ మనబడును. ఇట్టి కాలుష్యము — మాలిన్యము—లేని ఖ్యాతి అవిప్లవఖ్యాతి యగును.

ఆచార్యోపదేశము వలన వివేకమునెఱిగి, మనసము ద్వారమున దానిని స్థిరపరుచుకొని, దీర్ఘకాలమువరకు నిరంతరము శ్రద్ధతో సేవించుటవలన నేర్పడిన భావనాప్రకర్షము వలన నుత్పన్నమైనప్రత్యక్షాత్మకమగు సమాధిప్రజ్ఞ–అధ్యాత్మప్రసాదము–వివేకఖ్యాతి వాసనాసహిత మిథ్యాజ్ఞానమునకు దగ్ధబీజభావముకల్పించి నిర్విప్లవమై కైవల్యప్రాప్తి కుపాయమగునని భావము. వివేకఖ్యాతివలన మిథ్యాజ్ఞానము నశించును. అట్టిపై ప్రకృతిపురుషసంయోగము నశించును. అంపువలన దుఃఖత్రయ విఘాత మనెడి కైవల్య మొదవును.

"తస్యసప్తధాప్రాంతభూమిఃప్రజ్ఞా" ౨౭

తస్య= వివేకఖ్యాతియంపు నిష్ఫలయోగికి, సప్తధా = ఏడు విధములయిన, ప్రాంతభూమిః = ప్రాంతభూములుగల, ప్రజ్ఞా=బుద్ధి కలుగును.

వివేకఖ్యాతి కలిగిన యోగికి రాజసతామస జ్ఞానములు కలుగక యతని వివేకఖ్యాతి నిర్విప్లవమగును. అట్టివాడే ధర్మమేఘయోగి యనబడును. అతనికి సప్తవిధములగు ప్రజ్ఞ యేర్పడును. ఆ ప్రజ్ఞ జిజ్ఞాస, జిహాస, ప్రేప్స, చికీర్ష, శోకము, భయము, వికల్పము ననునేడును తొలగిపోవుటయే ఫలముగా గలిగియుండును. అందు, (౧) 'హేయమనగనేమో తెలిసినది. హేయమున తెలిసికొనదగిన యంశమొండులేదు.' అనుజ్ఞానము కలుగుటచే జిజ్ఞాస యుండదు. (౨) 'హేయమునకు కారణము లైన అవిద్యాది పంచక్లేశములు త్యజింపబడినవి. వీనిలో నిక త్యజింప దగినదిలేదు' అను జిహాస తొలగును. (3) 'హానము–

కైవల్యముప్రాప్తించినది. ప్రాప్తవ్యమొకింతయు నికలేమ'అను ప్రాప్తి-ప్రాప్తికోరిక యుండదు. (౮) 'వివేకఖ్యాతి రూపమగు ఊనోపాయము లభించినది. ఇకసంపాదింపవలసినది లేదు'అను చికీర్ష-కర్తవ్యేచ్ఛ తొలగిపోవును. ఈ నాలుగు విధములయిన ప్రజ్ఞయు కర్తవ్య సమాప్తిరూపమగుటచే కార్యవిముక్తి నామకప్రజ్ఞ యనబడును. (౫) 'నాబుద్ధిసత్వము కృతార్థమైనది.' (౬)'బుద్ధిరూపమున పరిణమించిన గుణములును పర్వత శిఖరమునుండిపడిన రాళ్ళవలె స్థానరహితములై స్వకారణమైన ప్రకృతియందులీనమై బుద్ధిసత్వముతోబాటు విలయమొందును. ఇయ్యవి మరల నుత్పన్నము కావు' (౭) 'త్రిగుణాతీతుడై స్వరూపమాత్రమున స్థితిగల కేవల పురుషుడు పరమాత్మ సాక్షాత్కారము నొందును.' అను నీమూడును చిత్తవిముక్తి రూపము లగుటచే చిత్తవిముక్తినామకప్రజ్ఞ యనిపించు కొనును. ఇట్లు కార్యవిముక్తి సంజ్ఞగల ప్రజ్ఞయు, చిత్తవిముక్తి సంజ్ఞగల ప్రజ్ఞయుకలిసి సప్తవిధప్రజ్ఞగా వ్యవహరింప బడునని భావము. భూములన నవస్థలు; ప్రాంతభూములన అవసానము గల యవస్థలని భావము.

ఉపన్యస్త సప్తవిధప్రాంతభూమి ప్రజ్ఞగల పురుషుడు నిర్వికల్పుడు-జీవన్ముక్తుడు-కుశలుడు నని చెప్పబడును.

వివేకఖ్యాతి కలుగుట కనుష్ఠింపవలసిన దేమన:—

"యోగాంగానుష్ఠానా దశుద్ధిక్షయే జ్ఞానదీప్తి రావివేకఖ్యాతేః" ౨౮

యోగాంగానుష్ఠానాత్ =ముందునూత్రమున చెప్పబడు యోగసాధనములను సరిగా సంపాదించినందువలన, అశుద్ధి

క్షయే=అవిద్యారూపమైన అశుద్ధి నశింపగా, ఆ వివేకఖ్యాతేః= వివేకజ్ఞానపర్యంతమైన, జ్ఞానదీప్తిః=సమ్యక్‌జ్ఞానము ప్రకాశించును.

యోగాంగములను సాధించినకొలది యశుద్ధి—అవిద్య—క్షీణించును. అవిద్య తొలగించినకొలది సమ్యక్‌జ్ఞానము వర్ధిల్లును. వివేకఖ్యాతి కలుగునప్పటికి జ్ఞానప్రకాశము వర్ధిల్లును. కాబట్టి సాంగయోగానుష్ఠానమే వివేకఖ్యాతిని కలిగింపగలదని భావము. గొడ్డలి ఖండింపదగిన కాష్ఠమును ఖండించి వేరు చేయునట్లు యోగాంగానుష్ఠానము అశుద్ధిని వేరుచేయును. ధర్మము సుఖమును ప్రాప్తింపజేయునట్లు వివేకఖ్యాతికి యోగాంగానుష్ఠానము ప్రాప్తికారణము.

ఆ యోగాంగములెవ్వి; మఱియు నెన్నియన:—

"యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహార
ధారణాధ్యాన సమాధయోఽష్టావంగాని" ౨౯

యమ.....ధయః = యమములు, నియమములు, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ,ధ్యానము, సమాధి, అను, అష్టౌ=ఎనిమిది, అంగాని=యోగమున కుపాయములు.

వీని లక్షణాదులు ముందుసూత్రములందు వర్ణింపబడును. సమాధిపాదమున చెప్పబడిన అభ్యాసాదులు నీ యుపాయములందే చేరిపోవును. అందు అభ్యాసము సమాధియందును, వైరాగ్యము సంతోషమునందును, శ్రద్ధ, వీర్యము మున్నగు

నవి నియమాంతర్గత తపఃస్వాధ్యాయాములందును, మైత్రి, కరుణాదులు ధారణాదులందును చేరునని గ్రహింపవలెను.

యమములు:—

"అహింసాసత్యమస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహాయమాఃⅠ" 30

అహింసా= మనోవాక్కాయములతో నెల్లప్పుడు నే ప్రాణికి పీడకలిగింపకుండుట, సత్యమ్=చెప్పదలచినపుడు (త్రికరణశుద్ధిగా) చూచినది చూచినట్లు, వినినది వినినట్లు, ఊహించినది ఊహించినట్లు చెప్పుట, ఆలోచించుటయు, అస్తేయమ్= సర్వథా పరద్రవ్యమునపేక్షింపకుండుట, బ్రహ్మచర్యమ్=గుప్తేంద్రియమైన ఉపస్థయొక్క సంయమము, అపరిగ్రహాః = దేహయాత్రకు కావలసినవానికి మించి భోగసాధనములను స్వీకరింపకుండుట, అను నీ యైదును, యమాఃⅠ=యమములు.

అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము నను నీ యైదును మనస్సుతోపాటు ఇంద్రియములను విషయములనుండి యమింప – ఉపరమింప – జేయును కాబట్టి యమము లనబడును.

ఇంపు అహింస ముఖ్యము. మిగిలిన సత్యము మున్నగున వన్నియు నా యహింసాశుద్ధికొఱకే యనుష్ఠింపవలయును. సత్యాదుల ననుష్ఠింపకున్న నహింసావ్రతము మలినమగును. అవదాతము కానేరదు. ఆగమికులు నిట్లేయనిరి.

"స ఖల్వయం బ్రాహ్మణో యథా యథావ్రతాని బహూని సమాదిత్సతే తథాతథా ప్రమాదకృతేభ్యో హింసా

నిదానేభ్యో నివర్తమాన స్తామేవానదాతరూపామ్ అహింసాం కరోతి"

సత్యాదివ్రతముల నాచరించినకొలది మానవుడు ప్రమాదకృత హింసాకారణములనుండి తొలగి యహింసను శుద్ధముచేయునని భావము.

తనకు తెలిసినదానిని ఇతరులకు దెలుపదలచి ప్రయోగించు వాక్యము అస్పష్టముగా నుండరాదు. అనగా నావాక్కువలన గలుగు జ్ఞానము వంచితముగాగానీ, భ్రాంతముగాగానీ యుండరాదు. వాక్కు సర్వభూతోపకారకము కావలయునుకాని భూతోపఘాతముకొఱకు గారాదు. ఇట్లు ప్రయుక్తమయ్యే వాక్కు భూతోపఘాతము – భూతహాని – కొఱకగునేని యది సత్యముకాదు. పాపమేయగును. పుణ్యమువలెతోచును. కాని యది పుణ్యాభాసము. దానివలన కష్టమునసంభవించును. కాబట్టి పరీక్షించి సర్వభూత హితమగు సత్యము పలుకవలయునని వ్యాసమహర్షి.

ఇంచు యోగులచే గ్రహింపదగు విశేషము:—

"జాతిదేశకాల సమయానవచ్ఛిన్నాః
సార్వభౌమా మహావ్రతమ్" ౩౧

పూర్వసూత్రమున జెప్పబడిన యమములు, జాతి... చ్ఛిన్నాః=జాతి, దేశ, కాల, సమయములచే సంకుచితములు కాని పక్షమున, సార్వభౌమాః=పై జెప్పిన జాత్యాదిస్థానములలో నెక్కడను ఖండితములుకానివై, మహావ్రతమ్=మహావ్రత మనబడును.

జాతిసంకుచితము:— కొందఱు మత్స్యజాతి ప్రాణులను హింసింతురు. మరికొందఱు మేక, లేడి మున్నగుజాతికిచెందిన ప్రాణులను హింసించి భక్షింతురు. అట్టివారు "మత్స్యములను తక్క వేనిని హింసింపన'నియు, 'మేకలనో, లేళ్లనో తక్క మరి వేనిని హింసింపన'నియు నని యట్లు వర్తించుట జాత్యవచ్ఛిన్న హింస యనబడును. అట్టిది మహావ్రతము కాజాలదు.

దేశసంకుచితము:—'కురుక్షేత్రమున ప్రాణిహింసచేయను'. 'కాశియందు ప్రాణిహింసచేయను' అని కొన్ని ప్రదేశములలో హింసను వర్జించుట.

కాలసంకుచితము:— 'ఏకాదశినాడు ప్రాణి హింసను చేయను.' 'పూర్ణిమనాడు హింసింపను' అనుట.

సమయసంకుచితము:—సమయమన ప్రతిజ్ఞ లేక సంకేతము. 'ఇతరులకొఱకు హింసింతునుకాని నాకొఱకు హింసింపన'నియో 'ఇతరులు హింసింపుమనిన హింసింతును లేకున్న హింసింపను' అనియో ప్రతిజ్ఞచేసి హింసనుండి విరమించుట.

ఇట్టి యపవాదములు లేక యేప్రాణిని నెన్నడు నెక్కడ నేవిధముగను హింసింపకుండుట మహావ్రతమగును. ఇట్లే సత్యాదులును పాటింపవలయును. యోగి యిట్టి వ్రతములనే యాచరింపవలయు నని భావము.

ఇక నియమములు:—

"శౌచ సంతోషతపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని నియమాః" ౩౨

శౌచ...నాని=శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము నను నైమును, నియమాః = నియమములు. శౌచము = శుద్ధి. అది రెండువిధములు. బాహ్యము—ఆభ్యంతరము. మృత్తిక, జలము మున్నగువానితో శరీరమును, సాత్వికాహారాదుల భక్షణవలన నుదరమును శుద్ధి చేసికొనుట బాహ్యమనబడును. మైత్రి, కరుణ మున్నగువాని ద్వారమున చిత్తమలములయిన రాగద్వేషములను పోగొట్టు కొనుట అభ్యంతర శుచి యనబడును.

సంతోషము:—జీవనయాత్రకు కావలసిన పరికరములకు మించి సాధనసామాగ్రిని సంపాదింప కుండుట. ప్రాప్తించిన సాధనములతో తృప్తిపడవలయును. సంగ్రహేచ్ఛ యుండరాదని భావము.

తపస్సు:— శీతోష్ణములు, మానాపమానములు, ఆకలిదప్పులు, మున్నగు ద్వంద్వములను సహించుట. హితము, మితము నైన భోజనముచేయుట.

స్వాధ్యాయము:—పవిత్రములయిన ప్రణవాదులను జపించుట, మోక్షశాస్త్రములగు వేదోపనిషదాదులను పఠించుట.

ఈశ్వరప్రణిధానము:—పరమగురువైన పరమేశ్వరునందు సర్వకర్మల నర్పించి కర్మఫలమును త్యజించుట.

ఇయ్యవి తప్పక చేయదగినవని నియమింపబడుట—విధింపబడుట—చేత నియమము లనబడుచున్నవి.

"శ్రేయాంసి బహువిఘ్నాని" మంచికెన్నో యాటంకములు అను సామెత ననుసరించి యమనియమాదుల నాచరింపబూనినపుడు హింసాదులచే బాధ యుపస్థిత మైనచో చేయవలసిన దేమన:—

"వితర్కబాధనే ప్రతిపక్షభావనమ్" 33

హింసాదులు వితర్కము లనబడును. యమనియమములను పాటించు యోగికి, వితర్క బాధనే=హింసాదులవలన విఘ్నముపస్థితమైనచో, ప్రతిపక్షభావనమ్ = ప్రతి పక్షమును భావింపవలయును.

యమనియమములను పాటించు యోగికి, 'అపకారిని హింసింతును; అసృతము పలుకుదును; పరుల ధనము నపహరింతును; పరదారల నభిగమింతును. శుద్ధిని విడుతును.' అనునిట్టి తలంపులు కలిగి బాధించుచో వానికి విపరీతమైన ప్రతిపక్ష భావనములు చేయవలయును. 'ఘోరమైన సంసారాగ్నియందు తపించుచు, సర్వభూతముల కభయమిచ్చు యోగధర్మము నాశ్రయించితిని. దుఃఖఫలకములైన హింసామిథ్యాభాషణాదులను త్యజించి, సుఖఫలకములయిన అహింసాది యమనియమముల నాశ్రయించితిని. అట్టినేను, క్రక్కినకూటికాసపడు కుక్కవలె హింసాది వితర్కములను త్యజించి మరల గ్రహించుటచే నీచవృత్తము కలవాడనగుదును. అయ్యది నాకుతగదు' అని యిట్లు భావించుట ప్రతిపక్షభావన మనబడును.

ఆ వితర్కము లెయ్యవి ? వానివిధ మెద్ది ? వానిధర్మ మేమి ? వానికి కారణము లేమి ? వానిఫలము లెయ్యవి ?

ప్రతిపక్షభావన మెట్టిది? యన:—

"వితర్కా హింసాదయః కృతకారితా నుమోదితా
లోభ క్రోధ మోహ పూర్వకా మృదు మధ్యాధి మాత్రా
దుఃఖాజ్ఞానానంతఫలా ఇతి ప్రతిపక్ష భావనమ్" 33

హింసాదయః=ఏ యన్నృతాదులకుముందు హింగవేక్కాన బకునో అట్టి హింసాదులు, వితర్కాః = వితర్కములనబడి, దుఃఖాజ్ఞానానంతఫలాః=అనంతమైన దుఃఖము, అజ్ఞానము, ఫల ముగాగలవి, ఇతి=అని, ప్రతిపక్షభావనమ్=ప్రతిపక్షభావనము చేయనలయును. మఱియు నవి యెట్టివన, కృతకారితానుమో దితాః=స్వయముగా చేసినవి కృతములు, ఇతరుల ప్రేరణచేత చేసినవి కారితములు. మేలుమేలు అని యితరులచే ననుమో దింపబడినవి యనుమోదితములు. మఱియు నెట్టినన, లోభ క్రోధమోహపూర్వకాః=లోభము, క్రోధము, మోహముచే చేయబడునవి. ఇంకను నెట్టివియన, మృదుమధ్యాధిమాత్రాః= లోభాదులలోగల మృదుమధ్యాధిమాత్రభేదములచే నయ్యవి యొక్కటొక్కటి తొమ్మిది విధము లగును. ఇట్లు కృతకారి తాది భేదములచే హింసాదులు మువ్విధములయ్య లోభాది భేదములచే తొమ్మిదివిధములగును. ఆ లోభాదులు మృద్వాది భేదములచే నొక్కటొక్కటి మరల తొమ్మిదివిధములయి మొత్తము ఎనుబదియొక్కవిధములగును. ఇట్లు వితర్కములు అనంతదుఃఖము, ననంతమైన యజ్ఞానమును నుదయింపజేయునని ప్రతిపక్షభావన మొనరింపవలయును.

కృతము, కారితము, అనుమోదితము అని హింస మువ్విధములు. మరల సయ్యది, మాంసచర్మాదులందలి లోభము చేతను, తన కపకారమొనరించెనను క్రోధముచేతను, దీని నిట్లు హింసించినంతన ధర్మము కలుగగలదను మోహముచేతను చేయబడే తొమ్మిదివిధములగును. ఆ లోభ క్రోధ మోహము లలోగల మృదు-మధ్య-అధిమాత్రభేదములచే నిరువదియేడు విధములగును. అందునను తీవ్రతలోగల మృదు-మధ్య-అధిమాత్రభేదములచే మరల మువ్విధములై యెనుబదియొక్క విధములగును. ఇట్లే అసత్యభాషణాదులు నూహింప వలయును.

యమనియమపరుడైన యోగి హింసాది వితర్కములు తన నష్టగించునపుడు 'ఇయ్యవి దుఃఖమును కలిగించునవి కాబట్టి యనిష్టములు'ని విపక్షముగా భావించినచో వానియెడ నతనికి ద్వేషము కలుగును. అందువలన వానినుండి విరతుడగును. విఘ్నములు తొలగును. యమనియమముల నిట్లు నిరాటంకముగా నాచరించి సఫలుడగును. చిత్తము నిర్మలమగును. కైవల్యము సిద్ధింపగలదు. కాబట్టి ఆయా సమయములందు యోగి ప్రయత్నపూర్వకముగ విపక్షభావన మొనరింపవలయునని భావము.

యమనియమములు పాలించు యోగికి అవి సిద్ధించినట్లు తెలిసికొనుటకు చిహ్నము లెయ్యవియన:—

"అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః" ౩౫

అహింసాప్రతిష్ఠాయాం=అహింస సిద్ధించిన, తత్సన్నిధౌ= యోగి సమీపమున, వైరత్యాగః=సదావిరోధులైన, అహినకు లాదుల వైరముండదు.

విరోధ స్వభావముగల జంతువుల్నైతము అహింసను సాధించిన యోగి సమీపమున తమ పారస్పరిక వైరమును విడుచును. ఒండొరులను హింసింపనేరవని భావము.

"సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వమ్" 3౬

సత్యప్రతిష్ఠాయాం=సత్యము సిద్ధించిన, యోగివాక్కు, క్రియాఫలాశ్రయత్వమ్= ధర్మాధర్మములనెడి క్రియకు, సుఖ దుఃఖములనెడి ఫలమునకు నాశ్రయమగును.

సత్యనిష్ఠగల యోగివాక్కు అమోఘమగును. 'ధార్మికుడవగుమ'నిన పాపియు ధార్మికుడగును. 'సుఖపడుము' అనిన దుఃఖితుడును సుఖి యగునని భావము.

"అస్తేయప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థానమ్" 3౭

అస్తేయప్రతిష్ఠాయాం=అస్తేయము సిద్ధించినయోగికి, సర్వరత్నోపస్థానమ్ = సంకల్పమాత్రమున సర్వరత్నములు చేకూరును.

"బ్రహ్మచర్యప్రతిష్ఠాయాం వీర్యలాభః" 3౮

బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం=బ్రహ్మచర్యము సిద్ధించిన యోగికి, వీర్యలాభః=మిక్కిలి సామర్థ్యము కలుగును.

బ్రహ్మచర్యము సిద్ధించిన యోగికి అణిమాద్యష్టగుణములు ప్రాప్తించును. తారము, సుతారము, తారతారము,

రమ్యకము, సదాముదితము, ప్రమోదము, ప్రముదితము, ప్రమోదమానము నను సిద్ధులును గలవాడై యోగి తన శిష్యులకు యోగవిషయక జ్ఞానము కలుగజేయగలడు. మృత్యువును జయింపగలడు.

"బ్రహ్మచర్యేణ తపసా దేవామృత్యుముపాఘ్నత
ఇంద్రోహ బ్రహ్మచర్యేణ దేవేభ్యః స్వరారభత"
అథ. ౧౧. 3. ౫. ౧౯

దేవాః=ఇంద్రియములు, బ్రహ్మచర్యేణతపసా=బ్రహ్మచర్యమనెడి తపస్సుతో, మృత్యుమ్ = విషయగ్రహణశక్తిని నశింపజేయు రోగజాతమును, ఉపాఘ్నత = నశింపజేసినవి. ఇంద్రః=జీవాత్మ, బ్రహ్మచర్యేణ=బ్రహ్మచర్యముతో, దేవేభ్యః= ఇంద్రియముల ద్వారమున, దేహమును, స్వః=సుఖమయము, కరభత=చేసెను.

"అపరిగ్రహస్థైర్యే జన్మకథంతాసంబోధః" ౩౯

అపరిగ్రహస్థైర్యే= అపరిగ్రహమునందు స్థిరతయేర్పడిన యోగికి, జన్మకథంతాసంబోధః= జన్మముయొక్క కింప్రకారత (విధానము) బోధపడును.

అపూర్వములైన దేహేంద్రియాదులతో (జ్ఞానహేతుకమగు) సంబంధము జన్మమనబడును. (కోఽహమాసమ్. కథమ్ అహమాసమ్. కిం స్విదిదమ్. కథం స్విదిదమ్. కేవాభవిష్యామః కథంవా భవిష్యామః) నేనెవడను ? ఎట్లయితిని ? ఇదియేమి ?

ఇదియెట్టిది? ఎవరమగుదుము? ఎట్లగుదుము? అను నిట్టిని కథంత-కథంభావమనబడును.

అపరిగ్రహమున స్థిరుడైనయోగి తన జన్మోదంతమును తెలియగోరిన నతనికంతయు సాక్షాత్కారముకాగలదని భావము.

"శౌచాత్ స్వాంగజుగుప్సా పరైరసంసర్గః" ౪౦

శౌచాత్=బాహ్యశౌచము సిద్ధించినయోగికి, స్వాంగ జుగుప్సా=తన శరీరమునందు ఘృణయేర్పడును. పరైః= ఇత రుల శరీరములతో, అసంసర్గః=అసంబంధము కలుగును.

శరీరోత్పత్తిస్థానాదుల పర్యాలోచనలవల బాహ్య శౌచము సిద్ధించినయోగికి తనశరీరమునందు ఘృణ (ఏవగింపు) కలుగుటయేకాక యితరుల శరీరములతో కలుగు సంబంధము (ఏకాంతవాసాదులవలన) బొత్తిగా గిట్టదు. ఇందువలన దేహా ధ్యాసము తొలగునని భావము.

బాహ్యశౌచముతోపాటు ఆభ్యంతర శౌచసిద్ధినలన కలుగు విశేషము లింక తెలుపుచున్నాడు.

"సత్వశుద్ధి సౌమనస్యైకాగ్ర్యేంద్రియ-
జయాత్మదర్శనయోగ్యత్వాని చ" ౪౧

శౌచసిద్ధివలన యోగికి, "సత్వ...యోగ్యత్వాని= బుద్ధి సత్వము శుద్ధమగును. సౌమనస్యము, ఏకాగ్రత, ఇంద్రియ జయము, ఆత్మదర్శనయోగ్యత యను నివి క్రమముగాకలుగును.

మైత్రి,కరుణ, మున్నగువాని భావనవలన రాగాదులయిన చిత్తమలములుక్షాళితములుకాగా బుద్ధిసత్త్వము నిర్మలమగును.

అటుపై సత్త్వగుణోత్కర్షతవలన సౌమనస్యము-స్వచ్ఛత-యేర్పడును. అందువలన నియతవిషయమున ఏకాగ్రత యేర్పడును. దానివలన బాహ్యేంద్రియములు మనస్సునకధీనములై యుండునవి కాబట్టి యవి కట్టుపడును. అటుపై పురుషఖ్యాతి కలిగి ఆత్మదర్శనయోగ్యత కలుగునని భావము.

"సంతోషా దనుత్తమ సుఖలాభః" ౪౨

సంతోషాత్=సంతుష్టచిత్తుడైన యోగికి, అనుత్తమ సుఖలాభః=మిక్కిలి సుఖప్రాప్తి కలుగును.

"సంతోషం పరమాస్థాయ సుఖార్థీ సంయతోభవేత్
సంతోషమూలంహి సుఖం దుఃఖమూలం విపర్యయః" మభా.౧౭౯.

సుఖార్థి పరమసంతోషముకలవాడై సంయతుడు కావలయును. సుఖము సంతోషమూలకము. దుఃఖము అసంతోషమున కలుగునని మనువు. కాబట్టి తప్పక యోగి సంతోషి కావలయునని యుపదేశము.

"కాయేంద్రియసిద్ధి రశుద్ధిక్షయాత్ తపసః" ౪౩

తపసః=తపస్సు సిద్ధించినయోగికి, అశుద్ధిక్షయాత్=పాపక్షయమువలన, కాయేంద్రియసిద్ధిః= శరీరసంపద, ప్రతిభ మున్నగు నింద్రియసిద్ధి కలుగును.

కాయసిద్ధియన అణిమాదిసిద్ధులనియు, ఇంద్రియసిద్ధియన దూరశ్రవణాదులనియు వ్యాసమహర్షి భాష్యము.

"స్వాధ్యాయా దిష్టదేవతాసంప్రయోగః" ౪౪

స్వాధ్యాయాత్ =స్వాధ్యాయము – ప్రణవజపాదులు– సిద్ధించినయోగికి, ఇష్టదేవతాసంప్రయోగః= అభీష్టములైన దివ్య గుణులగు దేవతల–ఋషుల–సిద్ధుల దర్శనము లభించును.

స్వాధ్యాయశీలుడైన యోగికి సిద్ధులు దర్శనమిత్తురు. అతనికార్యమున సహాయమొనర్తురు.

"సమాధిసిద్ధి రీశ్వరప్రణిధానాత్" ౪౫

ఈశ్వరప్రణిధానాత్ = ఈస్వరప్రణిధానము సిద్ధించిన యోగికి, సమాధిసిద్ధిః= సంప్రజ్ఞాతసమాధి సిద్ధింపగలదు.

ఇట్లు సిద్ధిని తెలుపు చిహ్నములతోబాటు యమనియమములను వర్ణించి తరువాతిది యైన ఆసనమన నేమో చెప్పుచున్నాడు.

"స్థిరసుఖ మాసనమ్" ౪౬

స్థిరసుఖమ్=నిశ్చలమై సుఖముకలిగించునది, ఆసనమ్= ఆసన మనబడును.

(ఆస్యతేఽత్రవా అనేనవా ఇత్యాసనమ్) ఆసనము బాహ్యము, శారీరము నని ద్వివిధము. అందు చైలాజినకుశోత్తర మనునది బాహ్యము. యోగి తన యభ్యాసమునిమిత్త మొకచో కూర్చుండుటకై సమప్రదేశమున దర్భాసన మొండు పరచి దానిపై మృగచర్మమో, లేక యున్నివస్త్రమో వేసి యటుపై నొకగుడ్డ పరచి యాసన మేర్పరచుకొనును. ఇట్టిది బాహ్యాసనము. యోగము నభ్యసించుటకై దానిపై సిద్ధాసనము, పద్మాసనము, భద్రాసనము, వీరాసనము నని చెప్పబడు

కూర్చుండు పద్ధతులు శారీరములు—శరీరమునకు సంబంధించిన ఆసనము లనబడును. అందెట్లు కూర్చుండిన స్థిరతయు, సుఖము నేర్పడునో యదియే యోగమున కుపకరించుఆసనమని గ్రహింప వలయును.

ఈ యాసన మెట్లుసిద్ధించు నన:—

"ప్రయత్నశైథిల్యానంతసమాపత్తిభ్యామ్" ౪౭

ప్రయత్న....భ్యామ్=ప్రయత్న శిథిలత—ప్రయత్నోపరతి—చేష్టాభావమువలనను, అయత్నసిద్ధములైన ఆసనములుగల సర్పాదిప్రాణిజాతమునుజూచి వాని ననుకరించుటచేతను ఆసనము సిద్ధించును.

స్వభావసిద్ధముగా నుండు శారీరికచేష్ట ప్రయత్న మనబడును. అట్టి ప్రయత్నమువలన శరీరమున కదలిక కలుగును. అది లేకున్న శరీరము స్థిరపడగలదు. పశువులు, పక్షులు, సరీసృపాదులు నేర్పుకయే ఆసనసిద్ధికలవై యున్నవి. వానినిచూచి యట్లనుకరించుట చేతను ఆసనము సిద్ధింపగలదని భావము.

ఆసనము సిద్ధించినదని తెలిసికొను కొట్లన:—

"తతో ద్వంద్వానభిఘాతః" ౪౮

తతః=ఆసనము సిద్ధించిన, ద్వంద్వానభిఘాతః=శీతోష్ణాది ద్వంద్వముల వలన బాధకలుగదు.

ఆసనసిద్ధియేర్పడిన యోగికి శీతోష్ణాది ద్వంద్వముల వలన బాధ కలుగనేరదని భావము.

తరువాత ప్రాణాయామము:—

"తస్మిన్‌సతి శ్వాసప్రశ్వాసయో ర్గతివిచ్ఛేదః ప్రాణాయామః" ౪౯

తస్మిన్‌సతి=అసనసిద్ధి కలిగినమీఁదట, శ్వాసప్రశ్వాసయోఃబాహ్యవాయువును లోపలికి తీసికొనుట శ్వాసము, కోష్ఠమునందలి వాయువును బయటికి విడుచుట ప్రశ్వాసము. ఇట్టి శ్వాసప్రశ్వాసముల – ఉచ్ఛ్వాసనిఃశ్వాసముల– రెంటికి, గతివిచ్ఛేదః = స్వాభావికగతి నిరోధము, ప్రాణాయామః = ప్రాణాయామ మనబడును.

రేచకము, పూరకము, కుంభకము, కేవలకుంభకము అని ప్రాణాయామము నాలుగు విధములు. కుంభకమునందు, కేవల కుంభకమునందు శ్వాసప్రశ్వాసము లుండవు కాబట్టి చెప్పే నిజమైన ప్రాణాయామము లనవచ్చును. కాని, రేచకప్రాణాయామమున శ్వాసముండదు; ప్రశ్వాసముండును. పూరకప్రాణాయామమున ప్రశ్వాసముండదు; శ్వాసము మాత్ర ముండును. కాబట్టి రెంటియున్నను రెండుండవుగనుక రెంటికి విధమగు గతివిచ్ఛేదముండుటచేత నవియు ప్రాణాయామము లనదగును.

శ్వాసప్రశ్వాసముల గతివిచ్ఛేదము ప్రాణాయామమునకు లక్షణము. ప్రాణాయామము లక్ష్యము.

ఇట్లు సామాన్యముగ లక్షణము చెప్పి విశేషలక్షణమునిట వర్ణించుచున్నాడు.

"బాహ్యాభ్యంతరస్తంభవృత్తి ర్దేశకాలసంఖ్యాభిఃపరిదృష్టో దీర్ఘసూక్ష్మః" ౫౦

ఆ ప్రాణాయామము, బాహ్యాభ్యంతర స్తంభవృత్తిః= బాహ్యవృత్తికలది, అభ్యంతరవృత్తి కలది, స్తంభవృత్తి కలది

యని మువ్విధములు. ఈ మువ్విధములైన ప్రాణాయామమును, దేశకాలసంఖ్యాభిః=దేశ కాల సంఖ్యలతో, పరిదృష్టః=చక్కగా తెలియబడినవై, దీర్ఘసూక్ష్మః=దీర్ఘము, సూక్ష్మము నగును.

(౧) లోపలి వాయువును బయటికితీసి యట స్తంభింప జేయుట బాహ్యవృత్తి ప్రాణాయామమగును. ప్రశ్వాసపూర్వక గత్యభావముగల ప్రాణాయామ మని భావము. ఇదియే రేచక ప్రాణాయామము.

(౨) శ్వాసపూర్వక గత్యభావాత్మక ప్రాణాయామము. ఇందు బాహ్యవాయువు లోపలికి తీసికొని యట స్తంభింప జేయబడును. ఆభ్యంతర వృత్తి లేక పూరక ప్రాణాయామ మన బడును.

(3) స్తంభవృత్తిప్రాణాయామము. ఇందు శ్వాసప్రశ్వాసములు రెండు నుండవు. ఎక్కడివాయువు నక్కడనే నిలుచునట్లుచేసి, లోపలివాయువు వెలుపలికికానీ, వెలుపలివాయువు లోపలికికానీ పోకుండ చేయవలయును. బాగుగా కాలిన రాతి మీద వేయబడిన నీటిబిందువు క్రమముగా నయ్యది యన్ని వైపులనుండి సంకుచించుచు చివరకు లేకుండపోవును. అట్లే శ్వాసప్రశ్వాసముల గతి నొక్కమాటు నడ్డగించుటచే ప్రాణ గతి సంకుచించి నిరుద్ధమగును. ఇదియే స్తంభవృత్తి-కుంభక ప్రాణాయామ మనబడును. కుంభములోని జలము కదలకుండ నట్లుండును కాబట్టి కుంభకమని యనబడును.

ఇట్టి ప్రాణాయామము దేశ కాల సంఖ్యలతో కూడి, దీనికింత ప్రదేశము విషయము, దీనికిన్ని క్షణముల స్థిరత

యనియు, ఇన్ని శ్వాసప్రశ్వాసములతో ప్రథమ ఉద్ఘాతము, ఇన్ని శ్వాసప్రశ్వాసములతో ద్వితీయ ఉద్ఘాతము, ఇన్నిటితో తృతీయ ఉద్ఘాతము ననియు, ఇది మృదువు, ఇదిమధ్యము, ఇది తీవ్రము ననియు తెలియనగును.

దేశపరిమితి:–సాధకుడు చేసించునప్పుడు, నాసికాగ్రమునకు ఎదురుగానుండులొడితెడో లేక జేనెడో లేక మూరెడో పరిమితి దూరముగల బాహ్యప్రదేశము రేచకమునకు విషయమగును. నాసిక కెదురుగానుంచబడిన చిన్న దూదిపింజ కదలికలను బట్టి పరిమితి తెలిసికొనవచ్చును. ఇట్లే పూరకమునకు కుంభకమున నాపాదతల మస్తకపర్యంతము లోపలి ప్రదేశము విషయము. వాయుపూరణ సమయమున లోపల చీమలు ప్రాకునట్లు స్పర్శ కలుగుటచే నాభ్యంతరదేశపరిమితి తెలియనగును. కుంభక ప్రాణాయామమునకు లోపలి వెలుపలి ప్రదేశమంతయు విషయ మగును. ఇందు పిపీలికాస్పర్శకాని, తూలికాచలనముకాని తెలియబడకుండుటయేగుర్తు.

కాలపరిమితి:–మోకాటిచిప్పను చేతితో ముమ్మాట్లు బాగుగాస్పృశించి యొకచిటికెవేయుట కెంతకాలము పట్టునో యంతకాలమొక మాత్రయనబడును. అట్టి పండ్రెండు మాత్రల కాలము కుంభకమునకు స్థిరత యేర్పడిన ఉద్ఘాతమనబడును. అది ప్రథమఉద్ఘాతము–మృదువు. ఇరువదినాలుగు మాత్రల కాలము స్థిరతకలిగిన ద్వితీయ ఉద్ఘాతము–మధ్యము. ముప్పది యారుమాత్రలకాలము స్థిరమయిన తృతీయఉద్ఘాతము – తీవ్రము అనబడును.

నాలుగవ ప్రాణాయామ లక్షణము:—

"బాహ్యాభ్యంతర విషయాక్షేపీ చతుర్థః" ౫౧

ఈ సూత్రమునందలి విషయశబ్దము దేశమును తెలుపును. దానింబట్టి కాలము సంఖ్యయు నింమ గ్రహింపబడును. బాహ్యాభ్యన్తర విషయాక్షేపీ = రేచకపూరకముల నపేక్షింపని శ్వాసప్రశ్వాసముల గత్యభావమనెడి కేవల కుంభక ప్రాణాయామము, చతుర్థః=నాలుగవది.

పూర్వసూత్రమున చెప్పబడిన కుంభక ప్రాణాయామము నకును, ఈ కేవలకుంభక ప్రాణాయామమునకును స్వల్పభేద మున్నది. కుంభకము శ్వాసప్రశ్వాసముల నపేక్షించును. కేవల కుంభకము శ్వాసప్రశ్వాసముల నపేక్షింపదు. దేశకాలసంఖ్యా పరిదృష్టత్వముమాత్ర ముభయత్రసమానమే. నిద్ర, ఆలస్యము మున్నగు వృత్తులచే బాధింపబడు సాధకులు శ్వాసప్రశ్వాస ముల నపేక్షించు కుంభకము నభ్యసించుట శ్రేయస్కరము. అట్టిబాధలులేనివారు కేవలకుంభకము నభ్యసించిన చాలును. ప్రాణాయామము సిద్ధించినదని తెలిసికొను మెట్లన:—

"తతః క్షీయతే ప్రకాశావరణమ్" ౫౨

తతః=ప్రాణాయామము సిద్ధించిన, ప్రకాశావరణమ్ = బుద్ధిసత్వప్రకాశమునకు ఆవరణమైన క్లేశము, క్లేశజన్య మాపాపి న్యము-పాపము, క్షీయతే=దుర్బలమై తొలగిపోవును.

ప్రాణాయామము సిద్ధించినకొలది యోగికి సత్వప్రకాశ మెక్కుడగును. అవిద్యాదిక్లేశములు, వానివలనకలుగు తామస వృత్తులు నశించును. అతనికి కలుగు స్వప్నాదివృత్తులును

సత్త్వప్రకాశమయమునై యుండును. ఈ స్థితియే ప్రాణాయామ సిద్ధికి చిహ్నమని భావము.

"ధారణాసుచ యోగ్యతా మనసః" ౫౩

మఱియు, ప్రాణాయామము సిద్ధించుటవలన, ధారణాసు= ముందు చెప్పబడు ధారణలందు చిత్తము నిలకడలందు, మనసః= చిత్తసత్త్వమునకు, యోగ్యతా=సామర్థ్యము కలుగును.

ప్రాణాయామము ద్వారమున ఆవరణము క్షీణింప బుద్ధి సత్త్వము నెటనిలిపిన నట నిలుచును. విక్షేపము కలుగదని భావము.

ప్రాణాయామము తరువాత ప్రత్యాహారలక్షణము:—

"స్వవిషయా సంప్రయోగే చిత్తస్వరూపానుకార
ఇవేంద్రియాణాం ప్రత్యాహారః" ౫౪

స్వవిషయాసంప్రయోగే = శబ్దాదులైన స్వవియము లతో సంయోగము లేనందున కలిగిన, ఇంద్రియాణామ్– చక్షురాదీంద్రియములయొక్క, చిత్తస్వరూపానుకార ఇవ = చిత్తస్వరూపము ననుకరించినట్లుండు ఉనికి, ప్రత్యాహారః= ప్రత్యాహార మనబడును.

యమనియమాసల ద్వారమున సంస్కరింపబడి చిత్త సత్త్వము విషయదోషములను గుర్తించి విరక్తమగును. మోహము, రాగము, ద్వేషము కలిగించు శబ్దాదివిషయము లతో సంబద్ధముకాదు. నిరుద్ధమై తత్త్వాభిముఖమగును. ఇందు వలనచిత్తమునకు లోబడియుండు నింద్రియములును శబ్దాదులైన స్వస్వవిషయములతో సంబద్ధములుకాక స్వయముగానే నిరు

ద్ధములగును. ఇట్లు చిత్తమువలెనే ఇంద్రియములును విషయములతో సంప్రయుక్తములు కాకుండుటయే ప్రత్యాహార మనబడునని భావము.

ప్రత్యాహారము వలన కలుగు ప్రయోజన మేమన:—

"తతః పరమావశ్యతేంద్రియాణామ్" ౫౫

తతః=ప్రత్యాహారము సిద్ధించినందువలన, ఇంద్రియాణామ్=ఇంద్రియములయొక్క, పరమా = ఉత్కృష్టమైన — మిక్కిలి, వశ్యతా=వశీకరణము కలుగును.

ప్రత్యాహారము సిద్ధించినచో నింద్రియములు బాగుగ జయింపబడునని భావము. ఇంద్రియ జయ విషయమున ననేక భిన్నాభిప్రాయములు కలవు. కొందరు విషయములయిన శబ్దాదులందు అసక్తి—వ్యసనరాహిత్యము—ఇంద్రియజయమందురు. వేదవిరుద్ధముకాని విషయములను సేవించుచు విరుద్ధములైన విషయములందు ప్రవర్తింప కుండుట ఇంద్రియజయమని మరి కొందఱు. శబ్దాది విషయములందు ఇంద్రియములను విషయాధీనులై కాక స్వేచ్ఛగా ప్రవర్తింపజేయుట ఇంద్రియ జయమని వేరొకకొందఱు. రాగద్వేషములు లేక సుఖదుఃఖశూన్యమైన శబ్దాదులజ్ఞానము ఇంద్రియజయమని ఇతరులు. చిత్తైకాగ్రతవలన చిత్తమింద్రియములతోబాటు విషయములందు ప్రవర్తింపకుండుటయే ఇంద్రియజయమని జైగీషవ్యమహర్షి. చిత్తనిరోధమున నింద్రియములు నిరుద్ధము లగుటయే ఇంద్రియముల పరమ వశీకారత. జైగీషవ్యమహర్షి చెప్పిన ఇంద్రియ జయమునకే యోగులు యత్నింతురు.

సాధనపాదము.

ఓమ్

యోగదర్శనము

విభూతి పాదము

ప్రథమ ద్వితీయ పాదములలో సమాధి, దాని సాధనములు వర్ణింపబడినవి. ఇంపు—తృతీయపాదమున—యోగసాధన విషయమున మందబుద్ధులకు శ్రద్ధ కలిగించుటకు గాను విభూతులు చెప్పవలసి యున్నవి. ఆ విభూతులు సంయమము వలన గాని సంపాదింప వలనుపడదు. ధారణ, ధ్యానము, సమాధి అను నీ మూటి సముదాయమే సంయమము. ఇంతకుపూర్వము వర్ణించిన యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహారములను నైదు యోగాంగములు బహిరంగ సాధనములు. ధారణాది సాధనత్రయము అంతరంగ సాధనములు. ఇందు ధారణ యననేమో వర్ణించుచున్నాడు.

"దేశబంధశ్చిత్తస్య ధారణా" ౧

చిత్తస్య=బాహ్యవిషయములను విడిచి తత్త్వమున కభిముఖమైన చిత్తము యొక్క, దేశబంధః = నాభిచక్రాది స్థానమునందు వృత్తిరూపమున నేర్పడుసంబంధము, ధారణా= ధారణ యనబడును.

యమాదుల ననుష్ఠించుటచే నిర్మలమై చిత్తసత్త్వము విషయవిముఖమై తత్త్వాభిముఖ మగును. అట్టి చిత్తము జీవే

శ్వాసులకు స్థానభూతములైన హృదయ పుండరీకము, మూర్ధ జ్యోతిస్సున్నగువానియందు కానీ, దివ్యములైన ప్రాకృతిక పదార్థములందు (చంద్రసూర్యాదులందు) కానీ నిలుపబడి వాని యాకారములను పొందును. ఇట్లొకచో చిత్తము నిలుపబడుట ధారణ యనబడునని భావము.

ధ్యానలక్షణము:—

"తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్" ౨

తత్ర=చిత్తస్థితికి విషయమైన ధ్యేయవస్తువునందు, కలుగు, ప్రత్యయైకతానతా = జ్ఞానప్రవాహము, ధ్యానమ్ = ధ్యాన మనబడును.

ధ్యేయవస్తువునం దెటుచిత్తసత్త్వము నిలుపబడినదో యట బుద్ధియందు ఆధ్యేయవస్తువునకు సంబంధించిన ప్రత్యయము—జ్ఞానము—తక్క యితరవృత్తి—ప్రత్యయము—కలుగక యున్నచో నట్టిచిత్తస్థితి ధ్యాన మనబడును.

సమాధిలక్షణము:—

"తదేవార్థమాత్రనిర్భాసం స్వరూపశూన్యమివ సమాధిః" 3

తదేవ=ఆధ్యానమే, అర్థమాత్ర నిర్భాసం = కేవలము ధ్యేయవస్తురూపమున భాసించుచు, స్వరూపశూన్యమివ = ధ్యేయరూపము మాత్రము వ్యక్తమగుటచేత జ్ఞానరూపము—ప్రత్యయరూపము—లేనట్లుండుట, సమాధిః = సమాధి యనబడును.

పుష్పస్వభావావేశమున స్ఫటికమణి తన స్వరూపమును విడిచి పుష్పరూపమును పొందునట్లు, ధ్యాన మభ్యసించినకొలది ప్రత్యయాత్మకమైన స్వస్వరూపమును విడిచి కేవల ధ్యేయాకారమున భాసించును. ధ్యేయవస్తు జ్ఞాన మటునుండక ధ్యేయము మాత్రము భాసించునని భావము. ఇయ్యదియే సమాధి యనబడును. చిత్తైకాగ్రత కలిగిన మీదట ధ్యాత, ధ్యానము, ధ్యేయము వేరువేరుగా తెలియబడుచున్నపుడు — యోగి తా నొకవస్తువును తెలిసికొనుచున్నాడని గుర్తించునపుడు—ఉండుస్థితి ధ్యానమనబడును. అట్టిధ్యానము కేవలము ధ్యేయావభాసముగా మారిన సమాధి యనబడునని వివేకము.

ముందు శాస్త్రమున సులభముగా ప్రయోగింప వీలగునట్లు ధారణాధ్యానసమాధులకు మూటికి నొకసంజ్ఞ యేర్పరుచుచున్నాడు.

"త్రయమేకత్ర సంయమః" ౪

ఏకత్ర=ఒకవస్తువు విషయముగాగల, త్రయమ్ = ధారణాదిత్రయము, సంయమః=సంయమ మనబడును.

సమానవిషయముగల ధారణాధ్యాన సమాధులు సంయమ మనబడును. ఇయ్యది శాస్త్రీయ పరిభాష.

ఇట్టి సంయమసిద్ధివలన కలుగునదేమన:—

"తజ్జయాత్ ప్రజ్ఞాలోకః" ౫

తజ్జయాత్ = సంయమస్థిరతవలన, ప్రజ్ఞాలోకః= సమాధి ప్రజ్ఞ నిర్మలమగును.

సంయమస్థిరత సంపాదించినకొలది సమాధిప్రజ్ఞ విశద మగుచుండు నని భావము.

ఇట్టి ఫలమును వినియోగించు స్థాన మెయ్యదియన:—

"తస్య భూమిషు వినియోగ:" ౬

తస్య=పూర్వము నిర్దేశింపబడిన ఫలముగలసంయమము, భూమిషు=సంప్రజ్ఞాత యోగభూములందు, వినియోగ:= విజిత భూమిని విడిచి యవిజితభూమియందు వినియోగింపబడవల యును.

ముందుగా స్థూలవిషయమునకు సంబంధించిన, సమాధి పాదమున చెప్పబడిన సవితర్క సంప్రజ్ఞాత సమాధియందు సంయమము వినియోగింపవలయును. అక్కడ విజయము లభించిన తదుపరి నిర్వితర్క సమాధియందు వినియోగింపవలయును. అట విజయముకలిగిన, సూక్ష్మవిషయక సవితర్క సమాధియందును, అటుపై సూక్ష్మవిషయక నిర్వితర్క సమాధియందును క్రమముగా సంయమమును వినియోగింపవలయును. ఇట్లు వినియోగింపగా నందు కుశలత యేర్పడును. ప్రజ్ఞాలోకము సంపాదింపబడును.

యమనియమాది యోగాంగములలో ధారణాధ్యాన సమాధులకే యోగభూములందువినియోగమేలచెప్పబడినదన:—

"త్రయమంతరంగం పూర్వేభ్య:" ౭

పూర్వేభ్య:= యమనియమాది పంచయోగాంగముల కంటె, త్రయమ్=ధారణాది త్రయము, అంతరంగమ్=యోగ

మున కంతరంగసాధనము; కాబట్టి వీని వినియోగము చెప్ప బడినది. యమాదు లైదు చిత్తమాలిన్యమును దూరమొనర్చి చిత్తైకాగ్రతకు సాధనములై యోగాంగము లైనను నయ్యవి భిన్న భిన్న విషయకములు. అందువలన నవి బహిరంగ సాధనము లనియు, ధారణాదులు మూఁటను ఏక విషయకములై యోగాంగము లనబడుటచే నంతరంగము లనియు చెప్పబడు నని భావము.

అసంప్రజ్ఞాత సమాధి యందు విషయమే యుండదు. సమాన విషయత్వ మట నుండదు కాబట్టి ధారణాదుల కట అంతరంగత్వ మెట్లు పొసగు నన:—

"తదపి బహిరంగం నిర్బీజస్య" ౮

తదపి=ధారణాది సాధనత్రయమును, నిర్బీజస్య=అసంప్రజ్ఞాత యోగమనెడి నిర్బీజసమాధికి, బహిరంగం=బహిరంగ సాధనమే.

ధారణాది సాధనత్రయము సంప్రజ్ఞాత సమాధికే అంతరంగ సాధనము. అసంప్రజ్ఞాత సమాధికి కాదని భావము.

('పరిణామత్రయ సంయమాత్' 3.౧౬) సూత్రమున చెప్పబోవు విషయమున నుపయోగించు పరిణామత్రయ మన నేమో చెప్పదలచి యిట నిర్బీజ సమాధి ప్రసంగవశమున నట్టి సమాధికాలమున నేర్పడు చిత్తనిరోధ పరిణామమును చెప్పుచున్నాడు.

"వ్యుత్థాన నిరోధ సంస్కారయో రభిభవప్రాదుర్భావౌ
నిరోధక్షణచిత్తాన్వయో నిరోధ పరిణామః" ౯

వ్యుత్థాన నిరోధసంస్కారయోః = సంప్రజ్ఞాతము పర వైరాగ్యము ననువాని సంస్కారములయొక్క, అభిభవ ప్రాదుర్భావౌ=క్షయ, అభ్యుదయము లనువానియందు, నిరోధక్షణ చిత్తాన్వయః = ఏ క్షణమున నిరోధముండునో ఆ క్షణము నిరోధక్షణము, అప్పుడుండు చిత్తము నిరోధక్షణచిత్తము, ఆశ్రయరూపమున నిట్టి చిత్తముయొక్క సంబంధము, నిరోధ పరిణామః=నిరోధకాలమునకు సంబంధించిన దగుటచే నిరోధ మను నామముగల ధర్మపరిణామ మనబడును.

ఈసూత్రమున గల వ్యుత్థాన శబ్దమునకు సంప్రజ్ఞాత మని యర్థము గ్రాయబడెనది. అసంప్రజ్ఞాతముకంటె సంప్రజ్ఞాతము వ్యుత్థానమగుటయే యింపులకుకారణము. ఇట్లే నిరోధ మన పరవైరాగ్యమని యర్థము. పరవైరాగ్యముచేతనే సంప్రజ్ఞాతము నిరోధింపబడును కాబట్టి నిరోధమనబడినదనిభావము.

అసంప్రజ్ఞాత సమాధి యుదయించు కాలమున ప్రతిక్షణము వ్యుత్థానసంస్కారము క్షయించును. నిరోధసంస్కారము ప్రతిక్షణ మభ్యుదయ మగును. ఇట్టిసమయమున నిరోధక్షణ వృత్తి చిత్తము— నిరోధచిత్తము – నిరోధాఖ్య ధర్మ పరిణామ మున కాశ్రయమై నిరోధపరిణామ మనబడును. ప్రతినిరోధ క్షణమునందు నొక స్థిర చిత్తమున ధర్మముగా నన్వయింపబడు వ్యుత్థానసంస్కారముల క్షయము, నిరోధసంస్కారముల యుదయమును నిరోధపరిణామ మనబడునని భావము.

చిచ్ఛక్తి (ఆత్మ)తక్క మిగిలిన భావపదార్థములన్నియు క్షణపరిణామములు – ప్రతిక్షణము మార్పు నొందునవి అని

యంగీకరించుట వలన ప్రతిధర్మి (భావపదార్థము) యొక్క పరిణామము, ధర్మము, లక్షణము, అవస్థ యని మువ్విధములు చెప్పబడును. (౧) అవస్థితమైయున్న ధర్మియందు పూర్వధర్మము తొలగించి ధర్మాంతర ముదయించుట ధర్మపరిణామము. (౨)ఉదయించిన ధర్మమునకు అనాగతము (భవిష్యత్కాలికము) అనెడి లక్షణముపోయి వర్తమానమనెడి లక్షణము కలుగుట లక్షణపరిణామ మనబడును. (3) ఇట్లు వర్తమాన లక్షణము గల ధర్మములకును ప్రతిక్షణము అవస్థాతారతమ్య మేర్పడుట అవస్థాపరిణామ మనబడును.

నిరోధసంస్కారపాటవమువలన వ్యుత్థాన సంస్కారము లన్నియు తొలగింపగా చిత్తస్థితి యెట్లుండు ననగా: —

"తస్య ప్రశాంతవాహితా సంస్కారాత్" ౧౦

సంస్కారాత్=అభ్యాసవశమునబలపడిన నిరోధసంస్కారమువలన; తస్య=వ్యుత్థాన సంస్కారములనెడి మలము బొత్తుగా నశించిన మీదట నేర్పడు నిరుద్ధచిత్తసత్వము, ప్రశాంతవాహితా=సంపూర్ణముగా వ్యుత్థానసంస్కారములు తొలగినందున నిరుద్ధసంస్కారరూపమున నిర్మలమై శాంతముగనుండును.

వృత్తులను నిరోధించుటచే నేర్పడిననిరోధసంస్కారము అభ్యాసవశమున బలపడి సర్వథా వ్యుత్థాన సంస్కారములను నశింపజేయును. అంటచే చిత్తము నిర్మలమై కేవలము నిరోధమనెడి సంస్కారరూపమున మిగిలి శాంతముగ నుండునని భావము. ఇందు వర్తమానలక్షణముగల నిరోధసంస్కారములు

యభిసృష్టని తెలిపి అవస్థాపరిణామము బోధింపబడినదని గ్రహింపవలెను.

సంప్రజ్ఞాతావస్థయందు చిత్తమునట్టి పరిణామముకలుగునన:—

"సర్వార్థతైకాగ్రతయోः క్షయోదయౌ
చిత్తస్య సమాధిపరిణామः" ౧౧

సర్వార్థతైకాగ్రతయోः=విక్షేపము, ఏకాగ్రత, అనువాని క్షయోదయౌ=క్షయము, ఉదయమును, చిత్తస్య=సమాధిచిత్తముయొక్క, సమాధిపరిణామः=సమాధిపరిణామమనబడును.

విక్షేపనాశము ఏకాగ్రతయుదయము ననునీయుభయధర్మములతోను సమాధిక్షణచిత్తము ధర్మిగా నన్వయించును. ఈసూత్రమునందలి సర్వార్థతకు నానార్థములను తెలిసికొనుటయని యర్థము. కాబట్టి విక్షేపమని వ్రాయబడినది.

సమాధికాలమున ప్రతిక్షణమునందును స్థిరచిత్తమున ధర్మముగా నన్వయింపబడు సర్వార్థత (విక్షేపము) యొక్క క్షయము, ఏకాగ్రతయొక్క యుదయము ననునీయుభయమును ధర్మియైన చిత్తముయొక్క సమాధిపరిణామ మని భావము.

అభ్యాసబలమున విక్షేపము నశించి సమాహితమైన చిత్తమునందు మరల నెట్టిపరిణామముకలుగునన:—

"శాంతోదితౌ తుల్యప్రత్యయౌ చిత్తస్యైకాగ్రతా పరిణామः" ౧౨

చిత్తస్య=సమాహిత చిత్తముయొక్క, శాంతోదితౌ=అతీతము, వర్తమానము ననును, తుల్యప్రత్యయౌ=సమాన విష

యకములగుటచే సమానములైన రెండు ప్రత్యయములు (ఈ రెండు ప్రత్యయములకును, ఏకాగ్రక్షణికచిత్తము ధర్మిగా ననన్వితమైయుండును.) ఏకాగ్రతాపరిణామః=ఏకాగ్రతా పరిణామ మనబడును.

ఏకాగ్రత యేర్పడిన కాలమున స్థిరమైన చిత్తమునందు ఒకేవిషయమునకు సంబంధించిన ప్రత్యయములు ఒకదాని తదుపరి మరియొకటియుదయించి యస్తమించుచుండును. ఏకాగ్రతారూప సమాధి భగ్నమగువరకు సమానప్రత్యయప్రవాహమిట్లు నడచుచుండును. నశించిన ప్రత్యయము శాంత మనబడును. తదుపరి యుదయించు ప్రత్యయము ఉదితమనబడును. శాంతోదితములు ఒకేవిషయమునకు చెందిన వగుటచే తుల్య ప్రత్యయము లనబడును. ఇట్టి తుల్యప్రత్యయము లాస్థిరచిత్తమున ధర్మముగా ననన్వయించును. అందుచే నియ్యవస్థ ఏకాగ్రతాపరిణామ మనబడునని భావము.

ధర్మియైన చిత్తసత్వమునొక్క పరిణామత్రయము చెప్పి యట్టిపరిణామములు చిత్తమువలెనే త్రిగుణాత్మకములైనందున పంచభూతములందును, చక్షురాదీంద్రియములందును కలవని చెప్పుచున్నాడు.

"ఏతేన భూతేంద్రియేషు
ధర్మలక్షణావస్థా పరిణామా వ్యాఖ్యాతాః" ౧౩

ఏతేన=పూర్వముచెప్పబడిన చిత్తసత్వమునొక్క పరిణామత్రయ వ్యాఖ్యానము ద్వారమున, భూతేంద్రియేషు= పృథివ్యాది పంచమహాభూతములందు, చక్షురాది సర్వేంద్రి

యములందును, ధర్మలక్షణావస్థాపరిణామాఃధర్మపరిణామము, లక్షణపరిణామము, అవస్థాపరిణామము నని మువ్విధములగు పరిణామములు, వ్యాఖ్యాతాఃవ్యాఖ్యానముచేయబడిన శ్లోక వలయును.

పృథ్వ్యాది పంచమహాభూతములు ధర్మిరూపమున స్థితమైయుండ వానివలన నేర్పడు గోమనుష్యాది శరీరరూపములు, ఘటపటాది వస్తురూపములు నెన్నో యేర్పడుటయు నశించుటయు కలుగుచున్నది. ఇట్లు భూతము లవస్థితములై యుండగా పూర్వరూపము నశించి క్రొత్తరూప మేర్పడుట ధర్మపరిణామ మనబడును. ఇట్టి ధర్మములకు అతీత వర్తమాన అనాగతములనెడి లక్షణములు ప్రాప్తించుట లక్షణపరిణామ మనబడును. వర్తమానాది లక్షణములుగల ఘటపటాది ధర్మములందు నవీనత—పురాణతలు, గోమనుష్యాది ప్రాణుల శరీర రూపధర్మములందు బాల్యయౌవనాదులు కలుగుట అవస్థాపరిణామ మనబడును. ఇట్లే చక్షురాదీంద్రియముల విషయమునను ఊహించనగును.

ఇట్టి పరిణామత్రయము దేనికి కలుగుచున్నదో యట్టి ధర్మియొక్క లక్షణమేమన:—

"శాంతోదితా వ్యపదేశ్యధర్మానుపాతీ ధర్మీ" ౧౪

శాంతో...పాతీ=శాంతములు, ఉదితములు, అవ్యపదేశ్యములు నయిన ధర్మములం దన్వయించునది, ధర్మీ = ధర్మియనబడును.

తమతమవ్యాపారములనొసర్చి యుపరమించునవి కాంత ములు—అతీతములు. ఉదయించి స్వవ్యాపారము నొసర్చి నుద్యమించునవి వర్తమానములు — ఉదితములు. శక్తిరూప ముననుండి భేదించి వర్ణింప వీలుకానివి అవ్యపదేశ్యములు — (భవిష్యత్తులు). ఇట్టి యతీతవర్తమాన భవిష్యద్ధర్మములలో వానితో నన్వయించు స్వభావముగల వస్తువు (సామాన్య విశేషాత్మకమైన) ధర్మి యనబడును. మృత్తిక, సువర్ణము మున్నగునవి యుదాహరణములు.

త్రివిధ పరిణామములలో ప్రత్యేకమొక్కటియే చేక నానావిధభేదములుకలవై భిన్నములా? భిన్నములేయైన చేత హేతువేమి? యన:—

"క్రమాన్యత్వం పరిణామాన్యత్వే హేతుః" ౧౫

పరిణామాన్యత్వే= ధర్మాదిపరిణామములు ప్రతిదియు భిన్నములగుటలో, క్రమాన్యత్వం=కనబడు పరిణామమునుల పౌర్వాపర్యమనెడి క్రమభేదము. హేతుః=కారణము.

ధర్మలక్షణాది పరిణామములలో ప్రతిదియు ననేకభేద ములు కలిగియున్నది. అందుకు కారణము వాని పరిణామము నందలి పౌర్వాపర్యక్రమభేదమే యని భావము.

అంటే, మృత్తికవలన మృత్పిండము, దానివలన కపాలములు, కపాలములవలన ఘటమునేర్పడును. మృత్తిక (దువ్వ మన్ను)– పిండములు, పిండకపాలములు, కపాలఘటములు అను వీనిలో నొకటి పూర్వము; మరియొకటిపరము. ఇట్టి

పూర్వాపరక్రమము మృత్పిండాదులకంటె భిన్నము. ఇయ్యది పిండాదులైన ధర్మపరిణామములలోని భేదమునకు కారణము.

అనాగతమనెడి లక్షణముగల ధర్మమునకు వర్తమాన మనెడి లక్షణము లభించుటయు, వర్తమానలక్షణముగల ధర్మమునకు అతీతలక్షణప్రాప్తి కలుగుటయు సంభవము. ఇట్లు అనాగతవర్తమానలక్షణ పరిణామములు పూర్వాపరములయి వానిక్రమము వానిలోగల భేదమునకు కారణమగును. ఇట్లే అవస్థాపరిణామములలో గల క్రమము వానిభేదమునకు కారణ మని తెలియనగును.

ధర్మపరిణామము, లక్షణపరిణామమును ప్రతిక్షణము కలుగక అప్పుడప్పుడు కలుగుచుండును. అవస్థాపరిణామము మాత్రము నియమముగా ప్రతిక్షణమును కలుగుచుండును.

ఇంతవరకు పరిణామత్రయము వివరముగా దేని నిమిత్తము వర్ణింపబడినదో యది యిటచెప్పుచున్నాడు.

"పరిణామత్రయ సంయమాత్ అతీతానాగతజ్ఞానమ్" ౧౬

పరి...మాత్=పూర్వము వర్ణించిన పరిణామత్రయమునందు సంయమమొనర్చిన నయ్యది ప్రత్యక్షమై, యోగికి, అతీతానాగతజ్ఞానమ్=భూతభవిష్యత్కాలిక సర్వవస్తుసాధారణమైన ధర్మలక్షణావస్థాపరిణామత్రయవిషయమునకు సంబంధించిన సాక్షాత్కారము కలుగును.

"శబ్దార్థప్రత్యయానా మితరేతరాధ్యాసాత్ సంకరస్తత్
ప్రవిభాగసంయమాత్ సర్వభూతరుతజ్ఞానమ్" ౧౭

శబ్దార్థప్రత్యయానామ్=వాచకము, వాచ్యము, వాని జ్ఞానము ననునివి వా స్తవమున విభ క్తములు. అట్టి వీనియొక్క; ఇతరేతరాధ్యాసాత్ =పరస్పరవిభాగము గ్రహింపబడకుండుట వలన, సంకరః= శబ్దార్థప్రత్యయముల యభేదజ్ఞానము కలుగు చున్నది. తత్ప్రవిభాగసంయమాత్ =ఆశబ్దార్థముల భేదము నందు సంయమమునుచేయుటవలన, భేదసాక్షాత్కారము కలిగి యోగికి, సర్వభూతరుతజ్ఞానమ్=పశు – మృగ– నరసృష్టిని సర్వ ప్రాణుల ధ్వనులజ్ఞానము కలుగును. అవి తమతమ ధ్వనులచే నేయర్థమును తెలుపుచున్నదియు తెలియునని భావము.

"సంస్కార సాక్షాత్కరణాత్ పూర్వజాతి జ్ఞానమ్" ౧౮

సంస్కారసాక్షాత్కరణాత్ =పరస్పరానుబంధముకలిగి, పూర్వపూర్వజన్మములం దుత్పన్నములైన సంస్కారములందు సంయమమొనర్చుటచే వాని సాక్షాత్కారముకలిగినందున, పూర్వజాతి జ్ఞానమ్= పూర్వజన్మముల పరంపర తెలియును.

వాసనారూపములు, ధర్మాధర్మరూపములునని సంస్కారములు రెండువిధములు. అందు వాసనారూపములు స్మృతి క్లేశమునకు హేతువులు. ధర్మాధర్మములు జాత్యాయుర్భోగములకు హేతువులు నని వివేకము.

తనయందలి సంస్కారముల సాక్షాత్కారమువలన తన పూర్వజన్మపరంపర తెలియునట్లు పరుల సంస్కారముల సాక్షాత్కారమువలన పరుల జన్మపరంపర తెలియునని గ్రహింప వలయును.

"ప్రత్యయస్య పరచిత్తజ్ఞానమ్" ౧౯

ప్రత్యయస్య=పరచిత్తమున సంయమము చేయుటవలన సాక్షాత్కారముకాగా, పరచిత్తజ్ఞానమ్=పరుని చిత్తము తెలియును.

పరుని చిత్తమున కాలంబనమును తెలియునా? యన:—

"నచ తత్సాలంబనం తస్యావిషయీభూతత్వాత్" ౨౦

తత్=పరునిచిత్తము, సాలంబనమ్=ఆలంబన (విషయ) సహితముగా, నచ=సాక్షాత్కారముకాదు. తస్య=ఆలంబముతో కూడిన ఆ చిత్తము, అవిషయీభూతత్వాత్=సంయమమునకు విషయముకాదు.

ఇతరులచిత్తము అనురక్తమా లేక కాదా యనియే తెలియనగును కాని యా చిత్త మెవరియందనురక్తమో, ఎవరియందనురక్తముకాదో తెలియబడదు. ఇట రాగాది సంస్కార సహిత చిత్తమే సంయమమునకు విషయము. కాబట్టి రక్త చిత్తజ్ఞానమేకలుగును కాని అచిత్త మే విషయమున రాగము కలిగియున్నదో యా విషయము తెలియదని భావము. పరుని చిత్తమున కేది విషయమో యట సంయమ మొనర్చిన నదియు సాక్షాత్కారము కాగలదని దీనింబట్టి తెలియనగును.

"కాయరూపసంయమాత్ తద్గ్రాహ్యశక్తి స్తంభే
చక్షుఃప్రకాశానంప్రయోగేఽన్తర్ధానమ్" ౨౧

కాయరూపసంయమాత్=యోగి తన శరీరపు రంగునందు సంయమముచేయుటవలన, తద్గ్రాహ్యశక్తిస్తంభే =

గ్రహింపబడు శక్తిస్తంభితమై, ప్రకాశాసంప్రయోగే=ఇతరుల నేత్రరశ్మి తన శరీరరూపముతో సంబద్ధముకాకపోవుటవలన, అంతర్ధానమ్ = యోగి కనపడకపోవుట.

యోగి తన శరీరమునందలి రూపము సంయమము చేసినప్పుడు అతడితరులకు కానరాడు. అట్టి సంయమసాధ్యత్వాకారమువలన శరీరమున గల గ్రాహ్యశక్తి ప్రతిబంధింపబడును. ఇతరుల చక్షురశ్మితో శరీరరూపము (సంయమముచే ప్రతిబద్ధమగుటంజేసి) సంయుక్తముకాదు. కాబట్టి శరీరము ప్రత్యక్షము కాదని భావము.

"సోపక్రమంనిరుపక్రమంచ కర్మ తత్సంయమాత్
అపరాంతజ్ఞాన మరిష్టేభ్యోవా" ౨౨

కర్మ = ఆయుర్విపాకమగుకర్మ, సోపక్రమం నిరుపక్రమంచ=సోపక్రమము నిరుపక్రమము అని రెండు విధములు. తత్సంయమాత్ = అట్టి కర్మద్వయముసాధ్యత్వాకారమగువరకు చేయు సంయమమువలన, అరిష్టేభ్యోవా=అధ్యాత్మిక-ఆధిభౌతిక ఆధిదైవిక అరిష్టములవలనను యోగికి, అపరాంతజ్ఞానమ్= 'ఈ కాలమున నీదేశమున నాదేహపాతము జరుగును.' అని మరణజ్ఞానము కలుగును.

ఉపక్రమమన వ్యాపారము. ఫలము ననుభవించుటకై తీవ్రవ్యాపారముతోకూడి బహుభోగమునుకలిగించి కొంచెము ఫలము మిగిలియున్న కర్మము సోపక్రమమనబడును. దానికి విపరీతము నిరుపక్రమము. సోపక్రమము, నిరుపక్రమము

సనమును ద్వేషమునగు నాయుష్కర్మమునందు సంయమమొనర్చుటవలన యోగి తానెప్పుడెక్కడ మరణించునదియు తెలిసికొనగలుగును. అరిష్టమువలనను మరణజ్ఞానము కలుగును.

చెవులను గట్టిగా మూసికొనినపుడు శరీరమునందలి నాదాత్మను వినబడకుండుట, కన్నులనుమూసి హస్తముతో రోధించెయడమున నిష్పుకణమువలె లోపల ప్రకాశము కనబడకుండుట అధ్యాత్మికారిష్టమని యెంచవలయును. అకస్మాత్తుగ భీషణాకారులైన పురుషరూపములనుకానీ, గతించిన మాతాపితరులనుకానీ, తన యెదుటనిలబడినట్లు చూచుట అధిభౌతికారిష్టమగును. గ్రహతారామండల సంయుక్తమైన ద్యులోకము విపరీతమైనట్లు కానీ, సర్వప్రపంచము విపరీతమైనట్లుకానీ అకస్మాత్తుగ తెలియుట ఆధిభౌతికారిష్ట మగును.

ఈయరిష్టజ్ఞానము సామాన్యమానవులకును కలుగును. దానింబట్టి వారును మరణవార్తను చెప్పగలుగుదురు. కాని యోగి యిట్టి యరిష్టములవలన నెప్పుడెక్కడ మృత్యువు వాటిల్లునదియు వివరముగా తెలిసికొనగలడు. సామాన్యమనుజులట్లు వివరముగ చెప్పజాలడని వివేకము.

"మైత్ర్యాదిషు బలాని" ౨౩

మైత్ర్యాదిషు=సమాధిపాదమున వర్ణింపబడిన మైత్రి అది భావనలందు సంయమ మొనరించినందున, బలాని=మైత్ర్యాదులు అమోఘములగును—వానిశక్తి పెరుగును.

మైత్ర్యాదిభావనలందు సంయమము సిద్ధించిన యోగి యితరులను సుఖులను చేయుటలో సఫలప్రయత్నుడగునని

భావము. మైత్ర్యాదిఅనుటలో ఆదిపదమువలన ఉపేక్ష్యగ్రహించ నవసరముండదు. పాపశీలుర నుపేక్షించుటకు సంయమము చేయవలసిన యగత్యముండదు.

"బలేషు హస్తి బలాదీని" ౨౪

బలేషు=ఏనుగు మున్నగువాని బలములందు సంయమ మొనర్చిన యోగికి, హస్తిబలాదీని=హస్తిబలము, సింహ బలము మున్నగునవి లభించును.

ఆజన్మ బ్రహ్మచర్య వ్రతమున సఫలులైన భీష్మాచార్యులు, దయానంద సరస్వతీ ప్రభృతులయిన సంయములకు లభింపని బలము లోకమున నొందుకలదా!

"ప్రవృత్త్యాలోకన్యాసాత్ సూక్ష్మ వ్యవహిత విప్రకృష్టజ్ఞానమ్" ౨౫

ప్రవృత్త్యాలోకన్యాసాత్=విశోక, జ్యోతిష్మతి మున్నగు ప్రవృత్తివలన కలిగెడి సత్త్వప్రకాశమును సంయమ బలమున విన్యసించుటవలన, సూక్ష్మ...జ్ఞానమ్=సూక్ష్ములు వ్యవహిత ములు విప్రకృష్టములు నయిన ప్రకృత్యాది పదార్థముల జ్ఞానము కలుగును.

సమాధిపాదమున వర్ణింపబడిన మనస్సునొక్క విశోక, జ్యోతిష్మతియు ననబడు వృత్తి యీ సూత్రమున ప్రవృత్తి శబ్దముచే చెప్పబడినది. అట్టి ప్రవృత్తియొక్క సాత్త్విక ప్రకాశము అలోకమనబడును. సూక్ష్ములు వ్యవహితములు, విప్రకృష్టములు నైన ప్రకృతి, పరమాణువులు మున్నగు సూక్ష్మ పదార్థములందు సంయమము ద్వారమున నట్టి యాలోకము

నుంచుట వలన నాయా సూక్ష్మ పదార్థముల జ్ఞానము కలుగు నని భావము.

"భువనజ్ఞానమ్ సూర్యే సంయమాత్" ౨౬

సూర్యే=సూర్యమండలమున, సంయమాత్=సంయమ మొనర్చిన యోగికి, భువనజ్ఞానమ్= భూనభోంతరాలములను ముల్లోకముల జ్ఞానముకలుగును.

"చంద్రే తారావ్యూహజ్ఞానమ్" ౨౭

చంద్రే=చంద్రమండలమున సంయమముచేసినంతవలన, యోగికి, తారావ్యూహజ్ఞానమ్=నక్షత్రముల సన్నివేశజ్ఞానము కలుగును.

"ధ్రువే తద్గతిజ్ఞానమ్" ౨౮

ధ్రువే = ధ్రువనక్షత్రమున, సంయమ మొనర్చినచో, యోగికి, తద్గతిజ్ఞానమ్= నక్షత్రములగతిజ్ఞానముకలుగును.

"నాభిచక్రే కాయవ్యూహజ్ఞానమ్" ౨౯

నాభిచక్రే = నాభిచక్రమున సంయమ మొనర్చినచో, యోగికి, కాయవ్యూహజ్ఞానమ్= శరీరమునందలి పదార్థముల సన్నివేశము తెలియును.

వాతపిత్తశ్లేష్మములు దోషములు. త్వక్కు,లోహితము, మాంసము, స్నాయువులు,అస్థులు, మజ్జ, శుక్రము ననునేడును ధాతువులు. శరీరమున నివి యెట్లు సన్నివిష్టమ్ములై యున్నదియు యోగికి తెలియునని భావము.

"కంఠకూపే క్షుత్పిపాసానివృత్తిః" ౩౦

కంఠకూపే = జిహ్వాకుక్రింద తంతువొకటియుండును. దానిక్రింద కంఠము, కంఠముక్రింద కంఠకూపముండును. అందు సంయమమొనర్చిన యోగికి, క్షుత్పిపాసానివృత్తిః=ఆకలిదప్పులుండవు.

కంఠకూపము రసస్థానికమగుటవలన నట సంయమమొనర్చినందున యోగికి ఆకలిదప్పులు బాధింపవని భావము.

"కూర్మనాడ్యాం స్థైర్యమ్" ౩౧

కూర్మనాడ్యాం= కంఠకూపమునకుక్రింద వక్షస్థలమున కూర్మాకారముననుండు నాడియందు, సంయమమొనర్చినచో యోగికి, స్థైర్యం= చిత్తస్థిరతకాని, శరీరస్థిరతకాని కలుగును.

"మూర్ధజ్యోతిషి సిద్ధదర్శనమ్" ౩౨

మూర్ధజ్యోతిషి = బ్రహ్మరంధ్రమున నంతర్భాగమున నున్నప్రకాశము మూర్ధజ్యోతి యనబడును. అందు సంయమమొనర్చిన యోగికి, సిద్ధదర్శనమ్=యోగమున సిద్ధులైన పరమయోగులు దర్శనమిత్తురు.

"ప్రాతిభాద్వా సర్వమ్" ౩౩

వా ప్రాతిభాత్= లేక, ప్రాతిభజ్ఞానము వలన, యోగి, సర్వమ్=సర్వమెరుగగలడు.

ప్రతిభ=ఊహ, ఊహవలన జనించిన జ్ఞానము ప్రాతిభము అనబడును. అది భవసాగరమునుండి తరింపజేయునది కాబట్టి తారక మనబడును.

ప్రసంఖ్యానము – వివేకఖ్యాతి – కొఱకు విశేషముగ సంయమంతుడైన యోగికి ప్రసంఖ్యాన ముదయించుటకు పూర్వ చిహ్నముగా (ఉదయించు సూర్యునికి పూర్వదీప్తి వలె) నుదయించు మానసికజ్ఞానమును ప్రాతిభమని యోగులు వ్యవహరింతురు. ఇట్టి ప్రాతిభజ్ఞానము వలన అతీతానాగత సూక్ష్మవ్యవహిత విప్రకృష్ట సర్వవస్తువులను యోగి యెఱుగ గలడని భావము.

"హృదయే చిత్తసంవిత్" 3౪

హృదయే=హృదయపుండరీకమున సంయమ మొనర్చిన యోగికి, చిత్తసంవిత్=వృత్తులతోకూడిన చిత్తము తెలియును.

"సత్వపురషయో రత్యంతా సంకీర్ణయోః ప్రత్యయావిశేషో భోగః పరార్థాత్ స్వార్థసంయమాత్ పురుషజ్ఞానం" 3౫

అత్యంతాసంకీర్ణయోః = పరస్పరము విరుద్ధధర్మము కలిగియుండుటచే మిక్కిలి భిన్నములైన, సత్వపురుషయోః= బుద్ధిసత్త్వము, పురుషుడు ననురెండు పదార్థములయొక్క, ప్రత్యయావిశేషః=సమానమైన జ్ఞానము, భోగః= భోగ మన బడును. (బుద్ధి వృత్తులే పురుషునకు సంక్రమించుటచే ప్రత్యయము సమానము.) పరార్థాత్=పరార్థకమైన – బుద్ధి ప్రత్యయముకంటె భిన్నమైన, స్వార్థసంయమాత్ = స్వార్థమున – పౌరుషేయ ప్రత్యయమున – చిద్రూపప్రత్యయమున సంయమ మొనర్చినంచున, పురుషజ్ఞానమ్ = జీవాత్మజ్ఞానము కలుగును. యోగికి స్వాత్మ సాక్షాత్కారము కలుగునని భావము.

స్వార్థ సంయమము వలన పురుషజ్ఞానము కలుగుటకు ర్వ మేమి కలుగునన:—

"తతః ప్రాతిభశ్రావణ వేదనాదర్శాస్వాద వార్తాజాయంతే" 36

తతః = పురుష జ్ఞానోత్పత్తికి పూర్వము, యోగికి, తిభ...వార్తాః=ప్రాతిభాది సంజ్ఞలుగల సిద్ధులు కలుగును.

ప్రాతిభము పూర్వమే వర్ణింపబడినది. చెవికి కలుగు శబ్దములను విను సామర్థ్యము శ్రావణము. త్వక్కునకు గు దివ్యస్పర్శములను తెలిసికొను సామర్థ్యము వేదన. వునకు కలుగు దివ్యరూపమును దర్శించు సామర్థ్యము ర్శము. జిహ్వకు కలుగు దివ్యరసము నాస్వాదించు సామ ము ఆస్వాదము. నాసికకు కలుగు దివ్యగంధము నాఘ్రా చు సామర్థ్యము వార్త.

ఆత్మజ్ఞానము కలుగుటకు పూర్వ మీ ప్రాతిభ ప్రభృతి లు ఆరు కలుగునని భావము. యోగి యీ సిద్ధులనుపొంది తార్థుడ నైతి'నని యెంచరాదు. కారణమేమన:—

"తే సమాధావుపసర్గా వ్యుత్థానే సిద్ధయః" 37

తే=ప్రాతిభాదులు, ఆరును, సమాధౌ=ఆత్మ సాక్షా రమును కలిగించు సమాధియందు, ఉపసర్గాః=విఘ్న లు. వ్యుత్థానే=వ్యుత్థానావస్థయందు, సిద్ధయః=సిద్ధులు— ర్యములు.

ప్రాతిభాది సిద్ధులు సమాధికి విఘ్నకారకములు కాబట్టి, కాములగు యోగులు వానియందు రమింపరు. వానిని యములని విడుతురు.

జ్ఞానాత్మక విభూతు లింతవరకు వర్ణింపబడినవి. ఇప్పుడు క్రియాత్మక విభూతులు వర్ణింపబడుచున్నవి.

"బంధకారణ శైథిల్యాత్ ప్రచార
సంవేదనాచ్చ చిత్తస్య పరశరీరావేశః" ౩౮

బంధకారణ శైథిల్యాత్=శరీరమునందు చిత్త బంధనమునకు కారణములైన ధర్మాధర్మముల శైథిల్యము వలన, ప్రచార సంవేదనాచ్చ= చిత్త గమనమునకు మార్గములైన నాడుల యనుభవము వలనను, చిత్తస్య=యోగి చిత్తమునకు, పరశరీరావేశః=ఇతరుల శరీరమున ప్రవేశము కలుగును.

ధర్మాధర్మ రూపమగు నదృష్టము వలన శరీరమున చిత్తము బంధింపబడును. సంయమము ద్వారమున నట్టి బంధనమున శైథిల్యమేర్పడును. ఇట్లే సంయమము ద్వారమున చిత్తగమనమునకు ఆధారములైన నాడుల జ్ఞానమును కలుగును. అట్టిపై యోగి తన చిత్తమును శరీరమునుండి బయటికి పంపి యితరుల శరీరమున ప్రవేశింపజేయ గలుగును. ఇంద్రియములు చిత్తము ననుకరించునవి కాబట్టి దానివెంట నవియు పోయి తమ స్థానముల చేరుకొనును.

"ఉదానజయాజ్జలపంకకంటకాది ష్వసంగః ఉత్క్రాంతిశ్చ" ౩౯

ఉదానజయాత్=ఉదానుజయమువలన, జలపంకకంటకాదిషు=అగాధమైన జలమునందుకానీ, ఊబివంటి బురదలోకానీ, తీక్ష్ణకంటకములందుకానీ, అగ్ని జ్వాలాదులందుకానీ, అసంగః = వికారముకలిగించునట్టి సంబంధము కలుగదు —

ఉత్క్రాంతిశ్చ = మరణకాలమున స్వేచ్ఛగా ఉత్క్రమణమును కలుగును. ఉదానజయమును సంపాదించిన యోగి జలాదులపై భూమిపై నడుచునట్లు నడువగలడు– వాని వలన యడ్డగింపవని భావము. మఱియు నతనికి స్వచ్ఛందమరణము కలుగును.

జీవన మను పేరుగల్గి క్రియాశక్తి ప్రధానముగాగల యంతఃకరణవృత్తి ప్రాణమనబడును. అయ్యది ప్రాణసమానాపానోదానవ్యానములని యైదు విధములు. అందు నాసికాగ్ర భాగము మొదలు హృదయమువరకు నుండి ప్రాణన క్రియకు కారణమైనది ప్రాణ మనబడును. అన్నపానముల పరిణామమయిన రసమును ఆయాస్థానములకు పంపుటలో కారణమై హృదయము మొదలు నాభివరకు నుండునది సమానము. మూత్ర పురీషాదుల నపనయించుటకు హేతువై నాభిమొదలు పాదతలమువరకు నుండునది అపానము. ఊర్ధ్వనయనమునకు హేతువై నాసికాగ్రము మొదలు శిరఃపర్యంతముండునది ఉదానము. దేహశుద్ధికి హేతువై శరీరమంతటను వ్యాపించి యుండునది వ్యానము. వీనిలో ప్రాణము ప్రధానము. అది యుత్క్రమించిన తక్కినవి యుత్క్రమించునని ఉపనిషత్తుల వర్ణన వలన తెలియును.

"సమానజయా జ్జ్వలనమ్" ౪౦

సమానజయాత్ = సంయమమువలన సమానమును జయించినచో యోగికి, జ్వలనమ్ = తేజస్సువలె జ్వలనము కలుగును.

సమాధానమును జయించినయోగి శరీరమునందలి యగ్ని
ను తేజంపజేయుచు నగ్నివలె జ్వలించునని భావము.

"శ్రోత్రాకాశయోః సంబంధసంయమాత్ దివ్యంశ్రోత్రమ్" ౪౧

శ్రోత్రాకాశయోః=శ్రవణేంద్రియము, ఆకాశము ననునీ రెంటియొక్క, సంబంధజయాత్ = సంబంధమున సంయమమొనర్చినంపున, యోగికి, దివ్యం = సూక్ష్మశబ్దమును గ్రహించు, శ్రోత్రం=శ్రవణేంద్రియమగును.

ఇట్లు ఆకాసంబంధసంయమమువలన నాయా యింద్రియములును దివ్యములగునని భావము.

"కాయాకాశయోః సంబంధసంయమాత్
లఘుతూలసమాపత్తేశ్చాకాశగమనమ్" ౪౨

కాయాకాశయోః=శరీరాకాశముల, సంబంధ సంయమాత్=వ్యాప్యవ్యాపక సంబంధమున సంయమజయమువలన, లఘుతూల సమాపత్తేశ్చ= లఘువైన తూలాదులందు సంయమము ద్వారమున చిత్తము తత్స్థ, తద్రూపముల నొందుట చేతను, బరువులేని శరీరముకలవాడైనయోగి, ఆకాశగమనమ్= ఇచ్చవచ్చినట్లు ఆకాశమున సంచరింపగలడని యర్థము.

శరీరాకాశముల సంబంధమును జయించుటచేత కానీ, లఘువైన వస్తువులయందు తద్రూపుడైకానీ యోగి తన శరీరమును లఘువుచేసికొనును. అట్టిపై యిష్టము వచ్చినట్లు ఆకాశముననేమి జలముపైనేమి చరింపగలడని భావము.

"బహిరకల్పితా వృత్తిర్మహావిదేహా తతః ప్రకాశావరణక్షయః"౪౩

బహిఃశరీరమునకు వెలుపల, అకల్పితా=కల్పింపకయే (శరీరమునకు వెలుపల నా మనస్సుండుగాకయని), యేర్పడిన, వృత్తిఃమనోవృత్తి, మహావిదేహా=మహావిదేహ యని నామముగలధారణ సంయమమువలన సిద్ధించినపుడు, తతఃఆ ధారణవలన, ప్రకాశావరణక్షయఃబుద్ధిసత్త్వ ప్రకాశమునకు ఆవరణమగు క్లేశకర్మవిపాకములు నశించును.

'నా మనస్సు శరీరమునకు వెలుపల నుండుగాక'యని కల్పనద్వారమున బాహ్యావిషయమున మనోవృత్తి కల్పింపబడినదై విదేహధారణ యనబడును. అట్టి ధారణసహాయమున యోగి సంయమముద్వారమున ధారణకు ఫలరూపమైన మహావిదేహ యనెడు అకల్పిత బాహ్యావృత్తిని సాధించును. ఇట్లు సిద్ధమైన అకల్పిత మహావిదేహ ధారణగలయోగికి సత్త్వ ప్రకాశమును నావరించు రజస్తమోమలములయిన క్లేశకర్మ విపాకములు నశించును. అవాంతరఫలముగా పరశరీరావేశాదులును కలుగునని భావము.

ఇంతవరకు ననేకవిధములగు సంయమములు, వానివలన కలుగు విభూతులు వర్ణింపబడినవి. ఇప్పు డీశాస్త్రమున ముఖ్యములనియెంచబడు గ్రహీతృ, గ్రహణ, గ్రాహ్యావిషయములకు సంబంధించిన సంయమసిద్ధులను వర్ణింపబూని ముందు గ్రాహ్యవిషయకసంయమసిద్ధిని వర్ణించుచున్నాడు.

"స్థూలస్వరూప సూక్ష్మాన్వయార్థవత్త్వ
సంయమాత్ భూతజయః" ౪౪

స్థూల...మాత్ర=స్థూలము, స్వరూపము, సూక్ష్మము, అన్వయము, అర్థవత్త్వము నను భూతముల పంచరూపములందు సంయమమొనర్చుటవలన, యోగికి, భూతజయః=పృథివ్యాది పంచమహాభూతముల వశీకారము కలుగును.

గంధము, రసము, రూపము, స్పర్శము, శబ్దము నను పంచవిశేషగుణములలో క్రమముగా నొక్కొక్క విశేష గుణము తక్కువగాగలవై చూడబడు పృథివ్యాదులే భూత ముల ప్రథమరూపము – స్థూలము. కాఠిన్యము, స్నేహము, ఉష్ణత మున్నగు ధర్మములచే వ్యక్తమగు పృథివీత్వము, జల త్వము మున్నగునవి భూతముల ద్వితీయరూపము–స్వరూపము. భూతములకు కారణములైన పరమాణువులు, తన్మాత్రములు భూతముల తృతీయరూపము–సూక్ష్మము. పరమాణువులకు కారణములై వానియందు అన్వితములై యుండుగుణత్రయము భూతముల చతుర్థరూపము–అన్వయము. అట్టిగుణములందు భోగాపవర్గార్థత అన్వయించియుండును. గుణములు, తన్మా త్రములు భూతభౌతికములం దన్వయించియుండును. ఇదియే భోగాపవర్గార్థనత్వము. ఇది పంచమరూపము.

యోగులు ధర్మధర్మ్యులను అభిన్నములుగా నెంచుదురు. కాబట్టి సామాన్యవిశేషముల సముదాయమే ద్రవ్యము. న్యాయవైశేషికుల మతమున సామాన్యవిశేషములకు ఆశ్ర యము ద్రవ్య మనబడునని వివేకము.

భూతజయమువలన యోగికి కలుగునదేమన:—

"తతోఽణిమాదిప్రాదుర్భావఃకాయసంప త్తద్ధర్మానభిఘాతశ్చ"౫౫

తతః=భూతజయమువలన, యోగికి, అణిమాది ప్రాదుర్భావః=అణిమాదులు ప్రాప్తమగును. కాయసంపత్=ముందు చెప్పబోవు కాయసంపత్తి, తద్ధర్మానభిఘాతశ్చ = పృథివ్యాది భూతధర్మములైన కాఠిన్యాదులచే బాధకలుగమియు కలుగును.

అణిమాదులు:— పరమాణువువలె సూక్ష్మముగుట అణిమ. ఇషీక, తూలములవలె తేలికయగుట లఘిమ. ఆకాశమువలె మహద్భావము కలుగుట మహిమ. సర్వపదార్థానిష్ధ్యము ప్రాప్తి. కోరికలు వ్యర్థముకాకుండుట ప్రాకామ్యము. భూతములు, భౌతికపదార్థములు, వీనిని నియమించుట వశిత్వము. భూతభౌతికముల ఉత్పత్తిస్థితిలయములకు, సమర్థుడగుట ఈశిత్వము. సత్యసంకల్పత యత్రకామావసాయిత్వము. అని అష్టసిద్ధులు.

ఇందు అణిమ, లఘిమ, మహిమ, ప్రాప్తి యనెడు నాలుగుసిద్ధులు భూతముల స్థూలరూపమున సంయమ మొనర్చుటవలన కలుగును. స్వరూపసంయమ విజయమువలన ప్రాకామ్యసిద్ధి కలుగును. సూక్ష్మసంయమమువలన వశిత్వము సిద్ధించును. అన్వయమునందు సంయమ మొనర్చుట వలన ఈశిత్వము కలుగును. అర్థవత్వమున సంయమ మొనర్చుట చేత యత్రకామావసాయిత్వము సిద్ధించును.

యోగి భూతములను జయించినతమపై యతడు భూమియందు ప్రవేశింప నెంచినచో పృథివియందలి కాఠిన్య మతని నడ్డగింపదు. జలధర్మమైన స్నేహ మతనిని క్లిన్నము చేయదు. ఉష్ణత యతనిని దహింపదు. వాయు వతనిని చలింప

జేయదు. ఆకాశమున నెగురుచు నతడెవరికి కనబడడు. అష్ట సిద్ధులను బొందినయోగి చేయుటకు చేయకుండుటకు విపరీత ముగ చేయుటకు సమర్థుడయ్యు పదార్థశక్తులను మార్చగలడే కాని పదార్థములను మార్చజాలడు.

కాయసంపత్తి:—

"రూపలావణ్యబలవజ్రసంహననత్వాని కాయసంపత్" ౪౬

రూప.....త్వాని=రూపము, లావణ్యము, బలము, వజ్రసంహననత్వము ననునాలుగును, కాయసంపత్=శరీరసంపత్తి యనబడును.

చూడదగిన రూపము రూపము. సర్వాంగ సుందరత లావణ్యము. వీర్యాధిక్యము బలము. వజ్రమువలె శరీరావయవముల ప్రయోజనార్థ్యము వజ్రసంహననత్వము.

గ్రహణసంయమము వలన గలిగెడి సిద్ధులు:—

"గ్రహణస్వరూపాస్మితాన్వయార్థవత్వ
సంయమాత్ ఇంద్రియ జయః" ౪౭

గ్రహణ.....మాత్ = గ్రహణము, స్వరూపము, అస్మిత, అన్వయము, అర్థవత్వము ననెడు పంచేంద్రియ రూపములందు సంయమ మొనర్చుటవలన, ఇంద్రియజయః=చక్షురాది ఇంద్రియముల వశీకారము కలుగును.

శబ్దాదులు గ్రాహ్యములు. గ్రాహ్యములైన శబ్దాదులందు ఇంద్రియములవృత్తి గ్రహణమనబడును. చక్షుష్ట్వాదికము స్వరూపము. వానికి కారణము—సాత్వికమైన అహంకా

రము అస్మితా. అంచు అనుగతమైయున్న గుణత్రయము అన్వయము. గుణత్రయమునం దనుగతమైయున్న భోగాపవర్గార్థత అర్థవత్వము అని వివేకము.

ఇంద్రియజయ ఫలమేమన:—

"తతో మనోజవిత్వం వికరణభావ: ప్రధానజయశ్చ" ౪౮

తతఃఇంద్రియజయమువలన, మనోజవిత్వం=మనస్సు వలె శరీరమునకును అధికవేగము సంభవించును. వికరణభావఃశరీరము నపేక్షింపకయే ఇంద్రియములకు ఇష్టమువచ్చిన దేశకాలవిషయములందు వృత్తికలుగును. ప్రధానజయశ్చ=ప్రకృతివికారములన్నియు వశముననుండును.

ఇంద్రియజయమువలన యోగికి మనోజవిత్వము, వికరణభావము, ప్రధానజయము కలుగును. ఈసిద్ధులనే యోగశాస్త్రనిష్ణాతులు మధుప్రతీకము లందురు. ఇందు మనోజవిత్వము గ్రహణసంయమమునకు ఫలము. వికరణభావము స్వరూపసంయమ ఫలము. ప్రధానజయము అస్మితాన్వయార్థవత్వ ఫలమని గ్రహింపవలయును.

గ్రహీతృ సంయమసిద్ధి:—

"సత్వపురుషాన్యతా ఖ్యాతిమాత్రస్య
సర్వభావాధిష్ఠాతృత్వం సర్వజ్ఞాతృత్వంచ" ౪౯

సత్వపురుషాన్యతాఖ్యాతిమాత్రస్య=బుద్ధివేరు; పురుషుడువేరు; అను వివేకఖ్యాతిమాత్ర రూపమున నిలుకడగల చిత్తము సంపాదించిన యోగికి, సర్వభావాధిష్ఠాతృత్వం =

సర్వపదార్థముల నియంతృత్వము, సర్వజ్ఞాతృత్వంచ=సర్వపదార్థముల విజ్ఞాతృత్వమును కలుగును.

సత్త్వపురుషాన్యతాఖ్యాతిమాత్రుడైన యోగిని నియమించుట కెవరికిని శక్యముకాదు. అట్టి యోగికి తెలియని పదార్థతత్త్వ ముండనేరదని భావము. పైరెండుసిద్ధులును కలిసి విశోక యనబడును. ఈస్థితిని పొంది సర్వజ్ఞుడై, క్షీణించిన క్లేశ కర్మబంధనములు కలవాడగుటచే శోకరహితుడై యోగి విహరించునని తెలియనగును.

"తద్వైరాగ్యాదపి దోషబీజక్షయే కైవల్యమ్" ౫౦

తద్వైరాగ్యాత్ = వివేకఖ్యాతియంచును వైరాగ్యము గలుగుటవలన, దోషబీజక్షయే = దోషములైన క్లేశముల సంస్కారము నశింపగా నసంప్రజ్ఞాతసమాధి కలిగినయోగికి, కైవల్యం=కైవల్యఫలము కలుగును.

వివేకఖ్యాతి యనెడు వృత్తియును నశించినతమపరి కైవల్యము ప్రాప్తించునని భావము.

కైవల్యమును సాధించుటకై ప్రవృత్తుడైన యోగికి మధ్యలో కలుగువిఘ్నముల నాశంకించి వాని నిరాకరింప యుపాయము వర్ణించుచున్నాడు.

"స్థాన్యుపనిమంత్రణేసంగస్మయాకరణంపునరనిష్టప్రసంగాత్" ౫౧

స్థాన్యుపనిమంత్రణే=ఆయాస్థానస్వాములు, గొప్పయైశ్వర్యవంతులునయిన గృహస్థులచే, "అయ్యా! ఇట కూర్చుండుము;

ఇది యనుభవింపుము; ఇది కమనీయమైన భోగము; ఈ [illegible] కమనీయ; ఈ రసాయనము జరామృత్యువులను తొలగించ జేయును." అనునిట్టి సత్కారపూర్వక వాక్యములతో నాహ్వా నముచేయబడినచో యోగి, సంగస్మయాకరణం=సంగమన క్రీడ; 'అహాహా! నాయోగప్రభావమెట్టిది!' యను కృతార్థతాభి మానము స్మయము; ఇట్టి ప్రీత్యభిమానములకు చనలో చా వీయరాదు. పునరనిష్టప్రసంగాత్=ప్రీత్యభిమానములు కలి నచో మరల ననిష్టము కలుగగలదు. కైవల్యసంపాదనమున నుత్సాహము కలుగునని యర్థము.

ప్రాథమ కల్పికులు, మధుభూమికులు. ప్రజ్ఞాజ్యో తులు, అతిక్రాంతభావనీయులు నని యోగులు నాలుగు తెగ లుగా నుందురు. అందు యోగమున ప్రవృత్తమాత్రులు, సవి తర్క సమాధిని సంపాదించినవారు, వశపడని పరచిత్తాది జ్ఞానము కలవారు ప్రథములు. నిర్వితర్క సమాధి ద్వారమున మధుమతీ భూమిని, ఋతంభరాప్రజ్ఞను సంపాదించి భూతేం ద్రియములను జయింప కోరికగలవారు ద్వితీయులు. స్వార్థసంయ మముతో విశోక, సంస్కారశేషము నను రెండుభూములను (అవస్థలను) సంపాదింపనెంచు జితభూతేంద్రియులు తృతీయులు. మధుమతి, మధుప్రతీక, విశోక, యనెడు భూములందు విర క్తులై, కృతార్థులై చిత్తవిలయము మాత్రము మిగిలియున్న వారు, మతీయు, సంస్కారశేషమనెడి చిత్తస్థితిని సంపాదించిన వారు, సప్తవిధప్రాంతభూమిప్రజ్ఞకలవారు, చరమదేహులు నయిన జీవన్ముక్తులు చతుర్థులు. వీరిలో ప్రథమశ్రేణికి చెందిన

యోగాని విశేషయోగ్యత లేనందున స్థానికులైన ఐశ్వర్యవంతులెప్పుడు సత్కరింపరు. తృతీయచతుర్థ శ్రేణులకు చెందినవారు తమకు స్వాస్థ్యమునివారు కాబట్టి వారిజోలికిని పోరు. కాని ప్రథమశ్రేణికి చెందిన ఋతంభరాప్రజ్ఞగలయోగి, ధర్మమేఘసమాధిని సంపాదించినవాడై ధైశ్వర్యవంతులచే పైనచెప్పిన్లు సత్కరింపబడుట సంభవము. అట్టియెడ ప్రీత్యభిమానములు కలుగరాదు. నిశ్చలమనస్కుడై సమాధిభావనయందే దృఢుడు కావలయును. లేకున్న సత్కారాదులందు చిక్కుకొని విషయానురక్తుడై యధఃపతనము చెందగలడు. అభిమానరహితుడు తనను కృతార్థునిగా నెంచును. సమాధికై యత్నింపవలెనని భావము.

వివేకమువలన కలుగు జ్ఞానమునకు సాధనమైన సంయమమును వర్ణించుచున్నాడు:—

"క్షణతత్క్రమయోఃసంయమాత్ వివేకజంజ్ఞానమ్" ౫౩

క్షణ తత్క్రమయోః = క్షణము దానిప్రవాహము యొక్క అపేక్షిన్నత, వీనియందు సంయమ మొనరించుటవలన వివేకజం=వివేకపూర్వక సమస్తవస్తుజ్ఞానము కలుగును.

ద్రవ్యముల సూక్ష్మతకు అవధి పరమాణువైనట్లు కాలమున నత్యంత సూక్ష్మకాలము క్షణమనబడును. లేక, ఎంత కాలములో పరమాణువు తనస్థానమును విడిచి మరియొకస్థానమును పొందగలదో ఆస్వల్పకాలము క్షణమనబడును. అట్టి క్షణముల ప్రవాహము తెంపులేమి క్రమమనబడును. సమస్త

విశేషములతోను వస్తువుల నొకదానినుండి మరియొకదానిని వేరుచేయుట వివేకము.

చిచ్ఛక్తి యనబడు చేతనము తక్క మిగిలిన పదార్థములన్నియు ప్రతిక్షణము మారుచుండును. యోగి యావస్తువుల పరిణామక్షణమునందును, క్షణముల క్రమమునందును వాని సాక్షాత్కార మేర్పడువరకు సంయమ మొనర్చినచో నతనికి నావస్తువుల సాక్షాత్కారము కలుగును. వస్తుసాక్షాత్కారము వలన వాని జ్ఞానము కలుగును. ఇదియే వివేకజజ్ఞానము.

వివేకజజ్ఞానము (యోగశాస్త్రసంజ్ఞ) యోగులపరిభాష. సాంఖ్యులు, యోగులు క్షణాత్మకకాలమును వాస్తవమందురు. అంతకుమించిన ముహూర్తము, యామము, దినము మున్నగు నామములచే పేర్కొనబడుకాలము అవాస్తవము. వైశేషికుల మతమున మహాకాలమే వాస్తవము; దానికిమించి క్షణాది వ్యావహారికకాలము అవాస్తవము.

వివేకజజ్ఞానమువలన కలుగునదేమన:—

"జాతిలక్షణదేశైరన్యతానవచ్ఛేదాత్తుల్యయోస్తతః ప్రతిపత్తిః"౫౩

తుల్యయోః= జాతి, లక్షణము, దేశము ననువానిచే సమానములైన రెండుపదార్థములయొక్క, జాతిలక్షణదేశైః= గోత్వాది జాతిచేతను, కపిలత్వాదిలక్షణముచేతను, పూర్వాది దేశముచేతను, అన్యతానవచ్ఛేదాత్ = భేదమునిశ్చయించుట సంభవముకాదు కాబట్టి, ప్రతిపత్తిః=అట్టివాని భేదనిశ్చయము, తతః=వివేకజజ్ఞానమువలన కలుగును.

జాతి, లక్షణము, దేశము ననుమూడింటిచే పదార్థముల భేదము (ఇది దీనికంటెవేరు అని) లోకమున తెలియబడును. దేశముచేతను లక్షణముచేతను సమానములుగానున్న గోగవయములలో గలభేదము (గోవుకంటె గవయము వేరుఅని) గోత్వగవయత్వజాతిభేదముచే తెలియనగును. దేశమునందు జాతియందు సమానము లైన రెండుగోవులలో గల భేదము (దీనికంటె నిదివేరు అని) వానియందుగల కపిలత్వము శ్వేతత్వము నను లక్షణభేదమువలన తెలియనగును.

ఇట్లే జాతియందు, లక్షణమునందును సమానము లైన రెండు ఆమలకములలో గల భేదము (దీనికంటె నిదివేరు అని) వానిలోగల దేశభేదముచే తెలియనగును. కాని జాతి, లక్షణము, దేశము నను మూటియందును సమానములైన – ఒకే చోట పెట్టియున్న రెండుఆమలకములలో గలభేదము, ఆమలకత్వజాతిచేకానీ, గోలకత్వాది లక్షణముచేకానీ, పూర్వాది దేశముచేకానీ తెలియజాలనపుడు వివేకజజ్ఞానమువలన వాని భేదము తెలియనగు ననిభావము. దీనింబట్టి సమానము లైన పరమాణువులలో గల భేదము కూడ వివేకజజ్ఞానమువలననే తెలియనగు నని తేలుచున్నది.

వివేకజజ్ఞాన లక్షణమేమన:—

"తారకం సర్వవిషయం సర్వథా విషయ
మక్రమంచేతి వివేకజంజ్ఞానమ్" ౫౪

తారకం=తనప్రతిభవలననే కలుగునది (ఇతరుల యుప దేశము నపేక్షింపక కలుగునది). సర్వవిషయం = సమస్తవస్తు విషయకము. (వివేకజ్ఞానమునకు విషయము కాని వస్తు వొంకును నుండదు.) సర్వథావిషయం= అన్నివిధములైన అవాంతరభేదములతోకూడి త్రికాలములకు సంబంధించిన వస్తువులన్నియు విషయముగాగలది. అక్రమంచ=క్రమములేక యొకేక్షణమున నన్నివిషయములు నన్నివిధముల కర్తలామా లకమువలె తెలుపునది. ఇట్టిజ్ఞానము, వివేకజంజ్ఞానమ్=వివేకజ ఙ్ఞాన మనబడును.

ఈ వివేకజజ్ఞానమే సంపూర్ణజ్ఞానము. దీనిద్వారమున తెలియనివస్తువు ఎక్కడను, ఏవిధముగాను, ఎన్నడునుండజాల దనవలయును. సంప్రజ్ఞాత మను యోగప్రదీపము దీనియంశమే. ఋతంభరాప్రజ్ఞ, మధుమతి మున్నగు నవస్థలన్నియు నిందే పరిసమాప్తము లగునని నిశ్చయింపనగును.

వివేకజజ్ఞానము కలుగనివానికి కైవల్యప్రాప్తి కలుగదా యన:—

"సత్త్వపురుషయోఃశుద్ధిసామ్యే కైవల్యమితి" ౫౫

సత్వపురుషయోఃశ = బుద్ధిపురుషులలో, శుద్ధిసామ్యే= సమానమైనశుద్ధి యేర్పడినపుడు, కైవల్యమ్=పురుషునకు కైవ ల్యము-మోక్షము-లభించును.

వివేకజజ్ఞానము కలిగినను కలుగకున్నను సత్వపురుషా న్యతా-ఖ్యాతి వలననే కైవల్యప్రాప్తి కలుగును. ఇందుకు బుద్ధి

సత్త్వమున క్లేశబీజములు దగ్ధములు కావలయును. ఈదగ్ధ క్లేశబీజతయే బుద్ధియొక్క పురుషసమానశుద్ధి.

సత్త్వపురుషాన్యతాఖ్యాతి కలుగుటయేతడవుగ పురుషుని యవిద్యతొలగును. అవిద్యతొలగినచో దానివలన నేర్పడు రాగాదిక్లేశములుండవు. అట్టిపై కర్మముండదు. కర్మాభావము వలన జన్మాభావము కలుగును. జన్మమునివర్తించిన దుఃఖాత్యంతనివృత్తి కలుగును. ఇట్టిస్థితిలో చరితార్థములగుటచే గుణములు (సత్వరజస్తమములు) మరల పురుషునకు దృశ్యములుగా ప్రవర్తింపవు. నాడు పురుషునకు కైవల్య మేర్పడును. స్వరూపమున ప్రకాశించుపురుషుడు కేవలుడై బ్రహ్మానందము ననుభవించును.

విభూతిపాదము

ఓమ్

యోగదర్శనము

కైవల్య పాదము

పూర్వపాదములందు యోగము, యోగసాధనములు, వానివలన కలుగువిభూతులు వర్ణించి యిందు యోగమునకు పరమఫల మైనకైవల్యమును వర్ణించుచున్నాడు. సిద్ధచిత్తములలో కైవల్యప్రాపకచిత్తమును నిర్ణయింపవలచి ముందుగా పంచవిధము లయిన సిద్ధులను చెప్పుచున్నాడు.

"జన్మౌషధిమంత్రతపః సమాధిజాః సిద్ధయః" ౧

జన్మౌషధి...జాః = జన్మజము, ఓషధిజము, మంత్ర జము, తపోజము, సమాధిజము నని, సిద్ధయః= ఐశ్వర్యములు ఐదు.

అందు జన్మజసిద్ధి స్వాభావికము. అయ్యది జ్ఞానాత్మకమో క్రియాత్మకమో యగును. కపిలాదులలో జ్ఞానరూపజన్మజసిద్ధి చూడనగును. క్రియాత్మకజన్మజసిద్ధి ఆకాశగమనాదులు జన్మతోసిద్ధించిన ప్రాణులందు చూడనగును. పాదరసము మున్నగువాని భస్మములను తినుటచే కలుగు శరీరసంపద ఓషధిజసిద్ధి. స్వాధ్యాయాదులవలన కలిగెడి ఇష్టదేవతాసంప్రయోగము (స్వాధ్యాయాదిష్టదేవతాసంప్రయోగః ౨.౪౪) మంత్రజసిద్ధి. తపస్సువలన కలిగెడిసిద్ధి తపోజసిద్ధి. విభూతిపాదమున

చెప్పబడిన సిద్ధులన్నియు సమాధిజసిద్ధులనియే గ్రహింప వలయును.

మంత్రౌషధులవలన కాయేంద్రియములలో జాత్యంతర పరిణామము కలుగును. దానికి కారణమేమన:—

"జాత్యంతరపరిణామః ప్రకృత్యాపూరాత్" ౨

జాత్యంతరపరిణామః = మంత్రౌషధులవలన శరీరేంద్రియములలో కలుగు పూర్వజాతికంటె విలక్షణమైన మరియొకజాతికి సంబంధించిన పరిణామము, ప్రకృత్యాపూరాత్ = శరీరమునకు ప్రకృతి భూతపంచకము, ఇంద్రియములకు ప్రకృతి అహంకారము (అస్మిత) ఈ రెంటిని స్వజాతి కనుకూలించు నవయవాంతరములతోకూడి ప్రవేశించుటవలన కలుగును.

కాయేంద్రియప్రకృతులు (పంచమహాభూతములు, అస్మిత) మంత్రౌషధులవలన కలుగు ధర్మాదినిమిత్తముల నపేక్షించుచు, క్రొత్తయవయవములలో ననుప్రవేశించుట యను నాపూరముతో తమవలన కలుగుక్రొత్తశరీరేంద్రియములను అనుగ్రహించును. అంటవలననే పూర్వపరిణామముపోయి క్రొత్తపరిణామము కలుగుననిభావము.

కాయేంద్రియప్రకృతు లింటికొఱకు చేయునదేమన:—

"నిమిత్తమప్రయోజకం వరణభేదస్తు తతః క్షేత్రికవత్" 3

నిమిత్తం=మంత్రౌషధులవలన నేర్పడు ధర్మాదినిమిత్తము, ప్రకృతీనాం = కాయేంద్రియప్రకృతులకు, అప్రయోజకం = ఆపూరమున ప్రయోజకముకాదు. వరణభేదస్తు= ప్రతిబంధ

కము లైనఅధర్మాదుల నశింపజేయుటయే, తతః=ఆ నిమిత్తము వలన కలుగును. క్షేత్రికవత్ =ఒక కేదారమునుండి మరియొక కేదారమునకు వెళ్లి దానిని నింపునీటికి కర్షకుడు ప్రయోజకుడు కాడు; కాని, మడిలోనికి నీరుపోవుట కడ్డముగా నున్నగట్టు మాత్రము తొలగించును.

కేదారములను నీటితో నింపదలచుకర్షకుడు నీటిని నడుపుటకు తానుచేయవలసిన దేమియునుండదు. కాని కేదారమునందు నీటినిప్రవేశింపనీయక యడ్డముగా నుండుగట్టును మాత్రము తొలగించును. అంతట నీరు స్వయముగ కేదారము నాపూరించును—నింపును. అట్లే ధర్మాదినిమిత్తములు(మంత్రాదులవలన జనించినవి) కాయేంద్రియప్రకృతులయిన భూతాహంకారములను ప్రేరింప పనియుండదు. కాని యవి, అధర్మాదులను తొలగించును. ఇట్లు అధర్మాదిఆవరణములు తొలగినచో ఆయాప్రకృతులు స్వభావముచేతనే తమచే నేర్పడు వికారముల నాపూరించు ననిభావము.

యోగి తనభోగముకొఱకు కాయేంద్రియప్రకృత్యాపూరణము ద్వారమున ననేక శరీరేంద్రియము లొకేసారి నిర్మించుకొనునపు డనేకచిత్తములను దేనినుండి నిర్మించుకొనునన:—

"నిర్మాణచిత్తా న్యస్మితామాత్రాత్" ౪

నిర్మాణచిత్తాని = సంకల్పముచే నిర్మించుకొను చిత్తములు, అస్మితామాత్రాత్ = చిత్తమునకు ఉపాదానకారణమైన అహంకారమునుండి నిర్మించుకొనును.

యోగి యొకే సమయమున ననేకశరీరములను నిర్మించుకొని వానిద్వారమున కర్మఫలము నంతటిని భోగించి నివారించుకొనదలచినపు డాశరీరములకు తగినట్లు చిత్తములనుకూడ అహంకారమునుండి నిర్మించుకొను ననిభావము.

క్రొత్తగా నిర్మింపబడినచిత్తములును చిత్తములేకాబట్టి పూర్వచిత్తముతో సమానములే యగును. ప్రతిశరీరమునందును వేరువేరుగా నుండు చిత్తములను ఒకేచిత్త మనునభిప్రాయముతో ప్రవృత్తిని కలిగింప వలనుపడదు. కాబట్టి యోగికి వానివలన భోగ మెట్లుసంభవమగునన:—

"ప్రవృత్తిభేదే ప్రయోజకం చిత్తమేక మనేకేషామ్" ౫

క్రొత్తచిత్తములను నిర్మించుయోగి, ఏకంచిత్తం = పూర్వము తనకుప్రాప్తమైయున్నచిత్తమును, అనేకేషాం = అనేకశరీరములకుగాను నిర్మించిన క్రొత్తచిత్తములను, ప్రవృత్తిభేదే=భిన్నభిన్నప్రవృత్తులందు, ప్రయోజకం=ప్రేరించు నాయకచిత్తముగా నిర్మించును. యోగి తనకుప్రాప్తమైయున్న పూర్వచిత్తమును క్రొత్తగా నిర్మింపబడినచిత్తములకు నాయకచిత్తముగా నొనర్చుటవలన దానిచే ప్రేరేపింపబడి క్రొత్తచిత్తములు ప్రవృత్తికలవై యోగికి భోగముకలిగించును. దేనికది స్వతంత్రముగాప్రవర్తించి స్వతంత్రభోగము కలిగింపనేరవు. కాబట్టి దోషములేదని భావము.

పూర్వము చెప్పబడిన జన్మజాది సిద్ధులతో కూడిన చిత్తములలో అపవర్గము ననుభవింపజేయు సిద్ధచిత్తమును నిశ్చయించుచున్నాడు.

"తత్ర ధ్యానజ మనాశయమ్" ౬

తత్ర=సిద్ధచిత్తము లైనవైదింటిలోను, ధ్యానజమ్ = సమాధిజసిద్ధితో కూడినచిత్తము, అనాశయమ్=క్లేశవాసనలు, కర్మవాసనలు లేనివై యపవర్గ ప్రాపకమగుచున్నది.

పంచవిధము లయినసిద్ధచిత్తములలో వాసనారహితమై సమాధిజసిద్ధియుక్తచిత్తము కైవల్యమును కలిగింప యోగ్య మగును. మంత్రాదిసిద్ధియుక్తచిత్త మట్లుకాదనిభావము.

యోగులుకానివారిచిత్తము కర్మానుబంధముతో కూడి యుండునట్లు, యోగిచిత్తమును కర్మాశయసంబద్ధ మేలకాదు? అనాశయ మెట్లగునన:—

"కర్మాశుక్లాకృష్ణం యోగిన స్త్రివిధ మితరేషామ్" ౭

యోగినః = యోగియొక్క, కర్మ = సమాధిప్రభృతి కర్మము, అశుక్లాకృష్ణం=శుక్లముకాదు, కృష్ణముకాదు – (పుణ్యముకాదు, పాపముకాదు.) ఇతరేషాం=యోగులుకాని వారిచిత్తము, త్రివిధం=శుక్లము, కృష్ణము, శుక్లకృష్ణము అని మువ్విధములు.

యోగికిని కర్మసంబంధముండును. కాని యతడొనర్చు కర్మము క్లేశకర్మవాసనాపూర్వకముకాదు. యోగి యొనర్చు సమాధి ప్రభృతికర్మము క్లేశకర్మాదివాసనలను నశింపజేయును. ఫలాభిసంధితోచేయమిచే పుణ్యముకానీ, నిషిద్ధకర్మలనాచ రింపమిచే పాపముకానీ యతనికర్మము కాదు. కాగా యోగి చిత్త మనాశయ మగును. ఇతరు లట్లుకాక ఫలాసక్తితో

పుణ్యపాపకర్మల నాచరింతురు. కాబట్టి వారిచిత్తము ఆయా కర్మవాసనలచే చిత్రితమై శుక్లము, కృష్ణము, శుక్లకృష్ణము నగునని భావము.

తపస్సు, స్వాధ్యాయము, ధ్యానము మున్నగు సాత్వికకర్మములు శుక్లములు. గోహత్యాదులు తామస కర్మములు కృష్ణములు. పశుహింసాదులతో కూడిన కర్మములు శుక్లకృష్ణములు నని వివేకము.

యోగులు కానివారి చిత్తములు వాసనలతో కూడియుండుటవలన కర్మ విపాకము తప్పదు! కాబట్టి యొకజన్మమును విడిచి మరియొక జన్మమును పొందినపుడు సమస్తవాసనలు అభివ్యక్తములై యొకజాతియందే యితర జాతులకు సంబంధించిన భోగములను అనుభవింపవలసి వచ్చునుకదా ? యన: —

"తత స్తద్విపాకానుగుణానా మేవాభివ్యక్తి ర్వాసనానామ్" ౮

తతః=పూర్వోక్త త్రివిధమైనకర్మము పక్వమై ఫలోన్ముఖమైనపుడు, తద్విపాకానుగుణానామేవ= ఆయా కర్మముల విపాకమనదగు జాత్యాయుర్భోగ లక్షణ ఫలమున కనుగుణమైన, వాసనానాం=ఆయాజాతియందు భోగింపదగు సంస్కారముల, అభివ్యక్తి ర్భవతి=(ఆయావిషయములను స్మరింపజేయుటయును) అభిముఖ్యము కలుగును.

కర్మము విపచ్యమానమగుచు నేజాతికి సంబంధించిన విపాకము నారంభించునో దాని కనుగుణమైనవాసనలనే యభివ్య

క్తముచేయును. అంచువలననే పుట్టినతోడనే ప్రాణి స్వజాత్యనుగుణమగు తగినభోగమునే యనుభవింప నారంభించును. ఒంటెపిల్ల ముండ్లపొదనే తినసారంభించును. బిడ్డాలకిక్షీరము మూషకశిశువులనే వేటాడును; గడ్డిపరకల నంటుకొనును. కాబట్టి దోషము లేదు.

మనుష్యుడు చనిపోయిన తమపరి వెంటనే కర్మసదృశ కమునసరించి మార్జాలభావము సందినపుడు ప్రార్థిణము వరకు నున్న—వ్యవధానములేని — మనుష్యవాసనయే అభివ్యక్తము కావలయును. అట్లుకాక యెంతో వ్యవధానముగల మార్జాలవాసన యెట్లు వ్యక్తమగును ? వ్యవహితావ్యవహిత ముల (దూరసామీప్యముల)లో అవ్యవహితమే వ్యక్తము కావలయును కదా ! యన:—

"జాతి దేశకాలవ్యవహితానా మప్యానన్తర్య
స్మృతి సంస్కారయో రేకరూపత్వాత్" ౯

జాతి....మపి = మధ్యలోగలుగు ననేకజన్మముల చేతను, పూర్వోత్తరాది దేశముచేతను, అనేక సంవత్సరాత్మక కాలముచేతను వ్యవహితములైనను, వాసనలు, అనంతర్యమ్= ఫలమునిచ్చుటలో వ్యవధానములు కావు. స్మృతిసంస్కార యోఃస్మరణము, వాసనలు నను రెండును, ఏకరూపత్వాత్ = సమాన విషయము లనునియమ ముండుటవలన.

అభివ్యక్తములయినవాసనలు తమకార్యమునుచేయును. అభివ్యక్తములుకానివి చేయవు. వాసన లభివ్యక్తములగుటకు

వ్యవధానముకానీ, అవ్యవధానముకానీ కారణము కాదు. వానిని వ్యక్తపరుపగల వ్యంజకము ఉపస్థితమైనపు డవి వ్యక్తములగును. కాబట్టి అభివ్యంజక సాన్నిధ్యమే కారణము. అభివ్యంజకమున కే సంస్కారములు సమీపములో యవియే వ్యక్తములగును. వ్యవహితములట్లుకావు. మార్జాలవాసనలకు అభివ్యంజకము ఆవాసనలకునిమిత్తములైన పూర్వ కర్మాశయములకు సంబంధించినదై యిప్పుడు పచ్యమానమగు మార్జాలకర్మమై యున్నది. అయ్యది మనుష్యవాసనలకుకాదు. వాసన కర్మమువలన నేర్పడును. స్మృతి వాసనవలన కలుగును. స్మృతివలన మరల వాసనకలుగును. వాసనవలన మరలకర్మము కలుగును. ఆకర్మము తనకభివ్యంజక మగు దేశకాలాది నిమిత్తము ద్వారమున ఫలమునిచ్చుట కభివ్యక్తమగును. దానిచే నభివ్యక్తము లైనవాసనలు సన్నిహితములై పూర్వజన్మమునం దేవిషయమునకు సంబంధించినవై యనుభవముచే సంచితము లైనవో అవిషయమునకు సంబంధించిన స్మృతినే యిప్పటి మార్జాలజన్మమునందు కలిగించును. కాని, మనుష్యజన్మమునం దనుభవించిన విషయమునకు సంబంధించినస్మృతిని కలిగింపవు. స్మృతి, సంస్కారములు రెండును ఏకరూపములగుటయే యిందులకు కారణము.

ప్రథమ జన్మమునందు పూర్వవాసనలుండవు. కాబట్టి యంప్రారంభించిన (ప్రారబ్ధ) కర్మము వలన నెట్టివాసనలు నభివ్యక్తములుకావుకదా? అప్పుడు ప్రాణులు తమతమ జాతికి యోగ్యమయిన భోగమునం దెట్లు ప్రవర్తింప గలిగినవనఁ—

"తాసామనాదిత్వం చాశిషో నిత్యత్వాత్" ౧౦

ఆశిషః= (నేను చావకుండునుగాక! ఎల్లపుడు నుండునుగాక!) అను ఆత్మస్పృహ, నిత్యత్వాత్ = నిత్యమగుటవలన, తాసామ్ = వాసనలకును, అనాదిత్వంచ=అనాదిత్వము కలదు.

'నేనుచావకుండునుగాక!సదాజీవింతునుగాక!'అనుమరణ భయము పూర్వమెన్నడు మరణదుఃఖము ననుభవింపని ప్రాణికి కలుగనేరదు. పుట్టినశిశువున కాజన్మమునందు మరణమువలన కలుగు దుఃఖము ప్రత్యక్షానుమాన-ఆగమములలో నేర్పరచి మరణముచేతను కలుగనేరదు. కాబట్టి స్వాభావిక మన జెల్లదు. కాని మరణదుఃఖస్మృతి మరణభీతివలన చూడబడుచున్నది. ఖడ్గాదులతో నెవడేని శిశువును కొట్టబోగా నాశిశువు మరణ దుఃఖమును సంస్మరించికదా కంపించు చున్నది? అట్టి స్మృతి వాసనలేక కలుగజాలదు. వాసన యనుభవము వలనగాని కలుగదు. అనుభవ మీ జన్మమునందు కలుగలేదు; కాబట్టి పూర్వజన్మమునకు సంబంధించిన దనక తప్పదు. పూర్వజన్మము నందును ఇట్లే మరల ఊహింపనగును. కాబట్టి వాసన అనాది యగును. అపుడు ప్రథమజన్మమిది యని యేదియు నిర్ణయింప వీలుకాదు. వాసనవలె దానికిహేతు వైనజన్మమును అనాది యగు ననిభావము.

వాసన అనాది యని సిద్ధపడిన చిచ్ఛక్తినలె నదియు నిత్యమగును. అది యెన్నడు నశింపజాలదన:—

"హేతుఫలాశ్రయాలంబనైః సంగృహీతత్వా
దేషా మభావే తదభావః" ౧౧

వాసనలు, హేతుఫలాశ్రయాలంబనైః = హేతువు, ఫలము, ఆశ్రయము, ఆలంబనము, ననువానిచే, సంగృహీతత్వాత్ = సంచితములగుటవలన, ఏషామ్ = హేత్వాదుల, అభావే=వినాశముకలుగగా, తదభావః= వాసనలు నశించును.

ఇందు అవిద్యాదిక్లేశములు, శుక్లాదికర్మములును హేతువనబడును. జాతి (జన్మము), ఆయువు, భోగము నీమూడును ఫలము; సాధికారచిత్తమ్ము (చరితార్థముకానిది) ఆశ్రయము; శబ్దాదివిషయములు ఆలంబనము అని వ్యవహరింపబడును.

కర్మాశయములు క్లేశములవలన కలుగును. క్లేశములు అవిద్యవలన నేర్పడును. కాబట్టి యవిద్య 'రాగద్వేషములు, సుఖదుఃఖములు, ధర్మాధర్మములు, నను ఆరు ఆకులుగల సంసారచక్రమును నడుపునదై వాసనలకు హేతువగుచున్నది. ఫలము, ఆశ్రయము, ఆలంబనము నను నీమూడును అవిద్యచే వ్యాప్తములై యుండును. అందుచే నవిద్య నివర్తించిన నవియు తొలగును. అట్టి యవిద్య ప్రసంఖ్యానబలమున నశించును. అవిద్యనశింపగా దాని నాశ్రయించిన వాసన లనాదులయ్యు నశించును. ఆశ్రయనాశ మాశ్రితనాశనమునకు కారణము. అనాదివాసనలు నశించినపుడు అనాదియైన చిచ్ఛక్తిమాత్ర మేలనశింప దనవలనుపడదు. చిచ్ఛక్తికి నాశకారణమేదియు లేదు. కాబట్టి చిచ్ఛక్తియుదాహరణముతో వాసనల నిత్యత్వము సాధింప వీలులేదని భావము.

యోగులు సత్కార్యవాదులు; కాబట్టి వినాశకారణమున్నను వాసన లెట్లునశింపగలవను:—

"అతీతానాగతం స్వరూపతో ఽస్త్యధ్వభేదాత్ ధర్మాణామ్" ౧౨

ధర్మాణామ్=వాసనాది ధర్మములయొక్క, అధ్వభేదాత్=భూతభవిష్యద్వర్తమానలక్షణ కాలభేదమువలన, అతీతానాగతం=(వినాశముపొందినది అతీతమనబడును. భవిష్యత్తున వ్యక్తమగునది అనాగతమనబడును.) ఇట్టి అతీతానాగత ధర్మములద్వయము, స్వరూపతః=అతీతానాగత లక్షణరూపమున, అస్తి=ఉన్నది.

వాసనలు స్వరూపనాశము నందవు. వాసనలందు అతీతత్వము అనాగతత్వము కలుగుటయే వానినాశ మనబడును. అందువలన సత్కార్యవాదమునకు క్షతికలుగదు. అతీతత్వాది రూపమున చిత్తమునందు వాసనలున్నచో చిత్తము పూర్వము వలె సాశయమై (కర్మాశయములతో యుక్తమై) భోగహేతువగుననరాదు. వర్తమానత్వ లక్షణముగల వాసనలతో కూడిన చిత్తమే సాధికారమగును – భోగహేతువగును.

ఈ ధర్మములన్నియు పరమార్థమున నెట్టివన:—

"తే వ్యక్తసూక్ష్మా గుణాత్మానః" ౧౩

వ్యక్తసూక్ష్మాః = (వర్తమానములు వ్యక్తములు; అతీతానాగతములు సూక్ష్ములు) వ్యక్తములు, సూక్ష్ములైన, తే=మహదాది ప్రకృతికార్యములన్నియు, గుణాత్మానః=గుణస్వరూపములే.

యోగశాస్త్రమున ప్రకృతి, దానివికారము లైన మహదాదులు భిన్నాభిన్నములని యంగీకరింపబడినందున, ప్రకృతి

భూతము లైన గుణములు (సత్త్వరజస్తమములు) పరిణామి నిత్యములు. వానివికారము లైన సర్వభావపదార్థములు (ధర్మములు)ను ప్రకృతియైన గుణత్రయముకంటె నభిన్నము లైనంచున (భిన్నములు కానంచున) నిత్యము లైనప్పటికి స్వరూప నిత్యములు కావు; నశ్వరములే. పురుషుడుమాత్రము కూటస్థ నిత్యుడు.

గుణములు త్రాత్మకములగుటచే 'ఒకశబ్దము, ఒక యింద్రియము, ఒకభూమి' అని గుణాత్మకవస్తువులలో నేకత్వ మెట్లుచెప్పబడునన:—

"పరిణామైకత్వా ద్వస్తుతత్వమ్" ౧౮

పరిణామైకత్వాత్ = పరిణామ మేకమగుటవలన, వస్తు తత్వం=వస్తువులు (శబ్దాదులు) గుణత్రయపరిణామములగుటచే నేకత్వము వస్తుతత్వ మగుచున్నది.

వత్తి, తైలము, అగ్ని, వీని పరిణామము దీపము. అది యొక్కటే. అట్లే సత్త్వరజస్తమములు మూడైనను వాని పరిణామముగా నేర్పడు శబ్దాదివస్తువుసైతము ఒక్కటియే యని భావము.

విజ్ఞానమునకు మించి మరియొండేదియు లేదు. అట్టి యెడ భావపదార్థములు త్రిగుణాత్మకములనియు త్రివిధము లనియు నననేలయన:—

"వస్తుసామ్యేఽపి చిత్తభేదా త్తయో ర్విభక్తః పంథాః" ౧౫

వస్తుసామ్యేఽపి=విషయమున భేదములేకున్నను చిత్త భేదాత్ = ఆవిషయమునకు సంబంధించిన జ్ఞానములలో భేదము

కనబడుటవలన, తదేకాకార = వస్తువు (గ్రాహ్యము) చిత్తము (గ్రహణము) నను రెంటియొక్క, విభక్తప్రపంచాకార=మార్గము భిన్నము.

బౌద్ధులలో విజ్ఞానవాదులు విజ్ఞానమునకు మించి వేరొండుపదార్థము నంగీకరింపరు. జ్ఞానముచేతనే వస్తుప్రస్న దనియు, అది యిట్టిదనియు తెలియుచున్నది. జ్ఞానములేకున్న వస్తువున్నట్లు తెలియదు. కాబట్టి జ్ఞానమే పదార్థము. అంతకు మించి మరియేమియు లేదని యందురు. 'లోకమున వ్యవహరింపబడు ఘటపటాదివస్తువులు స్వస్వరూపమున నలీకములై అనాది వాసనవలన ప్రతిచిత్తము కల్పితములై తోచుచున్నవి. అవి చిత్తమేకాని వేరుకావు.' అను నీవిజ్ఞానవాదము యుక్తముకాదు. చిత్తమునకుమించి చిత్తమునకు విషయ మగువస్తు వొండు లేకున్నచో ఒకవస్తువనేకచిత్తములకు విషయము కాకుండవలయును. మతియును 'అదేయిది' యను ప్రత్యభిజ్ఞయు కలుగకుండవలయును. ఒకచిత్తమువలన కల్పిత విషయము ఇతరులచిత్తములకు విషయమెట్లు కాగలదు ? లోకమున నిందులకు విపరీతముగ నొకవస్తు వనేకచిత్తములకు విషయ మగుట చూచుచున్నాము. అంతేకాక 'అదేయిది' యని ప్రత్యభిజ్ఞయు కలుగుచున్నది. కాబట్టి చిత్తమునకుమించి వేరేవస్తువు చిత్తమునకు విషయ మగునది యున్నదనియే యంగీకరింపవలయును.

'చిత్తవ్యతిరిక్తముగా విషయభూతవస్తువు సర్వథా లేదనము. కాని, చిత్తక్షణమునకు పూర్వోత్తర క్షణములలో

చిత్తమునకు మించి వేరువిషయము లేదంపము. చిత్తమున్న పుడొకదా విషయము తెలియును. కాబట్టి నానాచిత్తము లకు విషయము కాదగు వస్తువొండులేదు.' అన:—

"న చైకచిత్తతంత్రం వస్తు తదప్రమాణకం తదా కింస్యాత్" ౧౬

వస్తు=ఘటాది గ్రాహ్యవిషయము, ఏకచిత్తతంత్రం = ఏకచిత్తాధీనము–ఏకచిత్తసమయమున మాత్రముండునది, నచ= కాదు. తదా=ఆచిత్తమే యితరవస్తువున సంలగ్నమైనపుడు, తత్=ఆవస్తువు, అప్రమాణకం = ప్రమాణమైనచిత్తముచే గ్రహింపబడనిదై, కింస్యాత్ = ఏమగును? వినష్టమగునా? లేక పూర్వమువలె నుండునాయని ప్రశ్నముకలుగును.

చిత్తమునకు వ్యతిరిక్తముగా నొకవస్తువు చిత్తక్షణమున నుండియన్యక్షణముననుండదని యంగీకరించినట్లయిన ఆవస్తువు చిత్తకారణకమా? లేక అన్యకారణకమా? అని యడుగవలెను. చిత్తకారణకమేయనిన పూర్వవిజ్ఞానవాదమున నేదోషముచెప్ప బడినదో యదియే యిటప్రసక్తమగును. అన్యకారణక మంచు రేని, గ్రాహకమైన చిత్తము లేనపు డది యెట్లు నశించును? నాశకారణ మేదైన నుండవలయునుకదా? గ్రహణము లేనంత మాత్రమున గ్రాహ్యము నశింపవలయు ననునియమము లేదుకదా! విషయము నశింపక యట్లేయుండగల దనిన ఏక చిత్తతంత్రము–ఏకచిత్తవిషయక మన నెట్లుచెల్లును? ఇతర చిత్తములకు నది విషయమై సాధారణమే యగును. అట్లే యొకవస్తు వనేక చిత్తములకు విషయమగుట లోకమున

చూచుచున్నాము. కాబట్టి ఏకచిత్తతంత్రమే వస్తుసిద్ధులు యెట్లును తగదు.

ఘటపటాదివస్తువులు చిత్తముకంటె భిన్నములే యైన నెల్లపుడు చిత్తముచే నేలగ్రహింపబడవన:—

"తదుపరాగాపేక్షితత్వాత్ చిత్తస్య వస్తు జ్ఞాతాజ్ఞాతమ్" ౧౭

చిత్తస్య = చిత్తమునకు వస్తువులజ్ఞానము కలుగుటకు, తదుపరాగాపేక్షితత్వాత్ = ఇంద్రియములద్వారమున వస్తువులతో చిత్తము సంబద్ధమై వాని యాకారమును పొందుట అవసరము కాబట్టి, వస్తు=ఘటపటాదివస్తువులు, జ్ఞాతాజ్ఞాతం= సంబంధముకలిగినచో జ్ఞాతములు, సంబంధము కలుగకున్నచో అజ్ఞాతములు అగును.

ఘటపటాదివస్తువులు అయస్కాంతమణి వంటిది. అయస్కాంతమణి వంటిది. అయస్కాంతమణి లోహగుణమువంటి గుణముగల పరిణామస్వభావియగు చిత్తమును తమవంక ఆకర్షించి తమలో కలుపుకొని రంజిత మొనర్చును—తమయాకృతిని చిత్తమునకు కలిగించును. ఏవస్తువుతో చిత్తముకలిసి దాని యాకారమును తానుపొందునో యా వస్తువు తెలియబడును. ఇతరములు తెలియబడవని భావము.

అటులయిన నాయా వస్త్వాకారచిత్తవృత్తులు నెల్లపుడు తెలియబడకుండవలయునుకదా! యన:—

"సదా జ్ఞాతాశ్చిత్తవృత్తయస్తత్ప్రభోః
పురుషస్యాపరిణామిత్వాత్" ౧౮

తత్ప్రభోః=చిత్తసత్వమునకు స్వామియైన, పురుషస్య= జీవాత్మ, అపరిణామిత్వాత్ = పరిణామస్వభావము లేనిదగుట వలన, చిత్తవృత్తయః=ఆయా విషయాకారములుగల చిత్తసత్వ జ్ఞానములు, సదా = యెల్లపుడును, జ్ఞాతాః = గ్రహింపబడు చుండును.

చిత్తమువలె దానికిస్వామి యైనజీవాత్మయు (పురు షుడు) పరిణామము నొందుస్వభావము గలిగియుండినచో శబ్దాది విషయములవలెనే శబ్దాదివిషయక చిత్తవృత్తులును జ్ఞాతములు, అజ్ఞాతములు నై యుండెడివి. పరిణామము చెందినపుడు తెలియ బడి చెందనపుడు తెలియబడ కుండుట సంభవ మనిభావము. కాని పురుషుడు పరిణామికాడు. అతడు కూటస్థనిత్యుడు. కాబట్టి చిత్తవృత్తు లతనికి సదాజ్ఞాతములే యగును కాని యజ్ఞా తములు కాజాలవు.

వైనాశికుని మతముననుసరించి శంకించి సమాధానము చెప్పుచున్నాడు. 'చిత్తమే ఆత్మ; అంతకుమించి వేరేమియు లేదు. చిత్తమే అగ్నివలె స్వయముగా భాసించుచు వస్తువులను భాసింపజేయును. కాబట్టి చిత్తము స్వప్రకాశము, ఋణిక మును' అనఁ:—

"న తత్స్వాభాసం దృశ్యత్వాత్" ౧౯

తత్ =చిత్తము, దృశ్యత్వాత్ =దర్శనమునకు విషయ మగుటవలన, ఘటాదులవలె జడము పరిణామి యగుటవలనను, స్వాభాసం=స్వయంప్రకాశము, న=కాదు.

చిత్తము దర్శనమునకు విషయము. మఱియు నది ఘటపటాదులవలె జడము, పరిణామము గొనునదియును కాబట్టి అగ్నివలె స్వప్రకాశ మెన్నటికిని కాదు.

"ఏకసమయే చోభయానవధారణమ్" ౩౦

చ=మఱియు, ఏకసమయే=ఒకేక్షణమున, ఉభయానవధారణమ్=చిత్తము, చైత్తము (విషయము) నను రెంటిను తెలియబడవు.

వైనాశికులు క్షణికవాదులు. కావున చిత్తము క్షణికము– ఒక్కక్షణముమాత్ర ముండును. అన్యక్షణమున నశించును. క్షణికవాదుల మతమున చిత్తమొక్క– యుత్పత్తి క్రియయే దానికి కారకము కావలసివచ్చును. ఇతరుల మతమున ముందు ఉత్పత్తి, తరువాత క్రియ, అట్టిపై కారకము నగును. వైనాశికు లిట్లే చెప్పియున్నారు. "భూతి ర్యేషాం క్రియా సైవ కారకం సైవచోచ్యతే" ఉత్పత్తిక్రియయే కారకమని యభిప్రాయము. ఉత్పత్తిరూపక్రియతో తనను తెలిసికొనును. కాని యాక్రియతో నేయితరపదార్థమును తెలిసికొన వలనుపడదు. ఒకేవిధమగుక్రియ విలక్షణములైన రెండు కార్యముల నుత్పన్నముచేయజాలదు. ఒకేక్షణమున తనను తెలిసికొనువ్యాపారమువలన ఇతరజ్ఞానముగూడ కలుగు చెట్లు పొసగును? రెండవక్షణమున తెలిసికొన గలుగునంచు మనిన-చో చిత్తము క్షణికముకావున రెండవక్షణమున నదియుండదు. అట్టియెడ చిత్తము స్వప్రకాశకమై పరప్రకాశ మెట్లుకాగలదు?

కాబట్టి వైనాశికులమత మెవ్విధమునను సంభవముకాదని భావము.

చిత్తము విషయము నెఱుగును. అట్టి విషయజ్ఞాన మనెడి చిత్తమును వెంటనేకలుగు మఱియొక చిత్త మెఱుంగ గలదు. కాబట్టి దోషము లేదన:—

"చిత్తాంతరదృశ్యే బుద్ధిబుద్ధే రతిప్రసంగః స్మృతిసంకరశ్చ" ౨౧

చిత్తాంతరదృశ్యే=మరియొక చిత్తముచే గ్రహింపబడి నట్లంగీకరించిన, బుద్ధిబుద్ధేః = (స్మృత్యజ్ఞానము=బుద్ధి అదియే విజ్ఞానాత్మవాదుల చిత్తము.) ఇట్టి చిత్తము విషయముగాగల చిత్తమునకు, అతిప్రసంగః=అతిప్రసక్తికలుగును. అందువలన, స్మృతిసంకరశ్చ=వానివలన కలుగుస్మరణమును సంకరమగును.

చిత్తము నీలవర్ణమును గ్రహించుననుకొనుము. ఆ నీల వర్ణాకారమున మారిన వృత్త్యజ్ఞాన మనెడిచిత్తము తదనంతర మున కలిగిన చిత్తమునకు విషయ మగునెడల నీరెండవచిత్త మును చిత్తమే కాబట్టి యది మరియొకచిత్తమునకు విషయ మగును. అదియు మరియొకదానికి. ఇట్లు విరామముండదు. ఇట్టియెడ నీలవిషయక చిత్తమొకటి. అది విషయముగాగల నీలచిత్తచిత్తము రెండవది. అదియు విషయమైన నీలచిత్త చిత్తచిత్తము మూడవది యగును. అదియు మరియొకదానికి విషయమగును కాబట్టి నాలుగవది నీలచిత్తచిత్తచిత్తచిత్త మగును. ఇట్లు వీని కంతముండదు. ఇట్లైన స్మృతినియమమును నుండదు. చిత్తము లనేకములు. వానివలన సంస్కారము

లుమ్మడ్డములైన నొకేక్షణమున ననేకస్మృతు లేర్పడును. వివేకము కలుగనేరదు. కాబట్టి రెండుదోషము లేర్పడునని భావము.

చిత్త మిట్లు స్వాభాసముకాక చిత్తాంతర దృశ్యమును కాకపోయినచో నది పురుషునిచే నెట్లు తెలియబడును? చిత్తమునకు ఇంద్రియముద్వారమున వస్తుసంబంధము కలుగు నట్లు పురుషసంబంధము లేదుకదా? యన:—

"చితేరప్రతిసంక్రమాయా స్తదాకారాపత్తౌ స్వబుద్ధిసంవేదనమ్"౨౨

అప్రతిసంక్రమాయాఃా (విషయసంబంధమునకు హేతు వయిన వృత్తియనెడు సంచారము ప్రతిసంక్రమమనబడును.) ప్రతిసంక్రమములేని, చితేఃా=చిచ్ఛక్తికి—పురుషునకు, తదాకారా పత్తౌ = చిత్తమునందు ప్రతిబింబితమగుటచే చిత్తాకారమునకు సమానమైన ఆకారము కలుగగా, చైతన్యమొక్క— ప్రతి బింబిమును పొందిన చిత్తమును పురుషు డనుకరించుచున్న ట్లుండుటయే, స్వబుద్ధిసంవేదనం=స్వామియైనపురుషుడు తనకు భోగ్యమైన బుద్ధిని—చిత్తమును తెలిసికొనుటయగును.

పురుషుడు పరిణామికాకపోవుటవలన వృత్తియనెడి ప్రతి సంక్రమణములేక, చిత్తముతో సంబద్ధుడు కానిమాట వాస్త వమే; కాని, సామీప్యమువలన పురుషుడు చిత్తసత్వమున ప్రతిబింబించును. అట్లు ప్రతిబింబించి, విషయాకారతను భొందిన చిత్తాకారమును పొందినవాడై చూచుచున్న—తెలిసికొనుచున్న బుద్ధిని అనుకరించుచున్న ట్లుండును. ఇదియే పురుషుని ద్రష్టృ

త్వము. కాబట్టి పురుషుడు ద్రష్ట. చిత్త మతని దృశ్యము నని భావము.

ఇట్లు బుద్ధి పురుషుడు వేరువేరుగనుండ విజ్ఞానవాదులాకేచిత్తమును ద్రష్టృదృశ్యములుగ నేలభావించుచున్నారన:-

"ద్రష్టృదృశ్యోపరక్తం చిత్తం సర్వార్థమ్" ౨౩

ద్రష్టృ దృశ్యోపరక్తం=చేతనపురుషుడు ద్రష్ట; శబ్దాది విషయములు దృశ్యము; ఈ రెంటితోను, ఉపరక్తము-ప్రతిబింబములతో కూడినదై, చిత్తం=చిత్తము, సర్వార్థం = గ్రహీత, గ్రహణము, గ్రాహ్యము, అను భిన్నార్థముల యాకారముకలదై యున్నది.

స్ఫటికమణి కొకవైపున నీలవర్ణముగల నీలమణిని, మఱియొకవైపున రక్తవర్ణముగల కెంపును నుంచిన నా స్ఫటికము వాని ప్రతిబింబములతో కూడి త్రివర్ణములుగలదిగ భాసించును. అట్లే చిత్తసత్వమునకు సమీపమున నున్న పురుషుడాచిత్తమునందు ప్రతిఫలించును. బాహ్యవస్తువులును ఆచిత్తమున ప్రతిబింబించును. ఇందు పురుషుడుద్రష్ట-గ్రహీత; బాహ్యవస్తువులు గ్రాహ్యములు-విషయములు. చిత్తము స్వయముగ గ్రహణము-జ్ఞానము. ఈ మూడు నొకచో సమావేశమైయున్నట్లు చిత్తము గ్రహీతృగ్రహణగ్రాహ్యరూపమై యొప్పుచుండును. ఇట్లు త్రిరూపమున భాసించుచిత్తము విషయములో భ్రాంతులైన విజ్ఞానవాదులు వివేకింపజాలక చిత్తమే యాత్మయందురు. కాబట్టి వా రనుకంపనీయులు. ద్రష్టృదృశ్యములచే నుపరక్తమైన చిత్తము వారిభ్రాంతికి కారణ మనిభావము.

సుఖదుఃఖముల ననుభవింపజేయుటకు హేతువైన చిత్ర విచిత్రవాసనలతో కూడిన చిత్తమే యాత్మగా నంగీకరించి దానికి భిన్నముగా నొకభోక్త-జీవాత్మ నంగీకరింపకున్నచో గౌరవము కలుగదు గదా! యన:—

"తదసంఖ్యేయవాసనాభిశ్చిత్రమపి
పరార్థం సంహత్యకారితత్వాత్" ౨౪

అసంఖ్యేయవాసనాభిః=విపాకకారణము లైనఅసంఖ్య వాసనలతో, చిత్రమపి=చిత్రితమైనను చిత్తము, సంహత్యకారితత్వాత్=దేహేంద్రియాదుల సహకారముతో కలిసి ప్రయోజనకారి యగుటవలన, పరార్థమ్=పురుషుని భోగాపవర్గముల కొఱకే యగును. తనకొఱకుకాదు.

లెక్కింప వీలులేనన్ని సంస్కారములు, వానివలన కలుగు విపాకములు చిత్తమునే ఆశ్రయించుకొని ఉండుట మాత్రమున నది భోక్తకాదు. నానావిధ పదార్థములతో నిర్మింపబడిన యొక గృహ మెట్లు ఇతరుల కుపకరించునో యట్లే, శరీరము ఇంద్రియములు మున్నగువానితో కలిసి చిత్తము ప్రయోజనకారి యగుచున్నది. కాబట్టి యది పరార్థమగుచున్నది. అది యెవరికొఱకు భోగాపవర్గములను సాధించుచున్నదో యతడే పురుషుడు-భోక్త-యని భావము.

జన్మాదిసిద్ధులద్వారా కైవల్యమునకు యోగ్యమైనచిత్తమును తెలిపి దానివలన అర్థవివేకపూర్వకమైన కైవల్యమునకు మూలకారణ మగు వివేకము పురుషునకు యుక్తిగా చెప్ప

బడినది. అట్టివివేకము దర్శించు స్వభావముగల యధికారిపురు షున కీక్రమికలుగునని:—

"విశేషదర్శినః ఆత్మభావ భావనావినివృత్తిః" ౨౫

విశేషదర్శినః=వివేకమును సాక్షాత్కారము చేసికొనిన యోగ్యస్వక్తికి, ఆత్మభావభావనా వినివృత్తిః = నేనెవడను ? ఎట్లయితిని? ఇదియేమి? ఇది యెట్లేర్పడినది? ఏమగుదుము? ఎట్లగుదుము? అను నిట్టిజిజ్ఞాస తొలగిపోవును.

చిత్తసత్వము, పురుషుడు ననుసీరెంటి విశేషమును బాగుగా గుర్తించినపుడు 'ఇది యంతయు విచిత్రమైన చిత్త పరిణామమే. పురుషునకు సంబంధించినది కాదు. శుద్ధుడైన పురుషుడు అవిద్యతొలగగానే చిత్తధర్మములతో సంబద్ధుడు కాక శుద్ధుడగును'అని తెలిసికొనును. అప్పుడు సూత్రార్థమున చూపించిన (ఆత్మభావన) జిజ్ఞాసతొలగి స్వస్థుడగు ననిభావము.

జిజ్ఞాసతొలగిన విశేషదర్శి చిత్తమెట్లుండునని:—

"తదా వివేకనిమ్నం కైవల్యప్రాగ్భారం చిత్తమ్" ౨౬

తదా=అప్పుడు, చిత్తం=చిత్తసత్వ మనెడి జలము, వివేకనిమ్నం=వివేకమనెడి (ప్రవహింప యోగ్యమైన) నిమ్న ప్రదేశముకలదై, కైవల్యప్రాగ్భారం=మోక్షమనెడి ప్రవాహా వధి యైన ఉన్నతప్రదేశము కలదగును.

విశేషమును దర్శించిన పురుషుని చిత్తము విషయాభి ముఖ్య మనెడియజ్ఞానమార్గమున సంచరించుటమాని వివేక మార్గమున నడచి కైవల్యాభిముఖ మగునని భావము.

లోకమున వివేకులకును వ్యుత్థానచిత్తవృత్తులు కలుగ కారణమేమనఁ—

"తచ్ఛ్రిద్రేషు ప్రత్యయాంతరాణి సంస్కారేభ్యః" ౨౭

తచ్ఛ్రిద్రేషు = వివేకప్రత్యయమునకు మధ్య మధ్య, ప్రత్యయాంతరాణి = ఇతరప్రత్యయములు, సంస్కారేభ్యః = వ్యుత్థానఅనుభవము కలిగిన సంస్కారముల వలన కలుగు చుండును.

వివేకప్రత్యయము కలిగినతరువాతను అప్పుడప్పుడు వ్యుత్థానఅనుభవముచేకలుగుసంస్కారమువలన వ్యుత్థానప్రత్యయములు కలుగవచ్చుననిభావము.

వానిని తొలగించుకొను నుపాయమెద్దియన:—

"హానమేషాం క్లేశవదుక్తమ్" ౨౮

ఏషామ్=ఈవ్యుత్థాన సంస్కారముల, హానమ్=నివృత్తి, క్లేశవత్=క్లేశములను తొలగించినట్లు, ఉక్తమ్ = తొలగింప వలయు ననిచెప్పినట్లే భావింపవలయును.

క్రియాయోగాదులద్వారా అవిద్యాదిక్లేశము లెట్లు క్షీణింపజేయబడి తొలగింపబడునో యట్లే వ్యుత్థానసంస్కారములను తొలగింపవలెను. వీనికి వేరుగ ఉపాయము చెప్పనక్కరలే దనిభావము.

"ప్రసంఖ్యానేఽప్యకుసీదస్య సర్వథా
వివేకఖ్యాతేః ధర్మమేఘః సమాధిః" ౨౯

ప్రసంఖ్యానేఽపి= వివేకఖ్యాతియందును, అకుసీదస్య= అనురక్తుడు కానియోగికి, సర్వథా=అన్నివిధములను – యెల్ల పుడు, వివేకఖ్యాతేః=వివేకఖ్యాతికలుగుటవలన, ధర్మమేఘఃక్లైవల్యఫలము నొసంగు క్లేశములను నిర్మూలమొనర్చు ధర్మ మేఘమనెడి (ధర్మంమేహతి–ధర్మమును వర్షించు) సమాధిః= యోగము కలుగును.

యోగికి వివేకఖ్యాతికలిగినపుడు ఆ వివేకఖ్యాతిని పరి ణామముగానెంచి దానియందు నతడు విరక్తుడైనచో వ్యుత్థాన సంస్కారము లుదయింపవు. అట్టియెడ జ్ఞానము పరిపక్వమై ధర్మమేఘసమాధి యేర్పడును.

సంప్రజ్ఞాతసమాధికి ఫలము వివేకఖ్యాతి – ప్రసంఖ్యానము. దాని పరాకాష్ఠయే ధర్మమేఘసమాధి. అప్పుడు వ్యుత్థానసంస్కారము లుదయింపనేరవు. ధర్మమేఘసమాధి వలన జ్ఞాన ప్రసాద మనెడి పరవైరాగ్య ముదయించును. పర వైరాగ్యమువలన వివేకఖ్యాతియు నిరుద్ధమగును. అటుపై నిర్బీజసమాధి కలుగు ననిభావము.

వివేకఖ్యాతివలన ధర్మమేఘసమాధికలిగినకలుగనిమ్ము. క్లేశహీన మెట్లుకలుగు ననుప్రశ్నమునకు సమాధానమేమన:–

"తతఃక్లేశకర్మనివృత్తిః" 30

తతఃధర్మమేఘసమాధివలన, క్లేశకర్మ నివృత్తిః = వాసనలతోకూడిన అవిద్యాదిక్లేశములు వానివలనకలుగు శుక్ల కృష్ణాదికర్మములు నన్నియు నివర్తించును–తొలగిపోవును.

ధర్మమేఘసమాధి యుదయించినతమపరి అవిద్యాదిక్లేశ ములుకానీ, వానివలన జనించు శుక్లాదికర్మములుకానీ మరల జనింపనేరవు. ఇట్టిస్థితియందే నిర్మలప్రసంఖ్యానము కలవాడై యోగి జీవన్ముక్తు డనిపించుకొనును.

క్లేశకర్మనివృత్తి కలిగిన నేమగునన:—

"తదా సర్వావరణమలాపేతస్య
జ్ఞానస్యానంత్యాత్ జ్ఞేయమల్పమ్" 30

తదా = క్లేశకర్మనివృత్తి కలిగినమీదట, సర్వావరణ మలాపేతస్య=చిత్తసత్వము నావరించు క్లేశములు, కర్మములు ననెడు మలములన్నియు తొలగినట్టి, జ్ఞానస్య=చిత్తసత్వము యొక్క, అనంత్యాత్ =అనంత ప్రకాశమువలన, జ్ఞేయం=చిత్త ముచే తెలియదగు చేతనాచేతనాత్మక మగు విషయజాత మంతయు, అల్పం=స్వల్పమగును.

చిత్తసత్వము స్వభావముచే ప్రకాశమయ మగుటవలన వస్తువులనన్నిటిని తెలుపగలిగినదే; కాని, రజస్తమోమయము లయిన క్లేశకర్మాది ఆవరణమలములచే నాచ్ఛాదితమై కొంచె మునే తెలుపును. ధర్మమేఘ సమాధికలిగినపు డాచిత్తసత్వము మేఘపటలము క్తమైన శరచ్చంద్రుని ప్రకాశము దశదిశలవ్యా పించి వస్తుజాతకము సువ్యక్తము చేయునట్లు, మలరహిత మై విషయములను ప్రకాశింపజేయును. నాడాచిత్తసత్వముచే తెలియబడనిది యొకింతయు నుండదు. అంతటి ప్రకాశము ఆ చిత్తసత్వమునకు కలుగునని భావము. ఇట్టి స్థితియే ధర్మ

మేఘసమాధి పరాకాష్ఠ యనబడును. ఈ పరాకాష్ఠయే జ్ఞాన ప్రసాదము. యోగికి కలుగు నీజ్ఞానప్రసాదమే పరవైరాగ్య మనబడును. ఇయ్యది వ్యుత్థాన సంస్కారములను దూరమొన ర్చును. చిత్తమును నిర్బీజసమాధియందు సంయోజింపజేయును.

ధర్మమేఘసమాధివలన జ్ఞేయమల్పమైననేమి? గుణ పరిణామక్రమము సమాప్తముకాలేదుగదా? కాబట్టి యోగికి మరల దేహారంభ మేలకలుగదన:—

"తతః కృతార్థానాం పరిణామ క్రమసమాప్తి ర్గుణానామ్" 3౩

తతః=జ్ఞానప్రసాదము కలిగినమీదట, కృతార్థానాం= పురుషునకు భోగాపవర్గములను కలిగించిన, గుణానాం=ప్రకృతి భూతములగు సత్వరజస్తమోగుణములయొక్క, పరిణామక్రమ సమాప్తి= దేహేంద్రియాది కార్యములనారంభించుట యను పరిణామక్రమము సమాప్తమగును.

పురుషునకు భోగాపవర్గములు కలిగించి కృతార్థములు కానంతవరకే గుణములు పరిణామముచెందును. దేహాదికార్య ములు నుత్పన్నముచేయును. ధర్మమేఘసమాధి కలుగుటయే గుణముల కృతార్థత. ధర్మమేఘసమాధి కలిగిన పురుషునియెడ గుణములు కృతార్థత సంపాదించినవై యతనికొఱకు దేహేం ద్రియాది ప్రకృతిపరిణామములను కలిగింపవు. కాబట్టి గుణ ముల పరిణామక్రమము సమాప్త మైనదని భావము.

గుణముల పరిణామక్రమమేమన:—

"క్షణప్రతియోగీ పరిణామాపరాంతనిర్గ్రాహ్యః క్రమః" 33

పరిణామాపరాంతనిర్గ్రాహ్యాః= (పూర్వధర్మముపోయి క్రొత్తధర్మముకలుగుట పరిణామము. అపరాంత మన విరామము. నిర్గ్రాహ్యాః=ఊహింపదగినది.) ధర్మాంతరోత్పత్తి విరామముచే నూహింపదగిన, క్షణప్రతియోగీ=క్షణికభావపదార్థము నిరూపకముగాగల పరిణామపౌర్వాపర్యము, క్రమః=క్రమ మన బడును.

ధర్మపరిణామము, లక్షణపరిణామము, అవస్థాపరిణామము నని పరిణామము త్రివిధము. అందు ధర్మపరిణామమునందును, లక్షణపరిణామమునందును గలక్రమము ప్రత్యక్షముకాగలదు; కాని అవస్థాపరిణామమునందలిక్రమము గోచరింపదు. అదియే ముఖ్యపరిణామము. ధర్మలక్షణపరిణామములు నిండే యిమిడియుండును. ఒకధర్మియందు (వస్తువునందు) పూర్వధర్మముపోయి క్రొత్తధర్మము కలుగుట అవస్థయే యగును. ఇట్లే యొకధర్మమున లక్షణాంతర మేర్పడుటయు నవస్థయే యగును. కాబట్టి పరిణామములన్నియు నవస్థామాత్రమైనను సూక్ష్మభేదమును గమనించి యాచార్యులు పరిణామము త్రివిధమనిరి. నూతనవస్తుమునందు కాలముగడచినతమపరిగమనింపబడు ప్రాతదనము అనెడు పరిణామ మొక్కమాటు కలుగదు. ముందు సూక్ష్మతమముగాను, అటుపై సూక్ష్మతరముగాను, తరువాత సూక్ష్మముగాను, అనంతరము స్థూలముగాను కలుగును. ఇట్లు చిట్టచివరకు ప్రత్యక్షమైన స్థూలపురాణత అనెడుపరిణామము దానికిపూర్వ మాయా క్షణములందు దృష్టిగోచరముకాని పరిణామావస్థలను అనుమింప

జేయును. ఈ యనుమితావస్థల పూర్వాపరతయే క్రమమన బడునని భావము.

గుణముల పరిణామక్రమము సమాప్తముకాగా పురుషున కేర్పడు కైవల్యలక్షణ మెట్టిదన:—

"పురుషార్థశూన్యానాం గుణానాం ప్రతిప్రసవః
కైవల్యం స్వరూపప్రతిష్ఠావా చితిశక్తిరితి" ౩౪

ఈసూత్రమునగల 'ఇతి' శబ్దము శాస్త్రపరిసమాప్తిని తెలుపును. పురుషార్థశూన్యానాం = భోగాపవర్గ ప్రయోజనములుకలిగించి కృతార్థములైన, గుణానాం=కార్యకారణరూపములైన బుద్ధ్యాదిగుణములయొక్క, ప్రతిప్రసవః=స్వస్వకారణములలో విలయమగుట, వా=లేక, స్వరూపప్రతిష్ఠా = తనరూపమునందున్న, చితిశక్తిః=పురుషుడు—చిచ్ఛక్తి స్వస్వరూపమున నుండుట, కైవల్యం = కేవలభావము — మోక్షమనబడును.

కార్యకారణాత్మకములగు గుణములు—బుద్ధ్యాది కార్యములు పురుషునకు భోగాపవర్గములను నిర్వర్తించిన మీదట కృతకృత్యములై స్వస్వకారణములందు లీనమగుచు నంతిమమగు ప్రధానమందు విలయమగును. (వ్యుత్థాననసమాధి నిరోధ సంస్కారములు మనస్సునందును, మనస్సు అస్మితయందును, అస్మిత మహత్తత్వము నందును, మహత్తత్వము అలింగమైన ప్రధానమందును ప్రలయము నొందును.) ఇట్టి గుణప్రలయమే లింగశరీరభంగ మనబడును. లింగశరీరభంగము వలన వృత్తి

సారూప్యముండనేరదు. కాబట్టి పురుషుడు స్వస్వరూపమున స్థితుడై బ్రహ్మమును నిరంతరము సాక్షాత్కరింప జేసికొని తత్స్వరూపమైన ఆనందము ననుభవించును. ఇంచు పురుషార్థ శూన్యములైన గుణముల ప్రతిప్రసవము—ప్రలయము—సిద్ధింప గానే పురుషుడు స్వస్వరూప స్థితుడగును. కాబట్టి గుణప్రల యమో లేక చిచ్ఛక్తిస్వరూప స్థితియో కైవల్యమనబడినదని భావము.

నిఖిలశాస్త్ర నిష్ణాత శ్రీమత్పండిత ముక్తిరామ
ఉపాధ్యాయశిష్య పండిత గోపదేవ విరచిత
'అంబా' వ్యాఖ్యాన సహిత
యోగదర్శనమున
కైవల్యపాదము.

భారతీ ప్రెస్, తెనాలి—1951.

అనుబంధము

విశిష్ట పదసూచి

అంగమే జయత్వము ౩౨
అంతరాయములు ౩౧
అంధతామిస్రము ౧౦, ౬౬
అక్లిష్టములు ౭, ౮
అచరితార్థము ౨౨
అజ్ఞానము ౮౫
అణిమ ౧౩౫
అణిమాదులు ౧౩౫
అతిక్రాంత భావనములు ౧౩౯
అతీతము ౧౧౯, ౧౫౫
అదృష్ట జన్మము ౬౮
అనవస్థితత్వము ౩౨
అనాగతము ౧౫౫
అనుమానము ౫౩
అనుమానప్రజ్ఞ ౫౩
అనుమాన ప్రమాణము ౯
అనుశాసనము ౧
అనుశ్రవము ౧౫
అన్వయము ౧౩౪
అపరవైరాగ్యము ౧౫, ౧౬
అపరాంతము ౧౭౧
అపవర్గము ౭౭, ౮౪
అపానము ౧౩౧
అభావితస్మర్తవ్యము ౧౩
అభినివేశము ౧౦, ౬౫
అభ్యాసము ౧౪
అమర్షము ౩౫, ౩౬
అర్థము ౪౭
అలబ్ధభూమికత్వము ౩౨
అలింగము ౪౯, ౮౦
అవస్థా పరిణామము ౧౧౫, ౧౧౮
అవిద్య ౧౦, ౬౨, ౬౩, ౮౫
అవిప్లవఖ్యాతి ౮౬
అవిశేషము ౮౫
అవిశేషములు ౯౭, ౮౦
అవిరతి ౩౨
అవ్యక్తము ౮౦
అవ్యపదేశ్యములు ౧౧౯
అశుద్ధి ౫౧
అసంప్రజ్ఞాతము ౭
అసంప్రజ్ఞాత సమాధి ౪, ౨౦
అసూయ ౩౫, ౩౬
అస్మిత ౧౦, ౧౯, ౬౩, ౬౪
అస్మితానుగత సంప్రజ్ఞాతసమాధి ౪౪
ఆదర్శము ౧౨౯
ఆధిదైవికారిష్టము ౧౨౪
ఆధిభౌతికారిష్టము ౧౨౪
ఆధ్యాత్మికారిష్టము ౧౨౪
ఆనందము ౧౮
ఆనందానుగత సంప్రజ్ఞాతసమాధి ౪౪
ఆనుశ్రవికములు ౧౫
ఆలంబనము ౫౦, ౧౫౪

ఆలస్యమ్ ౩౧
ఆలోకము ౧౩౫
ఆశ్రయము ౧౫౪
ఆసనము ౧౦౧, ౧౦౩
ఆస్వాదము ౧౩౯
ఇంద్రియ జయము ౧౦౯
ఈర్ష్య ౩౫, ౩౬
ఈశత్వత్వము ౧౩౫
ఈశ్వరుడు ౩౫, ౩౬, ౩౭, ౩౯
ఈశ్వరప్రణిధానము ౩౬, ౫౪, ౯౩
ఉదానము ౧౩౧
ఉదాహరణములు ౬౦, ౬౧
ఉదాహారవస్థ ౬౯
ఉద్గీతము ౧౧౭, ౧౧౯
ఉద్ఘాతము ౧౦౫
ఉపక్రమము ౧౩౩
ఋతంభరాప్రజ్ఞ ౫౨
ఏకాగ్రము ౩
ఏకాగ్రతాపరిణామము ౧౦౬,౧౦౭
ఏకాదశేంద్రియములు ౯౧
ఏకేంద్రియసంజ్ఞ ౧౩
ఐహికము ౬౯
ఐహికములు ౧౫
ఓషధిజసిద్ధి ౧౪౫
కథంభావము ౯౯, ౯౯
కర్మాశయము ౭౨
కాయికము ౭౨
కావ్యవిముక్తినామకప్రజ్ఞ ౯౭, ౯౯
కాలపరిమితి ౧౦౫
కాలసంకుచితము. ౯౨
కుంభకప్రాణాయామము ౧౦౪
కుశలుడు ౯౯
కూటస్థుడు ౩౦
కృష్ణములు ౧౫౦
కేవలకుంభక ప్రాణాయామము౧౦౬
కేవలుడు ౩౦
కైవల్యము ౫
క్రోష్టము ౩౭
క్రమము ౧౪౦, ౧౭౧
క్రియాయోగము ౫౭, ౫౯
క్లేశములు ౭, ౯
క్షేశములు ౫౬
క్షణము ౧౪౦
క్షిప్తము ౪
గుణములు ౧౪౪
గ్రహణము ౭౬
గ్రహణములు ౪౪
గ్రహీత ౪౪
ఘృణ
చరితార్థము ౭౨
చిచ్ఛక్తి ౧౧౪
చితిశక్తి ౫
చిత్తభూములు ౭
చిత్తచాలిన్యము ౫౬
చిత్తము ౭
చిత్తవిముక్తినామకప్రజ్ఞ ౯౯
చిత్తసమాధానము ౧

జన్మజసిద్ధి ౧౪౫
జన్మము ౯౮
జాత్యసంకుచితము ౯౫
జీవన్ముక్తుడు ౮౮
జీవాత్మ ౫౫
జ్ఞానము ౪౬
తనువులు ౬౦
తపస్సు ౫౭, ౯౩
తపోజసిద్ధి ౧౪౫
తమస్సు ౧౦, ౬౬
తాపనుఃఖము ౭౩, ౭౫
తామసములు ౫౫
తామిస్రము ౧౦, ౬౬
తీవ్రము ౧౦౫
తుల్యప్రత్యయములు ౧౧౭
దుఃఖము ౩౭
దృష్టజన్మము ౬౮
ద్రష్ట ౭౬, ౮౧, ౮౭
ద్రష్టృ ౫౫, ౬
ద్వేషము ౧౦, ౬౫
ధర్మపరిణామము ౧౧౫, ౧౧౮
ధర్మమేఘయోగి ౮౭
ధర్మమేఘసమాధి ౧౭
ధర్మ్య ౧౧౮, ౧౧౯
ధాతువులు ౧౭౬
ధారణ ౧౦౯, ౧౧౦
ధ్యానము ౭౩, ౧౧౦
నిద్ర ౧౦, ౧౧
నియమములు ౯౭, ౯౩
నిరుద్ధము ౪
నిరుపక్రమము ౧౭౩
నిరోధము ౧౧౪
నిరోధపరిణామము ౧౧౪
నిర్వికల్పుడు ౮౮
నిర్విచార వైశారద్యము ౫౫
నిర్విచార సంప్రజ్ఞాత సమాధి ౪౯
నిర్వితర్క సమాధి ౪౭
నిర్వితర్క సంప్రజ్ఞాత సమాధి ౪౭
నిర్బీజసమాధి ౭౦
నిర్మాణచిత్తము ౧౭౧
పంచతన్మాత్రములు ౮౧
పంచమహాభూతములు ౮౧
ప్రాంతభూములు ౮౮
పరవైరాగ్యము ౧౭, ౮౮
పరాపకారబుద్ధి ౩౫, ౩౬
పరిణామము ౧౭౧
పరిణామదుఃఖము ౭౭, ౭౩, ౭౫
పురుషుడు ౫౭
పూరకప్రాణాయామము ౧౦౪
ప్రకాశము ౪
ప్రకృతి ౧, ౮౦
ప్రకృతిపురుషవివేకజ్ఞానము ౧

ప్రకృతిలయులు ౨౧
ప్రచ్ఛర్దనము ౩౭
ప్రజ్ఞ ౨౩, ౯౭
ప్రజ్ఞాజ్యోతులు ౧౩౯
ప్రజ్ఞాప్రసాదము ౫౧
ప్రతిపక్షభావము ౯౪, ౯౫, ౯౬
ప్రతిపక్షభావన ౬౦
ప్రతిప్రసవము ౬౭
ప్రతిధర్మి ౧౧౫
ప్రతిసంక్రమము ౧౯౩
ప్రత్యక్‌చేతనము ౩౦
ప్రత్యక్షప్రమాణము ౯
ప్రత్యభిజ్ఞ ౧౩
ప్రత్యాహారము ౧౦౭, ౧౦౮
ప్రధానము ౮౦
ప్రమాణము ౯
ప్రమాణములు ౯
ప్రమాద ౩౧
ప్రయత్నము ౧౦౨
ప్రవృత్తి ౪
ప్రశ్వాసము ౩౩
ప్రసంఖ్యానము ౧౫, ౬౮
ప్రసంఖ్యానాగ్ని ౬౭
ప్రసన్నుడు ౩౦
ప్రసుప్తములు ౫౯, ౬౦
ప్రాకామ్యము ౧౩౫
ప్రాణము ౧౩౧
ప్రాణాయామము ౧౦౩, ౧౦౪
ప్రాతిభము ౧౨౯
ప్రాథమకల్పికులు ౧౩౯
ప్రాప్తి ౧౩౫
ప్రాయణము ౭౦
ఫలము ౧౫౪
బలము ౧౩౬
బీజము ౫౯
భవప్రత్యయము ౨౧
భవిష్యత్తులు ౧౧౯
భవిష్యదుఃఖము ౭౫
భావన ౧౪
భావితస్మర్తవ్యము ౧౩
భూములు ౪౪
భేదదర్శనము ౬౦
భోగము ౭౭, ౧౨౪
భోగాపవర్గార్థవత్త్వము ౧౩౪
భ్రమ ౪౫
భ్రాంతిజ్ఞానము ౪౭
భ్రాంతిదర్శనము ౬౦
మంత్రజసిద్ధి ౧౪౫
మధుప్రతీక ౨
మధుప్రతీకము ౧౩౭
మధుభూమికులు ౧౩౯
మధుమతి ౨
మధ్యము ౧౦౫
మహాదహంకారములు ౪౧
మహామోహము ౧౦, ౬౬
మహావ్రతము ౯౧, ౯౨
మహిమ ౧౩౫

మాత్ర ౧౦౫
మానసికము ౭౨
మిథ్యాజ్ఞానము ౯౫
మూఢము ౪
మృదువు ౧౦౫
మోహము ౧౦, ౬౬
మోక్షము ౧౭౨
యతమానసంజ్ఞ ౧౬
యమములు ౯౦, ౯౧, ౯౨
యత్రకామావసాయిత్వము ౧౩౫
యోగము ౧, ౨, ౭౯
యోగమలములు ౩౧, ౩౨
యోగలక్షణము ౨, ౩, ౪
యోగాంగములు ౯౯
రాగము ౧౦, ౬౪
రాజసములు ౪
రూపము ౧౩౬
రేచకప్రాణాయామము ౧౦౪
లఘిమ ౧౩౫
లక్షణపరిణామము ౧౧౫, ౧౧౯
లావణ్యము ౧౩౬
లింగమాత్రము ౯౦
వజ్రసంహననత్వము ౧౩౬
వర్తమానము ౧౧౯
వశిత్వము ౧౩౫
వశీకారము ౧౧౫
వశీకారసంజ్ఞ ౧౬
వస్తుసామాన్యము ౫౩
వాచికము ౭౨
వార్త ౧౭౯
వికల్పము ౧౦
విక్షిప్తచిత్తులు ౫౭
విక్షిప్తము ౪
విచారము ౧౯
విచ్ఛిన్నము ౬౦
వితర్కము ౧౯
వితర్కములు ౯౪, ౯౫
విదేహులు ౨౧
విధారణము ౩౭
విపర్యయము ౧౦
విపర్యయములు ౫౯
విపర్యయజ్ఞానము ౯౫
విపాకము ౬౯
విప్రకృష్టము ౫౧
విప్లవము ౯౬
వివేకజజ్ఞానము ౧౪౧, ౧౪౨, ౧౪౩
విశేషములు ౭౯, ౯౦
విశోక ౨, ౧౩౯
విషవతీప్రవృత్తి ౩౯
వీర్యము ౨౩
వృత్తి ౨
వృత్తిసారూప్యము ౭
వృత్తులు ౯
వేదన ౧౭౯
వైరాగ్యము ౧౫
వైశారద్యము ౫౧
వ్యక్తములు ౧౫౫
వ్యతిరేకసంజ్ఞ ౧౬
వ్యవహితము ౫౧

వ్యాధి ౩౧
వ్యానము ౧౩౧
వ్యుత్థితచిత్తులు
శబ్దప్రమాణము ౯
శక్తిసంపత్తి ౧౩౬
శాంతము ౧౧౭, ౧౧౯
శాస్త్రము ౧
శుక్లములు ౧౨౦
శుక్లకృష్ణములు ౧౨౪
శౌచము ౯౩
శ్రద్ధ ౨౩
శ్రవణము ౧౨౯
శ్రుతప్రజ్ఞ ౨౪౩
శ్వాసము ౩౩
సంతోషము ౯౩
సంప్రజ్ఞాతము ౮
సంప్రజ్ఞాతసమాధి ౩, ౪౩, ౪౪
సంయమము ౧౦౯, ౧౧౦
సంయోగము ౯౪
సంశయము ౩౧
సంస్కారదుఃఖము ౭౩, ౭౪, ౭౫
సంస్కారశేషము ౮
సత్త్వపురుషాన్యతాఖ్యాతి ౨౬౩
సప్తవిధప్రజ్ఞ ౯౭, ౯౯
సబీజసమాధి ౧౯, ౨౦
సమయసంకుచితము ౯౨
సమాధి ౩, ౨౩, ౧౧౦, ౧౧౧
సమాధిజసిద్ధి ౧౪౫, ౧౪౬
సమాధిపరిణామము ౧౧౬
సమాపత్తి ౪౭
సమాధిప్రజ్ఞ ౨౬౩
సమానము ౧౩౧
సమాహితము ౩
సమ్యక్ జ్ఞానము ౬౦
సర్వార్థత ౧౧౬
సవిచారసంప్రజ్ఞాతసమాధి ౪౯
సవితర్కము ౪౫
సవితర్క సంప్రజ్ఞాతసమాధి ౪౬
సాత్వికములు ౪
సాధికారచిత్తము ౨౧, ౨౨
సుషుప్తావస్థ ౧౧, ౧౨
సూక్ష్మము ౧౩౪
సూక్ష్మములు ౧౨౫
సోపక్రమము ౧౨౩
స్మృయము ౧౩౯
స్వరూపము ౧౩౪
స్వాధ్యాయము ౨౫, ౨౬, ౯౩
స్మృతి ౧౨, ౧౩, ౨౩, ౭౯
స్థితి ౪
స్ఫుటప్రజ్ఞాలోకము ౨౧
స్థూలము ౧౩౪
స్వానమ్ ౩౧
హానము ౯౫, ౯౬
హృదయగ్రంథి ౬౪
హేతువు ౧౨౪

అకారాది సూత్రానుక్రమణిక

సం.	పా.	సూ.	పుట
౧. అతీతానాగతం స్వరూపతోఽస్త్యధ్వ భేదాద్ధర్మాణామ్	౪	౧౨	౧౫౫
౨. అథయోగానుశాసనమ్	౧	౧	౧
౩. అనిత్యాశుచి దుఃఖానాత్మసు నిత్యశుచి సుఖాత్మఖ్యాతి రవిద్యా	౨	౫	౬౨
౪. అనుభూత విషయా సంప్రమోషస్మృతిః	౧	౧౧	౧౨
౫. అపరిగ్రహస్థైర్యే జన్మకథంతా సంబోధః	౨	౩౯	౯౪
౬. అభావ ప్రత్యయాలంబనా వృత్తిర్నిద్రా	౧	౧౦	౧౦
౭. అభ్యాస వైరాగ్యాభ్యాం తన్నిరోధః	౧	౧౨	౧౩
౮. అవిద్యాఽస్మితా రాగద్వేషాభినివేశాః పంచక్లేశాః	౨	౩	౫౯
౯. అవిద్యాక్షేత్ర ముత్తరేషాం ప్రసుప్తతను విచ్ఛిన్నోదారాణామ్	౨	౪	౫౯
౧౦. అస్తేయ ప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థానమ్	౨	౩౭	౯౭
౧౧. అహింసాప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః	౨	౩౫	౯౬
౧౨. అహింసా సత్యాస్తేయ బ్రహ్మచర్యా పరిగ్రహాయమాః	౨	౩౦	౯౦
౧౩. ఈశ్వర ప్రణిధానాద్వా	౧	౨౩	౨౫
౧౪. ఉదానజయాత్ జలపంకకంటకాది ష్వసంగ ఉత్క్రాన్తిశ్చ	౩	౩౯	౧౩౦
౧౫. ఋతంభరాతత్రప్రజ్ఞా	౧	౪౮	౫౨
౧౬. ఏకసమయేచోభయానవధారణమ్	౪	౨౦	౧౬౧
౧౭. ఏతయైవ సవిచారా నిర్విచారాచ సూక్ష్మవిషయా వ్యాఖ్యాతా	౧	౪౪	౪౮
౧౮. ఏతేన భూతేంద్రియేషు ధర్మ లక్షణావస్థా పరిణామా వ్యాఖ్యాతాః	౩	౧౩	౧౧౭
౧౯. కంఠకూపే క్షుత్పిపాసా నివృత్తిః	౩	౩౦	౧౭౬

సం.		పా.	సూ.	పుట
౨౦.	కర్మాశుక్లాకృష్ణం యోగిన స్త్రివిధ మితరేషామ్	౪	౭	౧౪౯
౨౧.	కాయరూపసంయమాత్తద్ గ్రాహ్యశక్తిస్తంభే చక్షుఃప్రకాశాసంప్రయోగేఽన్తర్ధానమ్	౩	౨౧	౧౨౨
౨౨.	కాయాకాశయోఃసంబంధసంయమాత్ లఘుతూలసమాపత్తేశ్చాకాశగమనమ్	౩	౪౨	౧౩౨
౨౩.	కాయేంద్రియసిద్ధిరశుద్ధిక్షయాత్తపసః	౨	౪౩	౧౦౦
౨౪.	కూర్మనాడ్యాం స్థైర్యమ్	౩	౩౧	౧౨౭
౨౫.	కృతార్థం ప్రతినష్టమప్యనష్టం తదన్యసాధారణత్వాత్	౪	౩౨	౨౪
౨౬.	క్రమాన్యత్వం పరిణామాన్యత్వే హేతుః	౩	౧౫	౭౨
౨౭.	క్లేశకర్మవిపాకాశయైరపరామృష్టఃపురుషవిశేష ఈశ్వరః	౧	౨౪	౨౫
౨౮.	క్లేశమూలఃకర్మాశయోదృష్టాదృష్టజన్మవేదనీయః	౨	౧౨	౬౮
౨౯.	క్షణతత్క్రమయోఃసంయమాత్ వివేకజం జ్ఞానమ్	౩	౫౨	౧౪౦
౩౦.	క్షణప్రతియోగీ పరిణామాపరాన్తనిర్గ్రాహ్యఃక్రమః	౪	౩౩	౧౭౦
౩౧.	క్షీణవృత్తేరభిజాతస్యేవ మణేర్గ్రహీతృగ్రహణగ్రాహ్యేషు తత్స్థతదంజనతాపత్తిః	౧	౪౧	౪౨
౩౨.	గ్రహణస్వరూపాస్మితాన్వయార్థవత్త్వసంయమాద్ ఇంద్రియజయః	౩	౪౭	౪౨
౩౩.	చంద్రేతారావ్యూహజ్ఞానమ్	౩	౨౭	౧౨౬
౩౪.	చిత్తాంతరదృశ్యే బుద్ధిబుద్ధేరతిప్రసంగఃస్మృతిసంకరశ్చ	౪	౨౧	౧౬౨
౩౫.	చితేరప్రతిసంక్రమాయాస్తదాకారాపత్తౌ స్వబుద్ధిసంవేదనమ్	౪	౨౨	౧౬౩
౩౬.	జంఘాలఘుతూలసమాపత్తేశ్చాకాశగమనమ్	౪	౧	౧౪౫

సం.		పా.	సూ.	పుట
౩౭.	జాతిదేశ కాలవ్యవహితానా మప్యానంతర్యం స్మృతి సంస్కారయోరేక రూపత్వాత్	౪	౯	౧౫౧
౩౮.	జాతిదేశకాల సమయానవచ్ఛిన్నాః సార్వభౌమా మహావ్రతమ్	౨	౩౧	౯౧
౩౯.	జాతిలక్షణదేశైరన్యతా నవచ్ఛేదాత్ తుల్యయోస్తతః ప్రతిపత్తిః	౩	౫౩	౧౪౧
౪౦.	జాత్యంతర పరిణామః ప్రకృత్యాపూరాత్	౪	౨	౧౪౬
౪౧.	తచ్ఛిద్రేషు ప్రత్యయాంతరాణి సంస్కారేభ్యః	౪	౨౭	౧౬౭
౪౨.	తజ్జపస్తదర్థ భావనమ్	౧	౨౮	౨౯
౪౩.	తజ్జయాత్ ప్రజ్ఞాలోకః	౩	౫	౧౧౧
౪౪.	తజ్జః సంస్కారోఽన్య సంస్కార ప్రతిబంధీ	౧	౫౦	౫౪
౪౫.	తతః కృతార్థానాం పరిణామక్రమ సమాప్తి ర్గుణానామ్	౪	౩౨	౧౭౦
౪౬.	తతఃక్లేశ కర్మనివృత్తిః	౪	౩౦	౧౬౮
౪౭.	తతః పరమావశ్యతేంద్రియోణామ్	౨	౫౫	౧౦౮
౪౮.	తతః ప్రత్యక్చేతనాధిగమోఽప్యం తరాయాభావశ్చ	౧	౨౯	౩౦
౪౯.	తతః ప్రాతిభ శ్రావణ వేదనాదర్శా స్వాదవార్తా జాయంతే	౩	౩౬	౧౭౯
౫౦.	తతః స్తద్విపాకానుగుణానామే వాభివ్యక్తిర్వాసనానామ్	౪	౯	౧౫౦
౫౧.	తతః క్షీయతే ప్రకాశావరణమ్	౨	౫౨	౧౦౬
౫౨.	తతోఽణిమాది ప్రాదుర్భావః కాయసంపత్తద్ధర్మానభిఘాతశ్చ	౩	౪౫	౧౩౪
౫౩.	తతోద్వంద్వానభిఘాతః	౨	౪౯	౧౦౨
౫౪.	తతోమనోజలిత్వం వికరణభావః ప్రధానజయశ్చ	౩	౪౯	౧౩౬
౫౫.	తత్ ప్రతిషేధార్థమ్ ఏకతత్త్వాభ్యాసః	౧	౩౨	౩౩
౫౬.	తత్రప్రత్యయైక తానతాధ్యానమ్	౩	౨	౧౧౦
౫౭.	తత్ర ధ్యానజమనాశయమ్	౪	౬	౧౪౯

సం.	పా.	సూ.	పుట
౨౮. తత్రనిరతిశయం సర్వజ్ఞబీజమ్	౧	౪౫	౬౬
౨౯. తదర్థ ఏవదృశ్యస్యాత్మా	౪	౨౧	౯౩
౩౦. తదపి బహిరంగం నిర్బీజస్య	౩	౯	౧౧౩
౩౧. తదభ్యాసాత్ సంయోగాభావోహానం తద్దృశేః కైవల్యమ్	౪	౪౫	౯౫
౩౨. తదసంఖ్యేయ వాసనాభిశ్చిత్రమపి పరార్థం సంహత్యకారిత్వాత్	౪	౨౪	౧౩౫
౩౩. తదాద్రష్టుః స్వరూపేఽవస్థానమ్	౧	౩	౫
౩౪. తదా వివేకనిమ్నం కైవల్య ప్రాగ్భారం చిత్తం	౪	౨౬	౧౩౬
౩౫. తదా సర్వావరణమలాపేతస్య జ్ఞానస్యానంత్యాత్ జ్ఞేయమల్పమ్	౪	౩౧	౧౩౯
౩౬. తతఃపరాగాపేక్షిత్వా చ్చిత్తస్య వస్తు జ్ఞాతాజ్ఞాతమ్	౪	౧౭	౧౫౯
౩౭. తదేవార్థమాత్ర నిర్భాసం స్వరూపశూన్య మివసమాధిః	౩	౩	౧౧౦
౩౮. తత్ప్రవిభాగాదపి దోషబీజక్షయే కైవల్యమ్	౩	౫౦	౧౩౮
౩౯. తపఃస్వాధ్యాయేశ్వర ప్రణిధానాని క్రియాయోగః	౨	౧	౫౭
౪౦. తస్మిన్సతిశ్వాస ప్రశ్వాసయో ర్గతివిచ్ఛేదః ప్రాణాయామః	౨	౪౯	౧౦౨
౪౧. తస్య ప్రశాంతవాహితా సంస్కారాత్	౩	౧౦	౧౧౫
౪౨. తస్యభూమిషు వినియోగః	౩	౬	౧౧౨
౪౩. తస్యవాచకః ప్రణవః	౧	౨౭	౪౨
౪౪. తస్యసప్తధా ప్రాంతభూమిః ప్రజ్ఞా	౨	౨౭	౯౭
౪౫. తస్యహేతురవిద్యా	౨	౨౪	౯౫
౪౬. తస్యాపినిరోధే సర్వనిరోధాత్ నిర్బీజః సమాధిః	౧	౫౧	౫౫
౪౭. తాఏవసబీజః సమాధిః	౧	౪౬	౫౦
౪౮. తారకం సర్వవిషయం సర్వథా విషయక్రమం చేతివివేకజజ్ఞానమ్	౩	౫౪	౧౪౨
౪౯. తాసామనాదిత్వం చాశిషోనిత్యత్వాత్	౪	౧౦	౧౫౩

సం.	పా.	సూ.	పుట
౪౦. తీవ్రసంవేగానా మాసన్నః	౧	౨౧	౨౩
౪౧. తేప్రతిప్రసవహేయాః సూక్ష్మాః	౪	౧౦	౬౭
౪౨. తేహ్లాదపరితాపఫలాః పుణ్యాపుణ్యహేతుత్వాత్	౪	౧౪	౭౧
౪౩. తేవ్యక్త సూక్ష్మాగుణాత్మానః	౪	౧౩	౧౫౫
౪౪. తేసమాధా వుపసర్గా వ్యుత్థానే సిద్ధయః	౩	౩౭	౧౨౯
౪౫. త్రయమంతరంగం పూర్వేభ్యః	౩	౭	౧౧౨
౪౬. త్రయమేకత్ర సంయమః	౩	౪	౧౧౧
౪౭. (సతు) దీర్ఘకాలనైరంతర్య సత్కారాసేవితో దృఢభూమిః	౧	౧౪	౧౪
౪౮. దుఃఖదౌర్మనస్యాంగమే జయత్వ శ్వాస ప్రశ్వాసా విక్షేపసహభువః	౧	౩౧	౩౨
౪౯. దుఃఖానుశయీ ద్వేషః	౨	౮	౬౫
౫౦. దృగ్ దర్శన శక్త్యోరేకాత్మతే వాస్మితా	౨	౬	౬౩
౫౧. దృష్టానుశ్రవిక విషయ వితృష్ణస్య వశీకార సంజ్ఞావైరాగ్యమ్	౧	౧౫	౧౫
౫౨. దేశబంధశ్చిత్తస్య ధారణ	౩	౧	౧౦౯
౫౩. ద్రష్టృదృశ్యోపరక్తం చిత్తం సర్వార్థమ్	౪	౨౩	౧౬౪
౫౪. ద్రష్టృదృశ్యయోః సంయోగో హేయహేతుః	౨	౧౭	౭౬
౫౫. ద్రష్టాదృశిమాత్రః శుద్ధోపి ప్రత్యయానుపశ్యః	౨	౨౦	౨౧
౫౬. ధారణా సుచయోగ్యతామనసః	౨	౫౩	౧౦౭
౫౭. ధ్యానహేయా స్తద్వృత్తయః	౨	౧౧	౬౭
౫౮. ధ్రువేతద్గతి జ్ఞానమ్	౩	౨౮	౧౨౬
౫౯. నచతత్ సాలంబనం తస్యా విషయీభూతత్వాత్	౩	౨౦	౧౨౨
౧౦౦. నచైక చిత్తతంత్రం వస్తు తదప్రమాణకం తదా కింస్యాత్	౪	౧౬	౧౫౨
౧౦౧. నతత్ స్వాభాసం దృశ్యత్వాత్	౪	౧౯	౧౬౦
౧౦౨. నాభిచక్రేకాయవ్యూహజ్ఞానమ్	౩	౩౯	౧౨౬
౧౦౩. నిమిత్తమప్రయోజకం ప్రకృతీనాం వరణభేదస్తు తతః క్షేత్రకవత్	౪	౩	౧౪౬

సం.		పా.	సూ.	పుట
౧౦౪.	నిర్మాణ చిత్తాన్యస్మితామాత్రాత్	౪	౪	౧౪౭
౧౦౫.	నిర్విచార వైశారద్యేఽధ్యాత్మప్రసాదః	౧	౪౭	౫౦
౧౦౬.	పరంపురుషఖ్యాతే ర్గుణవైతృష్ణ్యమ్	౧	౧౬	౧౮
౧౦౭.	పరమాణుపరమమహత్త్వాంతోఽస్య వశీకారః	౧	౪౦	౪౯
౧౦౮.	పరిణామతాప సంస్కార దుఃఖైర్ గుణవృత్తి విరోధాచ్చ దుఃఖమేవ సర్వం వివేకినః	౨	౧౫	౭౯
౧౦౯.	పరిణామత్రయ సంయమా దతీతానాగతజ్ఞానమ్	౩	౧౬	౧౨౦
౧౧౦.	పరిణామైకత్వాద్వస్తు తత్త్వమ్	౪	౧౪	౧౫౬
౧౧౧.	పురుషార్థ శూన్యానాం గుణానాం ప్రతిప్రసవః కైవల్యం స్వరూపప్రతిష్ఠావా చితిశక్తి రితి	౪	౩౪	౧౭౨
౧౧౨.	పూర్వేషామపిగురుః కాలేనానవచ్ఛేదాత్	౧	౨౬	౨౭
౧౧౩.	ప్రకాశక్రియాస్థితిశీలం భూతేంద్రియాత్మకం భోగాపవర్గార్థం దృశ్యమ్	౨	౧౮	౭౭
౧౧౪.	ప్రచ్ఛర్దన విధారణాభ్యాం వా ప్రాణస్య	౧	౩౪	౩౭
౧౧౫.	ప్రత్యక్షానుమానాగమాః ప్రమాణాని	౧	౭	౯
౧౧౬.	ప్రత్యయస్య పరచిత్తజ్ఞానమ్	౩	౧౯	౧౨౨
౧౧౭.	ప్రమాణ విపర్యయ వికల్ప నిద్రాస్మృతయః	౧	౬	౯
౧౧౮.	ప్రయత్నశైథిల్యానంత సమాపత్తిభ్యామ్	౨	౪౭	౧౦౨
౧౧౯.	ప్రవృత్తి భేదే ప్రయోజకం చిత్త మేక మనేకేషామ్	౪	౫	౧౪౯
౧౨౦.	ప్రవృత్తాౌ లోకన్యాసాత్ సూక్ష్మవ్యవహిత విప్రకృష్ట జ్ఞానమ్	౩	౧౫	౧౩౫
౧౨౧.	ప్రసంఖ్యానేఽప్యకుసీదస్య సర్వథా వివేకఖ్యాతేర్ధర్మమేఘుః సమాధిః	౪	౨౯	౧౭౭
౧౨౨.	ప్రాతి భాద్వాసర్వమ్	౩	౩౩	౧౭౭
౧౨౩.	బంధకారణ శైథిల్యాత్ ప్రచార సంవేదనాచ్చ చిత్తస్య పరశరీరావేశః	౩	౩౮	౧౩౦
౧౨౪.	బలేషు హస్తిబలాదీని	౩	౨౪	౧౩౫
౧౨౫.	బహి రకల్పితావృత్తిర్మహావిదేహా తతః ప్రకాశావరణక్షయః	౩	౪౩	౧౩౭

సం.		పా.	సూ.	పుట
౧౨౬.	బాహ్యాభ్యంతర స్తంభవృత్తిర్దేశ కాలసంఖ్యాభిః పరిదృష్టో దీర్ఘసూక్ష్మః	౨	౫౦	౧౦౩
౧౨౭.	బాహ్యాభ్యంతర విషయాక్షేపీ చతుర్థః	౨	౫౧	౧౦౬
౧౨౮.	బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః	౨	౩౮	౯౭
౧౨౯.	భవప్రత్యయో విదేహ ప్రకృతిలయానామ్	౧	౧౯	౨౧
౧౩౦.	భువనజ్ఞానం సూర్యే సంయమాత్	౩	౨౬	౧౨౬
౧౩౧.	మూర్ధజ్యోతిషి సిద్ధదర్శనమ్	౩	౩౨	౧౨౭
౧౩౨.	మృదుమధ్యాధి మాత్రత్వాత్తతోఽపి విశేషః	౧	౨౨	౨౪
౧౩౩.	మైత్రీకరుణాముదితోపేక్షాణాం సుఖదుఃఖ పుణ్యా పుణ్య విషయాణాం భావనాతశ్చిత్త ప్రసాదనమ్	౧	౩౩	౩౫
౧౩౪.	మైత్ర్యాదిషుబలాని	౩	౨౩	౧౨౪
౧౩౫.	యథాభిమత ధ్యానాద్వా	౧	౩౯	౪౧
౧౩౬.	యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణాధ్యాన సమాధయోఽష్టావంగాని	౨	౨౯	౮౯
౧౩౭.	యోగశ్చిత్తవృత్తి నిరోధః	౧	౨	౨
౧౩౮.	యోగాంగానుష్ఠానా దశుద్ధిక్షయే జ్ఞానదీప్తిరా వివేకఖ్యాతేః	౨	౨౮	౮౮
౧౩౯.	రూపలావణ్య బలవజ్రసంహన నత్వాని కాయసంపత్	౩	౪౬	౧౩౬
౧౪౦.	వస్తుసామ్యే చిత్తభేదాత్తయో ర్విభక్తః పంథాః	౪	౧౫	౧౫౬
౧౪౧.	వితర్కబాధనే ప్రతిపక్షభావనమ్	౨	౩౩	౯౪
౧౪౨.	వితర్క విచారానందాస్మితానుగమాత్ సంప్రజ్ఞాతః	౧	౧౭	౧౮
౧౪౩.	వితర్కా హింసాదయః కృతకారితా నుమోదితా లోభక్రోధమోహ పూర్వకా మృదు మధ్యాధిమాత్రా దుఃఖజ్ఞానానంతఫలా ఇతి ప్రతిపక్షభావనమ్	౨	౩౪	౯౫

సం.		పా.	సూ.	పుట
౧౪౪.	విపర్యయో మిథ్యాజ్ఞాన మతద్రూప ప్రతిష్ఠమ్	౧	౮	౯
౧౪౫.	విరామప్రత్యయాభ్యాసపూర్వ: సంస్కార శేషోఽన్య:	౧	౧౮	౨౦
౧౪౬.	వివేకఖ్యాతి రవిప్లవాహానోపాయ:	౨	౨౬	౮౬
౧౪౭.	వివేకదర్శన అత్మభావభావనా వినివృత్తి:	౪	౨౫	౧౬౬
౧౪౮.	విశేషా విశేష లింగమాత్రాలింగాని గుణపర్వాణి	౨	౧౯	౭౯
౧౪౯.	విశోకావా జ్యోతిష్మతీ	౧	౩౬	౪౦
౧౫౦.	విషయవతీవా ప్రవృత్తి రుత్పన్నా మనస: స్థితినిబంధినీ	౧	౩౫	౩౯
౧౫౧.	వీతరాగ విషయం వా చిత్తమ్	౧	౩౭	౪౦
౧౫౨.	వృత్తయ: పంచతయ్య: క్లిష్టా క్లిష్టా:	౧	౫	౭
౧౫౩.	వృత్తిసారూప్య మితరత్ర	౧	౪	౬
౧౫౪.	వ్యాధిస్త్యాన సంశయ ప్రమాదాలస్యా విరతి భ్రాంతిదర్శనాలబ్ధ భూమికత్వానవస్థిత త్వాని చిత్తవిక్షేపాస్తేఽన్తరాయా:	౧	౩౦	౩౧
౧౫౫.	వ్యుత్థాన నిరోధ సంస్కారయో రభి భవప్రాదుర్భావౌ నిరోధక్షణచిత్తా న్వయో నిరోధపరిణామ:	౩	౯	౧౧౩
౧౫౬.	శబ్దజ్ఞానానుపాతీ వస్తుశూన్యో వికల్ప:	౧	౯	౧౦
౧౫౭.	శబ్దార్థ ప్రత్యయానామితరేతరాధ్యాసాత్ సంకర స్తత్ప్రవిభాగ సంయమాత్ సర్వభూత రుతజ్ఞానమ్	౩	౧౭	౧౭౦
౧౫౮.	శబ్దార్థజ్ఞాన వికల్పై: సంకీర్ణా సవితర్కా సమాపత్తి:	౧	౪౨	౪౫
౧౫౯.	శాంతోదితావ్యపదేశధర్మానుపాతీధర్మీ	౩	౧౪	౧౧౮
౧౬౦.	శాంతోదితౌ తుల్య ప్రత్యయౌ చిత్తస్యైకాగ్రతా పరిణామ:	౩	౧౨	౧౦౬
౧౬౧.	శౌచ సంతోషతపస్స్వాధ్యా యేశ్వర ప్రణిధానాని నియమా:	౨	౩౨	౯౨

సం.		పా.	సూ.	పుట
౧౬౨.	శౌచాత్ స్వాంగజుగుప్సా పరైరసంసర్గః	౨	౪౦	౯౯
౧౬౩.	శ్రద్ధా వీర్యస్మృతి సమాధిప్రజ్ఞా పూర్వక ఇతరేషామ్	౧	౨౦	౩౨
౧౬౪.	శ్రుతానుమాన ప్రజ్ఞాభ్యా మన్య విషయా విశేషార్థ త్వాత్	౧	౪౯	౫౨
౧౬౫.	శ్రోత్రాకాశయోః సంబంధ సంయమాత్ దివ్యం శ్రోత్రమ్	౩	౪౧	౧౩౨
౧౬౬.	సతిమూలేతద్విపాకో జాత్యాయుర్భోగాః	౨	౧౩	౬౯
౧౬౭.	సత్త్వప్రతిసంయాం క్రియాఫలాశ్రయాత్వమ్	౨	౩౬	౯౭
౧౬౮.	సత్త్వపురుషయో రత్యంతా సంకీర్ణయోః ప్రత్యయా విశేషోభోగః పరార్థాత్ స్వార్థసంయమాత్ పురుషజ్ఞానమ్	౩	౩౫	౧౩౮
౧౬౯.	సత్త్వపురుషయోః శుద్ధి సామ్యే కైవల్యమితి	౩	౫౫	౧౪౩
౧౭౦.	సత్త్వపురుషాన్యతా ఖ్యాతి మాత్రస్య సర్వభావాధిష్ఠాతృత్వం సర్వజ్ఞాతృత్వంచ	౩	౪౯	౧౩౭
౧౭౧.	సత్త్వశుద్ధి సౌమన స్యైకాగ్ర్యేంద్రియ జయాత్మ దర్శన యోగ్యత్వాని	౨	౪౧	౯౯
౧౭౨.	సదాజ్ఞాతా శ్చిత్తవృత్తయ స్తత్ప్రభోః పురుషస్యాపరిణామిత్వాత్	౪	౧౪	౧౫౯
౧౭౩.	సమాధి భావనార్థక్లేశ తనూకరణార్థశ్చ	౨	౨	౫౪
౧౭౪.	సమాధి సిద్ధిరీశ్వర ప్రణిధానాత్	౨	౪౫	౧౦౧
౧౭౫.	సమానజయా జ్జ్వలనమ్	౩	౪౦	౧౩౧
౧౭౬.	సంతోషా దనుత్తమ సుఖలాభః	౨	౪౨	౧౦౦
౧౭౭.	సంస్కార సాక్షాత్కరణాత్ పూర్వజాతిజ్ఞానమ్	౩	౧౪	౧౩౧
౧౭౮.	సర్వార్థతైకాగ్రతయోః క్షయో దయౌ చిత్తస్య సమాధి పరిణామః	౩	౧౧	౧౦౬
౧౭౯.	సుఖానుశయీ రాగః	౨	౭	౬౪
౧౮౦.	సూక్ష్మవిషయత్వంచాలింగ పర్యవసానమ్	౧	౪౫	౪౯

సం.		పా.	సూ.	పుట
౧౪౧.	సోపక్రమం నిరుపక్రమంచకర్మ తత్సం యమా దపరాంతజ్ఞానమరిష్టేభ్యో వా	౩	౨౨	౧౨౩
౧౪౨.	స్థాన్యుప నిమంత్రణే సంగస్మయాకరణం పునరనిష్ట ప్రసంగాత్	౩	౫౧	౧౩౮
౧౪౩.	స్థితౌ యతోన్నోభ్యాసః	౧	౧౩	౧౪
౧౪౪.	స్థిరసుఖ మాసనమ్	౨	౪౬	౧౦౧
౧౪౫.	స్థూల స్వరూప సూక్ష్మాన్వయార్థ వత్త్వ సంయమాత్ భూతజయః	౩	౪	౧౩౩
౧౪౬.	స్మృతిపరిశుద్ధౌ స్వరూప శూన్యేవా ర్థమాత్ర నిర్భాసా నిర్వితర్కా	౧	౪౩	౪౭
౧౪౭.	స్వప్న నిద్రా జ్ఞానాలంబనంవా	౧	౩౮	౪౧
౧౪౮.	స్వర సవాహీ విదుషోఽపి తథా రూఢోఽభి నివేశః	౨	౯	౬౫
౧౪౯.	స్వవిషయా సంప్రయోగే చిత్తస్య స్వరూపానుకార ఇవేంద్రియాణాం ప్రత్యాహారః	౨	౫౪	౧౦౭
౧౫౦.	స్వ స్వామి శక్త్యోః స్వరూపోప లబ్ధి హేతుకి సంయోగః	౨	౨౩	౮౪
౧౫౧.	స్వాధ్యాయా దిష్టదేవతా సంప్రయోగః	౨	౪౪	౧౦౦
౧౫౨.	హానమేషాం క్లేశవ దుక్తమ్	౪	౨౮	౧౬౭
౧౫౩.	హృదయే చిత్తసంవిత్	౩	౩౪	౧౨౮
౧౫౪.	హేతుఫలాశ్రయాలంబనైః సంగృహీతత్వా దేషా మభావే తదభావః	౪	౧౧	౧౫౩
౧౫౫.	హేయం దుఃఖమనాగతమ్	౨	౧౬	౭౫

భారతీ ప్రెస్, తెనాలి.